
# మిసిమి

చింతనాత్మక సారస్వతం



మాసపత్రిక, సెప్టెంబరు, 2016 ₹ 30

ISSN 2454–4329



అలకలేల

# మిసిమి

మాసపత్రిక

**"All that we are is the product of what we have thought"**
*- Dammapada*

**సంపుటి 27** | **సెప్టెంబర్** | **సంచిక 9**


ప్రధాన సంపాదకుడు
*చెన్నూరు ఆంజనేయ రెడ్డి*

సంపాదకుడు
*వల్లభనేని అశ్వినీకుమార్*

సహాయ సంపాదకుడు
*కాండ్రేగుల నాగేశ్వరరావు*

సహకార సంపాదకులు
*డా. వోలేటి పార్వతీశం*
*కరుటూరి విజయ్*

సాంకేతిక సహాయకులు
పడవల ఉమాశంకర్, చేపూరి రమేష్,
మహమ్మద్ కుర్రముద్దీన్ జీ షాన్,
వేముల రాణి, స్వాతి దండోతిక

*సంస్థాపక సంపాదకులు*
**రవీంద్రనాథ్ ఆలపాటి**


*Printed & Published by*

**Bapanna Alapati**
at **Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads,
Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536. Cell : 994 951 6567
E-mail : misimi_monthly@yahoo.in
www.misimimonthly.com
**e-magazine : www.kinige.com/misimi**
**facebook/misimi-monthlymagazine**
**https://twitter.com/MISIMIMONTHLY**

ప్రతి : ₹ 30/– సంవత్సరానికి : ₹ 360/–
విదేశాలకు ప్రతి : $ 3.00 సంవత్సరానికి : $ 36.00 (by Air Mail)

LIBRARY OF CONGRESS
LCCN
91-903060

ISSN INTERNATIONAL STANDARD SERIAL NUMBER INTERNATIONAL CENTRE
ISSN 2454-4329

YouTube : Silver jubilee celebrations of MISIMI Telugu Monthly


# ఈ నెల...

కమ్మతెమ్మెరలు ........ 5

తంజావూరు బృహదీశ్వరాలయ నిర్మాణ విశేషాలు–2 ........ 7
– *డా. ఈమని శివనాగి రెడ్డి*

అలౌకిక భావనా కృతి శ్రీమతి వేదవతి ........ 12
– *ప్రొ. రావినూతల సత్యనారాయణ*

ఆనంద శాస్త్రం – II ........ 26
– *ముక్తవరం పార్థసారథి*

ఆంధ్రులు – నాట్యకళ ........ 32
– *నటరాజ రామకృష్ణ*

రేడియోలో రెండు దశాబ్దాలు ........ 36
– *ఉషశ్రీ*

'రజనీ'గంధం ........ 41
– *ఎమ్మెస్ సూర్యనారాయణ*

వసివాడని తృణకంకణం ........ 43
– *డా. దిలావర్*

నిస్సిగ్గు వినోదం ........ 46
– *గొల్లపూడి మారుతీరావు*

సుల్తానుల పరిపాలన – తెలుగు భాషాపోషణ ........ 52
– *బి. నాగశేషు*

విపులాచ పృథ్వీ..... ........ 55
– *వి. అశ్వినీకుమార్*

కొడిగట్టని చింతనాగ్ని జి.వి.కె. కృష్ణరావు ........ 56
– *బి.వి. రామిరెడ్డి*

పోయన్, లేకబోయన్ అది కులనామమే ........ 59
– *భీమనాథుని శ్రీనివాస్*

త్యాగరాజుస్వామి జీవితం సత్యాసత్యాలు ........ 62
– *కాండ్రేగుల నాగేశ్వరరావు*

రాళ్ళపల్లి వారి లేఖ ........ 64
– *ఘట్టమరాజు అశ్వత్థనారాయణ*

క్రోమోసోమ్ కథనమ్ వ్యక్తిత్వం ........ 65
– *ము.పా.సా*

మరుగున పడిన సంస్థానం ........ 69
– *ప్రొ. ముదిగొండ శివప్రసాద్*

ఆ మనుషులేరి ........ 73
– *మహీధర రామశాస్త్రి*

చరిత్రలో తెనాలి ........ 79
– *ముత్తేవి రవీంద్రనాథ్*

తెలుగుతెరపై తొలిసీత ........ 83
– *హెచ్. రమేష్ బాబు*

మనుషులు చేసిన దేవుళ్ళు ........ 85
– *దేవిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి*

సహృదయునితో సంభాషణ ........ 90
– *ఆచార్య యార్లగడ్డ బాలగంగాధర రావు*


*ముఖచిత్రం : గోపూజ*
*మూడవ అట్ట : అలకలేల*
*నాల్గవ అట్ట : బిడియమేల* *చిత్రకారిణి* – ***కావ్యరెడ్డి***
*రెండవ అట్ట :* ***మిసిమి*** *తో ముఖ్యమంత్రి*

*వివరాలు : 50 వ పుటలో...*

అట్టతో కలిపి 100 పుటలు

"ఈ లోకంలో ప్రతి వ్యక్తీ తనకు తానే కేంద్రంగా బ్రతుకుతుంటాడు. ఆ కారణంగా మరొకరి కృషిని అతడు నిస్వార్థంగా అభినందించాలని ఆశించటం మూర్ఖత్వమే..." అంటాడు గోతె.


నిత్యజీవితంలో మనచుట్టూ ఉన్న వ్యక్తులనే మనం పట్టించుకోము, పట్టించుకున్నా పరిశీలనాదృష్టితో చూసేంత తీరుబడే ఉండదు. అలాంటి పరిస్థితుల్లో వారిలోని ప్రతిభను, కృషినీ హర్షించే విశాల హృదయం ఎందరికుంటుంది? కాని ఏదో ఒకరోజు అలాంటి సందర్భం వస్తే 'అరె – ఎంత పొరపాటు – ఇన్నాళ్ళు గుర్తించలేకపోవటం' అని బాధపడటం కూడా సహృదయులకే చెల్లుతుంది. ఇదంతా ఎందుకు ప్రస్తావిస్తున్నామంటే ప్రక్క పుటలోని లేఖ సాక్షిగా మాకూ కనువిప్పు కలిగిందనుకోవచ్చు.




ఇలాంటిదే గత సంచికలో 'ఎవరు ముందు' చదివి ఎందరో స్పందించారు. స్పందించడమే కాదు అనుబంధాలను, ఎంత సున్నితంగా వ్యక్తీకరించారు అని అభినందించడం. వారిలోని సంస్కారానికే కాక, వీరూ అలాంటి అనురాగావలయంలో ఉన్నారని సంకేతం కూడా.

ఆగస్టు సంచిక సంపాదకీయంపై స్పందిస్తూ 'దీనిని వేల కాపీలు తీసి అన్ని స్కూళ్ళు, కాలేజీలకూ పంపండి – తెలుగు భాషపై విద్యార్థులకు కనీస అవగాహన కలుగుతుంది' అని సలహా కూడా ఇచ్చారు – పాఠకులు సహృదయంతో!

ఈ సందర్భంగానే, తెలుగు భాష, పదాలపై చర్చ కొనసాగుతూనే ఉంది. 'పదికోట్ల మంది తెలుగు రాష్ట్రాలలో ఉన్నారు. పదికోట్ల మంది రాష్ట్రాల వెలుపల, ప్రపంచవ్యాప్తంగా ఉన్నారు' అని తరచూ వింటున్నాం. కాని 'తెలుగు మాసపత్రిక' ఏదయినా పట్టుమని పదివేల కాపీలు అమ్ముకోగలుగుతుందా? తెలుగువారు చదవరా? ఇప్పుడే మనం ఒక చారిత్రక విషయం గుర్తుచేసుకోవాలి. తెలుగు పత్రికలు, ఆంధ్రపత్రిక, ఆనందవాణి వస్తున్న రోజుల్లో పాఠకులెంతమంది? కొవ్వలి – జంపన పుణ్యమా అని తెలుగు పాఠకులు ఎంతగా పెరిగారు? అపరాధ పరిశోధక పుస్తకాలు – తర్వాత శరత్ సాహిత్యం తెలుగులో రావటంతో తెలుగు పాఠకులు మరింతగా చదివేందుకు 'మెటీరియల్' అందుబాటులోకి వచ్చింది కదా – ఆ తరువాత లత, మాలతీచందూర్‌లు తమ రచనలను ప్రజల్లోకి తీసుకువెళ్ళారుగదా – ఆ తర్వాత వచ్చిన వారపత్రికల కాల్పనిక గొలుసు కథలు కూడా తెలుగు పాఠకులను రాసిలో పెంచాయి – దిన, వారపత్రికలను ప్రక్కన పెడితే శుద్ధమైన నెలవారీ పత్రికలు తెలుగులో ఎన్ని నడుస్తున్నాయి? ఎన్ని కాపీలు ప్రజల్లోకి వెళ్తున్నాయి– ఈ దిశగా కూడా ఈ 'ఉద్యమ'కారులు ఆలోచించాలి – ఈ పరిస్థితి మిగతా భాషలలో ఉన్నదా? అందుకే మళ్ళీ ఒకసారి తెలుగువారు చదవరా? అనుకోవలసి వస్తుంది. ఈ పరిస్థితి మాసపత్రికలకే కాదు, వెయ్యి కాపీలు కూడా అమ్ముకోలేకపోతున్నాం అని ఎంతమంది రచయితలు వాపోవటంలేదు?



గత నాలుగేండ్లుగా 'పుస్తకాల పండగ' సందర్భంగా **మిసిమి** స్టాల్‌ను సందర్శించిన అభిమానులు, విజ్ఞులైన పాఠకులు, అట్టమీది బొమ్మలతో ప్రత్యేకంగా ఒక సంపుటి వేయండని అడుగుతున్నారు. అదే విషయం మరో లేఖలో కూడా ప్రస్తావన వచ్చింది. డిశంబరు 2016 నాటికి ఈ ప్రయత్నం పూర్తి చేయగలమని ఆశిస్తున్నాం. పాఠకుల ఆదరణ ఎలాగూ ఉంటుంది. ఎటొచ్చీ అమూల్యమైన దానికి వెలపెట్టటం కత్తిమీద సాము కదా.

'కాలెండర్ ఈవెంట్స్' దినపత్రికలకే చెల్లుతుంది. **మిసిమి** సభలూ, సమావేశాల వివరాలు జయంతి – వర్ధంతుల జోలికి అంతగా పోదు. గురువులకు గురువు రాధాకృష్ణన్! సెప్టెంబర్ 5 న రాధాకృష్ణన్, అక్టోబర్ 2న గాంధీ, నవంబర్ 4న ఆలపాటి రవీంద్రనాథ్ – ఈ జయంతి తేదీలు **మిసిమి** కి కూడా ముఖ్యమైనవే!

– సంపాదకులు

# కమ్మతెమ్మెరలు

✧ "...***మిసిమి*** జులై 2016 సంచిక పూర్తిగా అంటే పూర్తిగా చదివాను. ఈ చదువు నా ఆయుష్షును పదిరోజులు పెంచింది! చింతమనేని వేదవతి గారి *అక్షరాశ్రువులు* చక్కని భాష – చిక్కని విషయం – ఆమెకు ధన్యవాదాలు. చివరిలో మీ *ఎలిజీ* అదే షెల్లీ – కీట్స్ మరణానంతరం రాసిన అద్భుతమైన 'కవితా కన్నీరు' ఎంతటి విషాదం – ఎంతటి సౌందర్యం! మీకు ధన్యవాదాలు. 'వైజయంతిమాల' జీవితం కారు ప్రయాణంతో మొదలయింది. తర్వాత ఆమె కారు దిగలేదు – వెనుదిరిగి చూడనూలేదు. మొదటి చిత్రంలో ఎంత అందంగా ఉందో చివరి చిత్రంలోనూ అదే ఆకర్షణ – నా తరం వారి కథానాయిక ఆమె – అన్ని జ్ఞాపకాలను రేపిన కాండ్రేగులవారికి ధన్యవాదాలు. మొదటి *ఘటోత్కచుడు* – ఇదీ నాకు తెలియని నిజమే. *కళింగాంధ్ర* సమీక్ష అత్యంత ఉన్నతంగా ఉంది. ***మిసిమి*** లోని పుటలన్నీ పుటం పెట్టిన బంగారంలా మిసమిసలాడుతున్నాయి రూపంలోను, గుణంలోనూ. ఇదంతా సంపాదకుల ప్రతిభకు అద్దంపడుతుంది. నాకనిపిస్తుంది మనకు తెలిసినవారిలో ఇంత విద్వత్తును ఇన్నాళ్ళు గుర్తించకపోవటం ఒకింత 'గిల్టీ'గా కూడా ఉంది. మీ అందరికీ మరోమారు ధన్యవాదాలు......"

– ***ప్రొ. యార్లగడ్డ బాలగంగాధరరావు,*** *విజయవాడ*

✧ "... జులై 2016 ***మిసిమి*** సంచిక అట్టమీది బొమ్మలను చూశాక నాకీ ఆలోచన వచ్చింది. పూర్వం *ఇలస్ట్రేటెడ్ వీక్లీ ఆఫ్ ఇండియా* కు కుష్వంతసింగ్ సంపాదకునిగా ఉన్నప్పుడు తన *వీక్లీ* ని కేవలం బొమ్మల పత్రికగానే వెలువరించాలని ఉంది, ఆ దిశగా కృషి జరుగుతున్నది అని అన్నాడు. కాని అది కార్యరూపం దాల్చలేదు. మీరు ప్రతి ఏటా ఎలానూ ఒక నెల బుద్ధజయంతి సంచికను తీసుకువస్తున్నారు. అదేవిధంగా మీరు మీ పత్రికను సంవత్సరంలో ఒక నెల కేవలం బొమ్మల పత్రికగా తీసుకు రావచ్చును. ఇప్పటికి మీరు 27 సంవత్సరాలుగా మీ పత్రికను నడుపుతున్నారు. మొదటి సంవత్సరం వచ్చిన బొమ్మలు నెలకు నాలుగు చొప్పున సంవత్సరానికి 48 బొమ్మలు సిద్ధంగా ఉంటాయి. వాటి వివరణలు మరొక 24 పేజీలుంటాయి. మీరు బొమ్మల కోసం ఎలానూ మంచి కాగితాన్నే వాడుతారు కదా! చక్కగా ఒక సంచికకు సరిపడే మెటీరియల్ మీ చేతిలో ఉన్నట్లే! ఇలా 27 సంవత్సరాలు, సంవత్సరానికి ఒక నెల చొప్పున బొమ్మలు సంచికను ప్రచురించవచ్చు. ఆ తరువాత కూడా ఈ విధానాన్ని అవిచ్ఛిన్నంగా కొనసాగించవచ్చు. రవివర్మ పుట్టినరోజో లేక మరొక చిత్రకారుని పుట్టినరోజో పరిగణనలోనికి తీసుకొని, ఆ నెల ఆ సంచికను ప్రతి ఏడూ విడుదల చెయ్యవచ్చు. అట్టి సంచికలు యువతను కూడా ఆకర్షించవచ్చు. అటి సంచికలు సావనీర్లుగా బహుమతులుగా ఇచ్చుకోవడానికి కూడా ఉపయోగపడతాయి. దయచేసి నా ప్రతిపాదనను పరిశీలించండి...."

– ***కణుగుల వేంకటరావు,*** *శ్రీకాకుళం*

✧ "ఆలపాటి బాపన్న గారికి – రవీంద్రనాథ్ గారిచే ప్రారంభించబడి, తదుపరి మీ ద్వారా నిరంతరాయంగా వెలువడుతున్న ***మిసిమి*** మాసపత్రిక ద్వారా మీరు పరిచయస్తులే. ***మిసిమి*** పేరు నిర్ణయంలోను, ప్రచురణలోను చూచిన, చదివినవారందరికీ పత్రిక విశిష్టత తెలియనిది కాదు. ఎంతోమంది సాహితీప్రియులు, సాహితీవేత్తలు అభిమానించే విశిష్ట పత్రిక ***మిసిమి*** గురించి నేను వ్రావయలసిన అవసరం లేదు. ముఖ్యంగా వ్రాయునది పాత ***మిసిమి*** పత్రికలు కొన్నింటిని గతంలో విజయవాడ (పుస్తక ప్రదర్శనలో వి.బి.ఎఫ్. జనవరి) తీసుకున్నాను. హైదరాబాద్ వచ్చినప్పుడు మీ ఆఫీసుకు వచ్చినట్లయితే పాత పత్రికలు మీవద్ద దొరుకునా? అవకాశం ఉన్నదా?...."

– ***సత్యానందం,*** *రాజమండ్రి*

✧ "ఆర్థికశాస్త్రంలో రీడర్‌గా రిటైర్ అయ్యాను. ***మిసిమి*** ని క్రమంతప్పకుండా చదువుతున్నాను. అన్ని వ్యాసాలు శ్రద్ధగా! ***మిసిమి*** అట్టమీది బొమ్మలు నన్ను ఆశ్చర్యానందాలకు లోనుచేస్తాయి. కేవలం బొమ్మల అందం కోసమైనా పాఠకులు ***మిసిమి*** ని కొని, దాచుకోవాలి. తరువాత తీరుబడిగా చదువుకోవచ్చు..."

– ***పి. పేర్రాజు శర్మ,*** *విశాఖపట్నం (ఈ-మెయిల్)*

✧ "... గత మూడు నెలల నుండి ***మిసిమి*** తో సంబంధం 'ఆత్మీయంగా' మారింది. ఎందుకంటే, నా రచనా వ్యాసంగంలో కథ, వ్యాసం రాస్తున్న సమయంలో సరిగ్గా వాటికి సంబంధించిన వ్యాసాలు ***మిసిమి*** లో రావడం, అవి చదివి నా రచనను మరింత పరిపుష్టం చేసుకోవడం జరిగింది. అందుకు ***మిసిమి*** కి ధన్యవాదాలు. *వాగ్దేవికి స్వరనైవేద్యం* ఘంటసాల గానతత్వాన్ని చక్కగా చిత్రించింది. దాని వెంటనే *కరుణశ్రీ* పరిచయం మరింత శోభనిచ్చింది. *పురిటిగడ్డ* కథలో రాధ తన కొడుకు అడిగిన ప్రశ్నలకు అబద్ధాలు చెప్పడం సమంజసంగా లేదు. ఆ అబద్ధాలే పిల్లల మనస్సులలో ముద్రించుకుపోయే ప్రమాదముంది. కథంతా సహజ సౌందర్యంతో తొణికిసలాడింది. ముఖ్యంగా ఆర్ముగం, అలివేలు దృశ్యం గుండెను పిండేస్తుంది. కథకు ముగింపు మరీ బాగుంది. *గీటురాయి* లో ఎన్నో సత్యాలు వెల్లడి అయినాయి. *కాక్ అండ్ బుల్ స్టోరీ* పదబంధం వెనుక ఉన్న వాస్తవ గాథ ఇప్పటికైనా తెలిసింది. సంతోషం. విస్మృతిలోకి వెళ్ళిపోయిన రాజంరెడ్డి రామిరెడ్డిని స్మరించుకోవడం ఒక మంచి మర్యాద. పన్నాల సుబ్రహ్మణ్య భట్టు గారి *కథాకమామీషు* యక్షప్రశ్నలకు కథ, నవలా రచయితల స్పందనల కోసం ఎదురు చూస్తున్నాం. స్టోన్‌ఫోర్డు యూనివర్శిటీలో జరిగిన వాస్తవ సంఘటన నూటికి నూరుపాళ్ళు స్ఫూర్తిమంతమైన ఆదర్శ సన్నివేశం. సంపూర్ణ మానవత్వం వికసించిన అక్షర శిల్పం అది..."

**– డా. ఎమ్. పురుషోత్తమచార్య,** *నల్గొండ*

✧ "... జులై 2016 ***మిసిమి*** సంచిక కవరు విప్పగానే మొగలిపూవు పరిమళంలా గ్రీష్మతాపంతో దర్శనమిచ్చిందో ప్రౌఢనాయిక! ఏమి సౌందర్యం! పురుషాధిక్యతను సవాలు చేస్తున్న ఆమె వదనం – గ్రీష్మతాపాన్ని తట్టుకోలేని ఆ నయన సౌందర్యం రవివర్మ చిత్రకళా విన్యాసం అద్భుతం. *అమ్మ రూపం* చూస్తూ అలా నిలబడిపోయాను. భారతీయ చిత్రకళా సర్వస్వం – కృషీ అజరామరం.... ఆచార్య పింగళి లక్ష్మీకాంతం గారి గురించి చక్కని వ్యాసం చదివి, ముగ్ధుడనయ్యాను. ఆయన సేవలు ఆంధ్ర విశ్వవిద్యాలయానికి ఓ మణిదీపం! లక్ష్మీకాంతం గారితో కలిసి జంట కవిత్వం చెప్పాలనీ, జంట కవులుగా మనం కవిత్వం వ్రాద్దామని విశ్వనాథ సత్యనారాయణ గారు కోరారు. తీవ్రంగా నీతోనా జంట కవిత్వం అంటూ లక్ష్మీకాంతం తిరస్కరించారని పెద్దలు చెప్పగా విన్నాను. లక్ష్మీకాంతం గారు బహు స్వతంత్రులు. ఎవరికీ తలవంచని మహోన్నత వ్యక్తిత్వం. పింగళి – కాటూరి జంట కవులుగా ప్రసిద్ధులయ్యారు.... *పురిటి గడ్డ* కథలో మానవత్వం పరిమళించింది. చదివించే గుణం రచయిత్రిలో ఉన్నది.... ఘంటసాల వారి పద్యం పండిత పామరులందరికీ నైవేద్యం. పద్యం హాయిగా – స్పష్టంగా – కవిగారి భావపరంపరను తన గొంతు ద్వారా పలికించి, ముగ్ధులను చేయగల గంధర్వుడు ఘంటసాల.... పార్వతీశం గారి వ్యాసం పద్య విందులా సాగింది.... రావినూతల వారు పాపయ్యశాస్త్రి గారి గురించిన పరిశీలనాత్మక వ్యాసం వ్రాశారు. పాపయ్యశాస్త్రి గారి పద్యాలన్నీ ఘంటసాల పాడేవారు. తద్వారా పద్యాలు పాడటం ద్వారా పాపయ్యశాస్త్రి గారికీ ఘంటసాల గారికీ తెలుగు ప్రజానీకం నీరాజనాలు పట్టింది. పద్యరచనా – పాడటం ద్వారా వీరుభయులూ కీర్తిని గడించారు. ఉమ్మిటి శివలింగం అజ్ఞాత కవి. తన వృత్తిని కొనసాగిస్తూ సాహిత్య సంపదను సాధిస్తూ జీవించిన కవి గురించి హర్షవర్ధన గారు చక్కటి వ్యాసం వ్రాశారు.... వైజయంతిమాల వ్యాసం ద్వారా పాత సినిమాలలోని ఆమె నటనా, నాట్యం, అందమైన చిరునవ్వు, మళ్ళీమళ్ళీ మల్లెపూల మత్తులా జ్ఞాపకాల పుటలు పురివిప్పాయి. ఒకనాటి *భారతి, ఉదయిని, ప్రతిభ, జయంతి, జ్వాల* వంటి పత్రికలతో సమానంగా నేటి తరాన్ని ప్రభావితం చేస్తున్న ***మిసిమి*** విజయోస్తు!..."

**– చెరుకువాడ వెంకట్రామయ్య,** *విస్సాకోడూరు*

✧ "... జూలై 2016 ***మిసిమి*** సంచిక ఆద్యంతం పఠనీయంగా, ఆసక్తిదాయకంగా ఉంది. కాక్ హోటల్, బుల్ హోటల్‌కు సంబంధించి అడ్డగోలు కథలంటూ గొల్లపూడి మారుతీరావు గారు వెల్లడి చేసేవరకూ కాక్ అండ్ బుల్ స్టోరీస్ గురించి తెలియదంటే నమ్మండి. పుస్తకం చేతిలోకి తీసుకోగానే 'రవివర్మ'గారి చిత్తరువు ఆకట్టుకుంది. తొలి ఘటోత్కచుడు రాజంరెడ్డి గారి వివరాలు ప్రయోజనకరమనిపించాయి. పత్రికలో మనసులో ముద్రలు వేసుకొనే శీర్షిక కరుణశ్రీ గారి కవిత్వాన్ని గూర్చి ప్రొ. రావినూతల గారి విశ్లేషణ, ఓలేటి గారి వాగ్దేవికి నైవేద్యమంటూ ఘంటసాల గీతికల గూర్చిన రచన మాలాంటి అభిమానులను అలరించింది. ఒక మంచి వ్యాసం వైజయంతి మాల గూర్చి బాగుంది. మీ అభిమానం, స్నేహం సదా కాంక్షించే భవదీయుడు...."

**– యిమ్మిడిశెట్టి చక్రపాణి,** *అనకాపల్లి*

# తంజావూరు బృహదీశ్వరాలయ నిర్మాణ విశేషాలు - 2

- ఈమని శివనాగి రెడ్డి



### రాజరాజ చోళుడు - రాజగురువు ఈశాన శివుడు

బృహదీశ్వర దేవాలయ నిర్మాత రాజరాజ చోళుడు, తల్లిదండ్రులు సుందరచోళుడు, వానవన్ మహాదేవి. తల్లి తిరుక్కోయిలూరుకు చెందిన మలయమాన్ రాజవంశంలో పుట్టింది. బాల్యంలో రాజరాజ పేరు అరుకుమొళ్ళివర్మన్. అతనికి తనకంటే వయసులో పెద్దవాడైన ఆదిత్య కరికాల అనే సోదరుడు, కుందవై అనే సోదరి ఉన్నారు. అరక్‌మొళ్ళి ఎప్పుడు పుట్టాడో తెలియదుగానీ, ఐప్పాసి తమిళ మాసంలో, షడయం (శతభిష) నక్షత్రంలో పుట్టాడని మాత్రం తెలుసు. చిన్నప్పుడు అరుల్‌మొళి చాలా అందంగా ఉండేవాడనీ, అతని వంటిమీద పుట్టుమచ్చలు చూచి, విష్ణుమూర్తి ఇలా అవతరించాడా అని ప్రజలు అనుకొనేవారని రాజరాజ కొడుకు రాజేంద్రచోళుని రాగిరేకు శాసనాల్లో పేర్కొన్నాడు.

అన్న, యువరాజైన ఆదిత్య కంకాలన, హత్యకు గురవటంతో, అరుల్‌మొళి తీవ్ర మనస్తాపానికి గురైనాడు. పెద్దకొడుకు మరణవార్త విన్న రాజు సుందరచోళుడు గుండె పగిలి చనిపోయాడు. భర్త వియోగాన్ని భరించలేని వానవన్ మహాదేవి, భర్త చితిమంటల్లో దూకి ఆత్మాహుతి చేసుకొంది. అలా కొద్ది కాలంలోనే, అన్నను, తల్లిని, తండ్రిని పోగొట్టుకొని, దిక్కుతోచని స్థితిలోనున్న అరుల్‌మొళిని ఇద్దరు స్త్రీలు చేరదీశారు. వారిలో సేలం, తిరుచిరావల్లి జిల్లా సరిహద్దులోనున్న కొల్లి మండల అధిపతి అయిన మలవరైయ అనే రాజుకూతురు, తన అమ్మమ్మ అయిన సెంటియాన్ మాహాదేవి. ఈవిడ, రాజరాజు తాతీ పరాంతక చోళుని రెండవ కుమారుడు అయిన గండరాదిత్య చోళుని పెళ్ళి చేసుకొంది. అయితే గండరాదిత్య చోళుడు పశ్చిమ దేశంపై దండెత్తినపుడు ఆ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయాడు. అప్పటికే సెంబియాను దేవి గర్భవతి. ఆమె, పుట్టిన బిడ్డకు ఉత్తమ చోళుడని పేరుపెట్టి, అతన్ని పెంచి పెద్దచేసింది. గండరాదిత్యుడు చనిపోయిన తరవాత 45 సంవత్సరాలపాటు బతికిన ఆమె, ఆధ్యాత్మిక జీవనాన్ని గడిపింది. అనేక దేవాలయాలను బాగు చేసింది. కొనేరిరాజపురంలోనున్న త్రిపుర విజయ, వృషవాహనలాంటి అపురూపమైన అనేక కంచు ప్రతిమలను చేయించింది. చక్కటి కళాత్మకత ఉట్టిపడే, ఈ కంచుబొమ్మల శైలి, సెంబియాన్ కళా శైలిగా గుర్తింపు పొందింది. శాసనాల్లో సెంబియాన్ మహాదేవిని 'మలవల్లెయ రాజుకూతురు, గుండరాదిత్యుని భార్య, ఉత్తమ చోళుని తల్లిగా' ప్రస్తావించబడింది. మహాదాతగా గుర్తింపు పొందిన సెంబియాన్ మహాదేవి, పునర్నిర్మించిన అనేక దేవాలయాల్లో, కుంభకోణం దగ్గర కోనేరి రాజపురంలోని రాతి దేవాలయం ఒకటి. అంతేకాక, ఆలయంలో ఉత్సవాలకు అవసరమైన కంచబొమ్మలను చేయించి, ఉత్సవాలు జరిపించింది. నాటకాలు ఆడేట్లు, దేవరం కీర్తనలను పాడేట్లు ఏర్పాట్లు చేసింది. క్రీ.శ. 977 వ సంవత్సరంలో ఉత్తమ చోళుని కొనేరి రాజపురం శాసనంలో, దేవాలయంలో నిత్యార్చనలు, సేవలు, ఉత్సవాలు, సంగీతం, నృత్యాలకు ఎన్నో దానాలను చేసినట్లుగా చెప్పబడింది. సెంబియాన్ మహాదేవి ఆలయాలకు చేసిన పవిత్ర కార్యాలనన్నింటిని, యువరాజైన అరుల్‌మొళి (రాజరాజు) ప్రత్యక్షంగా చూశాడు.

గండరాదిత్యుడు మరణించినప్పుడు ఉత్తమ చోళుడు, చిన్నవాడుగా ఉన్నందున సింహాసనాన్ని అధిష్టించలేకపోయాడు. గండరాదిత్యుని చిన్న తమ్ముడు అరింజయుడు సింహాసనమెక్కినా, ఒక్క సంవత్సరం మాత్రమే పాలించి, మరణించాడు. తరువాత అరింజయుని కుమారుడు సుందర చోళుడు (రాజరాజ చోళుని తండ్రి) సింహాసనాన్నధిష్టించి, 18 సంవత్సరాలపాటు పాలించాడు. అతని కొడుకు ఆదిత్యుడు మరణించగా, గుండె పగిలి చనిపోయాడు, అప్పుడు ప్రజలంతా, అరుల్‌మొళి చిన్నవాడైనా పట్టాభిషేకం



ప్రవేశ మండపం

చేయాల్సిందేనని పట్టుబట్టారు. అరుల్‌మొళి అరియకు ఒప్పుకోనందున, సుందరచోళుని తమ్ముడైన అరింజయుడు సింహాసనమెక్కాడు. ఈ సందర్భంగా రాజరాజు కొడుకైన రాజేంద్రచోళుడు తన తిరువాలంగాడు శాసనంలో, 'రాజ విద్యలు నేర్చుకొన్న అరుల్‌మొళి, తొందరపడక, చిన్నాన్నకు అధికారం అప్పగించా'డని చెప్పిన విషయాన్ని జ్ఞాపకం చేసుకోవాలి. ఏది ఏమైనా, రాజరాజును తీర్చిదిద్దిన సెంబియాన్ మహాదేవి ఒక గొప్ప రాజమాతగా గుర్తింపు పొందింది. రాజరాజుకు తోడ్పడిన మరో మహిళ, అతని అక్క కుందవై. ఆమె కూడా నాయనమ్మలాగే శివునికి, విష్ణువుకు, జైనతీర్థంకరులకు అనేక ఆలయాలను నిర్మించింది. ఆమెను అక్కా అని పిలుచుకోవటమేకాక, బృహదీశ్వరాలయ శాసనాల్లో తన కానుకలను ప్రస్తావించి తన రాజులకంతా అక్కడే ప్రాధాన్యతనిచ్చాడు. క్రీ.శ. 970లో సింహాసనమెక్కిన ఉత్తమ చోళుడు అరుల్‌మొళిని, రాజ ప్రతినిధిగా నియమించి తరువాత యువరాజుగానూ ప్రకటించినట్లు తిరువాలంగాడు రాగిరేకు శాసనాల్లో ఉంది.

క్రీ.శ. 986లో ఉత్తమ చోళుడు చనిపోగా అరుల్‌మొళి పట్టాభిషిక్తుడై రాజరాజ చోళుడుగా పిలువబడే 'రాజకేసరి వర్మ మ్ముడి చోళుడు' అనే బిరుదును ధరించాడు. 30 ఏళ్ళపాటు అద్వితీయంగా పాలించి, పరిపాలన, కళలు, సాహిత్యం, శిల్పం, చిత్రలేఖనం, ఆలయ నిర్మాణం, రాజనీతిలో తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకొని, తన పాలనా విధానాన్ని, సాధించిన విజయాలను తన శాసనాల్లో పేర్కొన్నాడు. పాలనాపగ్గాలు చేపట్టిన కొద్ది కాలానికే కేరళ దేశంపై దండెత్తి, ఒక్కరోజులో మలైనాడులోని 18 దుర్గమారణ్యాలను దాటి, త్రివేంద్రం దగ్గరున్న కందలూరు శాలైను జయించాడు. తరువాత పాండ్యుల అధీనంలోనున్న మధురైని, ఉదకమండలాన్ని జయించి, అక్కడున్న దేవాలయాల్లో, తన జన్మ నక్షత్రమైన శతభిషం రోజున ప్రత్యేక ఉత్సవాలకు ఏర్పాట్లు చేశాడు.

అంతటితో ఆగక, తన కుమారుడు రాజేంద్ర చోళుని ఆధ్వర్యంలో గొప్ప సైన్యాన్నిచ్చి మైసూరు ప్రాంతానికి పంపి, పద్యతుగాంగులను, నాళంబులను, బీజాపూర్ ప్రాంతంలోని చాళుక్యులను జయించాడు. అదే ఊపుతో తూర్పు (వేంగీ), చాళుక్కులనూ, కళింగ రాజులను జయించాడు. అప్పట్నించే తీరాంధ్ర (కోస్తా) ప్రాంతాన్ని చోళమండలంగా పిలిచారు. బ్రిటీషు హయాంలో చోళమండలం కాస్తా 'కోరమాండల్' అయింది. ఇవన్నీ జయించిన రాజరాజచోళుని దృష్టి సింహళంపై పడింది. ఉత్తర సింహళాన్ని జయించి దానికి ముమ్మడి చోళ మండలమని పేరుపెట్టాడు. మాతోట్టం పొలోనున్నరువీలో జననాథ మంగళమనే శివాలయాన్ని కట్టాడు. అదే ప్రాంతానికి రాజరాజపురమనే పేరు పెట్టారు. తరువాత రాజరాజచోళుడు 2000 చిన్నచిన్న దీవులున్న మాల్దీవులు కూడ జయించాడు. రాజరాజు శాసనాల్లో అతనికి అరుల్‌మొళివర్మకు, రాజరాజచోళ, ముమ్మడిచోళ, జయంగొండచోళ, చోళేంద్రసింమాన్, శివపాదశేఖర, రాజాశ్రయ, రాజమార్తాండ, రాజేంద్రసింహ, చోళమార్తాండ, నిత్తవినోదన్, పాండ్యకులాశని, సింగాళారితకన్, కేరళాంతకన్, తెలింగకులకాలన్, తిరుమురై కండచోళ, అభయకుల శేఖరన్ అనే బిరుదులను పేర్కొనబడింది. క్రీ.శ. 1012 వ సంవత్సరంలో కుమారుడైన రాజేంద్రచోళుని యువరాజుగా ప్రకటించాడు. రాజరాజు పట్టమహిషి పేరు లోక మహాదేవి అని బిరుదుగాంచిన దంతి శక్తి విటంకి. అతని రెండో భార్య వానవీన్ మహాదేవికి పుట్టినవాడే రాజేంద్రచోళుడు.

పరమ శివభక్తుడైన రాజరాజుకు, శైవులకు అత్యంత పూజ్యనీయమైన దేవారం గీతాలను కనుగొన్న కీర్తి దక్కింది. క్రీ.శ. 14వ శతాబ్దివాడైన ఉమాపతి శివం, రాజరాజుల దేవారం గీతాలను కనుగొన్న విధానాన్ని తెలియజేశాడు. తన సభలో ఒకసారి దేవారంగీతాలను విన్న రాజరాజు వాటి సాహిత్య సౌరభానికి, భక్తితత్వానికి మంత్రముగ్ధుడై, అవి అందుబాటులో లేవని తెలుసుకొన్నాడు. విచారణ జరిపి, చిదంబరం దగ్గర తిరునరైయూర్‌లోని శైవాచార్య కుటుంబంలో జన్మించిన నంబి ఆండార్‌నంబి ద్వారా అవి

చిదంబరంలోని నటరాజాలయంలో భద్రపరచబడి ఉన్నాయని తెలుసుకొని ఆ గది తలుపులు తీయబోగా అవి రాలేదు. అప్పుడు రాజుకు దేవారంపాడిన ముగ్గురు నాయనార్లు ఈ గది ముందుకు వస్తేనే ఆ గది తలుపులు తెరుచుకుంటాయని ఆకాశవాణి వినిపించింది. అప్పుడు సుందర్, తిరుజ్ఞాన సంబదర్‌ల కంచిల బొమ్మలను ఊరేగింపుగా తీసుకొచ్చి ఆ గది ముందు నిలబెట్టగా తలుపులు తెరుచుకున్నాయి. చెదల పుట్టలు తొలగించగా చెదలు తినగా మిగిలిన కొన్ని దేవారం గీతాలున్న తాళపత్రాలు దొరికాయి. దేవారం గీతాలను కనుగొన్న రాజరాజుకు అప్పటి నుంచి తిరుమురై కంథచోళుడనే బిరుదు దక్కింది. అయితే దేవారం గీతాలను సాంప్రదాయ రీతిలో పాడించాలని ప్రయత్నించిన రాజరాజుకు, క్రీ.శ. 7వ శతాబ్దంలోను తిరుజ్ఞాన సంబంధమే ఆ గీతాలను పాడిన పులాంగు విన్నటువంటి తిరునీలకంఠ యళపనరాన వంశానికి చెందిన వల్లి అనే మాలిక ఉందనీ, ఆమె మాత్రమే అలా పాడగలదనీ తెలుసుకొని, ఆమెచేత పాడించి, ఆ సంప్రదాయాల్ని కొనసాగించాడు. తిరువడై వాసల్ అనే ఊళ్ళో ఉన్న క్రీ.శ. 11వ శతాబ్ది శివాలయ గోడలపై 11 గీతాలు మాత్రమే చెక్కబడి ఉన్నాయి. శివాలయంలో దేవారం గీతాలను ఆలపించే ఆచారముందని క్రీ.శ. 9వ శతాబ్దికి చెందిన ఒక పల్లవ రాజైన మూడో నంది వర్మ శాసనంలో ఉంది. మళ్ళీ ఈ సంప్రదాయాన్ని రాజరాజు నాయనమ్మ సెంబియాన్ మహాదేవి రాజరాజు ఇంకా యువరాజుగా ఉన్నప్పుడు, క్రీ.శ. 977లో కోనేరి రాజపుర శివాలయంలో పాడించే ఏర్పాట్లు చేసిందని అక్కడి శాసనం చెబుతుంది.

తిరుప్పదియమ్ అని పిలువబడిన ఈ గీతాలను అనేక దేవాలయాల్లో పాడే ఏర్పాటు చేసిన రాజరాజు పాడేవారికి భూముల్ని దానం చేశాడు. తాను నిర్మించిన తంజావూరు దేవాలయంలో శివదీక్ష తీసుకొని, వారి పేర్లు జ్ఞానశివన్, పూర్వశివన్, సత్యశివన్, నేత్రశివన్ అన్న పేర్లతో 50 దేవారంగాయములు నియమించాడు. వారితోపాటు సంస్కృత గీతాలు పాడే ఆర్యంపాడువాతో, తమిళ గీతాలు పాడే తమిళ పాండువార్‌లను కూడా నియమించాడు. రాజరాజు, ముగ్గురు నాయనార్ల గీతాలపై అచంచల భక్తి ప్రపత్తులతో ఉండి శైవమతాభిమతాన్ని నియమించాడు. కుటుంబంలోని పెద్దలు, ముగ్గురు నాయర్లు, ఇంకా కొంతమందితో శైవాచార్యుల ప్రభావంతో శైవభక్తుడైన రాజరాజు పట్టాభిషిక్తుడైనప్పట్నించి



ఈశ్వర వాహనం

అనేక పాత దేవాలయాలను బాగుచేసి, కొత్త దేవాలయాలను కట్టాడు. ఆయనకున్న బిరుదులతో శివునికి ఆలయాలు నిర్మించటం రాజరాజు ప్రత్యేకత. వాటిలో, ఉత్తర ఆర్కాట్ జిల్లాలోని సెంకురంలో 1. జయంగొండచోళీశ్వరం, 2. మేల్పడిలో చోళేంద్ర సింహేశ్వరం, 3. తిరునల్వేలిజిల్లా, చేరమదేవిలో చోళేంద్ర సింహేశ్వరం, 4. కన్యాకుమారి జిల్లా, నాగకోయివేలిగ రాజరాజేశ్వరం, 5. ఉత్తర ఆర్కాట్ జిల్లా, చోళపురంలో రాజరాజేశ్వరం, 6. మద్రాస్ దగ్గర శివపురంలో రాజరాజేశ్వరం, 7. దిండివనం దగ్గరి బ్రహ్మదేశంలో రాజరాజేశ్వరం, 8. శ్రీలంకలోని మాతోట్టంలో రాజరాజేశ్వరం, 9. మైసూర్‌లోని, మలూరి పట్టణంలో అరుల్‌మొళీశ్వరం, 10. తంజావూరు జిల్లాలోని అమంగుడిలో రాజరాజేశ్వరం, 11. అరకోలకాం దగ్గర కళాపుళామ్‌లో ముమ్మడి చోళేశ్వరమ్‌లు ముఖ్యమైనవి. కేవలం శివాలయాలేకాక, విష్ణువుకు, జైన తీర్థంకరులకు కూడా ఆలయం నిర్మించాడు. పాండిచేరి దగ్గరగల ఉంగపురంలో శివునికి అరికులకేసరీశ్వరుకు, విష్ణువుకు శ్రీరింజయ విన్నగారికు, జైనతీర్థంకరునికి సుందరచోళపళ్ళి (పళ్ళి అనగా జైనబసడి గల దేవాలయమున్న ఊరు) అనే దేవాలయాలను రాజరాజు నిర్మించాడు.

తంజావూరు బృహదీశ్వరాలయంపైగల శ్రీ విమాన నిర్మాణంలో తనతోపాటు, సోదరి కుండవై, రాజులు, సేనాధిపతులు, పురజనులు, గ్రామీణులు, సేవకులు కూడా వీరి వంతు సహకారాన్ని అందించే వీలు కల్పించాడు. ప్రాకారాన్ని రాజరాజ సర్వాధ్యక్షుడు నిర్మించగా, రాజరాజు, చోళులు ఉత్సవ విగ్రహాలనిచ్చారు. తన శివదీక్షనిచ్చిన రాజగురువు ఈశాన శివునికి ఉచిత రీతిలో సత్కరించాడు.

**రాజ గురువు – ఈశాన శివుడు :**

బృహదీశ్వరాలయంలోనున్న రాజరాజు పట్టాభిషిక్తుడైన

29వ సంవత్సరం (క్రీ.శ. 1012)పు శాసనంలో రాజపురోహితుడు అయిన రాచగురువును ఉడైయార్ శ్రీ రాజరాజదేవర్ గురుక్కుల్శ్రీ ఈశాన శివ పండితమే అని పేర్కొనబడింది. ఉడైయార్ అంటే రాజరాజుకు స్వామి లేక యజమాని అని అర్థం. రాజరాజు తనకు తాను రాజగురువుకు సేవకునిగా భావించాడు. బృహదీశ్వరాలయం, సముదాయంలోని పరివారాలయంల కుంభాభిషేకం సందర్భంగా బంగారు కలశాలనిచ్చి, ప్రతిష్టాక్రమాన్ని నిర్వహించాడు. రాజగురువుపైగల గౌరవంతో రాజరాజ భార్యలాంటి మహాదేవి రాజరాజు, ఈశాన్య శివుని కంచు ప్రతిమలను చేయించి గుళ్ళో ఉంచింది. తన ప్రతిమను చూచి మురిసిన రాజగురువు, దాని ముందు అఖండ జ్యోతి కోసం కొంత నగదును దానం చేశాడు. ఆగమ శాస్త్రానుసారం, రాజరాజు, అతని రాణిలోక మహాదేవి కంచు ప్రతిమలు చేయించి ఆలయంలో ఉంచారు. రాజగురువు ప్రతిమ పీఠం పైన 'గురుక్కల్ ఆక ఎమం తరులివిత్త ప్రతిమమ్' అని చెక్కబడి ఉంది. శైవాగమంలో ఘటికుడైన ఈశానీ శివుడు లాట దేశానికి చెందినవాడు కావటాన లాట మహాదేవి, రాజగురువు ప్రతిమను చేయించింది. రాజేంద్రుని ఆరోపాలూ సంత్సరంలో అంటే రాజరాజు చనిపోయిన 3 సంవత్సరాలకు రాజగురువు, బృహదీశ్వరుని అఖండ దీపానికి కొంత నగదును దానం చేసినట్లు అక్కడి శాసనంలో పేర్కొనటాన, ఈశాన శివుడు, రాజేంద్రునికి కూడా రాజగురువుగా ఉన్నాడని తెలుస్తుంది. ఈశాన శివుడు క్రీ.శ. 1020 ప్రాంతంలో చనిపోయాడు. శైవాచార్యులుగా ప్రకటించబడటానికి వారు ఆర్యదేశంలోని కర్ణాట, కళింగ, కచ్, కర్హద్, కాశ్మీర, కాంకణ, కూటక మరియూ కాక దేశాలకు చెందినవారై ఉండాలన్న నిబంధన ఉత్తర కామికాగమంలో ఉంది. శైవాగతమాచార్యగా చెప్పబడిన శైవాచార్యుల లక్షణాల ఆధారంగా రాజగురువుల ఎంపిక జరిగిందని ఆనాటి శాసన సాహిత్యాలు తెలియచేస్తున్నాయి. పూర్వకారణాగమం స్వయంభూగమనం మాత్రం, వింధ్య - కన్యాకుమారి మధ్య ప్రాంతమయి పుట్టినవారు మాత్రమే శైవార్యులుగ అర్హులని చెప్పబడ్డాయి. ఒక్కొనిది ఉత్తర దేశ ఆచార్యులు, దక్షిణ దేశంలోనూ దక్షిణ దేశ ఆచార్యులు ఉత్తర దేశంలోని శైవాచార్యులుగా తమ సేవలందించారు. క్రీ.శ. 1158వ సంవత్సరంలో సుప్రభేదా గ్రామంలో, అఘోరశవించార్యుని ఆచార్య పరంపర ప్రకారం, గోదావరీ తీరంలోనున్న ఆమర్థక శైవ మఠాచార్యులు గౌడ, తోట, ఆర్య, చోళ దేశాలకు చెందినవారున్నారు. రాజేంద్రచోళుని క్రీ.శ. 1020 నాటి శాసనంలో తంజావూరు ప్రధాన శివాచార్యుడైన సర్వ శివునికి ఆచార్య భోగాన్ని దానం చేస్తూ గౌడ, ఆర్య, మిథ్య దేశాలకు చెందినవారు శైవాచార్యులుగా అర్హులని చెప్పబడింది. మొదటి రాజరాజు కంటే ముందు కాలంలోనే చోళన దేశానికి చెందిన విద్యాంత శివుని, కాశీరాజు, తనీర రాజ గురువుగా నిర్మించుకొన్నాడు.

ఇక ఆచార్యులు కావాలంటే, అతడు శివభక్తుడై, శివభక్తులను గౌరవించి, సశ్శీలాలు కలిగి ఉండి, పాపరంజితుడై, కరుణామయుడై, నిష్టనియమాల్లు గరిష్టుడై ఉండాలని మధ్యయుగ శైవాగమాలన్నీ పేర్కొంటున్నాయి. పూర్వ కారణాగమంలో, ఆచార్యుడు, శైవసిద్ధాంత జ్ఞాని అయి ఉండి, అగ్ని, గురువు, దేవతలపట్ల గౌరవాచ్చావాత ఉండి, మంచి చెడుల విచక్షణాజ్ఞానం కలిగి ఉండి, సర్వజ్ఞుడై, శైవసమయాచారాలను కాపాడుతూ వివాహితుడై, జటిల ముడిని ధరించి, గడ్డాలు, మీసాలు లేకుండా ఉండాలన్న ఆచార్య లక్షణాలను పేర్కొంది. అంతేకాక, వారు రాయటంలో నిపుణులై ఉండాలన్న (లేఖ్య కర్మాణి నిపుణుడు) నిబంధన కూడా ఉంది. ఆలయ విధివిధానాలను తాళపత్రాలపైన, రాతిపైన, రాగిరేకులపైన శాసనాలుగా చెక్కించే బాధ్యత కూడా శైవాచార్యులదే. ఉత్సవాది అనేక ఆలయ, కార్యక్రమాలను నిర్ణయించాలిగాబట్టి అతడు జ్యోతిష్యశాస్త్రంలో పండితుడై ఉండాలి. న్యాయశాస్త్ర కోవిదుడై, వాస్తు శాస్త్ర విశారదుడై ఉండాలని అజితాగమంలో ఉంది. ఆలయ నిర్మాణ, పునరుద్ధరణ పనుల్లో స్థపతి / ప్రధాన శిల్పితో సమన్వంగా పనిచేయాలిగాబట్టి అతడు వాస్తు-శిల్పశాస్త్రాలలో దిట్ట అయి ఉండాలి. అలాగే కొన్ని లోపాలు, దోషాలున్న వ్యక్తులు శైవాచార్యులుగా పనికి రారని కూడా ఆగమ శాస్త్రాలు సూచించాయి. గుడ్డివారు, నయంకాని జబ్బులతో బాధపడుతున్నవారు, చెవిటివారు, శుచీ, శుభ్రం లేనివారు, బాగా పొడవుగా, బాగా పొట్టిగా ఉన్నవారు, స్థూలకాయులు, ఆత్మదోషం కలవారు, వేరొకరి భార్యతో కాపురం చేసేవారు, వితండవాది, ఇతరుల గురించి చెడుగా మాట్లాడేవారు, సంగీత, నృత్యకారులు, తాగుబోతులు, ఆయుధాలను ధరించేవారు, వైద్యులు, కావ్యాభిలాష కలవారు, పాచికలాడేవారు, శైవాచార్యులుగా, ప్రధాన పూజారులుగా,

స్థానాధిపతులుగా పనికి రారని అభితాగమంలాంటి ఆగమాలు ఘోషించాయి. అర్హతులు, అనర్హులు గురించి చెప్పిన ఆగమాలు శైవాచార్యులు విధులను గురించి కూడా చెప్పాయి. ఆలయ నిర్మాణంలో యజమాని (రాజు), రాజగురువులు ప్రధానపాత్ర పోషిస్తాడు. రాజు తలచుకుంటే, రాజగురువు అమలు చేస్తాడు. ఎంపిక చేసిన స్థలంలో, దేవాలయ చిత్రాలన్నీ గీచే దగ్గర నుంచి మహాకుంభాభిషేకం వరకూ రాజగురువుదే. అన్ని పనుల ప్రారంభ సమయంలో పూజలు చేస్తాడు. బలులకు పూజలు చేస్తాడు. తరువాత శిల్పి చెక్కటం ప్రారంభిస్తాడు. నిర్మాణంలో ప్రతి దశకూ ఆచార్యుని శ్రీమతి అవసరమని కూడా చెప్పబడింది. తంజావూరు దేవాలయ విషయంలో యజమాని రాజరాజు, ఆచార్యుడు ఈశాన శివుడు, ప్రధాన శిల్పి పెరుంతచ్చకులు ముగ్గురూ చెక్కటం సమన్వయంలో పనిచేసినట్లు, రాజరాజు శాసనాలు రుజువు చేస్తున్నాయి.

కామికాగమంలో రాజగురువు అత్యున్నత గౌరవ పురస్కారాలకు పాత్రుడని చెప్పబడింది. ఆలయపరమైన పనుల్లో, ముందు రాజగురువు, తరువాత రాజు, ఆ తరువాత రాజులు వరుస క్రమంలో పాల్గొనాలని ఉంది. తరువాత క్రమంలో పుంచిహితుడు, యువరాజులు, మంత్రులు ఇతర అధికారులు ఉంటారని ఆ ఆగమం పేర్కొంటుంది. రాజగురువు, రాజరక్ష, రాజాభిషేక, పుణ్యాభిషేక, రాజనీరాజన, కార్యక్రమాలను నిర్వహిస్తాడు. కారణాగమం అనాది శైవులు, ఆదిశైవులు, మహాశైవులు, అనుశైవులు, అవాంతర శైవులని, పదుశాఖల శైవాచార్యులను పేర్కొంది. అలాగే గోదావరీ తీరమయిన మంధని కాళేశ్వరంలో వ్యాపక శివుడు ప్రారంభించిన ఆమర్థక మఠంలో గోళకి, పుష్పగిరి, రణభద్ర అనే మరో మూడు మఠాలు సమన్వయంలో పనిచేస్తాయని కూడా చెప్పబడింది. రాజరాజు తరువాత, అతని వారసులు శైవాచార్యులను తమ గురువులుగా చేసుకొన్నారు. రాజేంద్రచోళునికి సర్వశివుడు, అతని తరువాత విక్రతిచోళునికి శ్రీకంతశివుడు, రెండో కులోత్తుంకునికి ధ్యానశివుడు, రెండో రాజరాజచోళునికి అఘమార శివుడు రాజగురువులుగా వ్యవహరించారు. శ్రీ కంత శివుని ఆధ్వర్యంలోనే చిదంబర దేవాలయ సుందరీకరణ పనులు జరిగాయి. సర్వశివుని పర్యవేక్షణలోనే రాజేంద్ర చోళుడు గంగైకొండ చోళపురంలో బృహదీశ్వరాలయాన్ని అలాగే రెండో రాజరాజు అఘోహర శివుని ఆధ్వర్యంలో దారాసురం దేవాలయాలన్నీ నిర్మించాడు. రెండో రాజాధిరాజ చోళునికి గింద దేశం నుంచి వచ్చిన ఉమాపతి గంగూలీ రాజగురువుగా వ్యవహరించాడు. ఆధారాలనుబట్టి చోళశైవాచార్యుల పరంపరను క్రింది విధంగా పేర్కొనవచ్చు.

| క్ర.సం. | రాజు | రాజగురువు | ప్రాంతం | ఉన్న ఆలయం | కాలం (క్రీ.శ.) |
|---|---|---|---|---|---|
| 1. | రాజరాజు | ఈశానశివ | లాటదేశం | తంజావూరు | 1000 |
| 2. | రాజేంద్రచోళ | సర్వశివ | లాటదేశం | తంజావూరు | 1020 |
| 3. | మొదటి కులాత్రుంగుడు | శ్రీకంతశివ | గౌడదేశం | తిరుమంగళం గుడి | 1020 |
| 4. | విన్రిమచోళుడు | శ్రీకంతశివ | గౌడ | తిరుమంగళం గుడి | 1121 |
| 5. | రెండో కులోత్తురుడు | ధ్యానశివ | గౌడ | చిదంబరం | 1150 |
| 6. | రెండో రాజాధిరాజు | ఉమాపతిశివ | గౌడ | అర్పక్కం | 1170 |
| 7. | మూడో కులోత్తరుడు | ఈశ్వారీశ్వర | గౌడ | త్రిభువనం | 1200 |

పై పట్టికను పరిశీలిస్తే, ఎక్కువమంది శైవాచార్యులు గౌడ దేశం నుంచి వచ్చినవారేనని తెలుస్తుంది. చోళదేశంలో శైవ సిద్ధాంతాన్ని ప్రచారం చేయటమేకాక, శైవాలయాలు నిర్మాణంలోనూ, ప్రధాన కార్యక్రమాల నిర్ణయంలోనూ, చోళరాజులకు సలహాలనిచ్చి, రాజుల మన్ననలను పొందారు. ఈ వ్యవస్థకు ఆద్యుడుగా, ఈశాన శివుణ్ణి, రాజగురువుగా ప్రకటించిన రాజరాజ చోళుడు చరిత్రకెక్కాడు.



డా. ఈమని శివనాగి రెడ్డి - స్థపతి
ది కల్చరల్ సెంటర్, విజయవాడ.
ఫోన్ : 984 859 8446.



వేదవతి

# అలౌకిక భావనా కృతి శ్రీమతి వేదవతి

- రావినూతల సత్యనారాయణ

**ప్రస్తావన :**

సామాజిక సంస్కృతిక రంగాలు ఏవైనా స్త్రీపురుషుల సమాన భాగస్వామ్యం వల్లనే పూర్తిగా వికసిస్తాయి. సాహిత్యం ఒక సాంస్కృతిక రంగం. ఏకముఖమైనది కాదు. భిన్న వర్గాల జీవితానుభవాలతో, జీవన విధానాలతో జీవన సంఘర్షణ నుండి జనించిన భావోద్వేగాలతో బహుముఖంగా వివిధ వర్ణ శోభితంగా ఉంటుంది. స్త్రీపురుషులందరు సాహిత్య సౌధ నిర్మాణంలో పాలుపంచుకోగలిగినప్పుడే అది సత్య సుందరాత్మకం అవుతుంది. పైన పేర్కొనిన నేపథ్యంలో పరిశీలిస్తే, శ్రీమతి సి. వేదవతి గారి రచనలు తెలుగు సరస్వతికి అమూల్యాభరణాలనుటలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

శ్రీమతి వేదవతి గారు భారతీయ సంస్కృతినీ, సాహిత్యాన్ని చక్కగా సమన్వయ పరచుకొని అధ్యయనం చేసిన విదుషీమణి. భారతీయ సంస్కృతీ సర్వస్వములైన భారత, భాగవత, రామాయణాలలోని పూర్వ గాథలను క్రొత్త పద్ధతిలో చిత్రించుట ఆమెలోని ప్రత్యేకత! వేదవతి గారి భాష సరళ సుందరమైనది. రస గుళికల వంటి భావాలు ఏర్చి కూర్చి తీర్చి దిద్దటం ఆమెకు వెన్నతో పెట్టిన విద్యగా గోచరిస్తుంది. ఇందుకు ఆమె రచనలే నిదర్శనం. కథ, కవిత, వ్యాసం, విమర్శ వంటి అనేకములైన ఆధునిక సాహిత్య ప్రక్రియలలో చిరకాలంగా రచనలు చేస్తున్న శ్రీమతి వేదవతి గారు తెలుగు సాహితీ లోకానికి కొత్తవారు కాదు. వారి రచనలు ప్రముఖ తెలుగు మాస, పక్ష, వార, దిన పత్రికలలో విరివిగా ప్రచురితమైనవి. అంతేకాదు, వేదవతి గారి రచనలు ఆకాశవాణి ద్వారా ప్రసారమై, ఆమెకు కీర్తి ప్రతిష్టలు ఆర్జించినవి. వేదవతి గారి ప్రచురిత గ్రంథాలలో ముఖ్యమైనవి : *శృంగారలహరి, తెలుగు వెలుగు, సామెత, ముంగిట ముత్యం, మొల్ల, సరళి, స్మృతిగీత, తలపుల తరగలు, సంజీవదేవ్ పోస్టు చేసిన ఉత్తరాలు* మొదలైనవి. వేదవతి గారి రచన తెలుగు వెలుగు అనే వ్యాస సంకలనానికి 1982లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ బహుమతి లభించింది.

ప్రస్తుత వ్యాసం, శ్రీమతి వేదవతి గారి జీవిత వివరాలతో వారు వ్రాసిన ప్రముఖ గ్రంథాలలోని విశేషాలు పాఠక లోకానికి అందజేసే ఉద్దేశంతో వ్రాయబడినది. నా ఈ ప్రయత్నాన్ని పాఠక లోకం హర్షిస్తుందని ఆశిస్తాను.

**వేదవతి గారి జీవిత విశేషాలు :**

శ్రీమతి వేదవతి గారు శ్రీయుతులు జంపాల గోపాలరావు, కనకవల్లి తాయారమ్మ దంపతులకు ఆఖరు సంతానంగా 16-12-1931 న, ఒంగోలు పట్టణంలో జన్మిచారు. వారి స్వగ్రామం గుంటూరు జిల్లాలోని దుగ్గిరాల. తండ్రిగారైన జంపాల గోపాలరావుగారు బ్రిటీష్ ప్రభుత్వంలో తహసీల్దారుగా వుద్యోగం నిర్వహించేవారు. ఉద్యోగరీత్యా ఒంగోలులో ఉంటున్న కాలంలో వేదవతిగారు జన్మించారు. ఆవిడ బాల్యం ఎక్కువగా గుంటూరులో గడిచింది. గుంటూరులోని స్టాల్ గరల్స్ హైస్కూలు (Stall Girls High School)లో S.S.L.C. వరకు చదివారు. పదమూడేళ్ళ చిరుప్రాయంలోనే వేదవతిగారి వివాహం తన మేనత్త కుమారులైన చింతమనేని కృష్ణారావు గారితో జరిగింది. ఆ తర్వాత వేదవతిగారి ఉన్నత విద్యాభ్యాసం కుంటుపడింది. వేదవతి గారికి చిన్నప్పటినుండే విపరీతమైన పఠనాశక్తి అలవడింది. కనిపించిన పుస్తక మెల్ల ఆమూలాగ్రంగా చదువుట అలవాటు చేసుకున్నారు. జీవితం పట్ల, సాహిత్యం పట్ల ఆమె చక్కటి అవగాహన అలవరుచుకున్నారు. కథలు, నాటకాలు, నవలలు వంటి సాహిత్య ప్రక్రియలన్నింటినీ ఇష్టంగా చదివారు. కృష్ణశాస్త్రి, విశ్వనాథ, శ్రీశ్రీల రచనలంటే

వేదవతిగారికి చాలా ఇష్టం. వీరి రచనలతోపాటు చిన్న వయసులోనే అడవి బాపిరాజు, మల్లాది రామకృష్ణశాస్త్రి, శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి, అబ్బూరి రామకృష్ణారావు వంటి మహా రచయితల రచనలన్నీ కాచి వడపోశారు. ఆ రచనలలోని సారాన్ని చక్కగా ఆకళింపు చేసుకున్నారు. ఇదంతా ఒక ఎత్తైతే, వేదవతిగారి పౌరాణిక వాఙ్మయ మథనం మరోఎత్తు. దీని వెనుక తండ్రిగారైన గోపాలరావుగారి ప్రేరణ ఉంది. వారు మన ప్రాచీన సాహిత్యములోని అనేక రసవత్తర ఘట్టాలను చదివి వేదవతిగారికి వినిపించేవారు. పౌరాణిక కథలు, ఇతిహాస విశేషాలు ఆవిడలో ఒక అద్భుతమైన చైతన్యాన్ని సృజించాయి. వేదవతిగారి ఆధ్యాత్మిక చింతనా ప్రవృత్తికి బీజాలు వేసినవారుకూడా వారి తండ్రిగారే! వేదవతిగారి ప్రాచీన సాహిత్యాభ్యాసం గోపాలరావుగారి ప్రేరణ వల్లనే క్రియారూపం దాల్చింది. ఒక విధంగా చూస్తే చిన్నప్పుడు వేదవతిగారు పెరిగిన వాతావరణమే ఆమెను రచయితగా రూపొందించింది.

**వేదవతి రచనా ప్రస్థానం :**

పూవు పుట్టగానే పరిమళిస్తుంది అనేది ఒక సామెత. ఇది వేదవతిగారి విషయంలో సార్థకతను సంతరించుకుంది. శ్రీమతి వేదవతిగారు పదో తరగతి (Vth Form) చదువుతున్న రోజులలో కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రిగారు ఆమెకు హిందీ నేర్పేవారు. చెప్పేది హిందీ పాఠమైనప్పటికీ, అప్పుడప్పుడూ తెలుగు భాషలోని సొబగులు విద్యార్థులకు చదివి చూపించేవారు. పాఠంలోని భాగంగా వేదవతిగారు హిందీ నుంచి తెలుగులోనికి చేసిన అనువాదం చూచి మెచ్చుకుని ఏకలవ్య అనే హిందీ నాటకాన్ని తెలుగులోకి అనువదించి ఇవ్వమని కోరారట. ఆ తెలుగు అనువాదాన్ని "జ్యోతి" మాసపత్రికలో ప్రచురింపజేశారట! అదే, వేదవతిగారి తొలి రచన. కొంతకాలం తరువాత కరుణశ్రీగారు *సుభాషిణి* అనే సాహిత్య మాసపత్రికను ప్రారంభించారు. ఆ పత్రికకు ఏవైనా రచనలు పంపవలసినదిగా వేదవతిగారిని అడిగారు. అందునిమిత్తమై ఆవిడ భారత, భాగవత, రామాయణ గ్రంథాల నుండి ఆమెకు బాగా నచ్చిన ఘట్టాలను ఎంచుకొని, కథ, గల్పిక, స్కెచ్ – మూడూ కలిపిన ప్రక్రియలో రచనలు వ్రాయటం మొదలెట్టారు. అవి మూడేళ్ళపాటు *సుభాషిణి* పత్రికలో ప్రతినెలా ప్రచురితమైనవి. ఆ సమయంలోనే *ముముక్షువు*, *శాంతి* వంటి పత్రికలలో వేదవతిగారి రచనలు విరివిగా ప్రచురితమైనవి. అవి పురాణ గాథలే అయినా, కొంత ఆధునిక దృష్టితో రూపొందించిన రచనలు. విషయ సామాగ్రి ప్రాచీనమైనప్పటికీ, నూతన పద్ధతిలో వ్యక్తపరచినందువల్ల, ఆ కథలు పాఠక లోకాన్ని ఎక్కువగా ఆకర్షించి, ఆకట్టుకున్నాయి. విమర్శకుల దృష్టిని కూడా ఆకర్షించాయి. చాలామంది విమర్శకులు ఆమె రచనలు చదివి ప్రశంసించారు. ఈ పౌరాణిక కథాచిత్రణలన్నింటినీ కలిపి తర్వాత కాలంలో పుస్తకరూపంలో *శృంగారలహరి* అనే శీర్షికన ప్రచురింపబడింది. *శృంగారలహరి* సంకలనానికి విశ్వనాథ సత్యనారాయణ గారు, కరుణశ్రీగారు, సి. నారాయణ రెడ్డిగారు ముందు మాటలు వ్రాశారు. పుస్తకంలోని రచనలను ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారు, దేవులపల్లి రామానుజరావుగారు ఎంతగానో ప్రశంసించారు. *శృంగారలహరి* వేదవతిగారి తొలి పుస్తకం. ఈ పురాణ క్షీరసాగరం నుంచి ఏర్చి కూర్చిన చిత్రణల సంకలనం తర్వాత వేదవతిగారి కలం నుండి దాదాపు ఇరవైకి పైగా రచనలు వెలుగు చూశాయి. ఈ రచనలన్నీ, స్వయంప్రతిభా మూలకమైన అభినివేశంతో, తాత్విక, విమర్శనా దృష్టితో రచయిత్రి వెలువరించినవి, వైవిధ్యంతో కూడినవి. కీర్తిప్రతిష్ఠలార్జించి తెలుగు సాహితీ లోకంలో ఆమెకొక చెరగని స్థానాన్ని గడించి బెట్టినవి.

శ్రీమతి వేదవతిగారు తమ సుదీర్ఘ రచనా ప్రస్థానంలో పాఠక లోక ఆదరాభిమానాలు చూరగొనుటయేగాక, అనేక సంస్థల నుండి పురస్కారాలను పొందారు. వాటిలో ప్రముఖమైనవి కొన్ని – 1. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ఉత్తమ గ్రంథ పురస్కారం (1982), 2. నన్నయ్య అవార్డు, కవిత్రయ జయంతి సంఘం, నెల్లూరు (1990), 3. వాసిరెడ్డి రంగనాయకమ్మ ధర్మనిధి పురస్కారం, తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు (1991), 4. మొల్ల జయంతి సాహితీ పురస్కారం (1995), 5. శ్రీనాథ జయంతి పురస్కారం (1996), 6. ఆంధ్రప్రదేశ్ సాహితీ పురస్కారం (1996), 7. ఆంధ్ర సారస్వత పరిషత్తు, ఎర్రమెద్ది రంగనాయకమ్మ సంస్మరణ పురస్కారం (1996), 8. వణుకూరు నారాయణ రెడ్డి సంస్మరణ పురస్కారం, విశ్వసాహితి, హైద్రాబాదు (1998), 9. తెలుగు విశ్వవిద్యాలయం ఉత్తం రచయిత్రి పురస్కారం (2000), 10. C.P. బ్రౌన్ జయంతి సంఘం పురస్కారం. (2006).

**వేదవతిగారి రచనల పరిశీలన :**

వేదవతిగారు ఇరవైకి పైగా పుస్తకాలు వ్రాశారు. అన్ని పుస్తకాలలోని విశేషాలను ఒకే వ్యాసంలో చర్చించుట సంభవం కాదు. ఆ కారణాన ముఖ్యమైన కొన్ని పుస్తకాల వివరాలనే పాఠకుల ముందుంచడమైనది.

**శృంగారలహరి :**

ఈ పుస్తకంలో భారత, భాగవత, రామాయణ గాథలు త్రివేణీ సంగమంగా రూపొందాయి. ఈ లహరిలో ఇరవై కథలున్నాయి. అందులో పదకొండు గాథలు భాగవతానికి సంబంధించినవి. ఐదు రేఖాచిత్రాలు భారతానికి చెందినవి. నాలుగుమాత్రం రామాయణ కథలోనివి. కరుణశ్రీగారి మాటల్లో "అజరామరమైన పౌరాణిక మధుర కథా సుధారసాన్ని సరికొత్త పాత్రల్లో అందించారు రచయిత్రి". వ్రాసింది వచనమైనా, ఇది వచనంలో వ్రాసిన కవిత్వమనిపిస్తుంది! రేఖాచిత్రాలు చదివినకొద్దీ చవులూరిస్తాయి. "కథలన్నిటిలోను, అద్భుతమైన భక్తితో మిళితమైన శృంగారాన్ని ప్రవచింప చేశారు రచయిత్రి". "ఈ పుస్తకంలోని కొన్ని కథలు శృంగారమువలె, కొన్ని కథలు ఇతర భావములు కలవిగాను కనిపించునుగాని, ప్రధానమైనది ఈమెకుగల కృష్ణ భక్తి" అంటారు కవిసామ్రాట్టు విశ్వనాథ. రచయిత్రి పురాణ పాత్రలలో ప్రవేశించి, వారితో తాదాత్మ్యము పొంది మనము మన మిత్రులతో, చుట్టాలతో, మనకు తెలిసిన మహాపురుషులతో ఏ విధంగా ప్రవర్తిస్తామో, అటువంటి సమయాల్లో మన అనుభూతి ఏ విధంగా పరిణమిస్తుందో దానిని విస్తరించి మన ముందుంచారు. అది కూడా, ఒకే మూసలో కాదు. వైవిధ్యంతో కూడిన విధానంతో! కొన్ని కథలు రచయిత్రి స్వయముగా చెప్పినవి.

కొన్ని పాత్రల నోటివెంట చెప్పించినవి, మరికొన్ని కథలు కథా కథన పద్ధతిలో సాగినవి. అలాగే, కొన్ని కథలు భావ ప్రధానాలైతే, కొన్ని వర్ణనాత్మకాలు. కొన్ని రేఖాచిత్రాలైతే మరి కొన్ని డైరీ పద్ధతిలో ముందుకు సాగినవి! సూక్ష్మంగా పరికిస్తే, "నిశీధిలో ఇంటర్వ్యూలో" ప్రేమమయి రాధిక ప్రణయం దర్శిస్తాం. బంధితుడులో యశోదమ్మ మాతృహృదయం మనకు పరిపూర్ణంగా సాక్షాత్కరిస్తుంది. అలాగే యుగళగీతిలో సీతారాముల ప్రణయ కలహాన్ని చతురతతో తీర్చిదిద్దిన చిలుకమ్మను చూచి సంతసిస్తాము. నివేదనము అనే కథలో కుబ్జకు కృష్ణపరమాత్మ యందుగల భక్తీ, అనురక్తీ వ్యక్తమౌతాయి. శృంగారలహరి వేణుగోపాలుని రాసలీలా విలాసానికి రమణీయమైన ప్రతీక. అదే విధంగా శబరితో ఇంటర్వ్యూ ఒక ఆటవికాంగన అమాయికతకూ, అచంచల భక్తికీ, ఆత్మార్పణకూ అద్దంపడుతుంది. అలాగే అర్జున ఉవాచ కథలో భగవంతుని గూర్చి అర్జునిని అనుభూతి ఎట్టిదో రమ్యంగా చిత్రితమైనది. ఈ రచనను జాగ్రత్తగా పరిశీలిస్తే రచయిత్రి వేదవతిగారు భావానికి ఎంత ప్రాధాన్యత ఇస్తారో భాషకు కూడా అంతటి ప్రాముఖ్యత ఇస్తారని, ఆమె రచనలో లలిత కోమల కాంత పదావళి లాస్యం చేస్తుందని గ్రహించవచ్చును. అందుకునే ఈ పుస్తకం చదువు తున్నప్పుడు పాఠకునికి ఒక చక్కని భక్తిరచన చదివిన అనుభూతి తప్పక కలుగుతుంది. ఈ గ్రంథం ప్రముఖుల ప్రశంసలనందుకున్నది.

**తెలుగు వెలుగు :**

అచ్చమైన తెలుగుతనపు తీరుతెన్నులను చిత్రించే కథలవంటి పన్నెండు వ్యాసాలు ఈ గ్రంథంలో చోటుచేసుకున్నాయి. కథలూ, కబుర్లూ చెబుతున్నట్లు మధ్యమధ్యలో పాటలూ, పద్యాలు చొప్పిస్తూ సాగింది ఈ వ్యాస రచన. తెలుగువారి ఆలోచనలూ, అభిరుచులూ, అందాలు ఆనందాలు, ఆశయాలు అనుభవాలు, ఈ వ్యాసాల ద్వారా వ్యక్తీకరించారు వేదవతిగారు. నేటి యాంత్రిక జీవనంలో లోపిస్తున్న ఈ లక్షణాలను ముఖ్యంగా మానవీయ అనుబంధాలను మనకు మనమే మననం చేసుకోవలసిన అవసరం ఈ కాలంలో హెచ్చుగా కనిపిస్తుంది. శ్రీమతి మాలతీచందూర్ అన్నట్లుగా వేదవతిగారికి తెలుగువారి సంస్కృతి పైనా, ఆచారాల మీద ముఖ్యంగా తెలుగు నేల మీద అపారమైన అనురాగం నిహితమై ఉంది. శ్రీమతి వేదవతి గారు ఈ వ్యాసాల ద్వారా తెలుగు ఆడపడుచు జీవితాన్ని, జానపద గేయాల నుంచీ ఏరిన భావకుసుమాలతోను, సాహిత్య సంపదతోనూ, మిళితంచేసి, అతి రమ్యంగా చిత్రించారు. అంతేకాదు, మన ఇతిహాసలలోని సంఘటనలనూ, లలిత కళలూ, ఆటలూ, ఆలనాటి చీరెలు, నోములు వ్రతాలే కాకుండా – అందులో అంతర్లీనమైన స్త్రీమూర్తిని గురించి చక్కగా అభివర్ణించారు. ఈ గ్రంథంలోని వ్యాసాలు విషయగర్భితమై, చక్కని శైలితో, చిక్కని భాషతో మిళితమై పాఠకుల ఉత్కంఠనూ, ఉత్సాహాన్ని ఇనుమడింపజేసి ఏకబిగిన చదివిస్తాయి. "తెలుగు వారికి గొప్ప చరిత్ర ఉంది. ఒక ఆదర్శ ప్రాయమైన విశిష్ట సంప్రదాయం ఉంది.

పరిపుష్టమైన సంస్కృతి ఉంది.... ఇవన్నీ విస్మరించి ఇతరులను అనుకరించబోవటం ఆత్మద్రోహం" అంటారు రచయిత్రి! ఈ తరం తెలుగువారు – ముఖ్యంగా యువతరం గ్రహించవలసిన విషయమిది. తెలుగు వెలుగు పుస్తకానికి 1982లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ బహుమతి లభించింది. తెలుగు వారంతా తప్పక చదువవలసిన మంచి పుస్తకమిది.

**ముంగిట ముత్యం :**

యశోద కృష్ణుల మధ్య ఉండిన వాత్సల్యానురాగాన్ని వస్తువుగా గ్రహించి చేసిన రచన ముంగిట ముత్యం. ఇది కేవలం యశోదాకృష్ణుల పాత్ర చిత్రణ కాదు. ఇది మాతృహృదయ వేదనకు మణిదీపం వెలిగించిన మహత్తర కావ్యం. శుక్తి నుండి ముత్యమువలె రచయిత్రి హృదయాంతరాళము నుండి ఈ గేయ స్రవంతి పెల్లుబికి వచ్చింది.

చైతన్యవంతమైన ఈ సర్వ సృష్టి స్వరూపంలో అణువణువునా శ్రీమతి వేదవతి గారు దర్శించుకొన్న తల్లితనానికి ప్రతీకగా యశోదా, అత్యంత బాలప్రాయపు మౌగ్ధ్యంతో – అందరినీ అలరించే అద్భుత శైశవమూర్తికి ప్రతీకగా కృష్ణశిశువూ, ఈ ముంగిట ముత్యానికి ముఖ్య పాత్రలు. "భాగవతంలోని బాలకృష్ణమూర్తి" వేదవతిగారికి అత్యంత ప్రీతిపాత్రమైన వత్సల పాత్ర! శ్రీమతి వేదవతిగారికి "భారతీయ భావనలో బాలకృష్ణ తత్వం" అనే అంశాన్ని గురించి ఒక సాహిత్య పరామర్శ చేయాలని చాలాకాలంగా అనుకొంటూ వచ్చారట. ఆ ప్రయత్నంలో మనసు బాలకృష్ణ భావనాసక్తమై వాత్సల్య భావజగత్తులో విహరిస్తూ వచ్చింది. మాతృత్వపు అనుభూతి సంపద ఒక్క శరీర ధర్మానికే పరిమితం కాదనే విషయాన్ని ఋజువు చేస్తూ, ఒక దివ్య వాత్సల్యోత్సుకత ఆమె హృదయంలో ఆవరించింది. జన్మాంతరపు ఆలోచనలూ, అనుభూతులు, అనురాగాలూ ఎక్కడెక్కడి నుండో వచ్చి ఆమెను ఉగ్రూత లూగించి, ఉక్కిరి బిక్కిరి చేయగా – యశోదతత్వము వచ్చి చేరిన గుండెలో ఒక అవ్యక్త భావరాగాలాపన తో పుట్టుక వచ్చినది ఈ ముంగీతి ముత్యపు పాట! ముత్యమంత పసివాడు ఈ గేయములకు కథానాయకుడు. అలాగే రంగస్థలము ఆ శిశువు పవ్వళించిన పర్యంకము (మంచము). అభినయము నిద్రాముద్ర. సమయము సూర్యోదయ వేళ, ప్రవేశము – తల్లి, తల్లి తనము తప్ప ఇతరమేమి ఎరుగని అచ్చపు తెలుగు తల్లి! నిదురిస్తున్న చినకుమారుని చూచు కొన్నప్పుడు ఆమెలో వాత్సల్యం రఘరివాకలై సాగినది. శిశువు పట్ల ఆమె అనురాగమంతా సంగీత రాగమైనది. ఆమె గుండెలోని మమకారపు పొంగులు, అనందపు విందులు అన్నీ చేరి వచ్చి ఈ వాత్సల్య గీతికలుగా రూపొందినవి! తొలి ఊపులో పురాణ పాత్రగా పరిచయమై రచయిత్రిని కదిలించిన బాలకృష్ణమూర్తి ఈ గీతికల ద్వారా భువికి దిగివచ్చి అచ్చపు తెలుగింటి శిశువైనాడు! అందుకు కారణం బాలభావనలో వేదవతిగారు పొందిన ప్రాకృతికమైన అనుభవ సిద్ధి.

ఈ కావ్యంలో ఏభై కవితా ఖండికలు పొందుపరచబడినవి. ప్రతి గేయానికీ, పూర్వపరంగా వచన వ్యాఖ్యను స్వయంగా సమకూర్చారు రచయిత్రి. శ్రీమతి వేదవతిగారి భావననుసరించి వాత్సల్య గీతను ఈ కావ్యానికి ఆత్మగాను, వ్యాఖ్యను శరీరంగాను పరిగణించాలి. ఈ విధంగా "ఒక ఆనందోత్సవ వత్సల భావానుభూతిలో ఈ గేయ రచన ముంగిటి ముత్యమై రూపుదిద్దుకొనినది'' అంటారు వేదవతిగారు. డా. రామరాజుగారు అభివర్ణించినట్లుగా ఇందులోని కవితా శీర్షికల పేర్లే దివ్య సంగీతమును త్రిథ ఆలపించినట్లు విశదము చేయుచున్నవి. కొన్ని శీర్షికలు శాస్త్రీయ సంగీతమువలెనూ, మరికొన్ని లలిత సంగీతమువలెనూ, మిగతావి జానపద సంగీతమువలెనూ ధ్వనించుచున్నవి! ఈ పుస్తకములోని గీతికలన్నీ దేనికవి విడిగా చదువుకొని, పాడుకొని ఆనందింపతగినవి. వేదవతిగారు పొందుపరచిన వ్యాఖ్యను చదివి కవితా ఖండికను చదివితే రచయిత్రి హృదయాన్ని చక్కగా అర్థంచేసుకోవచ్చు. ఇందులోని తొలి కవితా ఖండిక మారాజు అబ్బాయి మా కంటి వెలుగు అనే శీర్షికతో మొదలవుతుంది. పరికించండి :

*నల్లనివాడ నవ్వు కన్నుల వాడ!*
*నను కన్న నాతండ్రి లేచి రావయ్య!*
*చిలిపి కన్నులవాడ చిన్నారి కృష్ణమ్మ*
*కనులు తెరువర కూన నా కంటిపాప*

... ... ...

*కనులు విప్పుము తండ్రి కమలములవలెను*
*నిదుర లేవర కృష్ణ తెలవారిన దయ్య*
*నల్ల నల్లని వాడ నవ్వు కన్నుల వాడ*
*ననుకన్న నాతండ్రి లేచిరావయ్య!*

. . . ఈ శిశువు పెరిగి పెద్దవాడై తన వొడిని వదులునేమో! యశోదకు ఈ ఊహ భరింపరానిది అయినది!

ఆ క్షణాన ఆమె మూర్తి కట్టిన వాత్సల్యమైనది. ఆ తల్లితనం ఆమె అణువణువునా నిండినది. ఎవ్వరికీ మరెప్పటికీ – ముగ్ధమంజులమైన శైశవాకృతిని తనకు కరువు చేయవలదని – తన చిన్న కుమారుని బేలగా కోరుతున్నది యశోద –

*ఇంటి ముందర ముత్యమై వెలసినాడమ్మా*
*జన్మ జన్మల పుణ్యమై వెలసినాడమ్మా!*
*ఎన్ని నోముల ఫలము ఏరి కోరుతు వచ్చి*
*వత్సలాకృతి దాల్చి ఒడి నిండినదియో!*
*పసి పాదముల తాకి పొత్తిళ్ళలో నీవు*
*కదలాడగా కడుపు కలకండ తీపిరా!*
*పైట చాటున చేరి పాలు కుడువగ నీవు*
*గుండె నిడుగ సుధలు ఝురులు పారెనురా!*
*దోసపండుగ నీవు దోగాడగా చూచి*
*కనుల పండుగ కాగ కడుపు నిండెనురా!*
*తడబడచు కన్నయ్య తప్పటడుగులు వేయ*
*పసివాళ్ళు ఆసియాడు పనస తొనలటుల!*
*చీరకొంగును పట్టి చిడి బుడిగ నడచి*
*అడుగు అడుగుకు బంధమై అలరించెదవు కన్న*
*ఒడినింపుకొని నిన్ను పొదుపుకుని పొంగగా*
*చంక నిడుకొని నీకు బువ్వ తినిపింపగా*
*ఏమి తపములు చేసి తల్లినైతినిరా!*
*తల్లి తనమున తనిసి తనువు పొంగెనురా*
*శైశవాద్భుతి నాకు తరుగు చేయకు కన్న!*
*శైశవాకృతి నాకు కరువు చేయకు కన్న!*
*ఇంటిముంగిట ముత్యమై మెరిసినాడమ్మా*
*జన్మ జన్మల పుణ్యమై వెలసి నాడమ్మా!*

పైన ఉదహరించిన గీతికతో ముగుస్తుంది కావ్యం. ఈ కావ్యంలోని ఏ గీతిక పరికించినా వేదవతిగారి భావములెంత ముగ్ధమనోహరములో పాఠకులకు విదితమౌతుంది. "హృదయము నుండి ఉద్భవించిన భాష, హృదయాలకే అందుతుంది. హృదయభాష అంటే అదే! ఈ ముంగిట ముత్యం కావ్యం హృదయభాషతో నిండి వున్నది. అందరికీ అందే రీతిని, చెందే రీతిని ఉన్నది" అంటారు బాలబంధు బి.వి. నరసింహరావుగారు.

**సరళి (వచన, గేయ, కథా కవితలు) :**

వచన కవిత, గేయం, కథా కవితా ప్రక్రియలను ఎన్నుకొని, ఆయారంగాలలో కృషి చేశారు శ్రీమతి వేదవతిగారు. కవిత్వానికి ముఖ్యంగా హృదయ స్పందన అత్యవసరం. ఆత్మగతమైన ఒకానొక అనుభూతి తీవ్రత చేత ఒక భావతరంగమేదో ఉవ్వెత్తున ఎగసివచ్చి అంతరంగాన్ని తాకినప్పుడు పలుకుతుంది కవిత్వం. జీవన గమనంలో అడుగడుగునా ఎన్నో అనుభవాలు, అనుభూతులు, అంతరంగ మధనాలు సంభవిస్తాయి. అంతులేని ఈ అనుభూతి పరంపర ఒక్కోసారి గుండెను కదిలించి కవ్విస్తుంది. మరొకసారి తరచి తరచి శోధిస్తూ, విభ్రమించి విచలిస్తూ, అనేక వేళల అనేక విధాలుగా స్పందిస్తుంది. ఆ స్పందనా భావరాగాలను వచన గేయమాలగా సమకూర్చారు వేదవతిగారు. అదియే ఈ సరళి కవితా సంపుటి.

కవిత్వ విషయంలో వేదవతిగారికి కొన్ని నిర్దిష్ట అభిప్రాయాలు ఉన్నాయి. "కవిత్వం పేరుతో ఇజాలు. వర్గాలు చోటుచేసుకోవటాన్ని ఆమె నిరసిస్తారు. కవిత్వం ప్రధానంగా గుండెచప్పుడు నుంచి పుడుతుంది. మన హృదయాన్ని ఆవరించి అలజడిపరచే ఏ భావమైనా కవిత్వానికి ఆలంబన కావచ్చు. గిరిగీచి, సరిహద్దులు ఏర్పరచటం కవిత్వానికి మంచిది కాదు" అంటారు ఆమె. కవితా నందన వనంలో రకరకాల రంగుల పువ్వులు వివిధ పరిమళాలతో వికసించాలి. అప్పుడే సాహితీనందనం పరిపూర్తి అవుతుంది అని నమ్ముతారు వేదవతిగారు! సరళి సంపుటిలో 71 వచన, గేయ, కథా కవితలు చోటుచేసుకున్నవి. ఈ పుస్తకానికి పాండితీ ప్రతిభా సంపన్నులు డా. వి.వి.ఎల్. నరసింహారావుగారు దిదృక్ష (చూడాలనే కోరిక) అనే పేరుతో ముందుమాట వ్రాశారు. "పండిన అనుభవాలతో, నిండిన భావుకతతో జీవితాన్ని సందర్శించిన వేదవతి కవిత బుక్కులాంటి వచనమై, సామలాంటి గేయమై ఇతిహాసంలాంటి కథగా రూపొందింది" అంటారు నరసింహారావుగారు. కవితలన్నీ చదివినకొద్దీ చవులూరించి పఠితను ముందుకు నడిపిస్తాయి. మచ్చుకు మనసు అనే కవిత నుండి కొన్ని పంక్తులు :

*అనుభూతికి ఆలవాలం మనసు*
*నవరసాల సాలె గూటిలో పరిభ్రమిస్తుంది*
*ఊయల ఊహలలో ఊగులాడుతుంది*
*హరివిల్లుల వర్ణవిద్యోతన కేతనం మది.*
*ఉద్ధృత కల్లోలిని జల తరంగ మది!*
*ఒకప్పుడు మనస్సు మరిగే ఉష్ణగుండం*
*శ్రాంత సాధు స్వాంత సాధుగీతం!*

*ఒకప్పుడు మనసు ప్రమోదాత్త ప్రణవనాదం!*
*బ్రతుకు బాటలో ప్రతిక్షణ స్పందనం*
*ఊర్పుతాపుల విరాద్విజృంభణం!*
*ఎన్నెన్ని ఊహలు – ఉద్వేగాలు*
*. . .*
***మనసు మాత్రం గుప్పెడంత! – గుండె గూటిలో ఇమిడినంత!***

గుప్పెడంత మనసులోని వైవిధ్యాన్ని అతి మనోహరంగా చిత్రించారు. పైన ఉదహరించిన గేయంలో వేదవతిగారు. అలాగే సుదీర్ఘమైన అశ్రుగీతలో ఒకానొక అమ్మాయి (అక్క) అత్తింటి ఆరళ్ళకూ, కట్టుకున్న కసాయి కత్తి వేటుకూ బలి అయిపోతుంది. ఈ విషాద గాథను కళాత్మకంగాను, హృదయానికి హత్తుకునే విధంగాను చిత్రించారు రచయిత్రి. సరళిలోని కవితల్లో ముఖ్యంగా పేర్కొనతగినది ఈ కథా కవిత.

*అయ్యలారా అమ్మలారా పరుగు ఆపండీ*
*కాస్త ఆగి కష్ట గాథను కాన రారండీ*
*గుండె కరిగే చెరువు అయితే కరుణ నింపండి*
*కంటి కొసలను మండి ఎండిన కణము నేనండీ!*

అన్న పంక్తులు చదివినప్పుడు కవి గురజాడవారి పుత్తడి బొమ్మా – పూర్ణమ్మ జ్ఞప్తికి వస్తుంది.

**స్నేహ సూక్తం :**

సృష్టిలో తీయనిది స్నేహం. లౌకిక బంధాలన్నీలన్నింటినీ మించిన ఒక ఆత్మీయ బంధం. అటువంటి ఆత్మబంధాన్ని గుర్తెరిగి ఇతరులకు తెలియజెయ్యాలనే తపనతో, స్నేహంలో ఉండే మాధుర్యాన్ని అక్షరరూపంలో చిలికి రంగరించిన రచన ఇది. డా. బెజవాడ గోపాలరెడ్డిగారి జీవితం ప్రజాజీవితంతో ముడిపడిసాగింది. జీవితంలోని ఆటుపోట్లు, వెలుగు నీడలు అన్నీ అనుభవించి ఒక సమున్నత దశకు చేరుకున్నప్పటి ఆయన వ్యక్తిత్వం, ఆలోచనలూ, ఆయనతో ఏర్పడిన స్నేహబంధం దగ్గరగా తెలుసుకునే అవకాశం శ్రీమతి వేదవతిగారికి లభించింది. ఉత్తరాలు ఒక వ్యక్తి ఆంతర్యాన్ని, స్వభావాన్ని నిజాయితిగా వెల్లడిస్తాయి. డా. గోపాలరెడ్డిగారు ఉత్తరాల ద్వారా వెదవతిగారికి పంచియిచ్చిన స్నేహ సౌభాగ్యానికి గుర్తుగా చేసిన రచన స్నేహసూక్తం. డా. గోపాలరెడ్డిగారు వేదవతిగారికి 1980లో పరిచయమయ్యారు. తర్వాత పదిహేనుఏండ్లపాటు వారి సాహితీ బాంధవ్యం నిరంతరంగా సాగింది. అవ్యాజమైన స్నేహసౌజన్యాన్ని రచయిత్రికి అందించారు. నెల్లూరులో తరచుగా జరిగే సాహిత్య సదస్సులకు వేదవతిగారిని ఆహ్వానించి. ప్రసంగాలు చేయించారు. నిరంతరంగా సాగిన వారి ఉత్తర ప్రత్యుత్తరాలలో అనేక విషయాలు చోటుచేసుకున్నాయి. ఒక్కో ఉత్తరం ఒక్కొక్క సాహిత్య చర్చకు ప్రాణంపోసేది. ఆ విధంగా వేదవతిగారికి సాహిత్య విషయంలో చైతన్యస్ఫూర్తి కలిగేది. ఈ రచన ఒక నూతన సాహిత్య ప్రక్రియ. ఇది ఒక జీవిత చరిత్ర కాదు. ఒక ప్రతిభామూర్తి జీవిత విశేషాలను వ్యక్తిత్వాన్ని చిత్రించే రచన. పలువురు ప్రముఖ రచయితల ప్రశంసలందుకొన్నది. "స్నేహధర్మాన నా ఎరుకకు వచ్చిన, స్పందరాభిరామమైన ఆ మనోధర్మపు పరిమళాన్ని గురించి ఇష్టాగోష్ఠులలోనూ, ఇష్టంగా వ్రాసుకున్న ఉత్తరాలలోనూ ఆయన మాటల్లోనే ఆ వ్యక్తిత్వ ప్రదర్శనం చేయించే చిన్న ప్రయత్నమిదీ" అంటారు రచయిత్రి. 47 వైవిధ్య శీర్షికలతో నడచిన ఈ పుస్తకంలో ముందు తరాల వారికి ఉపకరించే విషయాలు నిక్షితప్తమై ఉన్నవి. ఈ స్నేహసూక్తం *మౌనరాగం* తో మొదలై *చలివేందిర* తో ముగుస్తుంది.

**తలపుల తరగలు :**

జీవితానుభవాన్ని పండించుకొని, సామెతల ఆమెతలు కూరుస్తూ, నలుగురూ మెచ్చే విధంగా చక్కగా కబుర్లు చెప్పగల్గడమూ, పదిమందికీ నచ్చేవిధంగా కథలూ, గాథలూ వ్రాయటం ఒక గొప్పకళ. ఆ కళలో ఆరితేరినవారు వేదవతిగారు. Critical appreciation అనేది ఒక రచనా ధోరణి. ఆ ధోరణిలో సాహిత్యంలోని వెలుగు రేఖలను, సాహితీవేత్తల వ్యక్తిత్వ సాహిత్య వైభవాన్ని అనుభూతిప్రదంగా రూపుదిద్దుకొనిన పది వ్యాసాల సంకలనం ఈ తలపుల తరగలు. ఈ పుస్తకానికి ముగ్గురు సాహితీ వేత్తలు మున్నుడిగా తమ అభిప్రాయలను సమకూర్చారు. డా. వేటూరి ఆనందమూర్తిగారు తమ ఆమోదంద్వారా ఇందులోని వ్యాసాలన్నిటికీ చక్కని విశ్లేషణ పొందుపరచారు. పుస్తకంలోని రసగంధిల రచనలు ఆనందించుటకు పాఠకులకు ఎంతో ఉపకరిస్తుంది డా.ఆనందంగారి వివరణ. *తలపుల తరంగాలు* పుస్తకాన్ని సాహితీ సాంస్కృతిక మూర్తి డా. బెజవాడ గోపాలరెడ్డిగారికి అంకితమిచ్చారు శ్రీమతి వేదవతిగారు.

**స్మృతిగీతి :**

లేఖాసాహిత్య ప్రక్రియలో సాగిన ఒకానొక ప్రణయ కావ్యం స్మృతిగీత. ఇందులోని వస్తువు కొంత భిన్న రకంగా

ఉంటుంది. ఇతరుల వేదననూ, వియోగ వ్యధను తనదిగా భావించి ఉత్తరాల రూపంలో స్మృతులను తవ్విపోసుకోవటం ఈ కావ్య విషయం. వియోగ వేదన వాస్తవం. అయితే, ఉత్తరాలలోని స్మృతిభావ తరంగాలు ఊహాజనితం!

నమ్మడానికి ఆశ్చర్యంగా ఉండే ఒక ఆదర్శ దాంపత్య జీవనం వదాన్యులూ, నిత్యసాహితీ వ్రతులైన శ్రీ వై.బి. రెడ్డిగారు, వారి ధర్మపత్ని శ్రీమతి రంగనాయకమ్మ గార్లది. వాళ్ళను చూస్తే, ఎక్కడా లేని, ఎవరిలోనూ కనిపించని సుఖదుఃఖాద్వైతం వారిలో కనిపించేదిట! ఒకరిని ఒకరు మన్నించుకొనే ఆ సంస్కారం, కష్టసుఖాలను కలిసి పంచుకొనే వారి చెలిమి, ఏకైక పుత్రికావియోగాన్ని తట్టుకుని నిలబడే ఆ స్థైర్యం, ఒడిదుడుకులకు తడబడకుండా ఎదుర్కొనే ఆ సమన్వయం అందరినీ ఆశ్చర్యచకితులను చేసేదట! 54ఏండ్ల దాంపత్య జీవనానికి శ్రీమతి రంగనాయకమ్మ గారి మరణం అఘాతాన్ని కలిగించింది. శ్రీ వై.బి. రెడ్డిగారికి దుర్భర వియోగాన్ని కలిగించింది. వేదవతిగారికి రంగనాయకమ్మతో ప్రత్యక్ష పరిచయం లేనేలేదు! శ్రీ వై.బి. రెడ్డిగారి అంతరంగంలో శాశ్వతంగా నిలిచివున్న ఆమెను తన ప్రజ్ఞాచక్షువుతో చూడగలిగారు రచయిత్రి! రంగనాయకమ్మగారితో ప్రత్యక్ష పరిచయమున్నవారికంటే ఎక్కువగా ఆమె స్వభావాన్ని లోతుగా అర్థం చేసుకొని ఆమె వ్యక్తిత్వానికి అద్భుతమైన రూపకల్పన చేశారు వేదవతిగారు ఈ రచనలో. శ్రీ వై.బి. రెడ్డి దంపతుల 54ఏండ్ల దాంపత్యానికి సంకేతాలుగా 54 లేఖలను రూపొందించారు రచయిత్రి! లేఖాసాహిత్య తెలుగు పాఠకులకు కొత్త కాదు గాని, ఒక వ్యక్తి మధురమైన జ్ఞాపకాలను ఈ విధంగా ఉత్తరాల రూపంలో వ్యక్తం చేయుట వినూత్న ప్రయత్నం. "హృదయాన్ని రంగరించి, అక్షరాల గుళికల అందిస్తే ఎలావుంటూందో ఈ స్మృతిగీత చెబుతుంది. తీయగా, వేదవతీయంగా సాగిన ఈ స్మృతి మాధురి సహృదయ పాఠకులు నిరంతరం మననం చేసుకునే కృతి లహరి" అంటారు కవి ఆచార్య నారాయణరెడ్డి గారు. కరుణారస ప్లావితంగా సాగిన ఈ రచన శ్రీ వై.బి. రెడ్డిగారిని ఎరిగినవారికేకాక, ఇతరులకు సహితం ఒక ప్రణయగీతగా పరిమళాలు పంచుతుందనుటలో ఎలాంటి సందేహమూ లేదు.

**సామెత :**

ఏరుల పుట్టుక, మునుల పుట్టుక తెలియదంటారు. సామెతల పుట్టుక ఎవరికీ తెలియదు. వాటి కర్తలెవరో తెలియదుకనుకనే వాటిని అపౌరుషేయాలు అన్నా బాధ లేదు! అవి ఒకతరం మరొక తరానికి అందిస్తుంటే, రాత పూతలకు నోచుకోక, జనసామాన్యం నోళ్ళల్లో భద్రంగా ఉంటున్న భాషాసంపద. సామెతలు ఉన్నది ఉన్నట్టుగా వాడుకుంటేనే దాని సొగసు! తన అనుభవాన్ని ఏ జానపదుడో తన భావావేశంలో అని ఉంటాడు. భావావేశంలో వెలువడినది కాబట్టే, వాటిలో ఒక విధమైన లయ వుంది. విన్నప్పుడు హాయిని గొలిపే శబ్దసౌందర్యమూ ఉంది. కనుకనే అవి సూటిగా గుండెను తాకుతాయి. ప్రజల అనుభవాలకి అవి అందమైన వ్యాఖ్యానాలవంటివి.

నానుడిగా జీవసూక్తంగా తెలుగు భాషలో ఒదిగిపోయిన తెలుగు సామెతను వర్గీకరించి ఆధునిక దృష్టితో వ్యాఖ్యానించిన విశ్లేషణాత్మక రచన వేదవతిగారి సామెత. సామెతల పుట్టుపూర్వోత్తరాలను గురించి చర్చించి, చారిత్రక, సాంఘిక నేపథ్యాన్ని నిరూపించి ఆధునిక సామాజిక వ్యవస్థలో వాటి స్థానాన్ని, ప్రాశస్త్యాన్ని వివరించిన పరిశోధనాత్మక గ్రంథమిది. ఈ పుస్తకానికి సంజీవదేవ్ "వీక్షణ" పేరుతో ఒక అందమైన పీఠిక రచించారు. "సామెత ఆవిష్కరణ హైద్రాబాదులోని శ్రీకృష్ణదేవరాయ భాషానిలయంలో ఏప్రిల్ 16, 1983న జరిగింది. పలువురు ప్రముఖ రచయితలు ఈ పుస్తకాన్ని ప్రశంసించారు. తెలుగు పరిశోధనా విద్యార్థులకు సామెత కరదీపికగా ఉపకరిస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తపరచారు.

**మనలోమనం :**

ఈ పుస్తకంలో వేదవతిగారు రచించిన 36 వ్యాసాలు పొందుపరచబడ్డాయి. రచయిత్రి వివిధ మానసిక స్థితులలో ఉన్నప్పుడు అనుకోని అతిథుల్లాగా ఏవేవో భావ వీచికలు ఆమె మనసును ఊరించి, వేధించి మనోమయ ప్రపంచాన్ని రాగజ్వలితం చేస్తుంటాయి! ఆ విధంగా వివిధ సమయాల్లో రచయిత్రి మనసును తాకిన ఊహల పోహళింపులే ఈ సంపుటిలోని రచనలన్నీ. "ఒక భావధార బహుముఖంగా విస్తరించడం, దాని పూర్వపరాలను పరామర్శ చేయడం, దానికి కొంత సాహిత్య గంధం అలమడం – స్కెచ్, లేదా గల్పిక అనబడే ఈ రచనల ప్రధాన లక్షణం" అంటారు రచయిత్రి. గల్పికను శ్రీ కొడవటిగంటి కుటుంబరావు అల్పిక అని, అభూత కల్పన అని సరదాగా వ్యాఖ్యానించినప్పటికీ, కల్పిక శబ్దమే గల్పికగా రూఢమై ఉండవచ్చు? అయితే, భావనచేసేకొద్దీ, చదివిన గల్పిక కల్పించే ప్రకంపనలు

హృదయాన్ని శాసిస్తాయి. జీవితాన్ని వ్యాఖ్యానించడం గల్పికలో ప్రధానంగా ఉండాలి. అధిక్షేప లక్షణాన్ని నిగూఢంగా ఉంచి, కళాత్మక శిల్పంతో కొనసాగించడం గల్పికలో కనిపిస్తుంది. అలాంటి పద్ధతినే వేదవతి గారు రూపొందించుకున్నారు ఈ లఘు రచనల్లో.

**మనలో మనం :**

పాఠకులతో సరదాగ, ఆత్మీయంగా – కబుర్లు చెబుతూ, వారితో అనేక భావతరంగాలను పంచుకోవడమే ధ్యేయంగా సాగిన రచనల సంకలనం ఈ పుస్తకం. ఇందులోని రచనలు కొన్ని కథనాత్మకంగాను, మరికొన్ని వ్యంగ హాస్యధోరణిలోను, ఇంకొన్ని సమాలోచన రూపంలోను సాగినవి. ఈ రచనలన్నీ ఇదివరలో వివిధ పత్రికలలో ప్రచురితమైనవే. వేదవతిగారి రచనా శైలీ, చక్కని నుడికారాలతో సాగిపోయే భాషా, పుస్తకాన్ని ఏకబిగిన చదివిస్తాయి. *మనలో మనం* సంకలనాన్ని రచయిత్రి తన భర్తగారైన కీర్తిశేషులు చింతమనేని కృష్ణారావుగారికి అంకితమిచ్చారు. “అందనంత ఎత్తులో ఉండే ఒక తార తీరాన్ని కొమ్మ వంచినట్లుగా వంచి, నీ కిటికీ పక్కకు తీసుకు వచ్చినట్లుంది ఈ పుస్తకంలో వాళ్ళ గురించి చదవడం” అంటారు వాడ్రేవు చినవీరభద్రుడు ఈ పుస్తకాన్ని గురించి.

**సంజీవదేవ్ పోస్టుచేసిన ఉత్తరాలు రచయిత్రి ప్రతి స్పందనతో:**

లేఖాసాహిత్యానికి సంజీవదేవ్‌గారు గొప్ప సేవ చేశారు. అలాంటి సాహిత్య సేవ చలం వంటి గొప్ప రచయితలు ఇదివరలో చేసిన సంగతి విజ్ఞులందరికీ విదితమే! సంజీవదేవ్ గారి లేఖలు కేవలం ఉభయకుశలోపరి ఉత్తరాలు కావు – రసగుళికలు, సరికొత్త సంగతులు, సందేశాలు, సందేహాలకు సమాధానాలు, సంవీక్షణలు. కొందరికి విందులు కొందరికి మందులుగా పనిజేసేవి.

“వెన్నెలను అనుభవంలోనికి తెచ్చుకోవటంవంటిదే సంజీవదేవ్‌తోడి స్నేహసహచర్యమున్నూ! ఆయునను చూడటమూ, ఆయునతో మాట్లాడి ఆత్మీయుతను పెంచుకోవడమూ, ఉత్తర ప్రత్యుత్తరాలతో మరింత దగ్గర కావడమూ, ఇదంతా మాటలకందని రసానుభూతి” అంటారు రచయిత్రి వేదవతిగారు. అంతేకాదు, “సంజీవదేవ్‌కూ, నాకు పరిచయమైననాటినుండేను మా మధ్య ఉత్తరాలు మొదలయ్యాయి. అవి కడకంటూ సాగిపోయాయి. ఒక్కొక్క ఉత్తరం ఒక రసగుళిక, అక్షరాలన్నీ ఆప్యాయతను పంచిపెట్టేవే! ఆలోచనలకు పదును పెట్టేవీ, చమత్కారపు తళుకులను అద్దేవీ ఇట్లా ఎంతో వైవిధ్యం ఉత్తరాల నిండా” అంటారు ఆమె.

**శ్రీమతి వేదవతి గారితో సంభాషణ :**

విదుషీమణి శ్రీమతి వేదవతిగారిని గూర్చి, ఆమె రచనా వ్యాసంగాన్ని గురించి ఈతరం వారికి తెలియజెయ్యాలనే అభిప్రాయంతో ఆమె జీవిత వివరాలతోసహా, ఆమె సాహిత్య ప్రస్థానాన్ని **మిసిమి** పాఠకులకు అందజేయాలని నిర్ణయించింది. సంపూర్ణ వివరాలకై శ్రీమతి వేదవతిగారితో ముచ్చటించారు **మిసిమి** ప్రతినిధి. ఆ ఇంటర్వ్యూలోని కొన్ని ముఖ్యాంశాలు ఇందు పొందుపరచడమైనది. ఇంటర్వ్యూ 16-07-2016 న జరిగింది.

***మిసిమి*** : *నమస్కారం వేదవతిగారు!*

వేదవతి : నమస్కారమండి!

***మి*** : ***ఇటీవల కాలంలో మీ గురించి, మీ రచనా వ్యాసంగాన్ని గూర్చిన విశేషాలతో వివరణాత్మక వ్యాసాలేవి ప్రచురణ కాలేదు. ఆ నేపథ్యంలో మిసిమి సంపూర్ణ వివరాలతో మీ రచనా సమీక్ష ప్రచురింప ఉద్దేశించింది. అందుకై మీతో ముఖాముఖి మాట్లాడటానికి అనుమతించినందులకు ధన్యవాదాలు.***

వే : మీతో ముచ్చట సంతోషదాయకం. మంచి అవకాశమిచ్చారు నాకు!

***మి*** : ***మునుముందు మీ బాల్యంతో మొదలెడుదాం! మీ చిన్ననాటి జ్ఞాపకాలను గూర్చిన వివరాలు తెలియజేస్తారా?***

వే : ఇప్పుడు నా వయసు 84 సంవత్సరాలు, 85 జరుగుతోంది. చిన్నప్పటి జ్ఞాపకాలంటే నాస్కూలు, విద్యాభ్యాసం మొదలైనవి. నేను High School వరకే చదివాను. కారణాంతరాలవల్ల నాకు బాల్యంలోనే వివాహమైనది. దాంతో పైచదువ సాగలేదు. ఎక్కువగా చదువుకోలేకపోయానన్న నిర్వేదం నాకు ఇప్పటికీ ఉంది. మిగతా నేనేదైన రచనలు చేసినా మరేంచేసినా అది నా స్వయంకృషే అని చెప్పుకోవాలి. విస్తృతంగా పుస్తకాలు అధ్యయనం చేయటం నాకు చిన్నప్పటి నుంచి అలవాటు. ఇంట్లో వాతావరణం దానికి కారణం. మా నాన్నగారు

జంపాల గోపాలరావుగారు డా. రాధాకృష్ణన్ గారి శిష్యుడు. ఫిలాసఫీ (Philosophy) ఆయన దగ్గర చదువుకున్నారు. అందువల్ల Philosophy పుస్తకాలు ఇంటినిండా ఉండేవి. రామాయణ, భారత, భాగవాలతోపాటు ఆధ్యాత్మిక రచనలు ఎక్కువగా ఉండేవి. అవన్నీ నాకు అందుబాటులో ఉన్న సాహిత్యం. అందుచేత, నేను కూడా వాటిమీద ఎక్కువ దృష్టిపెట్టి చదవడం జరిగింది. అది నా బాల్యం!

**ము** : *మీ నాన్నగారు, అమ్మగారు ఇద్దరు కూడా మిమ్మల్ని చదవటానికి ప్రోత్సహించేవారా?*

వే : చదివే అభిరుచి నాకు జన్మతః వచ్చిందేమో అని అనుకుంటాను. తెలుగు సాహిత్యంపై అభిరుచి కేవలం ప్రోత్సాహంవల్ల వచ్చేది కాదు. జన్మతః కూడా కొంత రావాలి. అయితే, తెలుగు సాహిత్యానికి సంబంధించిన ఆధునిక పుస్తకాలు అందుబాటులో ఉండేవి కావు. అందుబాటులో ఉన్నవన్నీ ఆధ్యాత్మిక రచనలే! సాహిత్య రచనలు దొరికినంతవరకు చాలా విస్తృతంగా చదివాననే చెప్పాలి!

**ము** : *మీ బాల్యం ఎక్కడ గడచింది?*

వే : నా బాల్యం ఎక్కువ భాగం గుంటూరులో గడిచింది. నేను గుంటూరులో Stall Girls High Schoolలో చదివాను. Missionary School కాబట్టి మంచి English standard ఉండేది. నాకు Englishలో మంచి పునాది అక్కడే పడింది. S.S.L.C. వరకు అక్కడే చదివాను.

**ము** : *అక్కడి గురువుల ప్రభావము మీపై ఏమైనా ఉందా?*

వే : ఆ ఉన్నదండీ! నేను చదువుకునే రోజుల్లో కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రిగారు హిందీ పాఠలు చెప్పేవారు. ఆరోజుల్లో V[th] Form విధ్యార్థులకు Optional subject ఒకటి ఉండేది. నేను హిందీని Optional subjectగా తీసుకున్నాను. దాంతో హిందీ మేష్టారైన కరుణశ్రీగారు నాకు గురువైనారు. కావటానికి హిందీ మేష్టారైనా క్లాసులో మాకు తెలుగు సాహిత్యంలో ఉన్న గొప్పతనాన్ని మధ్యమధ్యలో వివరిస్తూ పాఠాలు చెప్పేవారు. ఆ రోజుల్లో ఆయన ప్రభావం, ప్రోత్సాహం నన్ను బాగా ఆకర్షించాయి. నా స్కూలు చదువు పూర్తి అయిన తర్వాత కూడా, ఆయన సంపాదకత్వాన ప్రచురితమయ్యే *సుభాషిణి* అనే సాహిత్య మాసపత్రికకు నాచేత వ్యాసాలు వ్రాయించి ప్రచురించేవారు. *సుభాషిణి* పత్రికలో ప్రచురితమైన వ్యాసాల సంకలనమే *శృంగారలహరి* నా తొలి పుస్తకం! అంతేకాదు, హిందీ నుంచి "ఏకలవ్య" అనే నాటకాన్ని నాచేత తెలుగులోకి అనువదింపజేసి, శ్రీ ఆలపాటి రవీంద్రనాథ్ గారి సంపాదకత్వాన తెనాలి నుండి వెలువడే *జ్యోతి* అనే మాసపత్రికలో ప్రచురింపజేశారు. అప్పటి నుండి నా సాహిత్య కృషికి కరుణశ్రీ గారి ప్రోత్సాహం ఎక్కువగా ఉండేది. 1956 నేను హైద్రాబాదు వచ్చిన తర్వాత నా రచనా వ్యాసంగం విరివిగా సాగింది. దానికి ప్రోత్సాహం నా భర్త కృష్ణారావు గారి వలన జరిగింది. కృష్ణారావుగారు స్వయంగా వ్రాయకపోయినా అండదండగా నిలిచి, రచనకు ప్రోత్సహించేవారు. ఆయన సహకారం ఉండబట్టే నా సాహిత్య కృషీ, పుస్తకాల ప్రచురణ జరిగింది.

**ము** : *మీరు పెండ్లికి పూర్వమే పుస్తకం ప్రచురించారా?*

వే : లేదండీ. నా వివాహం 13వ ఏటనే జరిగింది. నా 16వ ఏట నా పుస్తక ప్రచురణ జరిగింది.

**ము** : *మీ రచలన్నిటిలోను ప్రాచీన సాహిత్యం నుండి ఏవో కొన్ని పంక్తులో, పద్యాలో చొప్పిస్తారు. ఆధునిక ప్రాచీనాల సాహిత్య సంధానం మీకు చాలా ఇష్టమా?*

వే : బాగా చెప్పారు. ఎందుకంటే ఎక్కువగా చదవడంవల్ల పండితులందరి రచనలతో నాకు సన్నిహిత్వం ఏర్పడటం, వాటిలోని మంచి వాక్యాలు నా రచనలలో సందర్భానుసారంగా చొప్పించడం, నా రచనలను పరిపుష్టంజేసి, పఠితలనాకర్షించడం నా అలవాటు. అంతేకాదు, ఆ పద్ధతి మనకిష్టమైన కవులను స్మరించుకొనుటకు ఉపకరిస్తుంది.

**ము** : *ప్రాచీన కవులలో మీకిష్టమైన వారిని గురించి ముచ్చటిస్తారా?*

వే : ప్రాచీన కవులలో పోతనగారంటే ఎక్కువ ఇష్టం. ఆయన భాగవతం చదివిన తరువాతనే నాకు పద్యం అంటే మక్కువ ఏర్పడింది. స్వయంగా నేను పద్యాలు

వ్రాయలేకపోయినా పద్యం అంటే చాలా ఇష్టం. నన్నయ, తిక్కనలు మహానుభావులు. వారి రచనలు కూడా శ్రద్ధగా చదువుతాను.

**మి : *ఆధునిక సాహిత్యంలో ఎవరంటే ఇష్టం మీకు?***

వే : ఆధునిక సాహిత్యంలో విశ్వనాథ సత్యనారాయణ, కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ గార్లంటే నాకు చాలా ఇష్టం.

**మి : *మీ మొదటి పుస్తకాన్ని గూర్చి ముచ్చటిస్తారా?***

వే : నా మొదటి పుస్తకం *శృంగారలహరి*. ఇదివరలో పత్రికలో ప్రచురితమైన వ్యాసాల సంకలనమది. వ్యాసాలన్నీ కూడా పురాణ కథలను తీసుకుని సరికొత్త పద్ధతిలో చెప్పటం అన్నమాట. కథని కథగా చెప్పటంకాక, నా సొంత భాషలో, సొంత వాక్యాల్లో, సొంత భావాలతో కొంచెం moderniseచేసి వ్రాయటం. మీరు శీర్షికలు చూస్తే అర్థమౌతుంది. శబరితో ఇంటర్వ్యూ, నిశీధిలో ఇంటర్వ్యూ, అమరుల ఆవేశాలు, ఇలా ఉంటాయి వ్యాసాల పేర్లు! Base పురాణ కథలే కాని, వాటిని కొత్త పద్ధతిలో ఒక స్కెచ్ మోస్తరు, లేకపోతే ఒక గల్పికలాగా మలచి చెప్పడం జరిగింది. ఒక్కో అప్పుడు పాత్ర స్వగతం రూపంలో నడిచింది రచన.

**మి : *ముంగిట ముత్యం అనే మీ రచన వాత్సల్యపూరిత భక్తిని వ్యక్తీకరించే గేయ సంపుటి. దాన్లో తల్లితనానికి మిమ్మల్ని ప్రతీకగా భావించవచ్చా?***

వే : భావించవచ్చు. తల్లితనం అనగానే నారాయణరెడ్డి గారు వ్రాసిన ఒక పాట జ్ఞప్తికి వస్తుంది. కంటేనే తల్లి అవుతుందా అనే పాట! మాతృవాత్సల్యం అనేది Universal. ప్రపంచంలోని ప్రతి జీవిలోనూ వాత్సల్యం ఉంటుంది. ఆ Universal వాత్సల్యాన్ని నేను యశోదాకృష్ణులను ప్రతీకలుగా తీసుకొని చిత్రించాను. కృష్ణుడూ, యశోదా భాగవతంలో మనకు తెలిసిన పాత్రలే! కాని, తెలుగు ఇళ్ళలో ప్రతి తల్లీ – బిడ్డల మధ్య ఉన్న ప్రేమా, వాత్సల్యం యశౌదాకృష్ణుల మధ్య ఉన్నటువంటిదిగా చిత్రించ ప్రయత్నించాను *ముంగిటి ముత్యం* రూపంలో. దానిని ప్రస్తుతించిన విధం పాఠకులకు భాగా నచ్చింది. జనం ఇష్టంగా చదువుకున్నారు. ఇప్పటికీ ఆ పుస్తకాన్ని గురించి చాలామంది అడుగుతూ ఉంటారు.

**మి : *1982లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు పొందిన తెలుగువెలుగు పుస్తకాన్ని గూర్చి ఏమైనా చెబుతారా?***

వే : *తెలుగువెలుగు* లో వ్యాసాలన్నీ తెలుగు సంస్కృతిని గురించినవి. తెలుగువారి ముచ్చట్లు, తెలుగువారి ఆభరణాలు, హాస్య ప్రియత్వం మొదలైన విషయాలను తీసుకొని తెలుగువారి సంస్కృతిని అన్ని కోణాల నుంచీ ప్రదర్శించటానికి యత్నించాను. ఆ రోజుల్లో కుందుర్తి ఆంజనేయులు గారి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ పత్రిక ప్రచురితమయ్యేది. దాని కొరకు ఆంజనేయులు గారు ప్రత్యేకంగా అడిగి వ్రాయించుకొనిన వ్యాసాలవి. ఏదో కట్టే, కొట్టే, తెచ్చే అన్నట్లు కాకుండా, అందరూ చదివే విధంగా, ఆసక్తికరంగా ఉండేటట్లుగా మధ్యమధ్య మన ప్రాచీన కవుల కవితలు సందర్భానుసారంగా ఉదహరిస్తూ రచించిన లలిత వ్యాసాలవి. ఆ పుస్తకానికి మంచి స్పందన వచ్చింది. మూడవ Edition ప్రతులు కూడా అమ్ముడుపోయాయి!

**మి : *తెలుగు వెలుగు వ్యాసాల ద్వారా ముఖ్యంగా మీరు తెలుగువారు మన సంస్కృతీ సంప్రదాయాలను విస్మరించి, పర సభ్యతా సంస్కారాలను అనుసరించుట అంత మంచి పద్ధతి కాదని, అలా చేస్తే మన ముందు తరాలవారు మన భాషా సాంప్రదాయాలను పూర్తిగా మరిచిపోయే స్థితి ఏర్పడగలదని హెచ్చరించారు. ఈ రోజుల్లో అలా జరుగుతున్నదని మీ అభిప్రాయమా?***

వే : పర సభ్యత పనికి రాదన్న భావాన్ని నేను వ్యక్తపరచలేదు. ప్రాచీన సంస్కృతిని గూర్చి ఈ తరం పిల్లలకు అవగాహన లేకుండా పోతున్నది. అసలు సంస్కృతి అంటే ఏమిటో తెలియదు. పూర్తిగా Modern అయిపోయి, పాశ్చాత్య సంస్కృతికి కట్టుబడిపోతున్నారు. కాలం జరిగినకొద్దీ ఆ రకం ధోరణి హెచ్చుగా కనిపిస్తున్నది. వారికి మళ్ళీ మన ప్రాచీన సంస్కృతిని గూర్చి తెలియజెయ్యాలని నా ఆకాంక్ష. ఆధునిక సభ్యతకు నేను వ్యతిరేకిని కాను. కాలంతోపాటు మార్పు సహజమే! తదనుగుణంగా

మనం మారాలి. అయితే, మన పునాది సంస్కారాన్ని, మాతృభాషను అశ్రద్ధ చేయకూడదు. ఆ తపనతో వ్రాసిన వ్యాసాలు *తెలుగు వెలుగు*లోనివి.

**ఖ : *మీరు తెలుగు వెలుగు ప్రచురించి దాదాపు 30 సంవత్సరాలు దాటింది. చాలా మార్పులు వచ్చేశాయి. అప్పుడు మీరు వ్యక్తపరచిన అభిప్రాయలు ఇప్పటికీ వర్తిస్తాయా?***

వే : ఇప్పటికీ అదే అనిపిస్తుంది నాకు. ఇప్పటి మన పిల్లలకు ప్రాచీన సంస్కృతి అంటే అసలు తెలియదు! తెలుగుతనమంటే ఏమిటో తెలియకుండాపోతున్నది. ముందుముందు పరిస్థితి ఇంకా అధ్వాన్నంగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. అందువలన నేను *తెలుగు వెలుగు* లో సూచించిన సలహాలు ఇప్పుడు ఎంతో అవసరమనిపిస్తుంది.

**ఖ : *స్నేహసూక్తం పుస్తకం తెలుగు సాహిత్యంలో ఒక నూతన ఫక్కీ రచన. అది జీవిత చరిత్ర కాదు. ఆ విధంగా వ్రాయుటంలో ప్రత్యేక కారణాలేమన్నా ఉన్నాయా?***

వే : అది డా. బెజవాడ గోపాలరెడ్డి గారిని గూర్చిన రచన. నాకు డా. బెజవాడ గోపాలరెడ్డిగారికి మధ్య పదిహేడు సంవత్సరాలపాటు ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగాయి. ఆ ఉత్తరాలలో అనేక విషయాలు సాహిత్య సంబంధమైనవి ఉండేవి. అవి అన్నీ కూడా గోపాలరెడ్డిగారు వ్రాసిన కవిత్వాన్ని పురస్కరించుకొని జరిగినవి. ఆ రచనల్లోని గొప్పతనాన్ని మేము ఒకరికొకరం చెప్పుకోవటం ఆ ఉత్తరాల ద్వారా జరిగేది. ఆ ఉత్తరాల ద్వారా డా. బెజవాడ గోపాలరెడ్డి గారి వ్యక్తిత్వాన్ని ప్రదర్శించాలని ప్రయత్నించాను. ఈ విధంగా ఉత్తరాల ద్వారా స్మృతి సాహిత్యం వ్రాయడమనేది కొత్త పద్ధతి అని విమర్శకులు అభిప్రాయపడ్డారు. డా. గోపాలరెడ్డిగారిని గూర్చి నేను వ్రాసిన Biography కృష్ణాజిల్లా తెలుగు రచయితల సంఘంవారు విడిగా ప్రచురించారు.

**ఖ : *సంజీవదేవ్‌గారితో మీకు పరిచయమున్నదా? ఆ జ్ఞాపకాలను వివరిస్తారా?***

వే : శ్రీ సంజీవదేవ్‌గారు అసమాన్యమైన వ్యక్తి. ఈ ప్రపంచంలో అటువంటి వ్యక్తులు ఉంటారా అని ఆశ్చర్యపోయేటటువంటి వ్యక్తిత్వం ఆయనది! మా మధ్య ఇరవైఏళ్ళపాటు ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగాయి. సంజీవదేవ్‌గారు నాకు వ్రాసిన ఉత్తరాలు నా ప్రతిస్పందనతో కలిపి *సంజీవదేవ్ పోస్టు చేసిన ఉత్తరాలు* అనే పుస్తకం ఇటీవలనే ప్రచురితమైనది. సంజీవదేవ్‌గారు బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆయన ఒక రచయిత మాత్రమే కాదు, గొప్ప చిత్రకారుడు, తత్వవేత్త, అన్నిటికి మించిన మానవతావాది. ఆయన చదువు విద్యాలయాల్లో, విశ్వవిద్యాలయాల్లో అభ్యసించినది కాదు. జీవితమనే విశ్వవిద్యాలయంలో స్వయంకృషితో ఆర్జించినది. అసాధారణ వ్యక్తిత్వంగల మహామనీషి సంజీవదేవ్. సంజీవదేవ్ అంటే ఒక తరంవారికి తెలుస్తుందేమోగాని, అందరికీ తెలియకపోవచ్చు. అదే నా బాధ.

**ఖ : *మీకు చాలామంది ప్రముఖ వ్యక్తులతో పరిచయమున్నది. గోపాలరెడ్డి గారు, సంజీవదేవ్ గారు, కాకుండా మరెవరైనా మీ అభిమానులున్నారా?***

వే : చాలామంది పుస్తకాలు చదివి, నాకు ఉత్తరాలు వ్రాశారు. వారిలో చాలామంది ప్రముఖులున్నారు. ఇప్పుడు జ్ఞాపకం రావటంలేదుగాని సంపత్‌కుమార్ ఆచార్య వంటివారు, సాహిత్య సమావేశాల్లో పరిచయమైన పెద్దలు చాలామంది నన్నెంతో అభిమానంతో చూసేవారు. ఇటీవల కాలంలో సాహిత్యపరంగా పరిచయమయ్యేవారికందరికీ (గుత్తి చంద్ర శేఖరరెడ్డిగారు, కోడూరు పుల్లారెడ్డిగారు) నేను అక్కయ్యను. వారితో పరిచయం కలగడం, స్నేహ బంధం కొనసాగటం నా అదృష్టంగా భావిస్తాను. ఈ సందర్భంలో మా వారు కృష్ణారావుగారిని ప్రత్యేకంగా పేర్కొనాలి. ఆయన L.I.C.లో పనిచేసేవారు. సాహిత్య ప్రియులు. పుస్తకాలు వ్రాయుటమే నా వంతు. ప్రచురణ తదితర కార్యక్రమాలన్నీ ఆయనే చూచుకొనేవారు. వారి సహాయ, సహకార, ప్రోత్సాహాలు లేకుంటే నేను రచయిత్రిని కాలేకపోయేదాన్ని.

**ఖ : *మీ శ్రీవారిని గూర్చిన స్వవిషయాలు కొన్ని చెబుతారా?***

వే : ఆయన చాలా మంచి మనిషి. చాలా సాధు స్వభావం.

నా స్నేహితులందరినీ తన స్నేహితులుగా కలుపుకోగలిగిన గొప్ప హృదయం ఆయనది. సాధారణంగా ఆడవాండ్లు (భార్యలు) పైకి వస్తుంటే మగవాళ్ళు (భర్తలు) సహించలేరు. అలా కాకుండా కృష్ణారావుగరు నా సాహిత్య జీవనంలో కూడా సగభాగమైపోయారు.

మి : *కొన్ని వ్యక్తిగత విషయాలు, అంటే కుటుంబాన్ని గురించి పిల్లలను గురించి ...*

వే : పిల్లలు లేరండి. ఆయన 2012లో వెళ్ళిపోయారు. ఆ తర్వాత ఒంటరి జీవితం. సాహిత్య సంబంధమైన పుస్తకాలు చదవటం కాలక్షేపం. ఒంటరితనంలో పుస్తకాలే నాకు నేస్తాలు.

మి : *మీ రచనలలో కథలు, వ్యాసాలు, కవితలు, స్మృతిసాహిత్యం, బాలసాహిత్యం అలా అనేక ప్రక్రియలున్నాయి. మీరు నవలలు, నాటకాలు, విమర్శలు వ్రాశారా?*

వే : నవలలూ, నాటకాలు వ్రాయలేదు. దీపిక అనే పేరుతో ఒక విమర్శనాత్మక పుస్తకం వ్రాశాను.

మి : *కవయిత్రి మొల్ల అంటే మీకు ప్రత్యేక అభిమానమని అనుకోవచ్చా?*

వే : అవును, కవయిత్రి మొల్ల అంటే చాలా ఇష్టం. ఆమె స్వయంకృషివల్ల పైకి వచ్చింది. ఆవిడ మహిళ కనుక నాకు ఆవిడయందు అభిమానం ఎక్కువ.

మి : *స్మృతిగీతం అనే మీ రచనను గూర్చి ఏమైనా వివరిస్తారా?*

వే : *స్మృతిగీతం* ఒక ఆదర్శ దాంపత్యాన్ని గురించిన రచన. భార్యా భర్తలిద్దరిలో ఒకరు ముందు మరణిస్తే రెండవ వారి వేదన పరాయీకరణ అంటే పరకాయ ప్రవేశంచేసి, నేను అనుభవించినట్లుగా ఊహించి వ్రాసిన రచన అది. ఈ రచన లేఖాసాహిత్యంగా పరిగణించబడుతుంది. చనిపోయిన భార్యకు సాహిత్యప్రియుడైన భర్త తన వ్యథను వ్యక్తపరుస్తూ ఉత్తరాలు వ్రాస్తాడు. ఆ భర్త వై.బి. రెడ్డిగారు నెల్లూరి దగ్గరనున్న ఇందుపూరు నివాసి. డా. బెజవాడ గోపాలరెడ్డిగారి ద్వారా పరిచయమయ్యారు. సుదీర్ఘ దాంపత్య జీవితం తర్వాత ఆయన భార్య మరణిస్తుంది. భార్యాభర్తలిరువురూ సాహిత్యాభిమానులు. స్వయంగా ఏమీ వ్రాయకపోయినా, కవులనూ, పండితులను పోషించుట వారికి ప్రీతికరమైన చర్య. వారి జ్ఞాపకార్థంగా వ్రాసి ప్రచురించబడినది *స్మృతిగీతం* లేఖా సాహిత్యంలో ఒక కొత్త ప్రక్రియ.

మి : *మీరు స్మృతి సాహిత్యాన్ని గురించి వ్రాసిన వ్యాసంలో భరద్వాజ వ్రాసిన దానిని ఎక్కువ వివరించి వ్రాశారు. దానికి ప్రత్యేక కారణం?*

వే : భరద్వాజగారు ఆధునికంగా డైరీల రూపంలో వ్రాసుకున్న జ్ఞాపకాలు, స్మృతులూ అవి. ఇది ఒక కొత్త ప్రక్రియ. ఇతర కవులు అలాంటి సందర్భాలలో పద్యాల రూపంలో తమ భార్యా వియోగ వ్యధను వ్యక్తపరచారు. కొత్త పంథాలో భరద్వాజ గారు వ్యక్తపరచారు గనుక నా వ్యాసంలో వారి రచనకు ప్రాధాన్యమిచ్చాను.

మి : *రచయితగా భరద్వాజగారి గురించి మీ అభిప్రాయం?*

వే : భరద్వాజగారు కూడా నాకుమల్లేనే ఎక్కువ చదువుకోకుండానే అట్టడుగునుంచి పైకి వచ్చినటువంటివాడు. నన్ను అక్కయ్యా అని పిలిచేవాడు. మా ఇంటికి రోజూ వచ్చి, తన జీవితానికి సంబంధించిన ఎన్నో ఘట్టాలు, అనుభవాలు నాతో ఆత్రంగా చెప్పుకుంటూ ఉండేవాడు. మంచి రచయిత. ఆధునిక సాహిత్యంలో భరద్వాజకు ఒక మంచి స్థానం ఎప్పుడూ ఉంటుంది.

మి : *మీకు డా. ఆలపాటి రవీంద్రనాథ్‌గారితో పరిచయం ఉందా?*

వే : డా. ఆలపాటి రవీంద్రనాథ్‌గారు ఆకాశవాణికి వచ్చారు. శ్రీ గోపీచంద్‌గారు నన్ను ఆయనకు పరిచయం చేశారు. అంతేకాదు, రవీంద్రనాథ్ గారు *జ్యోతి* పత్రికకు సంపాదకుడుగా ఉన్నప్పుడు ఒకటి రెండుసార్లు కలిసే అవకాశం కలిగింది. **మిసిమి** పత్రిక పెట్టిన తర్వాత వారు తరుచుగా ఫోనులో మాట్లేడేవారు. **మిసిమి** ని గూర్చి నా అభిప్రాయాలు అడిగి తెలుసుకునేవారు. వారితోటి పరిచయం నా అదృష్టంగా భావిస్తున్నాను.

మి : *ఈ రోజుల్లో వచ్చే సాహిత్య పత్రికలలో మిసిమి కి గౌరవ స్థానం ఉన్నదంటున్నారు చాలామంది, మరి మీ అభిప్రాయం?*

వే : **మిసిమి**కి మంచి గౌరవస్థానం ఉన్నదండి. ఒక ప్రత్యేకమైన అభిరుచి కలిగిన పాఠకులు తప్ప అందరూ చదువలేరు **మిసిమి** ని. అది ఒకప్పటి *భారతి* లాగా సాహిత్య విషయాలను గురించి సాధికారమైన రచనలు ప్రచురిస్తుంది. మొదట పెట్టినప్పటికీ ఇప్పటికీ చాలా అభివృద్ధి చెందింది. ప్రస్తుతం సాహిత్య రంగంలో ఉన్న పత్రికల్లో **మిసిమి** మేటి అని చెప్పుకోవాలి.

***మి : ఈ రోజుల్లో ప్రచురితమవుతున్న సాహిత్యాన్ని గురించి, రచనలను గురించి మీ అభిప్రాయం?***

వే : ఇప్పుడు కొత్త ప్రక్రియలు, రచనా విధానాలు విస్తృతంగా వస్తున్నాయి. కొనేవాళ్ళకంటే ఎక్కువగా పుస్తక ప్రచురణ జరుగుతోంది. అన్ని పవనాలు మనం ఆహ్వానించాలి. గిరిగీచి సాహిత్యం ఇలాగే ఉండాలనుకోవటం చాలా సంకుచితంగా అనిపిస్తుంది. అందువల్ల ఎవరు ఏది వ్రాసినా దాన్ని మనం సహృదయంతో ఆహ్వానించాలి. ప్రతి రచనా చదవాలి. ఈ రోజుల్లో పుస్తక పఠనం తగ్గిపోతున్నది. చదువ తగిన సాహిత్యం విస్తృతంగా రావాలి. పఠనం ఒక వ్యాపకంగా మారలి.

***మి : రచయిత్రిగా మీ దృక్పథాన్ని, మీ రచనా Philosophy ని మీరెలా విశ్లేషిస్తారు?***

వే : నేను Perfectionistని. ఏది వ్రాసినా చక్కగా, పరిపూర్ణంగ ఉండాలి. మంచిమంచి పదాలు ఉచిత స్థానంలో అమరాలి. శైలీ, వాక్య నిర్మాణం సరళంగా ఉండాలి, వ్రాసినదేదో నీలోనుంచి చించుకురావాలి. తిలక్ అన్నట్లు – నీ సొంతదై ఉండాలి. ఎదో ఒక మూసలోకాక వైవిధ్యంతో కూడి ఉండాలి.

***మి : మీ రచనా ప్రస్థానం సింహావలోకనం చేసుకుంటే, ఇది వ్రాయలేకపోయాను. ఇది వ్రాస్తే బాగుండేది, అని అనిపిస్తుందా? తీరని కోరికంటూ ఏమైనా ఉందా?***

వే : అట్లా అని కాదుగాని, వ్రాయవలసినంత, వ్రాయగలిగినంత వ్రాయలేదని అనుకుంటాను. దానికి కారణం Perfectionism మీద నాకున్న తపన! *వ్రాసింది రాసేకంటే వాసిలో రాణించాలన్న ఉద్దేశ్యం. ఆలశ్యంగా వ్రాసినా మంచి పుస్తకం వ్రాయాలి అన్న పట్టుదల. సాహిత్యమనేది జన హితానికి తోడ్పడాలి. ప్రచురణార్థం, ప్రచారార్థం, పురస్కారాలనాశించి కాదు. చెప్పేదేదో నిజాయితీగా చెప్పాలి. అందువల్ల నేను ప్రయోగించిన ప్రక్రియలన్నీ సొంతంగా ఊహించి నేను ఎన్నుకొనినవే. కాలక్షేప సాహిత్యం మీద నమ్మకం లేదు నాకు.*

***మి : మీరు కొంచెంసేపు క్రితం పురస్కారాలను గూర్చి పేర్కొన్నారు. రచనలోను, రచయితలోను గొప్పదనం ఉండాలని అభిలషించారు. పురస్కారం ముఖ్యం కాదని అన్నారు. మీ సుదీర్ఘ రచనా ప్రస్థానంలో పొందిన పురస్కారాల గురించి ఏమైనా చెబుతారా?***

వే : పురస్కారాలు కోరి తెచ్చుకొనేవి కొన్ని, అయాచితంగా లభించేవి మరికొన్ని. నేనెప్పుడూ పురస్కారాల వెంబడి ఇతరులతో చెప్పించి ప్రయత్నించలేదు. పురస్కారాలు వస్తే సంతోషమేకాని, రాకపోతే కృంగిపోవడం నా నైజం కాదు. రచనలో ఉండే విశిష్టతను అనుసరించి ఏవో అవార్డ్సు కొన్ని నాకు ఆయచితంగా లభించాయి. వాటి ప్రాముఖ్యత అంతవరకే!

***మి : ఈ కాలంలో కొంతమంది రచయితలు చదువకుండానే వ్రాస్తున్నారన్న విమర్శ ఉంది. కొత్తగా వ్రాసేవారికి ఏమైనా సందేశం?***

వే : రచయితలు కావాలని కోరుకునేవారు, వ్రాసేవారు ముందు బాగా చదవాలి. ఎవరేమి వ్రాస్తున్నారో తెలుసుకోవాలి. ఎక్కువ జ్ఞానసముపార్జన లేకుండా ఏదో వ్రాసుకొని, ప్రచురించి, దానికేదో అవార్డు రావాలన్న ధోరణి ఈ రోజుల్లో ఎక్కువగా కనిపిస్తున్నది. ప్రాచీన సాహిత్యం చదవాలి. *మన పునాది అంతా వాటిలో నిక్షిప్తమై ఉన్నది. ఆ సాహిత్యం చదువకుండా రచనా వ్యాసంగం సాగించుట నేలవిడిచినసామే!*

***మి : వేదవతిగారు మీరు అత్యంత శ్రమ తీసుకొని మాతో మాట్లాడి, అడిగిన ప్రశ్నలన్నిటికీ చక్కటి సమాధానాలిచ్చి ఇంతసేపు మాతో గడిపినందుకు మిసిమి తరుపున, మా తరపునా మా హృదయపూర్వక కృతజ్ఞతాభివందనములు.***

వే : నాకు కూడా ఈ రోజు చాలా సంతోషంగా ఉంది.

మీతో మాట్లాడటం, మీరు నా పుస్తకాలను కొన్నైనా చదివి, వాటిలోని విశేషాలన్నీ నాచేత మళ్ళీ అడిగి చెప్పించటం అనేది, నాకు ఒక విధంగా పునఃశ్చరణ చేసుకున్నట్లు అనిపిస్తున్నది. సంతోషం.

సంజీవదేవ్‌గారు వ్రాసిన ఉత్తరాలను భద్రపరచి వాటికి తన ప్రతిస్పందనను జోడించి ఈ పుస్తక రూపంలో పాఠకులకు అందించారు శ్రీమతి వేదవతిగారు. బాల్యంలోనే సంజీవదేవ్‌గారితో స్నేహం చేయగల్గిన శ్రీ వాడ్రేవు చినవీరభద్రుడు సంజీవదేవ్‌ను కొత్తకోణంలో ఆవిష్కరించి చూపుతూ, ఉత్తరాలను పరామర్శించి పరిచయ వాక్యాలను వ్రాశారు ఈ పుస్తకానికి. మేధావుల లేఖలు మానవజాతి సంస్కృతిక వారసత్వ సంపద. సంజీవదేవ్ లేఖలు ఆ కోవలోనివి. వీటిని చక్కని సంకలన రూపంలో ముందు తరాలకు అందజేసిన వేదవతిగారు ప్రశంసాపాత్రులు.

**ముగింపు :**


ఈపై వ్యాసంలో వివరించిన పుస్తకములే కాక, రచయిత్రి కలం నుండి *ప్రశ్న* అనే కథా సంపుటి, *భావయామి* పేరుతో *ఆకాశవాణి ప్రసంగాలు, కలసి ఉంటే* వంటి బాలసాహిత్య రచనలూ, దీపిక పేరుతో పీఠికలూ, సమీక్షలూ, తెలుగు వెలుగుల శృంకలంలో కవయిత్రి మొల్లను గూర్చిన రచన లాంటి అనేక పుస్తకాలు జాలువారాయి. శ్రీమతి వేదవతిగారు ప్రచురించిన గ్రంథాలన్నీ ప్రక్రియాపరమైన వైవిధ్యంతో ఒక విలక్షతను సాధించుకున్నవే! తెలుగు నుడికారపు సొంపునూ, సొగసునూ రసరమ్యంగా ఆవిష్కరించగలిగిన రచయిత్రిగా శ్రీమతి వేదవతిగారు గుర్తింపు పొందారు. 85 సంవత్సరముల వయసులో కూడా, విరామం లేకుండా ఆమె కలం సాగుతూనే ఉంది. ఆమెకు సర్వేశ్వరుడు చక్కని ఆరోగ్యాన్ని ప్రసాదించి, తెలుగు సాహిత్య వికాసానికి ఇతోధిక సేవాభాగ్యాన్ని అనుగ్రహించాలని ప్రార్థనతో ఈ వ్యాసం ముగించ మి

ప్రొ. రావినూతల సత్యనారాయణ
హైదరాబాద్.
ఫోన్ : 961 852 4702



ప్రొ. రావినూతల సత్యనారాయణ

*ఇందులో రచయితల రచనలే కాకుండా ఒక్కొక్కప్పుడు వారి జీవితంలోకి తొంగిచూడవలసిన అవసరం రావచ్చు. కేవలం రచనలు చదివితే సరిపోదు. రచయిత స్వభావంపట్ల కూడా అవగాహన ఉండకపోతే సమీక్ష తేలిపోతుంది. రచయితలు తాము రాసే రాతకు, జీవించే జీవితానికి పొంతనే ఉండదు. వీటిని సమన్వయపరుస్తూ వారి రచనలు విశ్లేషించగలగాలి. కవిత్వమైనా, కథయైనా, నవల అయినా, నాటకమైనా, విధానమేదైనా అన్నీ వ్యక్తిత్వ సూచికలే. రచయిత అనుభూతి పరిసరాల వీచికలే.*



*ప్రతి రచయితా తన మనసులో ఒక కార్యాచరణ ప్రణాళిక తయారు చేసుకుంటాడు. ఆనందం, ఆవేశం, ఆవేదన, ఆర్తి – ఇవన్నీ తన రచనలలో ప్రతిబింబింపచేస్తాడు. రచయితలకు భావావేశం ఎక్కువ. దానికి భిన్నమైన తర్కం కూడా ఉంటుంది. అవన్నీ పాఠకులలో గందరగోళాన్ని సృష్టిస్తాయి. రచయితను, పాఠకుడిని ఎదురెదురుగా నిలబెట్టి కరచాలనం చేయించగలిగినవాడే నిజమైన సాహితీ సమీక్షకుడు. ఆయన తన సమీక్షలో ఆయా రచయితలకు సంబంధించిన ఏ పుస్తకాన్నీ వదలలేదు.*

*తెలుగు భాషలో వెలుగు చూసి, పురస్కారం పొందిన రచనలన్నింటినీ, రచయితలెందర్నో సమీక్షించి, పరిచయం చేసి తెలుగు పాఠకులకు గ్రంథరూపంలో అందిస్తున్నారు. ఇది విజ్ఞులైన పాఠకులకూ, పరిశోధనాశీలురైన విశ్వవిద్యాలయ విద్యార్థులకూ కరదీపికగా ఉండగలదని ఆశిస్తున్నాం.*

**(ప్రతులకు మిసిమి కార్యాలయాన్ని సంప్రదించండి.)**

# ఆనంద శాస్త్రం - II

## ఆర్థర్ షోపెన్ హావర్

*– ముక్తవరం పార్థసారథి*

**మూడవ అధ్యాయం**

**సంపద :**

మనుషులకు మూడు రకాల అవసరాలుంటాయంటాడు ఎపిక్యూరస్. ఆనందశాస్త్రకారుని ప్రకారం తిండి, గుడ్డా అందరికీ కనీసావసరాలు. ఇవి లేకపోతే రోజు గడవదు. రెండవ రకంలో ఇంద్రియ సుఖాలుంటాయంటాడు కాని అవేమిటో స్పష్టంగా చెప్పడు. వీటి గురించి నా అభిప్రాయాలు తర్వాత స్పష్టం చేస్తాను. ఇక మూడవ రకం సహజమైనవీ కాదు. అవసరాలు తీర్చేవి కావు. ఇవి విలాస వస్తువులు. భేషజం పెంచుకోవటానికి సమకూర్చుకునే సరంజామా. ఈ రకమైన కోరికలు ఎంతటి సంపన్నుడికీ తీరవు. ఆకాశానికి వేసిన నిచ్చెనలవి. ఎవరికి ఎంత ఆస్తి కావాలో ఎలా నిర్ణయించటం? లోకంలోని వజ్రవైఢూర్యాలన్నీ ఒకచోట కుప్పగా పోసినా వీళ్ళకు తృప్తి కలగదే! ఎంత ఉన్నా మరికొంత కావాలనిపిస్తూనే ఉంటుంది. అవును. అవి తీరని కోరికలు. మనం దొరికిన దాంతో సంతోషించాలా లేక, లేనిదానికోసం అర్రులు చాస్తూ కూర్చోవాలా? దేన్ని భాగించాలో తెలుసుగాని, దేంతో భాగించాలో తెలియని లెక్కలాగుంటుందీ పరిస్థితి. వంద వస్తువులున్నాయని తృప్తిపడరు. లేని ఒక్కదానికోసం బెంగపెట్టుకుంటారు. కోరికలకు మహాశక్తి మాత్రమే సరిహద్దులు నిర్ణయిస్తుంది. ఊహించలేని దాని గురించి బాధ ఉండదు. ధనికుల సంపదను చూసి పేదలు అసూయ పడకపోవటానికిదే కారణం, సంపద ఉప్పునీరు లాంటిది. దాగినకొద్దీ దాహం పెరుగుతుందే తప్ప తగ్గించదు. కీర్తి కూడా ఉప్పునీటి లాంటిదే. కష్టాలు వచ్చినప్పుడు కోరికలు తగ్గుతాయి. ఆ సమస్యల్లో మనకు సంపద పెంచుకోవాలనే కోరిక కలగదు. కాని అదృష్టం కలసివచ్చినప్పుడు, దొరికిన దానితో తృప్తిపడక అంతా మనకే కావాలనుకొంటారు.

మానవజాతి అవసరాలను పరిశీలించినప్పుడు, అందరూ సంపదే కోరుకోవటంలో ఆశ్చర్యం లేదనిపిస్తుంది. డబ్బు చేసుకొన్నవాడే సజ్జనుడు అనిపించుకుంటున్నాడు. అవును మరి. కోరికలన్నీ తీర్చేది డబ్బే అయినప్పుడు అది కావాలనుకోవటం సహజమే కదా. ఇతర రకాల ప్రతిభతో ఒక్కొక్క కోరిక తీరుతుంది. కాని డబ్బుకు అన్నీ కొనగలిగిన శక్తి ఉంది. ఆకలేస్తేనే అన్నం కావాలి. మధువు మత్తెక్కిస్తుంది. జబ్బు చేస్తే మందులున్నాయి. చలికాలంలో వెచ్చని గుడ్డలు కావాలి. ఇవన్నీ అవసరమే. కాని డబ్బుంటే ఇవన్నీ సమకూరుతాయి. అంటే డబ్బు సర్వ రోగ నివారిణి, కామధేవును, కల్పవృక్షమూ కలిస్తే డబ్బు. కష్టాలకు అడ్డుగోడ డబ్బు. స్వయంకృషితో డబ్బు సంపాదించినవాళ్ళ, నిజమైన పెట్టుబడి వాళ్ళ ప్రతిభ అనీ, సంపాదన కేవలం దానిమీద వచ్చిన వడ్డీ మాత్రమే అనుకుంటారు. కానీ ఒకప్పటి ప్రతిభ తరువాత మసకబారుతుంది. డబ్బు కరిగిపోతుంది. కాని కాయకష్టం చేసేవాడు ఎప్పుడూ పశ్చాత్తాపపడవలసిన అవసరం లేదు. ఓపిక ఉన్నంతవరకూ అతడు ఎంతో కొంత సంపాదించగలడు. అందుకే అంటారు, పొట్టపోసుకోగలిగిన వృత్తి ఏదైనా బంగారు గనిలాంటిదే. కాని కళాకారులు తమ పెట్టుబడినే వడ్డీ అనుకుంటారు. ప్రతిభ తగ్గి, తమ కళాకృతులకు డిమాండ్ తగ్గిన తర్వాత బాధపడతారు. కనీసం, వారసత్వంగా సంపద లభించినప్పుడు, అసలుకు, వడ్డీకి తేడా తెలుస్తుంది. వడ్డీ అనుభవిస్తూ, అసలు జాగ్రత్త పెట్టుకోవటానికి ప్రయత్నిస్తారు. అయితే, వ్యాపార రంగంలో ఉన్నవాళ్ళకు ఇప్పటిదాకా నేను ఉటంకించిన అసలు, వడ్డీ ఉదాహరణ వర్తించదు. వ్యాపారస్తులకు డబ్బు ఒక 'పనిముట్టు'లాంటిది. కష్టపడి సంపాదించుకొన్నారు గనక, దాన్ని ఎలా జాగ్రత్త పెట్టుకోవాలో, ఎలా పెంచుకోవాలో కూడా వాళ్ళకు తెలుసు. అందువల్లనే, వ్యాపారస్తుల వద్ద డబ్బు పుట్టింట్లో ఉన్నట్టుగా ఉంటుంది.

లేమిని అనుభవించినవాళ్ళు కష్టాలకు భయపడరు. ఆ కారణంగానే దుబారా చెయ్యటానికీ వెనుకాడరు. సంపదను వారసత్వంగా గ్రహించినవాడు అది లేకపోతే బతకలేననుకుంటాడు. సంపాదించినా లేకపోయినా, ఉన్నదాన్ని కాపాడుకొంటాడు, పొదుపు పాటిస్తాడు. "డబ్బుకు అలవాటు పడినావిడ, ముందూ వెనుకా ఆలోచించి ఖర్చుచేస్తుంది. డబ్బున్నవాణ్ణి చేసుకున్న పేదరాలు మాత్రం రెండు చేతులా తగలేస్తుంది" అంటాడు డాక్టర్ జాన్సన్.

నాకు సంబంధించని విషయాల గురించి నేను మాట్లాడుతున్నానని భావించటంలేదు. సంపాదించుకున్న డబ్బైనా, సంక్రమించినదైనా జాగ్రత్తగా కాపాడుకోండి. తనూ, కుటుంబమూ సుఖంగా బతకాలంటే డబ్బు కావలసిందే. ఒకరి దగ్గర ఎక్కువ మరొకరి దగ్గర తక్కువ డబ్బు ఉండొచ్చు. ఫరవాలేదు. కాని ఏమీ లేకపోవటానికి, ఎంతో కొంత ఉండటానికీ మాత్రం చాలా తేడా ఉంది. డబ్బు దుబారా చేసి, తరువాత బాధపడకండి. భార్యాపిల్లల్ని, మనిషికున్న సంపదగా నేను భావించటం లేదు. ఎందుకంటే అతడు వీళ్ళకు చెందిన సంపద, మిత్రులూ అంతే. వాళ్ళు అతడికీ, అతడు వాళ్ళకూ చెందుతాడు.

**నాల్గవ అధ్యాయం**

**పరువు, మర్యాదలు :**

మొదటి భాగం : పలుకుబడి.

ఇతరులు తమ గురించి ఏమనుకుంటున్నారోనన్న విషయానికి కొందరు చాలా ప్రాముఖ్యత ఇస్తారు. కాని, పరుల అభిప్రాయాలు మన సంతోషానికి ఏమాత్రం దోహదం చెయ్యవని ఆలోచించగలిగినవాళ్ళెవరైనా ఇట్టే గ్రహిస్తారు. మరెందుకు, అందరూ తమ గురించి ఇతర్లు మంచిగా అనుకోవాలని ఆశిస్తారు? వాళ్ళ పొగడ్తలు తమ అహమనే అగ్నికి విసనకర్రలా? పిల్లిని చేరదీసి, దువ్వితే అది కృతజ్ఞతగా నీవైపు చూస్తుంది. ఎవరైనా నీ గురించి నాలుగు మంచి మాట్లాడితే సంతోషిస్తావు. కష్టాల్లో ఉన్నప్పుడు సానుభూతి చూపిస్తే అందరూ నీ వెంటే ఉన్నారనుకొంటావు. కాని, నీ అహాన్ని గాయపరిస్తే తెగ బాధపడిపోతావు.

పరువు, మర్యాదలు, ప్రశంసలు కొందరు అంత ముఖ్యమనుకుంటారు గనక, వాళ్ళ నైతిక దృక్పథాన్ని అవే నిర్ణయిస్తాయి. కాని మన సుఖసంతోషాలకు వీటిమీద ఆధారపడటం ఎంతమాత్రం అభిలషీయణం కాదు. ఈ బలహీనతను మనం అదుపులో పెట్టుకోవలసిన అవసరముంది. ఇలా చెయ్యని పక్షంలో మనం పరుల అభిప్రాయాలకు బానిసలమైపోక తప్పదు.

ప్రతి వ్యక్తి తనను తాను బేరీజు వేసుకొని, ఆ తర్వాత ఇతరుల అభిప్రాయాలు తనకెంత అవసరమో, ఏ మేరకు అవి తనకు సంతోషాన్ని కలిగిస్తున్నాయో తెలుసుకోవాలి. ఎవరైనా మునగచెట్టెక్కించినప్పుడు పొంగిపోతాంగాని, మన వెనకవాళ్ళు నిజంగా ఏమనుకుంటున్నారో తెలిస్తే అలాంటివాళ్ళ పొగడ్తలకు, తెగడ్తలకు కూడా దూరంగా ఉండాలనుకొంటాం. ఎంతమంది మహానుభావులను, జీనియస్‌లను గురించి చులకనగా మాట్లాడలేదు మూర్ఖులు! ఆకాశానికెత్తిన నోటితోనే వాళ్ళమీద నీలాపనిందలు వేశారు.

మొత్తంమీద తన సంతోషానికి ఇతర్లమీద ఆధారపడిన వ్యక్తి ఎప్పుడో ఒకప్పుడు ఆశాభంగం చెందక తప్పదు. ఆనందానికి, మన మనస్తత్వం, ఆరోగ్యం మూలం కావాలి. రోజువారీ సమస్యల్ని సంతోషంగా అధిగమించగలిగాలి. తన సంతోషం తనలోనే దాగి ఉందని అందరూ ఎంత త్వరగా గ్రహిస్తే అంత మంచిది. ఆరోగ్యం, స్వభావం, ఇల్లు, ఆదాయం, భార్యాపిల్లలు, మిత్రులు, ముఖ్యంగాని జనం ఏమనుకుంటున్నారోనని బిక్కుబిక్కుమనుకుంటూ గడపక్కర్లేదు. తమకు పరువు, మర్యాదే ముఖ్యమనుకునేవాళ్ళు అవి తప్ప మరేవీ తమకు సంతోషాన్నివ్వలేవని అంగీకరిస్తున్నారన్నమాట. అయితే, పరువు, మర్యాద, కీర్తిప్రతిష్టలు అవసరం లేదని చెప్పటం నా ఉద్దేశం కాదు. సమాజంలో పైకెదగాలన్నా, గుర్తింపు తెచ్చుకోవాలన్నా నలుగురూ మన గురించి మంచిగా చెప్పుకోవటం తప్పనిసరి. కాని, పరపతి పెంచుకోవటం కోసమే మన ప్రతిభా వ్యుత్పత్తుల్ని, సాహిత్య, కళా, శాస్త్ర కృషిని కొనసాగించాలనుకోవటం ఆత్మవంచనే అవుతుంది. అయినా ఎక్కువమంది ఇలాగే చేస్తారు. అంటే బహుశా, మానవ స్వభావంలోనే నలుగురి మన్నన పొందాలనే లక్షణం ఉందేమో! లేదా నాగరికతవల్ల మన మనస్తత్వం ఇలా మారింది. మొత్తం మీద మన ఆనందానికి అడ్డుపడుతుందన్నది మాత్రం స్పష్టం. పరుల మాటకు విలువ ఇవ్వటం వల్ల ఎన్ని జీవితాలు నాశనమయ్యాయో మరెందరు తమ ఆస్తులు పోగొట్టుకున్నారో మనోవేదనతో మంచం పట్టారో! ఇలా జరుగుతుందంటే వాళ్ళ చేతిలో నువ్వు కీలుబొమ్మవన్నమాటేగద. అంతరాత్మ ప్రబోధంతో మన మార్గాన్ని ఎంచుకోవటానికీ,

చెప్పుడు మాటలు విని దారి తప్పటానికీ తేడా లేదా? అయితే, జనాభిప్రాయాన్ని పూర్తిగా విస్మరించాలని కాదు. మనమనుకున్నదే చేస్తాం. కాని వాళ్ళ అభిప్రాయాల్ని కూడా పరిగణనలోనికి తీసుకొంటాం. ''నలుగురూ ఏమనుకుంటారు?'' అన్న ఆలోచనే మన జీవితాల్ని శాసిస్తున్నది. ఎంత విషాదం! మనకు మనం ఆపాదించుకునే ప్రాముఖ్యత మీద ఆధారపడి ఉంది. 'నలుగురూ ఏమనుకుంటారు' అన్న భావన. అసలు, చెయ్యాల్సిన పని ముఖ్యం కాని, మనం కాదుగద! జనాభిప్రాయాన్ని సీరియస్‌గా తీసుకొన్నవాళ్ళు తమకు తెలియకుండానే, ఎంత మూల్యం చెల్లించుకుంటున్నారో గమనిస్తే ఆశ్చర్యమేస్తుంది. చివరికి, చిన్నపిల్లలు కూడా దీనికి అతీతుల కారు. పిల్లలైనా, పెద్దలైనా, ఆత్మవిశ్వాసం సన్నగిల్లినప్పుడు, పరుల అభిప్రాయాలకిచ్చే విలువ పెరుగుతుంది.

ఇటీవలే ఒక వ్యక్తి, ఉరికంబం ఎక్కబోయే ముందు గొప్ప ప్రశాంతతనూ, ధీరోదాత్తతనూ ప్రదర్శించాడని చదివాను. అలా ఉండటంలో అతడి ఉద్దేశం ఏమిటి? అందరూ తన గురించి గొప్పగా చెప్పుకోవాలనే తప్ప మరేమీ కాదు. అందుకే టాసిటస్ అంటాడు : "ఐశ్వర్యాన్నీ, మరే ఇతర సుఖాన్నీ ఆశించనివాడు కూడా కీర్తికాంక్షకు అతీతుడు కాడు." ఈ బలహీనతను అధిగమించటానికి ఒకే పద్ధతుంది. అది ''కీర్తికాంక్ష అనబడేది ఒక బలహీనత'' అని గ్రహించటమే. కీర్తి అంటే పరుల దృష్టిలో మనకున్న గౌరవం, స్థాయి వగైర. కాని వాళ్ళ అభిప్రాయాలకు మనమెందుకంత విలువ ఇవ్వాలి? అవి తప్పు కావచ్చు. అందులో వుత్ప్రేక్ష ఉండవచ్చు. స్వార్థప్రయోజనం ఉండవచ్చు. కీర్తి గనుక ఇష్టపడ్డావుగాని, నీ గురించి చెడ్డగా చెప్పుకుంటే, నీలాపనిందలు ప్రచారం చేస్తే నీకు క్షణమైనా మనశ్శాంతి ఉంటుందా?

**ఆత్మగౌరవం, అభిమానం :**

మనలో ఏదో విషయంలో ప్రతిభ ఉందని నమ్మితే మనమీద మనకు గౌరవం పెరుగుతుంది. నలుగుర్లో తలెత్తుకుని నడుస్తాం. ఇతర్లలో ఉందన్నట్టుగా ప్రవర్తిస్తే అది వాళ్ళలో భేషజం పెంచుతుంది. గౌరవం వ్యక్తిత్వానికి సంబంధించింది. భేషజం ప్రదర్శించటానికే ఉపయోగపడుతుంది గాని గొప్పలు చెప్పుకోవటంకన్న మౌనంగా ఉండటంవల్ల మనపట్ల ఇతర్లకు గౌరవం పెరుగుతుంది. గౌరవానికి ప్రథమ శత్రువు భేషజం. ప్రతిభ లేనివాళ్ళు ప్రతిభావంతులపట్ల ఉడుకుమోత్తనం ప్రదర్శిస్తారు. అందువల్ల, అందరికీ సలహా ఒక్కటే. హోరెస్ చెప్పినట్లుగా, అర్హత ఉందనుకుంటే, కీర్తిశిఖరం మీద తప్పక జెండా ఎగరెయ్యి! ఇక, అత్యంత చవకబారు అభిమానం "మన జాతి, మన దేశం అందరికన్నా గొప్పది" అనే భావన. ఇందులో వ్యక్తి లక్షణాల ప్రస్తావనే లేదు. జాతి గొప్పదైతే, దేశం గొప్పదైతే తనెందుకు కాలరెగరేసుకు తిరగాలి? లక్షలాది, కోట్లాది మందిలో ఉన్న గుణాలే తనకూ ఉన్నాయి. ప్రతిభావంతుడు తన జాతి లోటుపాట్లను గుర్తిస్తాడు. కాని గర్వించటానికేమీ లేనివాడే "మా అంత గొప్పవాళ్ళు మరెవరూ లేర''ని తెగ నీల్గుతుంటాడు. ఉదాహరణకు ఇంగ్లీషువాళ్ళకు అసహనం, అహంకారం ఎక్కువంటే, ఆ దేశస్తులెంతమంది అంగీకరిస్తారు. మొత్తం మీద దేశౌన్నత్యం సంగతెలా ఉన్నా, వ్యక్తికున్న సుగుణాలూ, సచ్ఛీలతే అతనికి నిజమైన ఆభరణాలు.

**మూడవభాగం**

**హోదా/అంతస్తులు :**

జనం దృష్టిలో హోదాకు చాలా ప్రాముఖ్యత ఉంటుంది. పరపతి ఉన్నవాడికే ఎవ్వరైనా పట్టంగడతారు. కాని నిజానికి హోదా అనేది మనం కల్పించుకున్న ఒక భ్రమ, ఒక ప్రహసనం. ఎదుటి మనిషి మన మాట వింటే, మనని చూసి నిల్చుంటే, నమస్కరిస్తే, మనం వాడికన్నా ఉన్నతులమన్నట్టు. మనకు నెత్తిమీద కొమ్ములు మొలిచినట్టు. ఇదంతా ఒక జోక్‌లా కనిపించటంలేదూ!

**పరువు :**

వ్యక్తికి సమాజంలో ఉన్న గౌరవాన్ని హోదాతో ముడిపెట్టలేం. 'గౌరవం' అంటే ఇతర్లకు మన గురించి ఉన్న అభిప్రాయం. అయితే, గౌరవానికీ, నీతివంతమైన జీవితానికీ సంబంధం ఉండవలిన అవసరం లేదు. ప్రతి వ్యక్తీ పరువుననుభవించినట్లే, పరువు పోగొట్టుకొన్నప్పుడు అవమాన భారమూ ధరిస్తాడు. సమాజంలో వ్యక్తి ఒంటరిగా ఏమీ సాధించలేడు. నిర్మానుష్యమైన ద్వీపంలో రాబిన్‌సన్ క్రూసో కాడతడు. సామాజిక సంబంధాలే అతడి ఎదుగుదలకు దోహదం చేస్తాయి. ప్రతిభావంతుడు, తను సమాజంలో ఒక ఉపయోగకరమైన సభ్యుడిగా జీవితం కొనసాగించాలనుకొంటాడు. కాని, త్వరలోనే అతడికి అసలు విషయం అర్థమవుతుంది. ఉపయోగకరంగా ఉండటమంటే, సమాజం తన నుండి ఆశించింది చెయ్యటమేగాని తనకు

నచ్చింది చెయ్యటం కాదని. ఆ తర్వాత, ఇతర్ల దృష్టిలో తానెక్కడ దిగజారుతానోననే భయం కూడా పట్టుకుంటుంది. చివరికి, అనుకున్నది, ఇష్టమైనది చెయ్యటం మానేసి, నలుగురూ మెచ్చే పనులు మాత్రమే చేసి మెప్పు పొందాలనుకుంటాడు. 'పరువు' కోసం అతడు చెల్లించిన మూల్యమిది. పరువు/గౌరవం మూడు రకాలు : ఒకటి సామాజికమైన గుర్తింపు. రెండు : అధికారిక గుర్తింపు. మూడు: లైంగిక గుర్తింపు. సామాజిక నియమాలను, సంప్రదాయాలను గౌరవించటం ద్వారా సామాజికమైన గుర్తింపు లభిస్తుంది. వ్యక్తుల మధ్య స్నేహపూర్వక, సౌహార్ధిక సంబంధాలుండాలి. వీటిని ఉల్లంఘిస్తే శిక్ష తప్పదు. శిక్ష వెయ్యటాన్నే సామాజిక న్యాయం జరగటమంటారు.

ఇతరులు మనను గౌరవించటం సంగతెలావున్నా, వ్యక్తిత్వం అందరికీ ప్రాణప్రదమైంది. పోగొట్టుకున్నవి మరేమైనా సాధించుకోవచ్చుగాని, వ్యక్తిత్వాన్ని కోల్పోయిన మనిషినెవరూ రక్షించలేరు. కొన్నిసార్లు నీలాపనిందలవల్ల, అసూయాద్వేషాలతో చేసిన ఆరోపణలవల్ల సజ్జనులకు కూడా హాని కలగవచ్చునుగాని పరువునష్టం దావా వేసి వీటిని అధిగమించవచ్చు. పరువు రెండు రకాలు. జనం ఒక వ్యక్తి ప్రదర్శించిన లక్షణాల వల్ల అతణ్ణి గౌరవిస్తారు. కాని తరువాత ఎప్పుడైనా, అవి తెచ్చిపెట్టుకున్న / కుహనా సుగుణాలని తెలిస్తే వాళ్ళ అభిప్రాయమూ మారిపోతుంది. సత్ప్రవర్తనతో గౌరవం సంపాదించుకోవటం సులభమేగాని కీర్తి అలా కాదు. అది కొందరికే, అదీ అరుదుగా మాత్రమే సాధ్యం.

వృద్ధులను గౌరవిస్తాం. దీనికి కారణం, వాళ్ళు, ఒడుదుడుకులను తట్టుకొని ఇన్నాళ్ళు నెట్టుకు రాగలగటమే. యువకులు, తమ సామర్థ్యాన్ని ఇంకా నిరూపించుకోవలసిన అవసరముంది. నెరసిన జుత్తును చూస్తే ఎవరికైనా చేతులెత్తి దండం పెట్టాలనిపించటం సహజం. అందరూ గౌరవం, కీర్తి కోసం అర్రులు చాస్తారు. "కాని వాటివల్ల ఏ ఉపయోగమూ లేకపోతే అవి ఎందుకు?" అంటాడు సిసెరో. "వీటివల్ల చాలా లాభాలున్నాయి" అంటారు హెల్వెటియస్. పరువు గురించి ఈ మాత్రం చెప్పుకున్నాం చాలు!

**అధికారిక గుర్తింపు :**

అధికారంలో ఉన్నప్పుడు గౌరవం మనల్ని వెతుక్కుంటూ వస్తుంది. ఎంత పెద్ద ఉద్యోగమైతే అంత పరువు. కాని పాపం, సామాన్యులకు పరువుగా బతకటమే దినదిన గండంలా ఉంటుంది. లైంగిక గౌరవం అంటే స్త్రీ, పురుషులు పరువుగా, మర్యాదల్ని అతిక్రమించకుండ బతకటం అని అర్థం. 'హద్దులు మీరకపోవటం' అన్న మాట పురుషులకన్నా స్త్రీలకెక్కువ వర్తిస్తుంది. పెళ్ళి కాకముందు, పెళ్ళి తర్వాత ఎవరూ ఒక మహిళవైపు వేలెత్తి చూపే పరిస్థితి రాకూడదు. పురుషులు, స్త్రీల మీద ఆధారపడరని కాదుగాని, స్త్రీలు, పురుషుల మీద పరిపూర్ణంగా ఆధారపడతారు. పురుషులు, స్త్రీ అవసరాలన్నీ తీర్చగలిగాలి. పిల్లల పోషణ భారం వహించాలి. మొత్తం మీద భార్యాభర్తలిద్దరూ కలసి, సమాజానికి "రెండు శరీరాలైనా ఇద్దరం ఒక్కటే" అని చాటాలి. అయితే, ఇవన్నీ సాంప్రదాయక విలువలే. కాలానుగుణంగా మారుతూనే ఉన్నాయి.

**కీర్తి :**

పరువు, కీర్తి కవలపిల్లలు. ఇందులో పరువుకు హెచ్చుతగ్గులుంటాయి గాని కీర్తి అజరామరం. మనం నిజమైన, నిష్కల్మషమైన కీర్తి గురించి మాట్లాడుకుంటున్నాం. ఎందుకంటే కీర్తి కూడా అనేక రకాలు. ఏక్‌దిన్‌కా సుల్తాన్‌లా ఒకరోజు వెలిగిపోయే కీర్తి కూడా ఉంటుంది మరి. పరువు విషయం వేరు. నలుగురిలో ఉన్నప్పుడు మర్యాదగా, గౌరవంగా ప్రవర్తించటం పరువు నిలబెట్టుకోవటానికి తొలిమెట్టు. పరువంటే ఏమిటో ఎవరికి వాళ్ళు నిర్ణయించుకోవచ్చు. కాని కీర్తి స్థాయిని జనబాహుళ్యం నిర్ణయిస్తారు. మనకు తెలిసినవాళ్ళకు మాత్రమే పరిమితమవుతుంది పరువు. కాని కీర్తి అపరిచితులకు కూడా విస్తరిస్తుంది. పరువుగా బతికే హక్కు అందరికీ ఉంది. కాని కీర్తి కొందరినే వరిస్తుంది. అసామాన్యమైన ప్రతిభా పాటవాలుంటేనే ఇది సాధ్యం.

మన ప్రతిభను రెండు రకాల ప్రదర్శించవచ్చు. ఒకటి ఆదరణ ద్వారా లేదా ఇతర్ల ప్రశంసలు పొందే పనులు చేసి ఆచరణకు స్పందించే హృదయం అవసరం. గొప్ప పనులు సాధించాలంటే అరుదైన మేధస్సు, జీనియస్ అవసరం. అయితే రెంటికీ పరిమితులున్నాయి. ఆచరణ ప్రభావం తాత్కాలికం. జీనియస్ సాధించిన ఘనవిజయాలు శాశ్వతం కాకపోయినా ఎక్కువ కాలం గుర్తుంటాయి. ఆచరణ ఎంత గొప్పదైనా త్వరలోనే జ్ఞాపకంగా మారిపోతుంది. ప్రపంచ విజేత అలెగ్జాండర్ ఇప్పుడు మనకొక పేరు మాత్రమే. కాని ప్లేటో, అరిస్టాటిల్, హోమర్‌లతో మనం ఇంకా అడుగులో అడుగు వేస్తూ నడుస్తూనే ఉన్నాం. వేదాలు, ఉపనిషత్తులు

ఇప్పటికే సజీవంగా ఉన్నాయి. కాని ఆ కాలం వాళ్ళు చేసిన ఇతర పనుల గురించి ఇప్పుడు మనం మాట్లాడుకోం.

ఆచరణవల్ల వచ్చే కీర్తి విస్ఫోటనంలాంటిది. ఆ క్షణంలో దశదిశలా వినిపిస్తుంది. మహా కావ్యం యొక్క కీర్తిప్రస్థానం అతి సామాన్యంగా కొన్నిసార్లు అనామకంగా ప్రారంభమవుతుంది. కాని కాలక్రమంలో వేగం పుంజుకుంటుంది. ఓ శతాబ్దం తర్వాత లైట్‌హౌజ్‌లా నలుదెసలా వ్యాపిస్తుంది దాని వెలుగు. ఆ తర్వాత, వేలాది సంవత్సరాలు గడిచినా ఆ ధగధగలు ఏమాత్రం తరగవు. కాని విస్ఫోటనం విషయంలో, చెవులు బద్దలయ్యేట్టు వినిపించిన శబ్దం, మరుక్షణం బలహీనపడుతుంది. ఆ తర్వాత అది స్మృతిగా మాత్రమే మిగిలిపోతుంది.

ఆచరణ విషయంలో మరో చిక్కేమిటంటే దానికి కాలం కలిసిరావాలి. అంటే, ఇందువల్ల వచ్చే కీర్తి, కార్యసాధకుని ప్రతిభ మీద కాకుండా తాత్కాలిక పరిస్థితుల మీద ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు యుద్ధంలో వచ్చే కీర్తికి ప్రత్యక్ష సాక్షుల కథనాలే ముడిసరుకు. పలుసార్లు, సాక్షుల ఇష్టాఇష్టాలపై ఆధారపడి ప్రచారంలోకి వస్తాయి కథనాలు. అయితే ఆచరణలో ఉన్న సౌలభ్యం ఏమిటంటే, అది అందరికీ అర్థమవుతుంది. అందర్నీ తక్షణమే ఆకట్టుకుంటుంది. కాని ఆచరణను ప్రేరేపించిన ఆలోచనల్ని అర్థం చేసుకుంటే తప్ప, దాని మంచి చెడులను విశ్లేషించలేం. కావ్యాల విషయం వేరు. వీటి సృష్టిలో బాహిర పరిస్థితుల ప్రమేయం తక్కువ. రచయిత మేధో అవసరాలకు అనుగుణంగానే వీటి రూపకల్పన జరుగుతుంది. రచయితలు ఎలాంటివారైనా, వాళ్ళు రోజుకో రంగు మార్చరు. తమ వ్యక్తిత్వం ఎలాంటిదైతే, జీవితాంతం అలాగే ఉంటారు. వాళ్ళను అర్థంచేసుకోవటం కూడా కష్టమే. వాళ్ళ రచనల్ని అంచనా వెయ్యటమూ అంత సులభం కాదు. సద్విమర్శకులు ఈ లోకంలో నల్లపూసల్లాంటి వాళ్ళు కదా!

జీవితకాలంలో ఒక రచయితను కీర్తి వరిస్తుందా లేదా అనేది అనేక పరిస్థితుల మీద ఆధారపడి ఉంటుంది. రచన ఎంత గొప్పదైతే, దాన్ని కీర్తి అంత నెమ్మదిగా వరిస్తుంది. దీనికి సంబంధించి సెనెకా ఒక మంచి ఉదాహరణ ఇచ్చాడు. “శరీరాన్ని నీడ వెంబడించినట్టుగా ప్రతిభను వెంబడిస్తుంది కీర్తి. సమకాలికులు, తమ విష నిశ్శబ్దంతో ఒక మహాకావ్యానికి మరణ శాసనం రాయాలనుకొన్నా, తరువాతి తరాలవాళ్ళు దానికి బ్రహ్మరథం పడతారు.'' దీన్నిబట్టి మనకు స్పష్టమైందొక్కటే. సెనెకా కాలంలో కూడా విమర్శ విషపురుగులున్నారు. తమ మౌనంతో మహాకావ్యాలకు చితి పేర్చటానికి విఫల యత్నం చేశారు. తమకు నచ్చిన ఒక చవకబారు పుస్తకాన్ని అందలమెక్కించటానికి, మంచి పుస్తకాలను తొక్కిపెట్టటానికి సందేహించలేదు. పుస్తకాలను తొక్కిపెట్టటమనేది ఒక కళ. దాని పేరు ''మౌనం పాటించటం”. ఈ నాటికీ ఈ కళ చిరస్థాయిగా వర్ధిల్లుతూనే ఉంది. చిరకాలం మన్నే కీర్తి కోసం ఎవరికైనా సుదీర్ఘ నిరీక్షణ తప్పదు. ఈ రకమైన కీర్తి ఓక్ వృక్షం లాంటిది. నెమ్మదిగా పెరుగుతుంది. తక్షణం వచ్చిన కీర్తిని పట్టుకొన్నట్టుగా దీనికి బూజు పట్టుకోదు.

భవిష్యత్ తరాల కోసం బతికిన వ్యక్తి సమకాలికులకు అపరిచితుడుగా, కాందిశీకుడిగా కనిపిస్తాడు. ఎందుకంటే అతడు చేస్తున్న కృషి వాళ్ళ కోసం కాదు. దానిలో సమకాలీనత ఉండదు. వాళ్ళను ఆకట్టుకోదు. జనం ఎప్పుడూ తమ తక్షణ ప్రయోజనాల కోసం కృషి చేసేవాళ్ళనే అభిమానిస్తారు. ఒకసారి కళ, సాహిత్యాల చరిత్రను పరిశీలిస్తే ఆయా కళాఖండాలు, కావ్యాలు సమకాలీనుల మన్ననలు పొందలేదని స్పష్టమవుతుంది. కొన్ని తరాల తర్వాత మాత్రమే వాటికి గుర్తింపు వచ్చింది. ఎందుకిలా జరుగుతుందంటారా? ఏ వ్యక్తి అయినా తన స్వభావానికి అనుగుణమైన విషయాలను మాత్రమే ఆస్వాదించగలడు. చవకబారు మనిషి నేలబారు రచనల్నే ఇష్టపడతాడు. సంసార పక్షం మనిషి ‘చిన్ని నా బొజ్జకు శ్రీరామరక్ష' అని వీటిని వల్లించే పుస్తకాలే మళ్ళీమళ్ళీ చదువుతాడు. గందరగోళంలో ఉన్న మనిషి తనకర్థం కాని పుస్తకాల కోసమే వెతుకుతాడు. బుర్ర లేనివాడు సిల్లీగా ఉన్నదేదైనా చదువుతానంటాడు. అంటే, అందరూ తమతమ వ్యక్తిత్వాలకు, స్వభావాలకు అద్దంపట్టే పుస్తకాలనే ఎంచుకొంటారు. మనుషులు తమలాంటివాళ్ళనే ఇష్టపడతారంటే, కుక్క మరో కుక్కను, ఓ గాడిద మరో గాడిదను ఎందుకిష్టపడుతుందని అడిగినట్టుగా ఉంటుంది.

ఎంతటి బలవంతుడు కూడా దూదిపింజను గాలిలో పట్టి ఉంచలేడు. వదిలిన మరుక్షణం నేలమీద వాలుతుందది. దూదిపింజలో బలం లేనప్పుడు, మరో బాహిరశక్తి ఏదీ దానికి బలం సమకూర్చలేదు. అలాగే, మహాగ్రంథాలను అందరూ అర్థంచేసుకోలేరు. ఒక రచయిత చెప్పినట్టుగా ''బధిర

శంఖారావమంటే ఇదే. ఇలాంటివాళ్ళే రామాయణమంతా విని రాముడికి సీతేమవుతుందని అడుగుతారు." "A knavish speech sleeps in a fool's ear" అంటాడు హామ్లెట్. కాని మూర్ఖులను చూసి మనం నిరుత్సాహపడకూడదు. నీళ్ళలోకి రాయి విసిరితే అలలు వస్తాయిగాని, బురదలోకి విసిరితే మురికి మొహం మీద చిమ్ముతుంది.

పుస్తకాలు అద్దాలవంటివి. గాడిదకందులో తన ప్రతిబింబమే కనిపిస్తుందిగాని కుక్క కనిపించదుగద. "ఈ లోకంలో ప్రతి వ్యక్తీ తనకు తానే కేంద్రంగా బతుకుతాడు. అందువల్ల మరొకరి కృషిని అతడు నిస్వార్థంగా అభినందించాలనుకోవడం మూర్ఖం" అంటాడు గోతె. గొప్ప పుస్తకాలకు కీర్తి రావటం చాలా కష్టం. ఎందుకంటే వాటికి పాఠకులు బహు కొద్దిమంది. కేవలం వినోదం కోసం రాసే రచయితలకు లక్షలకొద్దీ ఉంటారు అభిమానులు. ఇక తాత్విక గ్రంథాల సంగతి చెప్పనక్కర్లేదు. ఏ కాలంలోనైనా వీటికి పాఠకులు పరిమితమే. అవును మరి. తాత్విక భావనలున్న వాళ్ళే వీటిని అధ్యయనం చేయాలనుకుంటారు.


ఇతరులతో పోల్చినప్పుడు, ఒక వ్యక్తిని అంచనా వెయ్యటానికి ఉపయోగించే కొలమానానికే మరో పేరు కీర్తి. అంటే, ఇతర్లు కూడా అంత ఎత్తుకెదిగితే, ఆ వ్యక్తి కీర్తి దానంతటదే తగ్గిపోతుంది. కీర్తి యాదృశ్చికం. ప్రతిఫలించినప్పుడే కాంతి రెట్టింపవుతుంది. కీర్తితో ప్రతిభకు గుర్తింపు వస్తుంది. "కీర్తి కోసం కృషి చేస్తారు పలువురు. కొందరు మాత్రమే దానికి అర్హులు" అంటాడు లెస్సింగ్.

కాని, కీర్తి అనే ఎండమావుల కోసం ఆశించిన వ్యక్తి జీవితం నిరర్థకం కాదా? జనం కరతాళ ధ్వనుల కోసం నిరీక్షిస్తూ అతడు నిద్ర లేని రాత్రులు గడుపుతాడు. జనాభిప్రాయమే అతడి జీవితాన్ని శాసిస్తుంది. అదే అతడి విషాదం. ఇతరుల అభిప్రాయాల మీద మన ఆనందం ఆధారపడాలా? ఎంత కృత్రిమ ఆనందమది! 'కీర్తి'మంతుల జాబితా చాలా పెద్దది. సైన్యాధికారులు, అమాత్యవర్యులు, దగుల్బాజీలు, వీధి గారడీవాళ్ళు, వీధి గాయకులు, విదూషకులు, నటీనటులు, కోటీశ్వరులు, ఒక్కరా ఇద్దరా – అందరూ 'కీర్తి'ని మూటగట్టుకున్నవాళ్ళే. అహంకారమనే మన ఆకలిని తీర్చే అన్నం ముద్ద కీర్తి అయితే ఇది అసహజమైన ఆకలి. ముఖ్యంగా ఎలాగైనా సరే పేరు సంపాదించాలనుకొనే వాళ్ళ పరిస్థితి మరీ దారుణం. తమ విలువ ఏమిటో తమకే తెలియదు. కాని, ఇతరులు దాన్ని గుర్తించి కీర్తికిరీటం తొడగాలి. పైగా, ఇలాంటివాళ్ళు, కీర్తి దక్కకపోతే, తమకేదో అన్యాయం జరిగిపోయినట్టుగా లోలోపలే కుమిలి, కుంగి, కృశించిపోతారు.

*"శిఖరం మీద కీర్తి మందిరం తళుకులీనుతున్నది.*
*అక్కడికి చేరుకోవటం దుర్లభం!!"*

అంటాడు మిల్టన్. కీర్తికి ఏమాత్రం అర్హత లేనివాళ్ళే దాని గురించి ఎక్కువగా కలలుగంటారు. కాని వ్యక్తిత్వంకన్నా ముఖ్యమైనది మాత్రం కాదది. మనకు ఒక వ్యక్తిపట్ల ఆరాధనాభావం కలిగించే లక్షణం ఆరాధనకన్నా గొప్పది. కీర్తివల్ల వ్యక్తికి ఆనందం కలగదు. ఏ లక్షణం / ఏ ప్రతిభ వల్ల కీర్తి కావాలని ఆశిస్తున్నావో ఆ లక్షణం / ప్రతిభ వల్ల మనకు ఆనందం కలుగుతుంది. ఈ లక్షణానికి / ప్రతిభకు ఇతర్లలో కనిపించే ప్రతిబింబమే కీర్తి. ప్రతిభ ఉండీ కీర్తి రాని వ్యక్తి కీర్తి వచ్చినవాడికన్నా ఎక్కువ ఆనందంగా ఉంటాడు. అసమర్థులు, భట్రాజులు పొగిడితే వచ్చేది కీర్తి కాదు. అతడి ప్రతిభను చూసి మనం అసూయపడితే అదే అతడికి నిజమైన కీర్తి. భవిష్యత్ తరాలకు వైతాళికుడతడు. జీవితకాలంలో వచ్చేది కీర్తి కాదు. మరణానంతరం కీర్తిస్తేనే అతడు ధన్యుడు. స్వేచ్ఛగా బతికాడు. అనుకున్నది చేశాడు. ఆనందంగా గడిపాడు. మరణానంతరం ప్రశంసల వర్షంలో తడిశాడు.

బధిరుల కరతాళ ధ్వనులందుకున్న సంగీతకారుడు తన ప్రతిభకు గుర్తింపు లభించిందని సంతోషిస్తాడా? లేదా, డబ్బులు తీసుకుని చప్పట్లు కొట్టారని తెలిస్తే తనమీద తనకు అసహ్యం పెరిగిపోదా? సమకాలికులు ప్రశంసలు ఇలాంటివే. వాళ్ళు పొగడటానికి ప్రతిభకు సంబంధించని కారణాలెన్నో ఉంటాయి. జీవితకాలంలోనే కీర్తి రావాలని ఒక వ్యక్తి తాపత్రయపడుతున్నాడంటే అర్థం, మరణానంతరం తననందరూ విస్మరిస్తారని భయపడుతున్నాడన్నమాట. యౌవనమనే ఎండాకాలంలో మగ్గిన మధుర ఫలం కీర్తి, శీతాకాలం (వృద్ధాప్యం) వరకు పక్వమవుతుంది.



ముక్తవరం పార్థసారథి
హైదరాబాద్.
ఫోన్ : 917 761 8708




# ఆంధ్రులు - నాట్యకళ

*- నటరాజ రామకృష్ణ*

దేవాలయములు హైందవ సంస్కృతికి నిలయములు, అవి లలిత కళలకు పుట్టినిల్లు; నాగరకతా చిహ్నములు. విజ్ఞానం మూసవోసి, కళాచాతుర్యం అంతా వినియోగించి, రూపురేఖలు దిద్ది అలంకరించి ప్రపంచానందంకోసం ప్రకృతిమాత అందించే వసంత శోభవంటిది సంస్కృతి. తద్వారా సర్వాంగ సుందరంగా రూపొంది మన లలిత కళలు పరివ్యాప్తమై అన్యజన ప్రేయం కూడా అయి, నేటికీ పవిత్ర భావములతో ఆరాధింపబడుతున్నవి. అందులో నాట్యకళ పరిపుష్టమై విన్యసిల్లినది.

మొదట ఆంధ్రదేశంలో నాట్యకళ రెండు విధాలుగా అభివృద్ధికి వచ్చినది. (1) ఆలయములలో దేవదాసీల ఆరాధనా నృత్యములు. (2) ఆలయముల వెలుపల వినోదం కోసం జరిగే కేళికానృత్యములు.

[1]ఈ ఆరాధనా నృత్యములు మార్గపద్ధతికి చెందినవి. ఇందలి కరణ, అంగహార, హస్తవిన్యాసములు, భావప్రకటనం శాస్త్రసమ్మతమై ప్రదర్శింపబడినవి. గర్భాలయములలో మూలవిరాట్టుల సాన్నిధ్యంలో ప్రదర్శింపబడే ఈ నృత్యములు ఆయా విరాణ్మూర్తులకు సంబంధించి ఏర్పాటైనవి. శివాలయమందు శైవరీతులు, విష్ణ్వాలయములందు వైష్ణవరీతులు నృత్యములలో ప్రదర్శించేవారు. భుజంగ, భుజంగత్రాస, శుద్ధ, శుభలీల, నవసంధి, సమపాద, కౌస్తుభ, పుష్పాంజల్యాదులు ఈ రీతులకు చెందినవే. ఈ రెండు రీతుల మధ్య చాలా భేదము కనపడుతున్నది. గంభీరమైన భావ ప్రకటన, ఉద్ధతమైన ఆంగవిన్యాసం, నృత్త నృత్యములతో భరత శాస్త్రాను గుణములైన కరణాంగహారముల తాండవ పద్ధతి ప్రదర్శనం శైవసంప్రదాయ రీతిలో విశేషములు. కోమలమైన

---

1. ఆరాధనా నృత్యములు ప్రదర్శించే నిమిత్తం మన ఆలయములందు ప్రత్యేకమైన ఏర్పాట్లు ఉండేవి. కాకతీయ ప్రభువుల కాలములో నిర్మింపబడిన ఆలయములందు స్వామికెదురుగా, నందికి వెనుకవైపు నునుపైన వలయాకారపు శిలావేదికలు కనిపిస్తున్నవి. ఈ ఏర్పాటు భారతదేశములోని ఇతర ప్రాంతముల ఆలయములందు గోచరించదు. దక్షిణ దేశమందలి తదితరాలయములలో ప్రత్యేక నృత్య వేదికలున్నప్పటికీ అవి స్వామికెదురుగా ఏర్పాటు కాలేదు. కాకతీయుల కాలమందున్న జాయపసేనుడు "నృత్త రత్నావళి" అనే ఒక స్వతంత్ర నృత్త గ్రంథం రచించాడు. దీన్ని అనుసరించి ప్రదర్శించిన భంగిమలే పాలంపేట వద్ద రామప్ప గుళ్ళలోని భంగిమలకు మాతృకలని కూడా కొందరు శాస్త్రజ్ఞుల అభిప్రాయం. ఇలాగే కొండవీటిరెడ్డి ప్రభువుల కాలంలో అభివృద్ధి చెందిన నృత్యకళను గూర్చి మనకు "వసంత రాజీయం" ద్వారా తెలుస్తున్నది. ప్రతాపరుద్రుని దర్బారును మాచల్‌దేవి అను ప్రఖ్యాత నర్తకి అలంకరించెను. లకుమాదేవి, కొమరగిరి ప్రభువు ఆస్థానములో నృత్యకళాలక్ష్మినారాధించెను. రాయలకాలములో పేరుగాంచిన నర్తకి రజకం కుప్పాయి. విజయనగర రాజుల హయాంలో ఆరాధింపబడిన నృత్యకళారీతి, అబ్దుల్ రజాక్ అనే విదేశ యాత్రికుడు చూసి వర్ణించిన అంశాలనుబట్టి వ్యక్తమౌతుంది. తమిళదేశమున అతి ప్రాచీనమైన "శిలప్పాధికారం" మూలంగా అప్పటి ద్రవిడ దేశ నృత్య సంప్రదాయములను విశేషంగా గ్రహింప గలుగుతున్నాము. కాని, అనేక రాచకీయ మత హేతువులవల్ల ఆంధ్రదేశంలో వేలకొలది గ్రంథములు ధ్వంసం కావడంతో ఆఖరుకు బౌద్ధయుగంనాటి మన లలిత కళలనుగూర్చిన గ్రంథములైనా లభ్యం కావడంలేదు. ఐతే, ఇక శిల్పంలో మలచిన మూర్తులను చూసి కొంతవరకు నాటి నృత్యకళను ఊహించగలుగుతున్నాము. టిబెట్టు, చైనా దేశపు భాషల్లో ఉన్న బౌద్ధగ్రంథములను పరిశోధించితే ఆనాటి ఆంధ్రదేశపు లలిత కళలనుగూర్చి మనకు కొంతవరకైనా తెలుస్తుందని ఆశించవచ్చు.

సుకుమార పద్ధతి హస్తవిన్యాసం, రసభావములతో రంగరించిన లాస్యం వైష్ణవ సంప్రదాయ రీతిలో విశేషములు.

మన ప్రతి కళ పావిత్ర భాసితం. కవులు గద్య, పద్య, గీత రచనలతో స్వామిని కీర్తించేవారు. సంగీత విద్వాంసులు కవుల గీతములకు రాగ, తాళములనుగూర్చి ఆలపించేవారు. వాద్యకులు వివిధ వాద్యముల మీద ఆ సంగీతమును అనుసరిస్తే శాస్త్రం తెలిసిన నర్తకీమణులు కాళ్ళ పసిడి మువ్వల ఝణం ఝణారవముతో మేళవించిన మహతీనాదమందు కంఠం చేర్చి మధురంగా భక్తిగీతమాలను ఆలపిస్తుండేవారు. గీతార్ధమును హస్తభంగిమాదులతోను, రసభావములను నేత్రవిన్యాసములతో, తాళగతిని పాదములతో వ్యక్తపరుస్తూ నిర్మలభావం ఆవేగం, భక్తిప్రపూర్ణ మనస్సుగలిగిన పరమహంసలవంటి[2] దేవదాసీ గణం దేవదేవునెదుట నృత్యం సల్పేవారు. ఇలా స్వామి సేవకు అంకితలైన దేవదాసీగణం ఇతర ప్రదేశాల్లో నృత్యమాడేవారు కారు. ఆదర్శవంతంగా నృత్యకళ అభివృద్ధి చెంది ప్రపంచమునకొక దివ్యసందేశం ఇవ్వజాలడానికి ఇదొక హేతువు. దేవదాసీగణం స్వామి ఎదుట నలిపే ఆరాధన నృత్యంకాక ఆయా సందర్భములందాయా ప్రత్యేక నృత్యములు ప్రదర్శించే ఆచారమును ప్రచారమునకు తెచ్చారు. ప్రాభాత సమయములో స్వామికి మేల్కొలుపులు మొదలుకొని రాత్రిపూట పవలింపు సేవవరకూ అనేక సమయముల్లో అనేక విధములుగా నృత్యపూజ సలిపేవారు. సంధ్యాసమయమందు శివాలయములో మహాదేవుని ప్రీత్యర్ధం భుజంగత్రాస నృత్యప్రదర్శనం ఉండేది. ఇవన్నీ శాస్త్రీయములైనవే. అంతేగాక, గణపతి, ఇంద్ర, విష్ణు, బ్రహ్మ, రుద్రాద్య పూర్వ తాళము నృత్యములు ప్రదర్శింపబడేవి. ఈ ప్రదర్శనములందు నర్తకీమణులు మనోధర్మ నియతిలోగాని నృత్యరీతులలోగాని శాస్త్రీయేతర పద్ధతులను అవలంబించే అవకాశము ఎంతమాత్రమూ ఉండేదికాదు. ఆలయములందలి ఆరాధనా నృత్యరీతులు ఎప్పుడెవ్వరి వల్ల ఆచరణలోనికి తేబడినవో చెప్పలేము. కాని, ఆంధ్ర శిల్పులు తమ కళానైపుణ్యమును మూసపోసి తెలుగునాట దేవతలకు ఆలయములను నిర్మించిననాటికే నృత్యకళ మహోన్నత స్థితినందుకొని ఉండవలెను. కఠిన శిలలో సజీవమూర్తులను తోపించే సౌందర్యమయములైన శిల్పములు సృష్టించే శిల్పిబ్రహ్మలుండుట అమర నర్తనంసల్పు నర్తకనర్తకీ గణం ఉన్నప్పుడే తటస్థించగలదు. ఎన్ని శతాబ్దముల క్రితం ఏ దేవదాసీ గణము ఆ నృత్య భంగిమములను ప్రదర్శించారో, ఆ భంగిమములను శిల్పులెన్నివందల సంవత్సరాల క్రితం శిలలలో శాశ్వతపరిచారో, అప్పట్లో ఈ కళలనే ప్రభువులు పోషించారో, ఈనాటికా దేవదాసీగణము, ఆ శిల్పులు, ఆ ప్రభువులు కాలవాహినిలో అదృశ్యమైనారు. చెక్కుచెదరక ఆ శిల్పములు మాత్రము సొంపులీనుతూ నేటికీ కళల మహత్వ సౌందర్యములను తెలుసుకోగోరి దేశపర్యటన చేసే కళోపాసకులకు తమ దివ్య మౌన సందేశములిస్తున్నవి[3].

2. మన పూర్వులు నాట్యకళను, దేవదాసీగణమును ఎంతో భక్తిభావంతో చూసేవారు. ఇందుకు ద్రాక్షారామాలయమునకు చెందిన ఒక గాథ చెబుతాను. ద్రాక్షారామభీమేశ్వరాలయంలో అమ్మవారి పేరు "మాణిక్యాంబ". ఈ మాణిక్యాంబ ద్రాక్షారామంలో ఒక దేవదాసి అట. ఆమె పవిత్ర జీవితం గడుపుతూ నాట్యకళతో భగవంతునారాధించి తరించినదట. అప్పటి నుండీ ఊరివారు ఆమెను అమ్మవారుగా భావించి పూజాపురస్కారములు ప్రారంభించారని అంటారు. అంతేగాక, నాట్యం చేసే సమయంలో దేవదాసీగణం వివిధావయవములను వివిధ దేవతలు ఆశ్రయించి ఉంటారట కూడా. 1. బ్రహ్మరంధ్రమున సదాశివుడు, 2. లలాటమున క్షేత్రపాలుడు, 3. కటిస్తలమున బుద్ధుడు, 4. మణికట్లలో మహాదేవుడు, 5. హస్తములందు స్థిరలక్ష్మి, 6. హస్తాగ్రములలో పార్వతి, 7. స్తనద్వయమునందు మేరుమందరములు, 8. వక్షమున శ్రీమహావిష్ణువు, 9. నాభిలో లక్ష్మి, 10. జఘనమునందు భూదేవి, 11. ఊరుద్వంద్వమున ఇంద్రుడు, 12. జంఘలందు బ్రహ్మ, 13. జానువులను వాయువు, 14. దృష్టులందు మన్మథుడు, 15. పాదములందు సూర్యచంద్రులును. ఇది అలంకారోచితమైన ఊహాచిత్రంగా తోచినా దేవదాసీగణం గడిపే పవిత్ర జీవితాన్ని వారిని దేవతాస్వరూపులుగా గడించిన ప్రజల భావమును కొంత తెలుపక తప్పదు.

3. వీరి కృషి ఫలితమే మన ఆలయ శిల్పాలు. రామప్ప గుళ్ళలోని అపూర్వ నృత్య భంగిమలు, లేపాక్షిలో ఊర్వశీ నృత్య విన్యాసాదులు. ఎల్లోరా గుహలలో శివతాండవం, కంచి కైలాస నాధాలయములో నృత్యకరణములు, తంజపురి బృహదీశ్వరాలయంలో తాండవ భంగిమలు, చిదంబరమందు భరతశాస్త్రములోని 108 కరణముల స్త్రీ భంగిమలు, తాడిపత్రి ఆలయంలోని తాండవ విన్యాసాలు అపూర్వ శిల్ప

⇨

ధన్యమా నర్త కీగణం. శిల్పగణమూ భారతీయుల దృష్టిలో ఏ కళగాని, ఏ శాస్త్రముగాని మానవుని ఆధ్యాత్మక దృక్పథమును పెంపొందించే సాధనముగా ఏర్పాటైనవి. ఏ ఆదర్శముతో ఆరాధనా నృత్యరీతి ఆరంభింపబడినదో అందుకు భంగము రాకుండా, కళల పావిత్ర్యం చెందకుండా, స్వరూపౌన్నత్యములకు స్ఖాలిత్యము ఆపాదిల్లకుండా పూర్వీకులు కళనారాధించారు. కావుననే పోషించు ప్రభువుల అభిరుచుల కనుగుణంగా కాలక్రమేణా దర్బారులలో గణికలు ప్రదర్శించే నృత్యకళ ఎన్నో మార్పులకు గురైనప్పటికీ, ఆరాధనా నృత్యరీతి మాత్రం నాటికీ నేటికీ ఒకేతీరున విరాజిల్లుతూ కళల ఆమరత్వమును పవిత్ర సందేశమును చాటుతున్నది. హైందవ నాగరకతలోని విశిష్టతకిదొక తార్కాణం. కాలగతిలో దేవదాసీ వ్యవస్థ ఎట్టిదుర్గతి పాలైనప్పటికీ, ఆదిలో ఆ నర్తకీమణుల త్యాగనిరతికి, ఆధ్యాత్మిక చింతనకు, శాస్త్రీయ కృషికి, నిస్స్వార్థతకు మన ఆలయములలోని అపూర్వ శిల్పములు అమరకావ్యములుగా నిలిచాయి.

ప్రారంభములో నృత్యకళ ప్రత్యేకముగా దేవతారాధనకే వినియోగింపబడినప్పటికీ, పదంపడి గర్భాలయమును విడిచి నర్తకీగణం కళ్యాణమండపమందు ఉత్సవమూర్తులకెదురుగా తమ కళను ప్రదర్శించడం మొదలుపెట్టారు. అది మొదలుగా మనకు తెలియకుండానే కళల పావిత్ర్యం తరిగిపోవడం ప్రారంభమైనది. శాస్త్రీయ శైలిని కాదనకపోయినప్పటికీ నర్తకీగణం స్వీయానుభవములకూ, ప్రజారంజకములయ్యే హావభావలాసములకు ప్రాధాన్యమిస్తూ ప్రదర్శనములు ప్రారంభించారు. వీరు నృత్తప్రధానమగు కరుణ విన్యాసములుకాక – నృత్యాభినయ ప్రధానమగు ఆలయమూర్తుల పురాణ గాథల ప్రదర్శనములకు అలవడినారు. ఆలయావరణములో మాత్రం నృత్యకళ శాస్త్రీయసంప్రదాయబద్ధముగానే ఆరాధింపబడినది కాని, ఉత్సవమూర్తులు ఆలయము దాటి[4] తిరువీధులందు ఊరేగింపుగా బయలుదేరినప్పుడు ఆలయములకు సంబంధించిన సంగీత విద్వాంసులు, నాట్యాచార్యులు, నర్తకీగణం రాచబాటల్లోకూడ తమ విద్యాప్రదర్శనమునకు దొడగినారు. దీనితో కళారాధనయందు ప్రజారంజనోద్దేశపు పాళ్ళెక్కువై పావిత్ర్య స్వరూపము కొరవడుతూ వచ్చినది.

ఈ విధముగా నృత్యకళ గణికలు – రాజనర్తకీగణం – ద్వారా రాజదర్బారుల్లో ప్రవేశించి స్వామికి బదులు ప్రభువుల స్తోత్రపాఠములతో నిండి, ఆస్థానమండలి పండిత రసికజనరంజకమునకు వినియుక్తమయ్యే వినోద విద్యగా రూపొందినది. వెనుకటి అలవాటుల ప్రకారం రాజనర్తకీగణమైనా కొంతవరకు శాస్త్రమర్యాదలను పాటించినప్పటికీ తరువాత తరువాత ప్రభువుల అభిమతానుసారం నర్తించడం వారి ధర్మమైనది.

---

కళాఖండములుగా నేటికీ విరాజిల్లుతూ నృత్యకళను సరిదిద్దుకోవటానికి లక్ష్యములుగా ఉపకరిస్తున్నవి. అజంతా చిత్రలేఖనము రసాభినయమునకు, నాగార్జున శిల్పములు అపూర్వ సాత్త్విక భావ ప్రదర్శనమునకు – బౌద్ధయుగంనాటి నృత్య గ్రంథములు లేకపోయినప్పటికీ – అప్పటి కళౌన్నత్యమును స్పష్టపరచగలుగుతున్నవి.

అయితే, ఆలయాల్లో చెక్కబడిన నృత్య భంగిమలు రెండు విధములుగా ఉన్నవి. (1) స్థానములు (ప్రారంభ భంగిమలు), (2) కరణాంత్యవిన్యాసము (ఒక కరణముయొక్క ముగింపు భంగిమ), కాని మన ఆంధ్ర శిల్పులు మరొకమెట్టు పైకెక్కినారు. ఒక భంగిమము విన్యాసము చేసేప్పుడు ప్రదర్శించే వివిధ హస్తపాదగతులను కూడా వారు శిల్పములో ప్రదర్శించారు. ఇటువంటి శిల్పమొకటి పశ్చిమగోదావరీ మండల మండలి పాలకొల్లులోని క్షీరారామ (పంచారామములలో ఒకటి) ఆలయములో ఒక స్తంభము మీద చెక్కబడి ఉంది. అది లలిత కరణమునకు సంబంధించిన ఒక స్త్రీమూర్తి విగ్రహం, నాలుగుకాళ్ళు చెక్కబడి ఉండుట విచిత్రమనిపిస్తున్నది. కాని దీర్ఘముగా ఆలోచించితే అప్పటి శిల్పికి నృత్యకళపట్లగల ప్రవేశము, ప్రావీణ్యము తెలిసి ఆశ్చర్యం కలుగుతుంది. ఆ శిల్పములో లలితకరణములోని స్థానకము నుండి కరణాంత్యవిన్యాసములోని పాదగతిని చూపుటకే ముగింపు భంగిమకు మధ్యగా మరో రెండు పాదాలను శిల్పి రూపొందించినాడు. ఇటువంటి శిల్పము నాట్యకళారాధకులకు ఎంతగా ఉపకరిస్తుందో ప్రత్యేకించి వ్రాయనక్కరలేదు.

4. గ్రామమండలి దేవతామూర్తిని బ్రహ్మోత్సవ సమయములో ఊరేగింపుగా తీసుకొనిపోయే మార్గములు తిరువీధులు. ప్రత్యేకముగా నాలుగువీధుల అష్టదిశలందూ మంత్రపూతంగా దిగ్బంధనం చేస్తారు. ఈ నాలుగు వీధులలోనే స్వామి తిరు వెళ్ళుతారు. ఆ సమయంలో మరేదేవుని ఊరేగింపుగాని రారాదు. అందుకే, గ్రామంలోని వేర్వేరు దేవతామూర్తులకు వేర్వేరు ఋతువులందు ఉత్సవములు ఏర్పాటై ఉండవచ్చును. నవసంధినృత్యము ఈ సంప్రదాయమునకు జెందినట్టిదే.


## కురవంజి

పర్వ దినములందు దైవతారాధనకోసం వచ్చిన భక్తబృందము వినోదార్థము చెంచులు, కురవలు మున్నగువారు – ఆటవికులు – ప్రదర్శించే దేశి నాట్యరీతులను కురవంజి నాటకాలు, చెంచు నాటకాలు అంటారు.

కురవ + అంజి = కురవంజి. అంటే కురవల అడుగు లేక చిందు.

ఈ ఆటవికులు శ్రీశైల, పీఠికాపుర, దాక్షారామ, భీమారామములు, కోటప్పకొండలవంటి శైవక్షేత్రములలో శివపురాణగాథలు; సింహాచల, శ్రీకూర్మ, శ్రీకాకుళములు, తిరుపతి మున్నగు వైష్ణవ క్షేత్రములందు విష్ణుపురాణ గాథలను ఆడేవారు. 'గరుడాచల యక్షగానం' పేరుతో ఈనాటికీ ప్రదర్శిస్తున్న 'చెంచులక్ష్మి' నాటకం ఈ కోవకు చెందినదే. తంజావూరు బృహదీశ్వరాలయములో ఇప్పుడు కూడా కురవంజి నాటకము ప్రదర్శిస్తుంటారు.

ఐతే, ఈ కురవంజి – చెంచు – నాటకములు మొదట కల్పనాత్మకములైన పోకడలు లేకుండా ప్రకృతిమీద ఆధారపడి అభివృద్ధి చెందినవి. వీటిలో సాహిత్య భాగము వర్ణనలతో కూడి, ఒక కథలోని వివిధ ఘట్టములను సువ్యక్తపరచేదిగా ఉంటుంది. కాబట్టి, వీటిని 'గేయ నాటకములు' అనవచ్చును కూడా.



నటరాజ రామకృష్ణ


కురవంజి నాటకములు నృత్యప్రధానమైనవి. కాని నర్తకులొనర్చే నృత్యం పాటకు, కథాగత సన్నివేశమునకు సంబంధించిన హస్తవిన్యాసము కాదు; ప్రేక్షకులకు విసువు పుట్టకుండా మధ్యమధ్య ప్రదర్శించే లయప్రధానమైన నృత్తం మాత్రమే; తాళమునకు ద్వితీయ ప్రాధాన్యముంటుంది; లయ వివిధ గతులలో ప్రదర్శింపబడుతుంది.

ప్రప్రథమమున కురవంజి ప్రదర్శనము ఏక పాత్రాభినయముగా ఉండి, ఒకే నర్తకి కథను గానము చేస్తూ, అటనట నృత్తం ప్రదర్శిస్తు ఉండేది. సంస్కృత నాటకములందలి నటీసూత్రధారులను పోలినట్టి సింగి – సింగడను రెండు పాత్రలను తరువాత ప్రవేశపెట్టారు. వీరు ఆయా కథాఘట్టములను పాడుతూ నృత్యం చేసేవారు. మరికొంత కాలమునకు హాస్యరసపోషణోద్దేశంతో కోణంగి (చోడిగాడు) పాత్ర కూడా ప్రవేశపెట్టబడింది.

ఈ పాత్ర హాస్యధోరణిలో కథాఘట్టములను తోచినరీతిని వ్యాఖ్యానించుట పరిపాటి. ఈ సంప్రదాయమునను సరించే, తోలుబొమ్మలాట (తోలుబొమ్మల భాగవతము)లో జుట్టుపోలిగాడు, కేతిగాడు, బంగారక్క అను పాత్రలు నేటికీ సజీవంగా ఉన్నవి. ఈ విధంగా ఏకపాత్రాభినయ పద్ధతిని నడచిన కురవంజిలో బహుపాత్ర ప్రవేశానుకూల్యం ఏర్పడినప్పటికీ నాటకములందాయా పాత్రల పోషణఫక్కీ అమరలేదు. ఆంధ్ర ప్రాంతమున దాసరి భాగవతులు, తెలంగాణమున బహురూపులు ప్రదర్శించే గరుడాచల నాటకము ఈ కురవంజి సంప్రదాయమునకు చెందినదే.

మన శాస్త్రీయ సంప్రదాయములోని సంగీతరీతులు, తాళశబ్దకట్టులు ఎన్నో విధములుగా అనుదినము మారుతూ వస్తున్నవి. ఇందుకు సంగీత విద్వాంసుల నిరంతర కృషియే హేతువు. కాని ఈ కురవంజి నర్తకులు మాత్రం ప్రాచీనమైన అపురూప రాగములందే, ఈ నాటికీ అప్పటి బానీలోనే పాడుతున్నారు. లలిత సంగీతము. సరళ సంగీతముల మాధుర్య మాస్వాదించుటకు అలవాటుపడినవారికి ఈ పద్ధతి కొంత మొరటుగా తోచినప్పటికీ, ఈ అపూర్వ రాగముల ప్రాచీన స్వరూపములను తెలుసుకోగోరు కళావేత్తల పరిశోధనలకెంతో ఉపకరించగలదు. ఆహిరి, గుమ్మకాంభోజి, జాలికాంభోజి, హెజ్జెజి – ఇత్యాది ప్రాచీన రాగముల లక్షణములు ఎక్కడో గ్రంథములందు కనపడినప్పటికీ, వాడుకలో మాత్రము లేవు. వీటిని వినుటకు కురవంజినే దర్శించాలి.

కురవంజి నర్తకులాశ్రయించిన నృత్తరీతి పూర్తిగ దేశపద్ధతిలో అభివృద్ధికాంచినది. ఈ నర్తకులకు శాస్త్రపరిచయమంతగాలేదు. కాని శృంగార, వీర, బీభత్స, శోక, విరహ, వియోగాద్యవస్థల్లో హృదయ స్థితివల్ల శరీరాంగికముల చలన పరిణామములెట్లుండునో చక్కగా ప్రజలకర్థమయ్యే విధముగా వీరు నృత్తమును ప్రదర్శించగలరు. ఇది శాస్త్రీయమూ, అశాస్త్రీయమూ అని తర్కించి తేల్చుట కష్టము. కాని వారి నృత్తమునందు ఉద్దేశింపబడిన భావప్రకటనకు సరియైన రసస్పష్టి ప్రేక్షకుల హృదయములందు కలుగుటే ఇందలి విశిష్టత.



ఉషశ్రీ

# రేడియోలో రెండు దశాబ్దాలు

– ఉషశ్రీ

బానిసత్వం నుంచి దేశం విముక్తి పొంది స్వేచ్ఛాతరంగాలలో తేలియాడుతున్నరోజులు, కాకినాడ కాలేజీలో ఇంటర్మీడియట్ చదువుతుండగా.... మహాత్మాగాంధీని ఉన్మాది ఎవరో తుపాకీ గుళ్ళతో నేలకూల్చాడు.

ఆయన పాంచభౌతిక దేహాన్ని ఢిల్లీ వీధులలో ఊరేగిస్తూ లక్షలాది జనం కన్నీరు విడుస్తూ సాగుతుంటే, ఆ యాత్రను కళ్ళకు కట్టేటట్టు వినిపిస్తున్నాడు రేడియోలో డిమెల్లో.

ఆ శోకసాగర మధ్యంలో నిర్లిప్తంగా సాక్షీభూతుడుగా డిమెల్లో గంభీర గళంతో వ్యాఖ్యానిస్తుంటే......

'రేడియోలో ఉద్యోగం వస్తే ఇలా ప్రత్యక్ష వ్యాఖ్యానం చేయాలి' అనుకున్నాను.

✧ ✧ ✧

నాలుగు దశాబ్దాలనాటి మాట అది! అయితే ఆ తరువాయి రెండు దశాబ్దాలు పూర్తి కాకుండానే రేడియోలో చేరాను. చేరడానికి ముందు హైదరాబాద్‌లో నాలుగైదుచోట్ల ఉద్యోగం వెలిగించాను, ఆరునెలలకంటే ఎందులోనూ ఉండే 'ఘటం' కాదిది అనే కీర్తి సంపాదించాను.

రేడియోలో చేరుతున్నప్పుడు అందరితోపాటు నేనూ అదే అనుకున్నాను. కాని రెండు దశాబ్దాలు దాటించాను – మూడు ప్రమోషన్లతో – మరో రెండేళ్ళుండి ఇంకో ప్రమోషన్ కూడా అందుకోవలసినవాడినే కాని నాపాటి 'పదునైన నోరున్న'వాడిని భరించగల అధికారుల యుగం చెల్లిపోవడంవల్ల స్వేచ్ఛావిహంగంలా తిరిగే అవకాశం రెండేళ్ళ ముందే లభించినందుకు నాకు కలిగిన సంతోషంకంటే రేడియో అధికారుల చుట్టూ వినయ వినమిత మస్తకన్యస్తులై తిరిగేవారికి కలిగిన సంతోషాన్ని అక్షరాలు వ్యక్తం చేయలేవు.

✧ ✧ ✧

రేడియో ఉద్యోగంలో చేరింది 1965లో......

మొట్టమొదట రేడియోలో గొంతు వినిపించింది 1952లోనే. పొట్టచేతబట్టి హైదరాబాద్ చేరింది మొదలు నెలకో, రెండు నెలలకో నా ఇంటి అద్దెకు రేడియోవారే డబ్బులిచ్చేవారు, కథలో, కవిత్వమో, మరేదో వ్రాయించి పలికించి.

**వార్తలు చదివా :**

ప్రాంతీయ వార్తా విభాగంలో చక్కని కంఠం, స్పష్టమైన పలుకూ ఉన్న నళినీమోహన్ సెలవు పెడితే రోజువారీ కూలిమీద నన్ను పిలిచారు.

తడబాటు లేకుండా ఒత్తులూ, విసర్గలూ మింగకుండా పుంస్త్వం ఉన్న కంఠానికి రేడియోలో ప్రాధాన్యం ఉన్న రోజులవి.

నేను వార్తావిభాగానికి వెళ్ళిననాడే భారత ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ కన్నుమూశారు. హైదరాబాద్‌లో ఉన్న మంత్రుల శ్రద్ధాంజలి రికార్డు చేయించాలన్నారు – అంటే ఏ మంత్రి ఏ శబ్దం పలకగలరో అవన్నీ గ్రహించి మనమే వ్రాసి తీసికెళ్ళి నాలుగైదుసార్లు చదివించి సాధ్యమైనంత తక్కువ దోషాలతో రికార్డు చేసి ప్రసారం చేయాలి. అప్పుడు శ్రద్ధాంజలి పట్టినవారెవరూ ఈనాడు భూమిమీద లేరు. తెలుగు చదవడం

రానివారూ, ఇంగ్లీషు వ్రాయడం రానివారూ మంత్రులైన కాలం అది.

చిన్ననాడే మా అమ్మగారు నాకు సుమతీ శతకం, వేమన శతకం, భాగవతంలో కొన్ని పద్యాలు నేర్పించడంవల్లనూ–

హైస్కూలులో వెంపరాల సూర్యనారాయణ శాస్త్రిగారి దగ్గర బాలవ్యాకరణంతో నీతిచంద్రిక కంఠపాఠం చెయ్యడంవల్లనూ......

నాకు వ్యావహారికం అంటే చులకన భావం సుష్టుగా ఉండేది. అయితే ఈ శతాబ్దంలో మేరుగిరులవలె నిలిచిన విశ్వనాథ, శ్రీశ్రీ, వేదుల, రామిరెడ్డి అదిగాగల మంచి "పలుకున్న" వారి కవితల రుచి ఆ రోజుల్లోనే ఇంద్రగంటివారు చూపించడంవల్ల భాష మీద కొంత వ్యామోహం ఉండేది.

కాలేజీ వదిలేనాటికే గ్రాంథిక వాసన దూరం అయినా భాష మీద మోహం ఇప్పటికీ వదలలేదు అని తెలుసు.

నేను రాసిన వాక్యాలు చదవడం – అమాత్యవర్యులకు .... నోట్లో పచ్చి వెలక్కాయ పడ్డంత బాధ కలిగించింది, అది వేరే కథ.

✧ ✧ ✧

అలా రెండు వారాలు – ప్రాంతీయ వార్తలు, చదువుతున్నది – పురాణపండ సూర్యప్రకాశదీక్షితులు – అంటూ యావదాంధ్రానికీ నా గొంతు అందించాను.

ఆ పదిహేను రోజులలో నా పనితనం చూసిన అప్పటి స్టేషన్ డైరెక్టరు కృష్ణమూర్తిగారు సూచించగా, రజని గారు నాచేత ఉద్యోగానికి దరఖాస్తు చేయించారు. ఆ సమయంలో పుల్లెల వెంకటేశ్వర్లుగారు తెర వెనక ఉండి కథ నడిపించకపోతే నేను రేడియోకి దూరంగా ఏ "ఆంధ్రభూమి"లో అనువాద సమ్రాట్‌గా అణగారేవాడిని, అది మరో కథ.

✧ ✧ ✧

రేడియో ఉద్యోగంలో చేరిన పదినెలలు దాటకుండానే పాకిస్తాన్ దురాక్రమణ జరపడం, దేశం అంతా యథాశక్తి ఎవరికి తోచింది వారు విరాళంగా అందివ్వడం.

ఆ సందర్భంగా లాల్ బహదూర్‌శాస్త్రి మన ప్రధాని – యుద్ధ నిధి కోసం హైదరాబాద్ వచ్చారు.

లాల్ బహదూర్ స్టేడియం నుంచి ప్రత్యక్ష వ్యాఖ్యానం నడిపించడానికి ఎవరున్నారు? అని డాక్టర్ అయ్యగారి వీరభద్రరావుగారు అడిగితే 'రజని' పుల్లెల వెంకటేశ్వర్లుగారూ నా పేరు సూచించారు. రేడియో ఉద్యోగంలో చేరి పది పదకొండు నెలలే అయినా అప్పటికే రేడియోలో ముప్పాతిక ముప్వీసం నామీద అవిశ్వాస తీర్మానం నెగ్గించ గలిగినంతమంది అహితులను తయారు చేసుకున్నాను. అదంతా నా 'నోరు' చేసుకున్న పుణ్యఫలం!

అంచేత అందరూ విముఖత చూపగా, అయ్యగారి వీరభద్రరావుగారు ఆలోచించి–

'చూద్దాం, ఏం చేస్తాడో కుర్రవాడు' అని సంతోషంతో ఆ ప్రత్యక్ష వ్యాఖ్యానం నాకు అప్పగించారు. నాకు పి.ఎస్.ఆర్. ఆంజనేయశాస్త్రి సహకార గానం!

"చేతిలో కాగితం లేకుండా నోటికొచ్చినట్లు మాట్లాడగల శక్తి ఉన్నవాడే రేడియోలో రాణిస్తాడు. కాగితం ఎదురుగా ఉన్నా చదువుతున్న అనుమానం రాకుండా చెప్పగలవాడు రేడియోకి కావాలి" అన్నారు డాక్టర్ రావు, అలా మొదటిసారి నా కోరిక ఫతేమైదాన్ స్టేడియంలో తీరింది.

✧ ✧ ✧

అలా స్క్రిప్ట్ రైటర్‌గా ప్రవేశించి దశాబ్దం పాటు కాగితం మీద కలం పెట్టకుండా రూపకాలు కూడా నడిపించాను. అటువంటి రూపకాలలో నాకు తగిన ధోరణిలో గొల్లపూడి మారుతీరావు, వి. సత్యనారాయణ, శ్రీమతి రతన్ ప్రసాద్ ఉండేవారు.

1969లో విజయవాడ వ్యసాయ ప్రసార శాఖలో పనిచేసే జలసూత్రం కన్నుమూసిన కారణంగా ఏర్పడిన ఖాళీకి నాచేత దరఖాస్తు చేయించారు.

హైదరాబాద్ వదలడం నాకిష్టం లేదు. కాని పెద్దలంతా నా అభివృద్ధిని కోరి నన్ను ఇంటర్వ్యూకి పంపారు. వ్యవసాయ శాఖాధికారులు నామీద ప్రశ్నల వర్షం కురిపిస్తుంటే–

"అయ్యా, ఎందుకీ శ్రమ, నాకు వ్యవసాయ జ్ఞానం శూన్యం అయినా రేడియోలో పనిచేసేవాడికి ఆ విషయం తెలియనవసరం లేదు, ఎందుకంటే మేము ప్రజలకు ఏం చెప్పాలీ అనేది తమవంటి శాస్త్రవేత్తలు ఇంగ్లీషులో మాకు పంపుతారు.

ఎలా చెపితే సామాన్యుడికి అందుతుందో మాకు తెలుసు. తెలుసు కనకనే వైద్యశాస్త్రంలో ఓనమాలు రాకపోయినా కుటుంబ నియంత్రణ కార్యక్రమాలలో నన్ను మించినవాడు తెలుగు రేడియోలో లేడు" అన్నాను.

అప్పుడు విజయవాడ డైరెక్టర్ సుఖంగా నవ్వి, "తెలిసిందా సార్, అదీ మా ఉద్యోగి బృందం శక్తి" అని ఆ

ఉద్యోగం నాకు ఖరారు చేశారు. అప్పట్లో గుమ్మలూరి సత్యనారాయణగారు వ్యవసాయ విభాగం చూసేవారు, ఆయన నా సంగతి తెలిసినవాడు కనుక అప్పటికప్పుడు చెప్పవలసిన అంశాలుంటే నన్నే స్టూడియోకి తోలేవాడు.

✧ ✧ ✧

**భద్రాచల రాముడు :**

రేడియో ఉద్యోగంలో సగర్వంగా చెప్పుకోగలిగినదీ, చెప్పవలసినదీ ఏదైనా ఉంటే ప్రత్యక్ష వ్యాఖ్యానం మాత్రమే. ఆ విద్య తెలిసినవాడు కనుకనే పదవీ విరమణ చేసి పదేళ్ళు దాటినా నేటికీ డిమెల్లోని పిలవక తప్పడంలేదు, ఢిల్లీ రేడియోకి.

విజయవాడకు చేరిన కొన్ని నెలలకు భద్రాచలం సీతారామకళ్యాణం ప్రత్యక్ష వ్యాఖ్యానానికి జమ్ములమడక మాధవరామ శర్మ గారితో నన్ను పంపడానికి శ్రీనివాసన్‌గారు సూచించారు.

అంతకు ముందు ఏడాదికొకరు చొప్పున ఎవరెవరో వెళ్ళారు, మళ్ళీ వెళ్ళే ధైర్యం వారికే లేకుండా పోయింది.

ఉత్తుంగ శృంగాల నుండి తరంగాలతో ప్రవహించే గంగానదీ సదృశ వేగ గంభీర గళంతో సీతారాముల కల్యాణాన్ని కనులకు కట్టించే శర్మగారి శంఖధ్వానం ముందు మరే కంఠమూ నిలబడదని అప్పటికే నాకు తెలుసు – అందుకోసమే పుట్టినవాడాయన. అప్పటికి సుమారుగా దశాబ్దికాలం ఆ వ్యాఖ్యానాన్ని వింటూ తలవంచుకున్న నాకు ఆయన సరసనన వెళ్ళాలనేసరికి కొంచెం జంకు పుట్టకపోలేదు.

ప్రత్యక్ష వ్యాఖ్యానానికి నేను భయపడలేదు, అంత పాండిత్యం, అనుభవం ఉన్న మహనీయుని సరసన నిలబడడమా!

చూద్దాం, దిగకుండానే లోతులకు భయపడితే ఈత నేర్చుకోలేంగదా, అని నిర్భయంగానే భద్రచాలంలో దిగాను.

సాయంకాలం కూర్చుని లోకాభిరామాయణం సాగిస్తూ.

"శర్మగారూ, రేపు నేనేం చేయాలి" అన్నాను.

"అదేమిటి, రేడియో అధికారులు మీరు చెప్పాలి" అని శర్మగారు అనగానే ఉలిక్కిపడి, తమాయించుకుని :

"తెలుగునాట ఈ విద్యకు మీరు ఆద్యులు, మీ సన్నిధిని శిష్యుడుగా వచ్చాను'' అన్నాను. "మీరెరగనిది కాదిది. ఇదివరలో వచ్చిన రేడియో ఉద్యోగులకు దాశరథీ శతకం అప్పగించడమే వచ్చు, మీకు ప్రత్యక్ష వ్యాఖ్యానం వచ్చు, ఇక ముందు నా అవసరం ఉండదు."

"శర్మగారూ, ఇప్పుడు చెపుతున్నాను, నేను రేడియోలో ఉన్నంతకాలం, నా మాట వినే వివేకం కల అధికారులు బ్రతికినంత కాలం రాముడి పెళ్ళి మీ నోటితోనే జరుగుతుంది, ఇప్పుడు చెప్పండి, నేనేం చేయాలో?"

''ప్రతిభావంతులు, రేపక్కడ కూర్చున్నాక మీకే తెలుస్తుంది" అన్నారు.

మౌనంగా సీతారాములకు నమస్కరించాను.

ఇంతలో అక్కడకు కళ్యాణమండపం కమనీయంగా నిర్మించిన గణపతి స్థపతి వచ్చి శర్మగారికి నమస్కరించగా, ఆయన నన్ను చూపించారు.

"స్థపతిగారూ, మీ శిల్పశక్తిని గురించి విన్నాను కాని చూసే అవకాశం కలుగలేదు" అనగానే నన్ను వెంటబెట్టుకొని కళ్యాణ మండపం దగ్గరకు తీసుకువెళ్ళి, అక్కడ తాను చిత్రించిన విజయనగర, కాకతీయ, చాళుక్య ఆదిశిల్ప విశేషాలతో, ఆ పీఠం చుట్టూ చేసిన విగ్రహ శిల్పాలను విశదం చేశారు.

హాయిగా గాలి పీల్చి గుండెమీద చెయ్యి వేసుకు నిద్రపోయాను. మరునాడు కళ్యాణమండప శిల్పాన్నీ స్వామివారి ఊరేగింపునూ, జనసందోహాన్ని..... ఇలా పైపై తంతు అంతా నా వంతుగా నడిపా.

అలా మూడు సంవత్సరాలు ఆయనను పరిశీలిస్తూ వచ్చా. అప్పటికి నాకు ఆయన ప్రక్కన నిలబడగలననే ధీమా వచ్చింది. దశాబ్దం పాటు అలా భద్రాద్రి రాముడి పెళ్ళి మీ అందరి రేడియోలలోనూ కళ్ళకు కట్టేటట్లు చెవులలో పోశా!

శర్మగారు ప్రయాణం చేయలేని దశకు చేరేవరకూ ఆయనను పిలుస్తూనే ఉంది రేడియో.

ఇంతలో రజనీకాంతరావు గారు డైరెక్టర్‌గా వచ్చారు. రేడియోకి మాత్రమే సాధ్యమైన ఈ ప్రత్యక్ష వ్యాఖ్యానం మరికొందరికి కూడా శర్మగారి దగ్గరే దగ్గరే శిక్షణ ఇవ్వాలి, అన్నారు. అప్పుడు ఏలూరిపాటి అనంత రామయ్య జంధ్యాల మహతీశంకర్ గారలను అందుకు పిలిపించాం.

ఆ తరువాయి అధికారుల దృష్టి మారి పురాణం చెప్పుకొనేవారినీ, నాటక పద్యాలు రాగాలతో పాడేవారినీ పంపి, సీతాకళ్యాణం జరుగుతుంటే ఉత్తర రామచరిత్ర, శూర్పణక వర్ణన చేయించడం, ఆరంభించారు. దానితో నేను

భద్రాచలానికో నమస్కారం పెట్టి నగరాలలోని ఆలయాలలో రామాయణ ప్రవచనం ఆరంభించాను.

రజనీకాంతరావు గారి హాయంలోనే రాజమహేంద్రవరం రోడ్డు – రైలు వంతెన ప్రారంభోత్సవానికి సత్యం శంకర మంచినీ, నన్నూ పంపారు.

శంకరమంచి రాజమండ్రీవైపున ఆగి, నన్ను కొవ్వూరు పొమ్మన్నాడు. అయితే రాజమండ్రిలో వీరేశలింగం శిలావిగ్రహం దగ్గర నిలబడిన వ్యాఖ్యాతకు కావలసినంత విషయం దొరుకుతుంది కాని, భారత రాష్ట్రపతి గారు రిబ్బన్ కత్తిరించి వంతెన ఎక్కగానే, నిశ్చింతగా :


'అదిగో కొవ్వూరు ఒడ్డున మా ప్రతినిధి ఉషశ్రీ' అని తప్పుకున్నాడు సత్యం.

ఆ శబ్దం వినిపించింది కాని, రాష్ట్రపతి ఏ కారులో బయలుదేరారు, ఎవరెవరున్నారు? ఇవేమీ లేవు.

లేకపోతేనేం –

రాష్ట్రపతి కారు కొవ్వూరు చేరి, రైలు వంతెనమీదికి చేరే వరకూ ఇలా పాపికొండల నుంచి, ఏటివార బంతి మొక్కల మధ్య పల్లెపడుచుల వరకూ నా ప్రత్యక్ష వ్యాఖ్యానానికి విషయమే అయింది.

వ్యాఖ్యానం ముగించగానే విజయవాడ నుంచి టెలిఫోన్‌లోనే నన్ను అభినందించి, ఆశీర్వదించి, రజనిగారు శబ్దంతోనే ఆలింగనం చేసుకున్నారు. అదీ 'అధికారి' లక్షణం!



బాలాంత్రపు రజనీకాంతరావు

**గదిలో కూర్చుని :**

జై ఆంధ్రా! ఉద్యమ సమయంలో గుండె ఆగి దేహయాత్ర చాలించిన 'ఉక్కు కాకాని' అంతిమయాత్ర ప్రత్యక్ష వ్యాఖ్యానం కావాలన్నారు 'రజని'. రేడియో కారు కనిపిస్తే తగలపెట్టే వేడిలో ఉన్నారు ఉద్యమకారులు.

ఎలా చేస్తావో ఆలోచించు, అన్నారు. సాధారణంగా విజయవాడలో అంతిమ యాత్రలు ఏ దారిని సాగుతాయో ఎరిగిన విషయమే. ఇక శవం ఎంతకు లేచిందో తెలుసుకున్నాను. స్టూడియో గదిలో కూర్చుని రికార్డింగు మొదలెట్టాను. అడుగడుగునా కారు ఆగుతుంది, కన్నీటితో ప్రజలు, పూలమాలలు....... పది నిమిషాలు కళ్ళు మూసుకుని ప్రత్యక్ష వ్యాఖ్యానం చేసి, ఈవలకు వచ్చేసరికి, బీసెంటురోడ్డు నుండి మా ఉద్యోగి ఒకడు వచ్చాడు.

ఏమిటి విశేషం అన్నాను.

మోడరన్ కేఫ్ దగ్గరకు వచ్చేసరికి తెన్నేటి విశ్వనాథం గారు అప్పుడే వచ్చి ఆ వాహనం ఎక్కారు అన్నాడు.

ఇంతకంటే సమాచారం ఏం కావాలి, అనుకుంటూ స్టూడియోలో అడుగుపెట్టి.

'అదిగో కురువృద్ధ తెన్నేటి విశ్వనాథంగారు. కన్నీరు కనిపించకుండా నిర్భరంగా అందరినీ వెన్ను తడుతూ అంతిమ యాత్ర సాగించే వాహనం అధిరోహించారు, తన సహచరుని భౌతిక కాయానికి అశ్రుతర్పణం అందించి, పూలమాల వేశారు, కారు సాగుతోంది, జన సముద్రం ఆ సాగరంలో తాబేలులా నడుస్తోంది శకటం......' ఈ ధోరణిలో సాగించి ఒక్క నిమిషం మిగిల్చాను.

సరిగ్గా కృష్ణానది ఇసుక తిన్నెల మీద ఆ స్వాతంత్ర్య యోధుని దేహానికి నిప్పు పెట్టిన క్షణంలో ఆ వార్త అందుకుని....

''అదిగో ఉక్కు కాకాని దేహం పంచభూతాలలో లీనమవుతున్నది. అందరూ విషాదవదనులై తలలు వంచి నిలబడ్డారు, మనం కూడా మౌనంగా ఉందాం'' అని ముగించాను.

శ్రోతలకే కాదు, రేడియోలో పని చేసేవారికి కూడా ఇది ఆశ్చర్యం కలిగించింది, రేడియో మనిషి కనిపిస్తే కీళ్ళు విరిచే సమయంలో జనంలోకి నేనెలా వెళ్ళగలిగాననే సందేహం ఈ నాటికీ తీరలేదు. ఇదీ అసలు రహస్యం.

ఇటువంటి ఇంద్రజాలాలు చేయవచ్చు రేడియోలో ఉంటే – అవి ఈ తరం వారికి చెప్పడానికే ఈ ప్రస్తావన. అంతే కాని ఇదేదో నా కిరీటం మీద తురాయి అని కాదు, వాస్తవానికిది ఘనకార్యమూ కాదు.

స్టూడియో గదిలోంచి చేసిన ప్రత్యక్ష వ్యాఖ్యానం విన్నవారిలో కొందరు 'రజని' గారికి అభినందనలందించారు. టెలిఫోన్‌లో ఆయన స్టూడియోలోకి వచ్చి గాఢాలింగనం చేసుకుని ఆనంద భాష్పాలు తుడుచుకున్నారు. అంత సుకుమార హృదయుడాయన కనక ఆయన హయాంలో విజయవాడ రేడియో కీర్తిపతాకం ఢిల్లీ దాకా ఎగిరింది.

ఇప్పటికీ ఆ తరం యువకులు ఢిల్లీ బహుమానాలందుకుంటూ ఉన్నారు, అప్పుడాయన ఇచ్చిన ప్రోత్సాహం అంతటిది.

**తల వంచాను :**

ఈనాడు తెలుగునాట అనేకులకు తెలుసు
నేను అహంకారిననీ, ఎవరికీ తలవంచననీ

ఈ పొగరుమోతు లక్షణం నాకు ప్రత్యక్షంగా అక్షర దీక్షనిచ్చిన వెంపరాల సూర్యనారాయణ శాస్త్రి గారికి, నండూరి రామకృష్ణమాచార్య దిగుమర్తి సీతారామస్వామి, దరాసర్వేశ్వర శాస్త్రి గారలెవరి దగ్గరా లేదు, వీరంతా సౌమ్యస్వభావులే!

ఈ శతాబ్దపు సాహిత్య ద్రోణులు విశ్వనాథవారి నుంచి సంక్రమించిన సుగుణం ఇది. ఆయన దగ్గర ఏనాడూ నేను పాఠం చదవలేదు కానీ కాలేజీలో చేరిన క్రొత్తలో ఆయన ఉపన్యాసాలు వినడం, వినిపించడం చేశాను, ఆ క్షణాలలో ఆవహించింది.

అయితే విద్వాంసులూ, ప్రతిభా సంపన్నులూ ఎదుటబడితే వినయంతో చేతులు జోడించాను, జోడిస్తున్నాను నాడు నేడు.

రేడియోలో నేను తలవంచి – కాదు – సాష్టాంగపడింది ఒకే ఒక్కరికి. హైదరాబాద్ నుంచి బెజవాడ చేరిన నాలుగు ఏళ్ళ నాటి మాట, రికార్డింగు రూములో ఉన్నాను, ఏదో పనిమీద. ప్రక్కనున్న రికార్డరు నుంచి వస్తున్న మాటలు వింటూ నాలుగు నిమిషాలు నిలబడిపోయి–

'ఈ ముసిలాడెవడో ఉషశ్రీ కంటే రేడియోని బాగా వాడుకుంటున్నాడే' అన్నాను.

రికార్డు చేస్తున్న శ్రీనివాసన్ గారు నవ్వుతూ నా భుజం తట్టి – 'మీరే ఎరగరా, అది దువ్వూరి వెంకటరమణ శాస్త్రి గారి గొంతు' అనగానే రెండు చేతులూ జోడించి మనసా అక్కడే నమస్కరించా.

రికార్డింగు పూర్తి కాగానే స్టూడియోలోకి వెళ్ళి "ఆంగీరస బార్హస్పత్య భారద్వాజ'' అంటూ ప్రవర చెప్పుకుని సాష్టాంగపడ్డాను, నా వెనకాలే వెచ్చిన శ్రీనివాసన్‌గారు–

'శాస్త్రిగారూ, ఈయనే ఉషశ్రీ' అన్నారు. ఆ క్షణంలో ఆయన నన్ను దగ్గరగా తీసుకుని వెన్ను దువ్వుతూ.

'దీర్ఘాయుష్మాన్ భవ! చిరంజీవీ, నువ్వేకాదూ మాధవరాముడితో భద్రాచలంలో జానకమ్మ పెళ్ళి కనులారా చూసి మాకందరికి చెవులతో చూపిస్తున్నావు, చాలా సంతోషం ఇంతకూ ఎవరి తాలూకు మనం?' అని ముసిముసి నవ్వులు నవ్వారు. 'గోదావరికి ఆవల కాకరపర్రు అగ్రహారంలో పురాణపండ వారి కుర్రవాడ్ని వెంపరాలవారి శిష్య వంశం' అన్నాను. 'అలా చెప్పు అంత పునాది ఉంది కనుకనే ఆ ధీమా' అన్నారు. డెబ్భయ్యోపడి దగ్గరవుతూన్న వయస్సు, నాలుగు దశాబ్దాలు బాలవ్యాకరణం పాఠం చెప్పిన వ్యక్తి అంత అలవోకగా, ఎదురుగా కూర్చుని మాట్లాడుతున్నట్లు రేడియో ప్రసంగం చెయ్యగల వ్యక్తిని అంతకు ముందు చూడలేదు, ఈనాడు ఆ అవకాశం లేదు.

ఆ తరువాయి శ్రీనివాసన్ గారన్నారు.

"నేను అరవదేశం నుంచి వచ్చానని మీ వాళ్ళకి నా మీద కోపం కాని ఇందరు తెలుగువాళ్ళు ఉండి ఇటువంటి వక్తను రేడియోకి రప్పించలేకపోయారు. నా జీవితంలో ఇటువంటివారిని పట్టుకురావడం ఎంత తృప్తినిచ్చిందో......." అని ఆనంద భాష్పాలు విడిచారాయన.

'మన చుట్టూ ప్రదక్షిణాలు చేస్తూ, చేతులు నలుపుతూ తిరిగేవారు కాదు రేడియోకి కావలసింది. మనం తిరగాలి, తిరిగి పట్టుకుని తీసుకురావాలి దువ్వూరి వారి వంటి చక్కని ప్రసంగాలివ్వగలవారిని.

"ఎవడో రాసిపెడతాడు అది పూర్తిగా చదవటం రానివారు చాలామంది మన ద్వారా రేడియో పరువు తీస్తున్నారు రేపు టీవి వస్తే వీరి మాటలతో ముఖాలు కూడా హింసిస్తాయి ప్రజలను, అప్పటికి మనం బైటపడతాం'' అన్నారు అంతే జరిగింది.

నేను చేసిందీ అదే–

నా చుట్టూ తిరిగే వారికికాక నేను చుట్టూ తిరగవలసినవారినే ప్రసంగాలకు పిలిచాను, పిలవనిచ్చారు రజని, శ్రీనివాసన్ వంటి డైరెక్టర్లు.

భజనపరులకు అలవాటుపడిన అధికారుల ప్రవాహం ఆరంభమైంది. నన్ను రేడియో నించి విశ్రాంతి తీసుకోమన్నారు.

ఉద్యోగం చేసినన్నాళ్ళూ ఎంత తృప్తిగా చేశానో ఇంటికి పొమ్మన్నాక అంతకంటే తృప్తిగా ఉన్నాను.

అదీ పరాత్పరుడు నాయందు చూపిన అనుగ్రహం అందుకాశక్తికి వందనం.

గాయత్రీదేవి
(ఉషశ్రీ గారి పెద్దమ్మాయి)
ఫోన్ : 800 859 9901.

# 'రజనీ'గంధం

– ఎమ్మెస్ సూర్యనారాయణ

మధ్యాహ్నం పన్నెండు గంటల సమయం......
బెజవాడ, సీతారామపురం, వారణాసివారి వీధిలోకి ప్రవేశించిన తొమ్మిదిమంది జీవితాల్లోకి హఠాత్తుగా ఒకానొక పురాతన సంకీర్తన *రజని గంధమై*......
'శతపత్ర సుందర' దరహాసమై పూసింది!
పట్టపగలే కురిసిన వెన్నెల్లో....
'పసిడి మెరుగుల తళతళలు' తెలుగుతల్లి తొలిగీతంలా లిల్లీపూల పరిమళ ప్రవాహ గానమై ముంచెత్తినప్పుడు నాతోపాటు కె. శ్రీనివాస్ తన సతి సుధ, కె. శివారెడ్డి ఇంకా..... ఖాదర్ మొహిద్దీన్, బండ్ల మాధవరావు, అనిల్ అట్లూరి, బి.వి.వి. ప్రసాదు, సీతారాం... అనే తొమ్మండుగురం మా అస్థిత్వాలని అసంకల్పిత ప్రతీకార చర్యల్లా రద్దుచేసుకున్న వైనం.... స్పృహ తెలియనేలేదు!

ఆ అపరాహ్నం అదాటుగా రజనీగంధ గాంధర్వమై.... ఆ ఉధృతిలో కొట్టుకొని పోతూ.... మెల్లగా కళ్ళు నులుముకుని చూస్తే – ఆ విశాలమైన 'హాలు'ని.... గంధర్వ గాన 'గాథా'శృతిగా గుర్తించేందుకు కొంత సమయం పట్టింది.
"చల్లగాలిలో.... యమునా తటిపై.....
శ్యామసుందరుని మురళీ!" అంటూ రజనీ కంఠం మెలమెల్లగా 'పురి'విప్పారుతూ.... 'రసవాహిని సృష్టిస్తుంటే 'బాల'గాంధర్వం మహత్వపూర్ణానందంగా... శతమానం భవతిగా తొణికిసలాడి.... కళ్ళు తిరిగి మత్తు కమ్మి మూర్ఛిల్లాం!

ఎక్కడ చిత్తూరి నాగయ్య.... కృష్ణశాస్త్రి.... సాలూరి.... ఘంటసాల.... భానుమతి.... టంగుటూరి సూర్యకుమారి తన్మయంలో పడ్డారో!

ఏ కంఠసీమ నుంచి జాల్వారిన అనేక రాగస్వరూపాలు అన్నమయ్య సాక్షిగా ఉరికి, వడివడిగా లలిత సంగీతామృత మహాప్రవాహాలయ్యాయో!...

ఏ వాన చినుకులు సంగీత సాహిత్యాల సమలంకృతులై 'చినుకు కన్నియల పరికిణీ చెంగున' ఛెంగుఛెంగున దుమికాయో!

ఎవరివల్ల ఏ యక్షగాన మాధుర్య స్ఫూర్తులు తెలుగునాట విలసిల్లాయో!

ఏ ఆగస్టుమాసపు అర్థరాత్రి స్వతంత్రంగా 'మాదీ స్వతంత్ర దేశం' అంటూ టంగుటూరి కంఠం ఏ గీతాన్ని ఖంగుమని మారుమోగించిందో! ఏ కర్ణాటక, హిందూస్తానీ, రవీంద్ర, అరబిక్, వెస్టర్న్ సంగీత శుద్ధోదక, స్నానమాచరించిన లలిత సంగీతపు సుగంధ సుస్వర 'ప్రసార ప్రస్థానం'తో తెలుగుజాతి పునీతమయ్యిందో!

ఏ అన్నమయ్య, త్యాగయ్య, క్షేత్రయ్యల వాగ్గేయ గాత్ర ధర్మాత్మ సుగుణ సంపదలతో, రజనీరవమై జాతి సుసంపన్నమయ్యిందో! ఏ 'నాదసుధార్ణవ' 'నవీన వాగ్గేయకార' 'పుంభావ సరస్వతీ'మయమైన బిరుదాంకితాలతో లలిత కళాప్రపూర్ణమో! ఏ రవీంద్ర భావస్ఫోరక బెంగాలీ సూక్తి సుధామృత గేయధారలు సోదాహరణ ప్రసంగ పాఠాలు చెప్పాయో!

ఏ 'శృతపత్ర సుందరి' 'విశ్వవీణ'గా చండీదాస, మేఘసందేశ, క్షీరసాగరమయమై.... 'కొండ నుంచి కడలి'దాకా విశాలాంధ్ర నుంచి టోక్యోదాకా ప్రతిధ్వనించాయో!

ఆ పద సన్నిధిలో మూర్ఛిల్లాం!
మా ముందు.... ఆ మిట్టమధ్యాహ్నం..... సోఫాలో....
రెండు మెత్తటి దిండ్ల మీదుగా చేరగిలపడిన
ఒక మహాగాన శతాబ్ది గళన్మంగళ కోలాహలంలో 'ఒహోవిభావరీ!' అంటూ ఒకానొక భావప్రసార సారంలో

పడి కొట్టుకెళ్ళిన రసలోకాలు.... ఎవరివి వారివే! దిగింతర్వాత..... ఎక్కిన దాని గురించి మాట్లాడుకున్నా గ'మ్మత్తు'గానే ఉంటుంది! అదాటుగా ఆ ఆదివారపు మధ్యాహ్నం..... బాలాంత్రపు రజనీకాంతరావనే తొంభైఐదేళ్ళ గాన శతాబ్దపు ద్వారాలు తాకినప్పుడు... ఎక్కిన రసోన్మాదం..... అది ఒక ప్రాచీన గాన రసాయన చర్య!

ఒకానొక జ్ఞాపకపు ఛాయామాత్రపు
అలవరసల రేడియో తరంగాల
ధార్మిక శక్తిని తట్టుకుని నిలబడే ప్రయత్నంలో
అస్థిత్వం తూలి పడక తప్పదు!
రెండోసారి మొదలైన వేసవి గాడ్పులో
హఠాత్తుగానే ఒక లలిత సంగీత రస విభావరి
ప్రత్యక్షమైనప్పటి స్థితి... పలవరింత కాక తప్పదు!
ఈ 'స్థితి' నుంచి 'మెలకువ'గా చెప్పాలంటే–

రెండువేలపద్నాలుగు ఆగస్టు మూడాదివారపు మధ్యాహ్నం......

మమ్మల్ని... సాదరంగా ఆహ్వానించారు రజనీ పెద్దబ్బాయి హేమచంద్ర ఆయన సతి ప్రసూన. శ్రీమతి ప్రసూన...... ఆ మధ్యాహ్నపు 'ఛాయ'ని కాచి వడబోసి కప్పులు కప్పులుగా మాకూ, ఒకనాటి పాటల పల్లవులనీ, చరణాలనీ గుత్తులు గుత్తులుగా మామగారికీ అందిస్తూ వచ్చారు ఆసాంతం! తొంభైఐదు వసంతాల రజనీ చెవులకి అర్థమయ్యే సౌంజ్ఞలతో

"మామగారూ! బదిలీ.... బదిలీ పాట పాడి వినిపిస్తారా?
జ్ఞాపకముందా పల్లవి? అదే......
ఊరు వెనుక ఊరూ
గడచిన కాలపు తీరూ!"
అంటూ ఆమె గుర్తు చేయడమే తరువాయి–
రజనీ పెదాలు విచ్చుకునేవి!
ఎప్పటివో! దశాబ్దాల బావుల్లోంచి.... భావుకతలోంచి.....
ప్రాణశక్తినంతా ధారపోసి.....
గాన శక్తినంతా చేది, పోసి!
కొంచెం అలసటతో ఆయన మౌనంలోకి జారగానే.....
"ఇదిగో.... వేడి చాయ్!
ఇది పడితే మీకింకా జోష్ పెరుగుతుంది!"

అంటూ గోర్వెచ్చని ఉత్సాహాన్ని రజనీ గొంతులోకి ఆమె ఒంపుతుంటే.... తేరుకుని... తేయాకు తెరలమీదుగా మళ్ళీ ఈసారి హఠాత్‌గా... సైగల్ పాటతోడి! అలా అంతా 'రజనీ' కను'సైగల్'లో ఉండగానే టాగోర్‌ని బెంగాలీ బెంగతో.....

'ఏక్‌లోచలో..... ఏక్‌లోచలో!' అంటూ తోడిపోయడం!
ఇంతలో ఎవరో కోరిన మీదట
"ఓహో! పావురమా!
ఓహోహో పావురమా! పావురమా! పావురమా" అంటూ భానుమతీ సమేతంగా 'స్వర్గసీమ' నుంచీ ఆ పావురాన్ని లోపల్నుంచి ఎగరేయడం!

ఈ తోడిరాగాలిలా రజనీ తోడిపోస్తుండగానే ఉన్నట్టుండి శివారెడ్డి ఎంకి పాట అందుకోవడం! నేనేం తక్కువా అన్నట్టు ఖాదర్ భాయ్ హిందీ గజలందుకోవడం!

ఖయ్యాం రుబాయీ ఆలపించడం!
ఈ చారిత్రక సన్నివేశాలన్నింటికీ.....
ఎవరి డిజిటల్ హక్కులతో వాళ్ళు
ఛాయాచిత్రాలుగా బంధించడం!
మధ్యాహ్నం రెండుగంటలయ్యింది.
రజనీ గంధం.... అలసిపోయింది....

'అయ్యగారు.... భోజనం చేసి విశ్రాంతి తీసుకోవాలి' అంటూ ప్రత్యక్షమయ్యిందొక సహాయకురాలు!

రజనీని మేమంతా మత్తులో...... విస్తుపోయి చూస్తుండగానే.... ఆజానుబాహువును పసిపిల్లవాడిలా నడిపించుకుంటూ....... విశ్రాంత మందిరంలోకి తోడ్కొని వెళ్ళింది. మేమంతా సెలవు తీసుకొని..... తడబడుతూ.... బయటికి నడిచాం.....

అవును.......
ఇంతకీ ఆ సహాయకురాలికి తెలుసా?
అసలామెకు తెలిసుంటుందా?
ఒక గాన శతాబ్దిని తను నడిపిస్తోందని!
ఒకవేళ..... 'శతపత్ర సుందరి' ఆత్మ ఆమేనా?!

ఎమ్మెస్ సూర్యనారాయణ
ఫోన్ : 929 895 0941



# వసివాడని తృణకంకణం

– *దిలావర్*

ప్రబంధ సంప్రదాయాలు మూసగా వెల్లువెత్తుతున్న రోజులవి. 'మంగళాదీని, మంగళమధ్యాని మంగళకాంతానిచ కావ్యానిప్రథయంతే' అని ఒక కావ్య లక్షణం ఘోషిస్తున్నది. అష్టాదశ వర్ణనలుండాలని ఇంకో నిర్బంధం. కావ్యం 'శ్రీ'తో ప్రారంభం కావాలి. ఇది ప్రాచీన తెలుగు కవులందరూ పాటించిన మరో నియతి. దేవతా స్తుతి మామూలే. ప్రాచీన కావ్యాలలో సాధారణంగా శృంగార రసంలో తలమున్కలైనవారే. కావ్యాలు వస్తుప్రధానంగాక వర్ణన ప్రధానాలై ఉండాలి. ఎక్కడన్నా క్వాచిత్కంగా కథావస్తువు ఉన్నా అది తప్పనిసరిగా రాజుల రాణుల, దేవతలకు సంబంధించింది ఉండాలి. భాష గ్రాంథికమై ఉండాలన్న విషయం వేరుగా చెప్పవలసిన పనిలేదు.

కందుకూరి వారు సామాజిక సంస్కరణల కోసం అహర్నిశలు పాటుపడ్డా కవిత్వ సంస్కరణల్ని పెద్దగా పట్టించుకోలేకపోయారు. గిడుగుపిడుగు ఒకవైపు, గురజాడ, కట్టమంచి, రాయప్రోలులాంటి అభినవ కవిత్వ ప్రోక్తలు మరోవైపు కొత్త పుంతలు తొక్కడానికి నాంది పలుకుతూ ప్రాచీన ప్రబంధ రీతుకు భరతవాక్యం పలికారు. 'మంగళాదీని....' లాంటి లక్షణాలకు మంగళం పాడారు.

ప్ర కవిత్వం రాజ్యమేలుతున్న కాలంలో ఖండకావ్యాలు కలికానిక్కూడా లేకుండాపోయాయి. గురజాడ, కట్టమంచి, రాయప్రోలు తమ నవ్య కవిత్వం ప్రచలితం కావడం కోసం ఖండకావ్యాలనే ఎన్నుకున్నారు. "స్వయం సంపూర్ణమై, పూర్వాపర నిరాకాంక్షయై, పరిసమాప్తార్థకరమై రసపర్యవసాయి కాగలిగిన కావ్యైక దేశము ఖండకావ్యము" అని ఖండకావ్యాన్ని ఆంధ్ర విజ్ఞాన సర్వస్వం నిర్వచిస్తున్నది.

గురజాడ 'పుత్తడిబొమ్మ పూర్ణమ్మ' కట్టమంచివారి 'ముసలమ్మ మరణం' రాయప్రోలు వారి కష్టకమల, స్నేహలత, తృణకంకణం, స్వప్నకుమారం మొదలైనవి అభినవ ఖండకావ్యములకాద్యమూ, ఆదర్శప్రాయమై అయ్యాయి. వీటిలో 'తృణకంకణము' గురించే మన పరిశీలన. ఇక మనం కథలోకి ప్రవేశిద్దాం. కథానాయిక ఒక తోటకు వెళ్ళే సన్నివేశంతో కథ ప్రారంభమవుతుంది. 'అడుగులు బొబ్బలెత్త, వదనాంచలమందున చిన్కుచెమ్మటల్ మడుగులు గట్ట, మందుకనుమాలపుటెండ పడంతి యోర్తు జారెడ జిలుగుం బయటం సవరించుచు చొక్కిన ఇంపుతోడకాల్నడకన బోవుచుండెనెడలన్ కనిపించెడి పచ్చతోటకున్' అంటాడు రాయప్రోలు. ఈ పద్యంతో ఆ యువతి వెంట మనల్ని కూడా పచ్చని తోటకు తీసుకువెళతాడు కవి. పదహారు సంవత్సరాలు దాటని ఆ జవ్వని యవ్వనాన్ని మనోహర వర్ణనలతో రూపుకట్టిస్తాడు కవి. ఆమె అందెల రవళి విని ఆమె పెంపుడు లేడిపిల్ల ఆమెను చేరుతుంది. ఆ లేడిపిల్లతో ఆమె జరిపిన ముద్దుమురిపాలను అందంగా చిత్రించాడు రాయప్రోలు.

అయితే ఈ లేడిపిల్ల పాత్ర ఏదో కావ్యపూరణకు ఉద్దేశించినది కాదు. ఆ యువతి యొక్క ప్రేమార్ద్రమైన మనసు ఎంతటి సున్నితమైనదో తెలియజేయడానికే.

*నయన మూలాంచలములు స్విన్నంబులయిన*
*వేల? చెల్లెలా! యీ ప్రాలు మాలికలకు*
*కారణం బెయ్యది? కఠోర కంటకంపు*
*వనుల దిరుగవు గద చిన్న తనపు చేష్ట!*

అంటూ ఆ కురంగమును జాలితో ప్రశ్నిస్తుంది. ఆ యువతి కోమల హృదయాన్ని పట్టి ఇచ్చే పద్యమిది. అయితే ఆమె ఈ మృదుస్వభావం, మున్ముందు జరుగబోయే కథలో ఆమె వ్యక్తిత్వం వ్యక్తం చేయడానికి అవసరమవుతుంది కాబట్టి రాయప్రోలు వారు చాలా మెలకువతో కురంగ కుమారుని సాహచర్యాన్ని చిత్రించారు. సందె మసలినకొద్దీ ప్రకృతి చల్లగా, ప్రశాంతంగా మారింది. నడకతో కలిగిన అలసట తీరిపోవునట్టుగా ఆ యువతి మీద చల్లచల్లగా ప్రదోష వనాలు ఆమెమీద వీచాయి. అంతటి ఆహ్లాదకర వాతావరణంలో ఆమె మనసులో ఏవేవో ఊహలు కదలడం మొదలయింది.

*ముగ్ధమధురమ్మయిన లేడి ముద్దులాట,*
*లోల పవనాకుల లతావలోకనంబు,*

*పొడుపుటేటి మెలపు, జారుపొద్దువలపు,*
*ఆయమనొకానొక వికార మందుత్రోసె*

ఆ మనో వికారంలోనే ఆమె పరిపరివిధాల తలపోస్తూ ఉంది. చిటికెన వ్రేలుకు పెట్టుకున్న ముద్దుటుంగరం, మణికట్టుకు కట్టుబడిన అందమైన పట్టుతోరం (పట్టు సూత్రం) ఇవేవీ ఆమెకు సంతోషం కలిగించకపోగా కొంత కష్టం కలిగిస్తున్నాయట. అవ్యక్తమయిన వికారమేదో కలత పెట్టుచుండగా నిట్టూర్పు విడుచుకుంటూ ఉండగా అనుతాపం వల్ల గద్గాదికమయిన ఒక 'క్లాంత కంఠస్వరం' వినిపించింది. అలా నిశ్శబ్దం భగ్నం కావడంతో ఆ కోమలి శబ్దం వచ్చినవైపు చూసింది.

అందగాడయని ఒక యువకుడు స్వగతంలో ఏవేవో దుఃఖభాజనమైన తలపోతలతో ఉండటం గమనిస్తుంది యువతి. అనూహ్య విషాదాన్ని మిగిల్చిన తన భగ్నప్రేమ గురించి పరిపరి విధాలుగా పరితపిస్తూ ఉంటాడు. ఆ ప్రేమికుని ప్రేమను ఉదాత్తీకరించేందుకు అతడు పడే తపనను మూసపద్ధతులకు భిన్నంగా నూతన రీతులతో ఆవిష్కరించాడు రాయప్రోలు. "ఓ కాలమా! నా ఆశలన్నిటినీ అడియాశలు చేసి 'వేసటలద్రోసి ఆయాస పెట్టాలని అనుకుంటున్నావా? లత నుండి వేరుపడిన సుమం సొగసు కోల్పోయి కృషింపకుడా ఎలా ఉంటుంది? ఓ హృదయమా! అసలు పూల మీద నీకు ఆశే లేదు. ఎట్లాగో ఒక మృదుసుమాన్ని అభిలాషించావు. తద్వారా ఎంతో ఉత్కంఠననుభవించావు. కాని కాలం నిరాశనే నీకు మిగిల్చింది.

ఓ మనసా! తేటవలుపులు మొలకెత్తినది మొదలు ఆ నెలతయందు పవిత్ర ప్రేమ నిలిపావు. చివరకు భగ్న మనోరథ దోషివై ఎందుకారాటపడుతున్నావు? వలపు నిండిన అకలుష భావంతో ఏది కాంక్షించితివో అది లభించలేదు. చివరకు అనుతాపమొక్కటే నీకు తోడయింది. ఓ చెలీ! ఎన్నడో బాల్యంలో, స్నేహం మనల్ని చేరదీసింది. ఆ ముగ్ధ స్నేహంలో మునిగియుండటంవల్ల ఎలాంటి 'రవంత అయిన ఘోషటి కూడా మనకు వినిపించలేదు. ఇప్పుడు యౌవనప్రాయానికి వచ్చి 'కందళిత స్నిగ్ధరసోదయం' వల్ల 'చేతము' అల్లాడి ఆకులు మేస్తూ ఉంది. బలవద్వియోగం అనుంగు ప్రేమను తెంపుతూ ఉంది.

*"చెలియా! యెన్నడో చేరదీసి......" అన్న పద్యంలోనూ....*
*"ఆశాభంగ కఠోర శస్త్రికలు కోయన్ గాయముల్ గాక బా*
*ధా శోకంబున నేటికో కటకటల్ తాళంగ, ప్రేమ భి*
*క్షా శూన్యంబయి గొడ్డువారిన జుగుప్సాలోకమం దేమృషా*
*పాశంబుల్ బిగియించె నిన్ను త్యజియింపకన్ లేవు నా ప్రాణమా!"*

అన్న పద్యంలోనూ– ఇలా ఒకటి రెండు పద్యాల్లో నాయికా నాయకుల 'ఫ్లాష్‌బాక్‌ను సూచనప్రాయంగా తెలుపుతాడు రాయప్రోలు'. ఈ యువతీ యువకులు బాల్యం నుండే ఒకరినొకరు గాఢంగా ప్రేమించుకుంటారు. విధివశాత్తు ఆ యువతికి మరొక యువకునితో పెళ్ళి జరుగుతుంది. తల్లి ఎంత చెప్పినా వినకుండా యువకుడు మాత్రం పెళ్ళి చేసుకోకుండా బ్రహ్మచారిగానే ఉండిపోతాడు.

ఇక్కడ కవిత్వపరమైన ఒక విశేషం ఉన్నది. కాలాన్నీ, హృదయాన్నీ, మనసునూ, ప్రాణాన్నీ, మోహాన్నీ సంబోధిస్తూ తన బాధల్ని వివరిస్తాడు యువకుడు రాయప్రోలు – అమూర్తాలను మూర్తిమంతం చేయడంలో కొత్త పుంతలు తొక్కాడు. యువకుని సంబోధనలకు ఏ అంశాలనైతే తీసుకొన్నాడో వాటికి అన్వయించే వర్తించే కవితా సామగ్రిని తీసుకొని తన ఊహాశాలితను చాటుకున్నాడు. ఇలా స్వగత దుఃఖంతో కంచెను దాటుచున్న యువకుణ్ణి చూస్తుంది యువతి.

*మిసమిసలాడే జవ్వనపు మేలిమి మేన మునంగు వారుగా*
*ని, సొగసు సళ్ళినట్టి నళినిం దలపించేదు; ఎద్దియో రహో*
*వ్యసన నిపీడ కానబడునాతని చూపులందు, ఆర్తి లా*
*లస హృదయంబు మాత్రమకలంకముగా కనుపట్టుమోమున్*

యువకుడు యౌవనపు మేలిమితో మిసమిసలాడుతున్నా అతని అంతరంగంలో మాత్రం ఏదో విషాదం ఉన్నట్టు గ్రహిస్తుంది యువతి. యువకుడు దగ్గరికొస్తాడు. ఇద్దరూ అన్యోన్యం చూసుకుంటారు. చేయి చేయి కలుపుకొని ఇద్దరూ మౌనంగా అలా చిత్తరువుల్లా ఉండిపోతారు. మొదట యువకుడు తేరుకొని యువతి చేతిని వదిలిపెడతాడు. కుశల ప్రశ్నలడుగుతాడు. అప్పుడా యువతి

*సొగకన్నులు విప్పారజూచి ప్రియును*
*పలుకుల హృదంతరార్థమేర్పడ ననియె;*
*అస్ఖలిత మగు ప్రేమ రహస్య సూత్ర*
*విశద బుద్ధిన్ హృదయవాద కుశలయగుచు*

తన హృదంతరంలో ఉన్న అస్ఖలిత ప్రేమ రహస్య సూత్రాన్ని ప్రియునకు విశదపరచాలని అనుకుంటుంది యువతి. 'అస్ఖలిత ప్రేమ' అన్న పదబంధంతో, తాను

ప్రతిపాదించబోవు 'అమలిన శృంగారా'నికి బీజావాపం చేశాడు రాయప్రోలు. తన నిరాశానిస్పృహలను, నిర్వేదాన్ని, హృదయదఘ్న విషాదాన్నీ నిష్ఠుర వాక్కులతో తెలియజేస్తాడు యువకుడు. అప్పుడు

*'కలసిన యంతమాత్రమున కాదు సుమీ చెలికార మంతరం*
*బుల నతుకంగ జాలిన అపూర్వపు లంకెయె స్నేహమౌ, తద*
*స్ఖలిత సమస్త సాధనము జ్ఞాన విదగ్ధుల మార్గ సూత్ర, మే*
*వలతి నైన ప్రేమ పరిపాకము లిట్టులెయన్వయించెడిన్'*

అంటూ పవిత్ర స్నేహాన్ని, పరిణతి చెందిన ప్రేమనూ వివరిస్తుంది యువతి. రాయప్రోలు వారు ప్రతిపాదించిన ఈ అమలిన శృంగారం మూస శృంగారానికి భిన్నమైనదే. "సంభోగ శృంగారము ఉపాధి మాత్రమైనది కాబట్టి ఇది క్షయమైనదని, వియోగ శృంగారము అనుపాధికము కాబట్టి అక్షయమైనదని ఇదే శ్రేష్ఠమైనదని వీరి (రాయప్రోలు వారి) సిద్ధాంతము" అని సి. నారాయణరెడ్డిగారు తెలిపారు.

అమలిన శృంగార సిద్ధాంతాన్ని వ్యతిరేకించిన వారు కూడా అన్నారు 'అమలిన శృంగారం పచ్చి అబద్ధమని, శృంగారమెప్పుడూ మైథున శృంగారమేనని, శృంగారంలో మలినము, అమలినము ఉండవని ఘంటాపథంగా చెప్పాడు చలం. అయితే అమలిన శృంగార సిద్ధాంతం పాశ్చాత్యులలో ప్లాటో కాలం నుండే ఉంది. అందుకే దీన్ని 'Platonic Love' అన్నారు. మచ్చుకు ఒకటి రెండు వివరణలు.

1. A close relationship between two persons in which sexual desire is non existent or has been suppressed or sublimated.

2. Love conceived by plato as ascending from passion for the individual to contemplation of the universal and ideal.

సరే. అసలు కథలోకొద్దాం

*కనుల నొండొరులను చూచుకొనుటకన్న*
*మనసు లవికార ధారణన్ మనుటకన్న*
*కొసరి 'యేమోయి'యని పిల్చుకొనుట కన్న*
*చెలులకిలమీద నేమి కావలయు సఖుడ*

అంటూ అనేక రకాలుగా చెలికాణ్ణి సమాశ్వాసించే ప్రయత్నం చేస్తుంది యువతి. "నా మణి బంధమందు భావబంధంబు విధంగా ఈ పట్టుసూత్రము కట్టినావు. ఇప్పుడు దాన్ని విప్పుతావా?" అంటూ కన్నీళ్ళు నిండిన కళ్ళతో చేతి మణికట్టును చూపిస్తూ అంటుంది యువతి.

*"ఈ తృణ కంకణంబు భరియింపుము నీ మణిబంధమందు*
*ప్రీతిని అప్పుడప్పుడు వలపింపుల నెయ్యము జ్ఞప్తిగొన్న ప్రా*
*భాతిక వేళ నీ ప్రణయ బాష్పజలాంజలి నింత చలి, యే*
*రీతిని వాడకుండ నలరింపు మిదే తుది వాంఛ సోదరీ!"*

అని చివరకు ప్రియురాలిని సోదరీ! అని సంబోధిస్తాడు. ఆమె తన వేలికున్న ముద్దుటుంగరం ప్రియసఖుని వేలికి తొడుగుతుంది. అంతటితో ఎవరిదారిన వారు పోతారు. 'రాయప్రోలు వారు కరుణ శృంగార రసములు రెండే రసవిపాకమునకు సమర్థములని అభిప్రాయపడిరి. పూర్ణానందస్వాదనమునకు శృంగార రసము, మనోదష శుద్ధికి కరుణ రస ముపయుక్తములని వీరి భావము. వీనిలో రెండవది అరిస్టాటిల్ ప్రతిపాదించిన కెథార్సిస్ (catharsis) అను లక్షణమునకు సరిపోవుచున్నది' అని రాయప్రోలు వారి అభిప్రాయాన్ని తెలిపారు సినారెగారు. 'తృణ కంకణం' కూడా కరుణ రసాత్మకమైనదే కాబట్టి కెథార్సిస్ లక్షణమేంటో చూద్దాం.

'A purifying or figurative cleansing of the emotions, esp, as an effect of tragic drama. The relief of tension and anxiety by bringing repressed feelings and fears to consciousness అన్నది ఒక వివరణ (The Random House dictionary).

కథాకథనం నవ్యాతినవ్యమైనది. 'త్యాగగుణం' శిఖరాయమానంగా చిత్రింపబడిన కథ ఇది. ఎత్తుగడే ఉత్కంఠభరితంగా ఉంటుంది. కథ ఎక్కడో 'మధ్య'లో మొదలవుతుంది. తరువాత ఆ యువతీ యువకుల ప్రేమ నేపథ్యం తెలుస్తుంది. వియోగంతో ముగుస్తుంది. ఆధునిక కథానిక లక్షణాలన్నీ తృణకంకణంలో ఉన్నాయి. కాకపోతే పద్యరూపంలో ఉంది. భావుకతలో – అభివ్యక్తిలో, పదబంధ ప్రయోగంలో, అలంకారాల్లో, కవి సమయాల్లో వినూత్న పోకడలతో తరువాతి వారికి తమదైన ఒక ఒరవడిని సృష్టించారు రాయప్రోలు. యువతీ యువకులు విడిపోవడంతో ఈ ఖండకావ్యం ముగుస్తుంది. అయితే కథమాత్రం కంచికి పోదు. మెత్తగా కోసుకుంటూ నేరుగా గుండెల్లోకి దూరిపోతుంది. ఇంత రసరమ్యంగా ఉంది కాబట్టే వందేళ్ళు దాటినా వసివాడిపోలేదు తృణకంకణం. మి

డా. దిలావర్.
ఖమ్మం. ఫోన్ : 986 692 3294

# నిస్సిగ్గు వినోదం

– గొల్లపూడి మారుతీరావు

నాకు ఇంగ్లండు అంటే నాటకమే. నేను నూటికి నూరుపాళ్ళూ తెలుగువాడినయినా ఇంగ్లీషువారి రెండు గొప్ప విషయాలకు నేను అభిమానిని. ఆంగ్ల భాష, నాటకం, ఇంగ్లండులో నాటకరంగం ఒక వ్యవస్థ. కేవలం వినోదం కాదు, కాలయాపన కాదు, ఊసుపోత కాదు. అలనాటి క్రిస్టోఫర్ మార్లో, జాన్ ఫ్లెచర్, షేక్స్పియర్, క్రిస్టాఫర్ ఫ్రై, జాన్ గాల్స్వర్దీ, ప్రీస్ట్లీ, జె.ఎం. బారీ, డబ్ల్యు.డబ్ల్యు. జాకబ్స్ – ఇలా ఎందరినయినా చెప్పగలను. ఇప్పటికీ నాలుగు – ఐదువందల ఏళ్ళనాటి నాటకాల పదో, పదకొండో పునర్నిర్మాణాన్ని కన్నులారా చూడవచ్చు. నాటకం వారికి దైనందిన కార్యక్రమం, ఉపాధి, ఊపిరి.

ఈసారి – ఆంధ్రా మెడికల్ గ్రాడ్యుయేట్స్ రీ యూనియన్‌కి నన్ను డాక్టర్ వ్యాకరణం అచ్యుతరామారావు గారు ఆహ్వానిస్తూ నా వ్యసనం తెలిసినవారుగా 'సభ అయ్యాక ఇంగ్లండులో ఉంటారా?' అని అడిగారు. కొన్ని సంవత్సరాలుగా నాకో వ్యాసంగం ఉంది. నార్త్ ఉడ్‌లో మిత్రులు పాల్‌రెడ్డి గోవర్ధనర్‌రెడ్డిగారున్నారు. వారి ఇంటి నుంచి టాక్సీలో అండర్ గ్రౌండ్‌కి వచ్చి, రెండు రైళ్ళు మారి పికడిల్లీ వచ్చి, థియేటర్‌దాకా నడిచి, రాత్రి 10.45కి ఈ ప్రయాణమంతా మళ్ళీ చేసి పదకొండున్నరకి ఇల్లు చేరాలి. ఎముకలు కొరికే చలిలో. అయితే శక్తిమాట అటుంచి ధైర్యం చాలలేదు. కిందటిసారి ఈ పనులు చేసింది తేలికగా అయిదారేళ్ళ కిందట. వయస్సు హెచ్చరిస్తోంది. వాతావరణం భయపెడుతోంది. "వెళ్ళలేను. మీరు చూపిస్తే ఒకటి రెండు నాటకాలు చూస్తాను" అన్నాను ఆయన్ని మొహమాట పెడుతున్నాని తెలుస్తూనే. ఆయనా నాటక ప్రియులు. ఏటా వాళ్ళావిడ పద్మగారి పుట్టినరోజుకు కూతురు, అల్లుడు మనమల్నీ వెస్టెండు తీసుకెళ్ళి ఒక నాటకం చూపిస్తారు. అదీ పుట్టినరోజునాడు వారికిచ్చే బహుమతి. సరేనన్నారు. నేను ఉండే తేదీలు లెక్కబెట్టి, సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని, మధ్యాహ్నం మ్యాటనీని ఎంపిక చేశారు. నాటకం, సంగీత నాటకం "మిసెస్ హెండర్సన్ ప్రెజంట్స్" (శ్రీమతి హెండర్సన్ సమర్పించు) ఇదీ నాటకం పేరు.

దీని ప్రచారమే విచిత్రంగా, విభిన్నంగా జరిగింది. డెయిలీ మైల్ పత్రిక ఈ నాటకాన్ని *నిస్సిగ్గు వినోదం* (Unashamedly Entertaining) అంది. అదేమిటి? సిగ్గుకీ వినోదానికీ ఏమిటి సంబంధం? అంటే పెద్ద అక్షరాలతో ప్రకటనలో మొదటి పెద్ద శీర్షిక కనిపించింది : "ప్రదర్శన ప్రారంభం కావాలంటే బట్టలు విప్పెయ్యాలి". నగ్నంగా బట్టల్లేకుండా చాలామంది అందమైన అమ్మాయిలు ఇందులో కనిపిస్తారన్నది ప్రముఖమైన ప్రకటన. ఇది బొత్తిగా చవకబారు 'తేలుమందు' అమ్మకంలాగో, దొమ్మరి ఆటలాగో అనిపించింది. ఒక నాటకం ప్రత్యేకత కేవలం బట్టలిప్పేసిన ఆడపిల్లలే అయితే అందుకోసం ఇంగ్లండు వరకూ రానక్కరలేదు. కొన్ని శతాబ్దాల ప్రాముఖ్యత ఉన్న వెస్టెండు నాటకరంగం ఇంత దయనీయమైన స్థితికి దిగజారనక్కరలేదు అన్నది నా మొదటి స్పందన – నాటకరంగానికి అంకితమయిన వ్యక్తిగా. ఆ ఆలోచనని అటకెక్కించవలసిన సాయంకాలాన్ని గురించే ఈ వ్యాసం.

మొదట ఈ నాటకశాల నోల్‌కొవార్డ్ థియేటర్ గురించి. 1903లో సర్ చార్లెస్ విండామ్ అనే ఆయన సెంట్ మార్టిన్ లేన్‌లో ఈ థియేటర్‌ని ప్రారంభించారు. అప్పుడు దీని పేరు న్యూ థియేటర్. 1973లో అంతవరకూ ఈ థియేటర్‌కి మేనేజర్‌గా ఉన్న సర్ బ్రోన్సన్ ఆల్బెనీ గౌరవార్థం ఆయన పేరుని (ఆల్బెనీ థియేటర్) ఈ థియేటర్‌కు పెట్టారు. మరో 32 సంవత్సరాల తర్వాత ఈ నాటకశాల ప్రముఖ నాటక రచయిత, నటుడు 'నోల్ కొవార్డ్' పేరుని పొందింది. ఒక కళాకారుడికి ఎంత గొప్ప నివాళి! మనదేశంలో ఎవరయినా 'బళ్ళారి రాఘవ థియేటర్' 'స్థానం థియేటర్' అని నామకరణం చేసే రోజు వస్తుందా అనిపిస్తుంది. ఈ నాటకరంగం మీద ప్రముఖ నటులు జాన్ గిల్గుడ్ (పేరు విననివారికి 'గాంధీ' సినిమాలో గవర్నర్ జనరల్‌గా నటించిన మహానటుడు – ఉప్పుసత్యాగ్రహంలో 'స్టాప్!' అన్న క్లోజప్ గుర్తుకొస్తుందనుకుంటాను), లారెన్స్ అలీవియర్, పెగ్గీ ఆష్క్రాఫ్ట్, ఎడిత్ ఇవాన్స్ మొదలయిన నటులు అద్భుతమయిన నాటకాలలో నటించారు.

ఇక ఈ నాటకం – లండన్ విండ్‌మిల్ థియేటర్‌కి సంబంధించి నిజంగా జరిగిన కథ ఇది. జరిగిన సంవత్సరం 1937. దీని ఆధారంగా 2005లో ప్రముఖ నటీమణి –

ఇంగ్లండు గర్వపడే నటీమణి – జూడీ డెంచ్ ప్రధాన పాత్రని ధరించగా స్టీఫెన్ ఫ్రియర్స్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. అప్పట్లో విజయవంతంగా నడిచిన చిత్రం అది. కథ ఇది. 1937లో 70 ఏళ్ళ ముసలమ్మ లారా హెండర్సన్‌కి కోట్ల ఆస్థి చేతికి వచ్చింది. ఆవిడ తిక్క మనిషి. తిక్క సరదాలున్న మనిషి. ఏం చేసింది? ఓ నాటకం థియేటర్‌ని కొన్నది. కొని, వివియన్ వాన్ డామ్ అనే ఓ నిరంకుశుడైన మేనేజర్‌ని నియమించింది. తిక్కలో ఒకరికొకరు తోడయారు. రకరకాల జానపద ప్రదర్శనలు (దాదాపు మన పౌరాణిక, జానపద నాటకాల వంటివి) ఏర్పాటు చేశారు. అవి బాగా లాభించాయి. వెంటనే మిగతా థియేటర్లవారూ ఆ రకం ప్రదర్శనలమీద పడ్డారు. వీళ్ళకి నష్టం రావడం ప్రారంభించింది. అప్పుడు ఏం చేయాలి? ఈవిడ తిక్కమనిషి కదా? తిక్క ఆలోచన వచ్చింది. ఆడపిల్లల్ని నగ్నంగా చూపిస్తే? పారిస్‌లో 'మౌలిన్ రూజ్' అనే కోవకు చెందిన ప్రదర్శనలున్నాయి. వాన్ డామ్ కూడా అటువేపు మొగ్గాడు. కాని తగాదా అల్లా అధికారులను (లార్డ్ చాంబర్లిన్ ప్రతీ నాటకం నియమబద్ధంగా, క్రమబద్ధంగా ఉందో లేదో చూసి అనుమతి ఇవ్వాలి) ఎలా ఒప్పించాలా అని. నిజంగానే ఆ అధికారి ఇబ్బంది పడ్డాడు. బాగా ఆలోచించి – ఈ నగ్నంగా ఉండే అమ్మాయిలు ఏ భంగిమలూ చేయకుండా శిలాప్రతిమల్లాగ నిలవాలి – అని శాసించాడు. అప్పుడు అశ్లీలత కాస్త మరుగున పడి, ఒక శిల్పాన్ని చూస్తున్న స్పృహ ప్రేక్షకులకు ఉంటుందని ఆయన అభిప్రాయం.

ఈ థియేటర్ ఆ రోజుల్లో ఇప్పుడు పికడిల్లీ సర్కస్‌కి ఎదురుగా ఉన్న క్రైటీరియన్ థియేటర్‌లాగా వీధిమట్టానికి కిందుగా ఉండేది. అవి రెండో ప్రపంచ యుద్ధం రోజులు. ఒకవేళ బాంబులు పడినా, దగ్గర్లో పడ్డ బాంబులకి సెట్టింగులు, థియేటర్ గడగడమనేవి. నగ్నంగా నిలబడిన అమ్మాయిలు తలదాచుకుని బాంబుల తాకిడి తర్వాత మళ్ళీ స్టేజిమీదకి వచ్చి నగ్నంగా, ధీటుగా నిలబడేవారు. నాటకం సాగిపోయేది.

యుద్ధ సమయంలో ఈ నాటకాన్ని చూడటానికి చాలామంది సైనికులు, ఆఫీసర్లు వచ్చేవారు తరచుగా. ఈ నాటకంలో నటిస్తున్న మౌరీన్ అనే అమ్మాయిని ఒక సైనికుడు ఆకర్షించాడు. తిక్క ముసలమ్మ ఆ ప్రేమని ఎగదోసింది. మౌరీన్ గర్భం దాల్చింది. ఇక తన నట జీవితం దెబ్బతింటుందేమోనని ఆ అమ్మాయి బెంబేలు పడింది. ఉద్యోగం మానెయ్యడానికి నోటీసు కూడా ఇచ్చేసింది. అయితే ఒకరోజు – నాటకం పూర్తయాక ఇంటికి వెళ్తుండగా బాంబు పడి, ఆ అమ్మాయి చచ్చిపోయింది. ఇదంతా ఈ సంగీత నాటకం కథ. ఒకపక్క బాంబులు పడుతున్నా ప్రేక్షకులు ఈ నాటకం చూడటానికి విరగబడి వచ్చేవారు, అధికారులకి ఇది తలనొప్పిగా మారింది. ఈ ఆకర్షణ ఆడపిల్ల నగ్నత్వం కారణమని చూపించి అధికారులు నాటకం థియేటర్‌ని మూసేయమన్నారు. లార్డ్ చాంబర్లిన్‌కి హెండర్సన్ ఎదురు తిరిగింది. తమ దేశం కోసం ప్రాణాలు అర్పించే యువ సైనికులు జీవితంలో స్త్రీ సుఖం ఎరగకపోగా కనీసం స్త్రీని నగ్నంగా ఇలా చూసే అవకాశం కలుగుతోందని వాదించింది. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో గాస్ చాంబర్‌లో (ఆమె యూదురాలు) తన ఒక్కగానొక్క కొడుకు ఫ్రెంచి పోస్టు కార్డు మీద ఉన్న నగ్న స్త్రీ బొమ్మ తప్ప మరేదీ చూడలేదని గుర్తుచేసింది. ఇదీ ఆమె మాట : "మనం మన పిల్లల జీవితాల్ని దేశం కోసం అర్పించమంటున్నాం. కాని వారి ఆనందాన్ని, ఆనందానికి అవకాశాన్ని అర్పించమనే హక్కు మనకు లేదు."

అధికారులు నిస్సహాయంగా అంగీకరించారు. నాటకం సాగింది. యుద్ధమూ సాగింది. ఆ రోజుల్లో ఈ నాటకాన్ని చూడడానికి వచ్చినవారిలో విక్టోరియా మహారాణి మనుమరాళ్ళు ఇద్దరూ ఉన్నారట. ఇదంతా నాటకం కథ.

డి.వి. నరసరాజుగారు రాసిన మోలియర్ నాటకం 'నాటకం'లాగ, ఒక నాటక రంగం కథ ఇది. హెండర్సన్ అనే ఓ తిక్క మనిషి – అశ్లీలత అనిపించని, ప్రేక్షకులను ఆకర్షించే, ఒక విలక్షణమయిన ఇతివృత్తాన్ని, నాటకరంగానికి తెచ్చిన కథ ఇది. ఇందులో పసందయిన సంగీతం ఉంది. ఆశ్చర్యం కలిగించిన, అసభ్యం అనిపించని అతి సౌందర్యవంతులయిన అమ్మాయిల నగ్నదృశ్యాలున్నాయి. రెండో ప్రపంచ యుద్ధం నాటి బాంబులున్నాయి, చిన్న రొమాన్స్ ఉంది. సెన్సార్ అధికారులతో తలపడి వారిని ఒప్పించి, నాటకాన్ని నడిపిన హెండర్సన్ వైదుష్యం ఉంది. చివరగా రసవత్తరమైన పాటలున్నాయి. అద్భుతమైన నాట్య దర్శకత్వముంది. గొప్ప టైమింగ్‌తో చేసిన నాట్యాలున్నాయి. వెరసి ఒక సాయంకాలాన్ని చిరస్మరణీయం చేయగల వెస్టెండు సంప్రదాయ వైభవాన్ని ఏమాత్రమూ దిగజార్చని వినోదం ఉంది. అయితే "మిసెస్ హెండర్సన్ ప్రెజెంట్స్" సంగీత రూపకంగా ఎందుకు తయారయింది? ఈ కథలో నాటకీయత



ఎమ్మా విలియమ్స్

తగినంతగా లేదు కనుక. కాగా, స్త్రీ నగ్నత్వాన్ని ఒక సీనులో రక్తికట్టించటం జరిగే పనికాదు. నగ్నత్వం కేవలం దృశ్యం, ఒక అనుభూతి. అది రెచ్చగొట్టే స్థాయిలోకాక కళాత్మకమయిన స్థాయిలో నిలపే ప్రక్రియ – తప్పని సరిగా ఆవేశానికికాక అనుభూతికి పెద్దపీట వేసే సంగీత రూపకం కావాలి. మరొక ముఖ్యమైన విషయం. స్త్రీ నగ్నత్వం వెగటు కలిగిస్తుంది. చూపగలిగిన ధోరణిలో, బాధ్యతగా చూపకపోతే చూడదగిన దృశ్యం కాదు. అందుకే చిత్రలేఖకులు, శిల్పులు, ఫోటోగ్రాఫకులు – వీరందరికీ కొలమానం – స్త్రీ నగ్నసౌందర్యం. ఒక ఛాలెంజ్. ఒప్పించే స్త్రీ నగ్నత్వ దృశ్యం తమ సృష్టికి పరాకాష్టగా భావిస్తారు. ఈ నాటకంలో ఒక్కసారి కళ్ళు మిరిమిట్లు గొలిపేలాగ నలుగురయిదుగురు అమ్మాయిల ప్రఖ్యాత గ్రీకు శిల్పాల ఫోజుల్లో నగ్నత్వాన్ని చూపే దృశ్యం – ఒక్కసారి ప్రేక్షకుల్ని తుళ్ళిపడేట్టు చేసింది. అందరూ నిశ్చేష్టులయిపోయారు. దర్శకుడు, లైటింగ్ స్పెషలిస్టూ చాలా గంటలు, రోజులు కష్టపడి ఆ దృశ్యాలకు లైటింగుని నిర్ణయించి ఉంటారు. ఫ్లాట్ లైట్ కాక దంతపు బొమ్మలాగ కనిపించేటట్టు శరీరాలని, సౌష్టవాన్నీ, పొంకాన్నీ వెల్లడించే మూడ్ లైట్‌ని ఏర్పాటు చేశారు. ఆ దృశ్యం మనసుల్లో నిలిచేదాకా, రంగస్థలం ఆ క్షణాలలో ఒక తైలవర్ణ చిత్రమయిపోయింది. ఇది ఆ కళాకారుల సౌందర్యానికీ, ఆ సౌందర్యాన్ని ప్రొజెక్ట్ చేసిన సాంకేతిక నిపుణులకూ కితాబు.

నాలుగు డిగ్రీల చలిలో మధ్యాహ్నం కారులో సెంట్రల్ లండన్ చేరి, కారుని ఆపినచోటు నుంచి టాక్సీలో థియేటర్‌కి వచ్చాం. లండన్‌లో మొదటి సమస్య కారు. అంత చలిలోనూ పండగలాగ నాటకాన్ని చూడడానికి వచ్చిన (ఆ రోజు బుధవారం – అయినా థియేటర్ హౌస్‌ఫుల్) ప్రేక్షకులు నాకు మొదటి ఆకర్షణ. కేవలం గంట ముందు వచ్చి వైన్ సేవించి, ఇంటర్వెల్‌లో మళ్ళీ వైన్ పుచ్చుకుని, బ్రిటిష్ మర్యాదలకి, అభిరుచులకీ, సభ్యతకీ ఏ మాత్రమూ ఈ నాటకం భంగపరచలేదని తమ హర్షం ద్వారా తెలిపి తరలిపోయేవారిని చూస్తూ ముచ్చటపడిపోయాను. 2005లో సినిమాకు రచన చేసిన మార్టిన్ షెర్మన్ అడుగు జాడల్లో టెర్రీ జాన్సన్ ఈ రచనని చేసి దర్శకత్వం వహించారు. 'సింగింగ్ ఇన్ ది రైన్' వంటి గొప్పగొప్ప సంగీత రూపకాలకు పనిచేసిన కొరియోగ్రాఫర్ ఆండ్రూ రైట్ ఈ నాటకాన్ని నిర్వహించారు. సినిమాలో జుడి డెంచ్ చేసిన ముఖ్య పాత్రని ట్రేసీ బెనెట్ అనే నటీమణి అతి సమర్థవంతంగా నటించింది. ప్రఖ్యాత నటీమణి ఎమ్మా విలియమ్స్ మారీన్ పాత్రను నిర్వహించారు.



జుడి డెంచ్

'వెన్నెల ఎంత వృథా', 'ఇది సమయం కాదు', 'కొండల్ని ఎక్కడం సులువైతే' (if mountains were easy to climb) సరదాగా, సరసంగా ప్రేక్షకుల్ని గిలిగింతలు పెట్టిన పాటలు. "Always nude but never rude" అంది టెలిగ్రాఫ్ పత్రిక ఈ నాటకాన్ని చూసి. ఆ రోజుల్లో ఒక జోక్ ఉండేది ఈ నాటకం మీద : రెండో ప్రపంచ యుద్ధం ఒకపక్క జరుగుతున్నా ప్రదర్శన ఆగని నాటకం ఇది అని గర్వంగా చెప్పుకున్నారట. "We never closed" అని కూడా చెప్పుకోవచ్చు అన్నారట. డైలీ మెయిల్ సమీక్షకుడు ఒక మాట అన్నాడు : ఇంత ఆనందంగా థియేటర్‌లోంచి బయటికి వచ్చి చాలాకాలమయింది. నేనూ ఆయనతో ఏకీభవిస్తున్నాను.

ఇంతవరకూ వచ్చాక వ్రాయకుండా ఉండలేని ఒక సంభాషణ నా కలాన్ని ఊరిస్తోంది. నాటకం సభ్యతని నిర్ణయించే అధికారితో హెండర్సన్ సంభాషణ :

హెండ : Tommy, you're so literal. You're thinking bosoms, but I'm thinking breasts.

Lord Cromer : And what, my dear, is the difference?

Laura Henderson : Ah, the difference is in your soul.


ఈ నాటకాన్ని కేవలం కళ్ళతోనేకాక, మనస్సుపెట్టి చూడాలంటోంది ఈ 70 ఏళ్ళ ముసలమ్మ హెండర్సన్. నరాల్ని జోకొట్టి హృదయాన్ని మేల్కొలిపే ఓ సాయంకాలం వినోదం ఈ నాటకం.


గొల్లపూడి మారుతీరావు

email : gmrsivani@gmail.com

# భాగవతానుశీలన

ఆచార్య గార్లపాటి దామోదర నాయుడు పదవీ విరమణ చేసిన సందర్భంలో (2011) శిష్యులు, మిత్రులు కలిసి ఆయనకు అభినందనా పూర్వకంగా *భాగవతానుశీలన* అనే గ్రంథాన్ని సమర్పించారు. డా. జి.డి.ఎన్. ప్రాచీనాంధ్ర కవిత్వ ప్రియులు, అధ్యయనశీలి, గ్రంథకర్త.




డా. జి.డి.ఎన్. శిష్యమిత్రులు ఆయనకు ప్రీతిపాత్రమైన శ్రీమదాంధ్ర భాగవతం గురించి పరిశీలనాత్మకమైన 45 వ్యాసాల్ని కూర్చి ఈ గ్రంథాన్ని వెలువరించారు. డా. జి.డి.ఎన్. జీవిత రచనా వ్యాసంగం గురించి సంక్షిప్త పరిచయం ఈ గ్రంథంలో ఉంది. పెద్దలు మంగళాశాసనాలు చేయగా, శిష్యులు ప్రశంసలు కురిపించారు.

*భాగవతానుశీలన* తెలుగు వాళ్ళకు ఎంతో ప్రియమైన పురాణం గురించి పెద్దలు, పిన్నలు రాసిన వ్యాసాల సంకలనం. తెలుగు భాగవతంలోని పన్నెండు స్కంధాల గురించి 13 వ్యాసాలున్నాయి. చాలావరకు ఇవి కొత్త విషయాలు తెలుపని పాత మాటల పునరుక్తులే. డా. యార్లగడ్డ బాలగంగాధరరావు పోతన – భాగవతం నేపథ్యం గురించి పరిశీలనాత్మక వ్యాఖ్యలు చేశారు. 'మహనందాంగనా డిభకున్' అన్న మాటకు రావుగారిచ్చిన వివరణ చక్కగా ఉంది. 'కర్ణాట' శబ్ద చర్చ కూడా గమనించదగ్గ విషయమే. డా. అన్నవరం చిదంబరశాస్త్రి గారు శ్రీకృష్ణావతార లక్ష్యాల్ని వివరిస్తూ పూతన, తృణావర్త, కుబ్జ, అష్టమహిమలు, గోపికాస్త్రీల వృత్తాంత మర్మాల్ని తెలియచేసిన వైనం ప్రశంసనీయం. డా. కె. సర్వోత్తమరావు వ్యాసం భాగవతంలోని స్త్రీ పాత్రల్లోని విశేషాల్ని చక్కగా ప్రకటిస్తుంది. డా. కోసూరి దామోదర నాయుడు వ్యాసం భాగవతంలోని మాతాపితరుల పుత్రానుబంధం, డా. ముదివేడు ప్రభాకరరావు గారు పోతన – ఏర్చూరి సింగనల అవతారికల తులనాత్మక పరిశీలన సునిశితంగా చేశారు.

ఈ అభినందన గ్రంథం పోతన భాగవతానుశీలనకు పరిమితం కావటం విశేషం. కాని, డా. జి.డి.ఎన్. గారి రచనల సమీక్ష కూడా ఈ గ్రంథంలో జరిగి ఉంటే సముచితంగా ఉండేది.


*(**భాగవతానుశీలన** : ఆచార్య గార్లపాటి దామోదర నాయుడు అభినందన గ్రంథం. పేజీలు : 478, వెల : రూ. 518/–లు. ప్రతులకు : డా. నాదెండ్ల శ్రీమన్నారాయణ. తెలుగు ఉపన్యాసకులు. ఎ.జి.ఎస్. ఎయిడెడ్ జూనియర్ కళాశాల. కపిలతీర్థం బైపాస్ రోడ్, తిరుపతి.)*



దామోదర నాయుడు

# ప్రబంధ కవుల తిరుమల దర్శనం

ఏడుకొండల వేంకటేశ్వరస్వామి పేరుప్రఖ్యాతులు నేడు ప్రపంచమంతటా ప్రతిధ్వనిస్తున్నా క్రీ.శ. 14వ శతాబ్దంనాటికి గాని మన తెలుగు కవులు తిరుమలను కాని, తిరుమలేశుని కాని స్మరించుకొనే సదవకాశానికి నోచుకోలేకపోయారు. శేష శైలవాసుడైన శ్రీనివాసుని మొట్టమొదటిసారిగా స్మరణించి, తెలుగు కవి శంభుదాసుడు, ప్రబంధ పరమేశ్వరుడు ప్రసిద్ధి చెందిన ఎర్రాప్రెగ్గడ. ఈశ్వరార్చన కళాశీల శ్రీనాథుడు రెండవ కవి. 'కొండలలో నెలకొన్న కోనేటి రాయుణ్ణి' వేనోళ్ళ కొనియాడిన విష్ణుభక్తులు తాళ్ళపాక అన్నమయ్య ప్రభృతులు.



ప్రాచీన తెలుగు కావ్యాల్ని చదువుకొన్న, పిల్లలకు పాఠాలు చెప్పగలిగే శక్తిసామర్థ్యాలున్నవాళ్ళలో ఆచార్య గార్లపాటి దామోదర నాయుడుగారొకరు. ఈయన 'ప్రబంధ కవుల తిరుమల దర్శనం'లో శ్రీకృష్ణదేవరాయలు, నంది తిమ్మన, పింగళ సూరన, తెనాలి రామకృష్ణుడు, రఘునాథ నాయకుడు ఈ ఐదుగురు మహాకవులు తమ ప్రబంధాల్లో శ్రీ వేంకటేశ్వరున్ని స్తుతించిన 47 పద్యాల్ని, 7 వచనాల్ని టీకాతాత్పర్య సహితంగా వివరించారు. అంతేకాక, ప్రతి పద్యంలోని విశేషాల్ని చెప్పారు. ఆంధ్ర భోజుడైన శ్రీకృష్ణదేవరాయలు తమ 'ఆముక్తమాల్యద'లో వేంకటేశ్వరుని 11 పద్యాల్లో కొనియాడితే తెనాలి రామకృష్ణుడు 21 పద్యాల్లోను, 3 వచనాల్లోనూ ప్రస్తుతించడం గమనార్హం. ఆచార్య దామోదర నాయుడు "అనుచు లోననుచు..." అనే తెనాలి రామకృష్ణుని పద్యంలోని "కౌశిక దిక్తటాంచల' పదబంధంలోని 'కౌశిక' పదానికి 'ఇంద్రు'డనే అర్థాన్ని గ్రహించడం సముచితంగా ఉంది. "తొడపై ఎడమ చేతిని పెట్టుకొని" (పే. 253) అన్న వివరణలో 'తొడైప'కి బదులుగా నడుం మీద అని ఉండటం సముచితం కదా! "తిండి మెండయ గారిని, తిగళ గరుని" అన్న పద్యపాదంలోని 'తిగళ' శబ్దానికి నాయుడుగారిచ్చిన పరబ్రహ్మ స్వరూపం, తెన్‌గళై దక్షిణ దేశస్థులు – అనే రెండు వివరణలూ పొసగవు. 'తిగళ' శబ్ద వ్యుత్పత్తి చర్చనీయాంశంగా భావించాల్సి ఉంటుంది.

ఆచార్య గార్లపాటి దామోదర నాయుడు గారు ఏర్చి కూర్చిన "ప్రబంధ కవుల తిరుమల దర్శనం" చదువతగ్గ పుస్తకం.

*(**ప్రబంధ కవుల తిరుమల దర్శనం** – రచయిత : ఆచార్య గార్లపాటి దామోదర నాయుడు. పేజీలు : 280, వెల : రూ. 120/–లు. ప్రతులకు : జి. హేమనళిని, 10–50/3, మారుతీనగర్, తిరుపతి – 517502. ఫోన్ : 7893 982 500.)*



కావ్యరెడ్డి

# అట్టమీద బొమ్మలు

## చిత్రకారిణి కావ్యరెడ్డి

**కా**వ్యరెడ్డి చిన్నతనమంతా కళలకు కాణాచైన గోదావరీ తీరప్రాంతం రాజమండ్రిలో సాగింది. తండ్రి పి. గణపతిరెడ్డి మెరైన్ ఇంజనీరు, తల్లి ఝాన్సీలక్ష్మి. కందుకూరి వీరేశలింగం పంతులు స్కూలులో ప్రాథమిక విద్య సాగింది. తరువాత వికాస్ జూనియర్ కాలేజీ, ఆ తరువాత బొంబాయిలో ఠాగూరు ఇంజనీరింగ్ కాలేజీలో ఇంజనీరింగ్ పట్టభద్రురాలైంది. చిన్నతనం నుంచి చిత్రకళపైనున్న మక్కువతో చిత్రాలు గీసినా, హైస్కూలు, కాలేజీలలో అనేక బహుమతులు గెలుపొందినా, ప్రాథమికంగా చిత్రకళలో పెద్దగా తర్ఫీదు పొందలేదు. అంతా శృతపాండిత్యం. గొప్ప చిత్రాలను చూసి విషయాలను గ్రహించటం, Trial and error method ద్వారా వాటిని ప్రయోగిస్తూ చిత్రాలు గీసేది. క్లుప్తంగా చెప్పాలంటే ఆమెది స్వయంప్రతిభ.

తన అక్కను చూడటానికి అమెరికా వెళ్ళినప్పుడు, అక్కడ నాలుగు నెలలు ఉండవలసి వచ్చింది. అమెరికాలోని డల్లాస్ వద్దనున్న SOFA (Society Of Figurative Arts)లో ఆమె ప్రఖ్యాతిగాంచిన మైఖేల్ మెంటర్ వద్ద చిత్రకళలో శిక్షణ తీసుకుంది. తనదైన ముద్రకోసం అహర్నిశలు శ్రమించి ఒక శైలిని ఏర్పరచుకోగలిగింది.

ఆమె చిత్రాలలో ఎక్కువ భాగం స్త్రీ సౌందర్యానికి, ప్రకృతి రమణీయతకు సంబంధించినవే! ఆమె చిత్రాలలో భారతీయ సహజ జానపద శైలి దోబూచులాడుతుంది. చిత్రాలను వేస్తున్నప్పుడు పొందే భావావేశాలు అప్రయత్నంగా చిత్రాలలో కనిపిస్తాయి. లలిత సుకుమారమైన తేలికపాటి రంగులు శాంతికి ప్రతీక. అవంటే ఆమెకు ఇష్టం. తాను నేర్చుకున్న రేఖలకు, రంగులకు ఒరవడి దిద్దుకుంటూ తనకు తానుగా ముందుకడుగేసింది. కావ్య రెడ్డి మంచి వ్యాసకర్త. చిత్రకళను విశ్లేషిస్తూ చాలా వ్యాసాలు ఆంగ్లంలో వ్రాశారు. ఆంగ్ల భాషలో వచ్చే *ART Phoenix India* మాసపత్రికకు ఆమె సంపాదకురాలుగా పనిచేస్తున్నారు.

గత అయిదు సంవత్సరాలుగా ఆమె చిత్రాలు ముంబయిలాంటి పలు నగరాలలో ప్రదర్శించబడుతున్నాయి. ఆమె చిత్రాలు ప్రపంచ వ్యాప్తంగా అమ్ముడుపోయాయి.

**ముఖచిత్రం : *గోపూజ*.** ఈ ముఖచిత్రం గౌరీ అన్న సీరీస్‌కు సంబంధించినది. ఇందులో ఆవును పూజ చేస్తున్న గౌరి, ప్రక్కన శివుడు చిత్రించబడ్డారు. ఈ చిత్రంలో ఎడమవైపు పైభాగంలో, కుడివైపు క్రింది భాగంలో దేవనాగరి లిపిలో

*శివాయ గౌరి పదారవింద / సూర్యాయ దక్షః ద్వరనాసికాయ*
*శ్రీ నీలకంఠాయా వృషద్వజాయః / తస్మయః సికాయః*
*ఓం నమశ్శివాయః*

అనే శివపంచాక్షరీ మంత్రం లిఖించబడింది.


**రెండవ అట్ట : *మిసిమి*** తో ముఖ్యమంత్రి.

**మూడవ అట్ట :** మీరా కృష్ణులకు సంబంధించినది. ఇక్కడ కృష్ణుడు తన చెంతనే ఉన్నట్టు మీరా ఊహించడంవల్లనే కృష్ణుని మూర్తి కొంత అస్పష్టంగా చిత్రించబడింది.


**నాల్గవ అట్ట : *బిడియమేల***

కావ్యరెడ్డి ప్రస్తుతం హైదరాబాద్‌లో నివసిస్తున్నారు.


**ఫోన్ :** 9160 520 338.




**కావ్యరెడ్డి సంపాదకత్వంలో వెలువడుతున్న ఆంగ్ల పత్రిక**



ధమ్మరక్షిత భంతే, ఆనంద భంతే (జనరల్ సెక్రటరి - మహాబోధి సొసైటీ), ధమ్మాచారి విజయకుమార్, కస్సప భంతే (ఛైర్మెన్), ధమ్మపాల భంతే, శివనాగిరెడ్డి, ఆంజనేయరెడ్డి



ముఖ్యమంత్రితో **మిసిమి** ప్రధాన సంపాదకులు ఆంజనేయరెడ్డి, ప్రభృతులు

ఆగస్ట్ 12, 2016 వ తేదీన బెంగుళూరుకు చెందిన మహాబోధి సొసైటీ బౌద్ధభిక్షులు, **మిసిమి** ప్రధాన సంపాదకులు ఆంజనేయరెడ్డి (ఐ.పి.ఎస్.)గారితో కలసి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబునాయుడుగారిని వారి అధికార ప్రాంగణంలో సమావేశమయ్యారు. ఆ సందర్భంగా విశాఖపట్న తీర ప్రాంతంలో ఒకప్పటి బౌద్ధ విద్యాకేంద్రంగా భాసిల్లి, ప్రస్తుతం అవశేషాలతో కొండపైనున్న తొట్లకొండకు సమీపంలో కొంత ప్రదేశాన్ని బౌద్ధ స్థావరంగా పునర్నిర్మిస్తూ, నిర్మాణం సాగించటానికి బౌద్ధ సంస్థలకు కేటాయించవలసిందిగా కోరిన సందర్భంలో తీసిన ఛాయాచిత్రాలు. వీరి అభ్యర్థనకు గౌరవనీయ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు సానుకూలంగా స్పందించారు. మి

# సుల్తానుల పరిపాలన – తెలుగు భాషాపోషణ

– బి. నాగశేషు

క్రీ.శ. 1206లో బానిస వంశస్థుడైన కుతుబ్ ఉద్దీన్ ఐబక్ భారతదేశంలో ఒక నిర్దిష్టమైన, పటిష్ఠమైన ముస్లిం సామ్రాజ్యాన్ని స్థాపించడం జరిగింది. పశ్చిమోత్తర భారతదేశంపై ముస్లింలు దండయాత్రలు చేయకమునుపే దక్షిణ భారతదేశ తీర ప్రాంతాల్లో ముస్లింలు ఉన్నట్లుగా విశదమౌతుంది. ముస్లిం పాలకులైనప్పటికీ తెలుగు సాహిత్యాన్ని తెలుగు దక్షిణ నాడును సుసపన్నం చేశారు. తెలుగు సాహిత్యాన్ని ఏవిధంగా ముస్లింలు సుసపన్నం చేశారో చర్చించడమే ఈ వ్యాసముఖ్య ఉద్దేశ్యం, ఆంధ్రదేశాన్ని అనేక రాజవంశస్థులు పాలించారు. వారిలో శాతవాహనులు, శాలంకాయనులు, విష్ణుకుండినులు, తూర్పుచాళుక్యులు, కాకతీయులు, రెడ్డిరాజులు, పద్మనాయకలు, సంగమ సాళువ, తుళువ అరవీటి వంశస్థులు, వీరిలో తెలుగు సాహిత్యాన్ని కవులను పెంచి పోషించిన వారు తూర్పు చాళుక్యులు, కాకతీయులు, రెడ్లు, పద్మనాయకులు, వీరి కాలంలో తెలుగు సాహిత్యం వైభవోపేతంగా విరాజిల్లింది. విజయనగర సామ్రాజ్యం అంతమవడంతో బహమని సుల్తానులు బాగా ప్రాభవంలోకి వచ్చారు. బహమని సుల్తానులు 5 భాగాలుగా విడిపోయారు. అందులో గోల్కొండ రాజ్యం ఒకటి. గోల్కొండను రాజధానిగా కుతుబ్‌షాహి రాజులు పదహారో శతాబ్దం అంతం వరకు దాదాపు రెండువందల సంవత్సరాల కాలం పరిపాలించారు. ఈ సుల్తానులు చాలావైభవోపేతంగా పరిపాలించి అన్నిరంగాలకు సమప్రాధాన్యాన్ని కల్పించారు. ముస్లిం పాలకులైనప్పటికీ ఏమాత్రం భాషావివక్ష చూపకుండా తెలుగు భాషను అభ్యసించి తెలుగు భాషా కవులను ప్రోత్సహించి ఆదరించి కొన్ని కావ్యాలను వారే స్వయంగా రచించి కొన్నింటిని అంకితం కూడా తీసుకొన్నారు. కుతుబ్‌షాహి సుల్తానులు పారసీ ఉర్దూ, భాషాభిమానం గలవారైనప్పటికీ ఉర్దూ భాషతోపాటు తెలుగు, సంస్కృతాలను కూడా అదరించారు. కుతుబ్‌షాహి వంశానికి మూలపురుషుడు సుల్తాన్ కుతుబ్‌షా. ఇతడు పర్షియా దేశవాసి. క్రీ.శ. 15వ శతాబ్దంలో భారతదేశం వచ్చి, బహమని సుల్తానులను ఆశ్రయించారు. క్రీ.శ. 1496లో బహమనీ ప్రభువు సుల్తాన్ కులీకి కుతుబ్ ఉల్–ముల్క్ బిరుదిచ్చి తెలుగు దేశంపై అధికారికంగా నియమించాడు.

బహమని ప్రభువు మహమ్మద్‌షా మరణానంతరం సుల్తాన్ కులీకుతుబ్‌షా అనేనామంతో క్రీ.శ. 1512లో స్వతంత్ర్యం ప్రకటించుకొని స్వతంత్ర్యరాజుగా పరిపాలన సాగించాడు. వీరి తెలుగుభాషా పోషణ పొగడదగింది. సుల్తాన్ కులీకుతుబ్‌షా కాలంలో చరికొండధర్మన *చిత్రభారతం* అనే ఎనిమిది ఆశ్వాసాల మహా కావ్యాన్ని రచించాడు. కుతుబ్‌షాహీల కాలంలో చిత్రభారతమే ప్రథమ తెలుగు కావ్యం. ఈ కావ్యాన్ని చిత్తాపఖాను అనే ఎముకల పెద్దనామాత్యునికి అంకితమిచ్చాడు. ఈ సుల్తాను కాలంలోనే ఖమ్మం మెట్టవాసి సహజసారస్వత చంద్రులైన హరిభట్టు 'వరాహపురాణం' మత్స్యపురాణం భాగవతంలో 6, 11, 12 స్కంధాలు ఉత్తర నారసింహ పురాణం మొదలైన కావ్యాలను రచించారు. ఈ కవి 'అష్టఘంటావదాన' మనే గొప్ప బిరుదాంకితుడు. సుల్తాన్‌కులీ కుతుబ్‌షా అనంతరం తన తృతీయ పుత్రుడు జంషీబ్ కుతుబ్‌షా రెండవ సుల్తాన్‌గా రాజ్యాధికారాన్ని స్వీకరించాడు. ఇతను మంచి పండితుడు. ఆంధ్రాభిమానిగా తెలుగుభాషను ఆదరించాడు. ఇతని కాలంలో పిడపర్తి బసప్ప, ప్రభులింగలీల అనే ఐదు ఆశ్వాసాల పద్య కావ్యాన్ని రచించారు. రాజ్యాధికార కాంక్షతో జంషీద్

కుతుబ్‌షా తన సోదరుడైన ఇబ్రహీం కుతుబ్‌షాను అంతమొందించాలనే ప్రయత్నంలో ఉన్నాడు. ఈ ప్రయత్నాన్ని గమనించిన ఇబ్రహీం కుతుబ్‌షా విజయనగరాధీశుడైన అళియ రామరాయలను ఆశ్రయించాడు. ఆ ప్రభావంతో ఇబ్రహీం కుతుబ్‌షా తెలుగు సంస్కృత భాషలను అభ్యసించేలా జరిగింది. ఇబ్రహీం కుతుబ్‌షా కాలంలో అనేకమంది కవులను, పండితులను, పెంచి పోషించారు. తెలుగు కవులు ఈ సుల్తానుపై ఉండే గౌరవంతో 'మల్కీభిరాముడు' అనే బిరుదుతో సంబోధించారు. హిందూ ముస్లిం అనే తేడాలు లేకుండా తెలుగు, ఉర్దూ భాషా బేధాలు లేకుండా సమానదృష్టితో ఆదరించారు. ఇబ్రహీం కుతుబ్‌షా దర్బారులో అద్దంకి గంగాధర కవి, పొన్నగంటి తెలగన అనే ఇద్దరు కవులు ఉండేవారు. అద్దంకి గంగాధర కవి 'తపతి సంవరణోపాఖ్యానం' అనే ఐదు ఆశ్వాసాల శృంగార కావ్యాన్ని రచించి సుల్తానుకే అంకితమిచ్చారు. ఒక తెలుగు కావ్యాన్ని ముస్లిం ప్రభువుకు అంకితమివ్వడం చరిత్రలోనే ప్రథమం. సుల్తాను జాతీయతకు నిదర్శనం. అనూరి మరింగంటి సింగరాచార్యుడుని సైతం కుతుబ్‌షా సత్కరించారు. ఇతను ప్రేమాభిరామము, రామకృష్ణ విజయము, నలయాదవ పాండీయమనే కావ్యాన్ని "రాకాసుధాపూర్ణిమ" దశరాజ నందనచరిత్ర, మొదలగునవి రచించాడు. వీరికి అగ్రహారాలు మొదలైన వాటితో సుల్తాను సన్మానించి గౌరవించారు. ఇబ్రహీం కుతుబ్‌షా సన్మానం పొందిన వారిలో కందుకూరి రుద్రకవి కూడా ఉన్నారు. ఈ కవితన కవితా ఝురిని ఏరులుగా పారించి సుల్తానునేకాక సభికులందరినీ ఆశ్చర్యపరిచి తన కవితా వైదుష్యాన్ని ప్రదర్శించారు.

ఈ కవికి సుల్తాను రెంటచింతల గ్రామాన్ని అగ్రహారంగా ఇచ్చి గౌరవించారు. సుగ్రీవ విజయమనే యక్షగానం, నిరంకుశోపాఖ్యానమనే ప్రబంధం, జనార్ధనాష్టకమనే స్తోత్రం మొదలైన రచనలు ఇతని పాండిత్యానికి నిదర్శనాలు. ఇబ్రహీం సుల్తాను కాలంలోనే కాకునూరి అప్పకవి అనే లాక్షణికుడు 17వ శతాబ్దంలోనే అత్యంత గొప్ప లక్షణ కర్తగా పేరుగాంచాడు. అష్టకవీయం అనే లక్షణ గ్రంథం తెలుగువారిందరికీ సుపరిచతమే. కలబార్ణవం అనే జ్యోతిశ్శాస్త్ర గ్రంథం అంబికా వాదమనే యక్షగానం, అనంతర కల్పం కవి కల్పకం, అనే వ్యాకరణ గ్రంథం శ్రీశైలేశ్వరశతకం మొదలగు గ్రంథాలను వెలువరించి సుల్తాను ప్రీతికి పాత్రుడయ్యాడు. ఇబ్రహీం కుతుబ్‌షా సన్మానానికి పాత్రుడైన అద్దంకి గంగాధరకవి, మరింగంటి సింగరాచార్యులు, కందుకూరి రుద్రకవి అనే కవిత్రయం ఉండేవారు. మేము కవులు అని వచ్చి సుల్తానుకు వచ్చిరాని కవిత్వాలను చదివి వినిపించి అనేక మంది తమబతుకుబండిని ముందుకు లాక్కుపోయేవారు. ఇబ్రహీం కుతుబ్‌షా కాలంలో తెలుగు సాహిత్యం విశేషంగా వికసించిందని చెప్పడానికి చక్కటి ఉదాహరణగా ఒక కవి, బ్రహ్మను సైతం దూషించి బ్రహ్మదేవుడి కంటే సుల్తానే గొప్ప అని కొనియాడారు.

ఉ॥ *"రార విధాత యోరి వినరా, తగురా, తలకొట్ల మారి ని*
*స్సారపు లోభిరాజులను జంపక మల్కిభరామ భూవరున్*
*జారు యశోధనున్ సుగుణి జంపితి వర్థుల కేమి దిక్కురా*
*చేరిన నింతరాజును సృజింపగ నీతరమా వసుందరన్"*

అని వాపోయాడు. సుల్తానుపై ఆ కవికి ఉండే భక్తి పూర్వకమైన ప్రేమ ప్రదర్శించాడు. ఏకంగా బ్రహ్మనే దూషించాడంటే సుల్తాను కీర్తి ఇక ఏ విధంగా విస్తరించిందో అర్థం చేసుకోవచ్చు. ఇబ్రహీం కుతుబ్‌షా కాలంలో హిందూ ముస్లిం భేదభావాలు లేకుండా పరిపాలించాడు. ఈ విషయాన్ని షేక్‌బుడేన్‌సాహెబ్ అనే కవి ఈ కింది విధంగా వర్ణించారు.

కం॥ *"క్షీరములో నీరమువలె*
*దారము సూదియును రెండు దవలిన భంగిన్*
*గూరలలో గారమువలె*
*గూరిమి హిందూ ముసిలిము కూటములమరెన్*

ఈ విధంగా ఇబ్రహీం కుతుబ్‌షా కాలంలో తెలుగు సాహిత్యం శోభాయమానంగా విలసిల్లింది. కుతుబ్‌షా తరువాత మహమ్మద్ కులీకుతుబ్‌షా క్రీ.శ. 1580 నుండి 1612 వరకు రాజ్యాన్ని పాలించారు. ఇతని ఉర్దూ కవిత్వంలో అక్కడక్కడ తెలుగుపదాలు కూడా దొర్లి ఉన్నాయి. తన కవితలను "దివాన్" అనే సంకలనాలుగా వెలువడ్డాయి. ఈ దివాన్‌లు 1800 పుటలతో 50వేల పంక్తులు కలిగి ఉన్నాయి. తన ప్రియురాలి భానుమతిపై చక్కటి కవిత్వం రాశారు.

మహమ్మద్ కులీ కాలంలో చరిగొండ నరసింహకవి 'శశిబిందు చరిత్ర మనే పద్యకావ్యాన్ని రాశారు. వెల్లుట్ల నారాయణకవి వజ్రాభ్యుదయమునే కావ్యం, ఎలకూచి బాల సరస్వతి భర్తృహరి సుభాషితాలను తెలుగులో అనువదించారు. అలాగే భ్రమరగీతమనే ప్రబంధం కార్తికేయాభ్యుదయం, రంగకౌముది అనే నాటకం మొదలగునవి రచించారు.

సుల్తానుచే సన్మానం పొందిన వారిలో నరసయమంత్రి మరొకరు. మహమ్మద్ కులీకుతుబ్‌షా అనంతరం సుల్తాన్ మహమ్మద్ కుతుబ్‌షా క్రీ.శ. 1612 నుండి క్రీ.శ. 1626 వరకు సింహాసనాన్ని అధిష్టించారు. ఇతని పరిపాలన కాలంలో సారంగుతమ్మయ *వైజయంతీ విలాసం* అనే నాలుగు అశ్వాసాల శృంగార ప్రబంధాన్ని రచించారు. దీనికే విప్రనారాయణ చరిత్ర అనే మరొక పేరు కూడా కలదు. మహమ్మద్ కులీకుతబ్‌షా అనంతరం సుల్తాన్ అబ్దుల్లా కుతుబ్‌షా రాజ్యాధికారాన్ని స్వీకరించాడు. క్రీ.శ. 1626 నుండి క్రీ.శ. 1672 వరకు రాజ్యం పరిపాలించారు. ఈ సుల్తాను దర్బారులో సకలవేద వేదాంగా పారంగతులైన పండితులతో, కవులతో నిత్యం కళకళలాడేది. ఇతను కూడా మంచి పండితుడు. ఇతని కాలం ఉర్దూ సాహిత్యానికి స్వర్ణయుగంగా వికసించింది. విదేశాల నుంచి సైతం ఇతని రాజ్యాన్ని దర్శించడానికి వచ్చేవారు. ఈ సుల్తాను కాలంలో గవ్వానీ, ఇజ్జ్నని, షౌతి, అనే ఉర్దూ కవులుండేవారు. గవ్వాని కవి కుశసప్తతికి పారసీ అనువాదమైన తూతీనామాను ఉర్దూభాషలోకి అనువదించారు. ఇతని ఆస్థానంలో గణనాథుడు, తులసిమూర్తి అనే కవులున్నారు. పదకవిత్వంలో ప్రసిద్ధుడు క్షేత్రయ్య సహా ఈ రాజు ఆస్థానాన్ని సందర్శించారు. కర్పూర కృష్ణమాచార్యకవి *భగవద్గీత* ద్విపద కావ్యాన్ని రచించారు. కేసన, మల్లన, కవులు *దాక్షాయణీ పరియణం*, *విష్ణుభజనానందం*. ఎలకూడి విన్నయ ప్రభాకరుడు, *ఆదిత్య పురాణం*, సోమనాథకవి *వసుచరిత్ర*కు విద్వజ్జన మనోరంజనీ వ్యాఖ్యను, యాదవ చరిత్రం, *గంగాగౌరీ సంవాదం* అనే రచనలు చేశారు.

కుతుబ్ షాహీ వంశంలో కడపటి ప్రభువు అబుల్‌హసన్ తానాషా పరిపాలన కొచ్చాడు. క్రీ.శ. 1672 నుండి క్రీ.శ. 1687 వరకు పాలించారు. ఇతను కూడా తన పూర్వ సుల్తానులవలె ఆంధ్రభాషాభిమానియై తెలుగు భాషను సంరక్షించారు. తానీషాన్ తానీషాగా వ్యవహారంలో స్థిరపడ్డారు. ఇతని కాలంలో రామదాసు కీర్తనలు దాశరథీశతకం, కుదుమపల్లి విలాసపు కర్త పానుగంటి జగన్నాథరావు, యతిరాజశతకర్త తిరునగరి వెంకటాచార్యులు ఈ సుల్తాను కాలంవారే.

ఇబ్రహీం కుతుబ్‌షా కాలంలో ప్రముఖ ఉద్యోగి సామంతుడు, సర్దారైన అమీన్‌ఖాన్ కూడా తెలుగుభాషా సాహిత్యాలపై తెలుగు ప్రజలపై ఆదరాభిమానాలు చూపారు. ఇతని కాలంలోనే వేదశాస్త్ర ప్రవీణుడైన మరింగంటి అప్పలాచార్యుడున్నాడు. పొన్నగంటి తెలగనార్యుడు తన ఐదు ఆశ్వాసాల యయాతి చరిత్రను అమీనుఖానుకు అంకితమిచ్చాడు. ప్రథమాంధ్ర అచ్చతెలుగు కావ్యానికి కృతిభర్త అమీనుఖాను ఒక ముస్లిం ప్రభువు కృతిభర్త కావడం, శుద్ధాంధ్రలో ఈ కావ్యం ఉండటం, అనే రెండు విశిష్టలక్షణాలకు దోహదమయ్యింది. తెలుగుభాషను తెలుగు ప్రజలను అంతగా అభిమానించారంటే తెలుగుభాష ఎంత మధురమైందో మనం గ్రహించవచ్చు. రెండువందల సంవత్సరాలు ఆంధ్రదేశాన్ని పరిపాలించారంటే వారి జాతీయభావం, ప్రజల ఆదరణ రెండూ సమతూకంగా ఉన్నాయని అర్థంచేసుకోవచ్చు. దేశం పచ్చగా ఉండాలంటే పాలకులు జాతి, మత, కుల రహిత పరిపాలన అన్ని రంగాల్లోను జరపాలి. కేవలం ఒక్క ప్రాంతానికే ప్రధానులైనట్లు ఒక ప్రాంతానికే ముఖ్యమంత్రులైనట్లు కొంతమంది ప్రవర్తిస్తూ ఆ ప్రాంతాలను మాత్రమే అభివృద్ధి చేస్తున్నారు. అధికారకాంక్ష ఉన్నప్పటికీ ప్రజోపయోగ కార్యక్రమాలు చేపట్టాలి. ప్రజారంజకంగా దేశాన్ని పరిపాలించినప్పుడే ఆ పాలకులు ప్రజలమనసుల్లోచిరస్థాయిగా నిలిచిపోతారు. కొన్ని అవాంతరాలు వచ్చినా అవి ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉంటే అవి తక్షణం చేపట్టాలి. సుల్తానులు పరభాషాజ్ఞానులైనా పరమతస్థులైనా తెలుగు సంస్కృతిని తెలుగు భాషను తెలుగు ప్రభువులకంటే బాగా తెలుగు ప్రజలకు ఉన్నత స్థానాన్ని కల్పించారు. పరిపాలకుల్లో జాతీయభావం తప్పనిసరిగా ఉండాలి. పక్షపాతవైఖరి పాలకుల్లో ఉండకూడదు. దేశప్రజలను ఇంటి మనుషుల్లా భావించుకొని వారికి కావాల్సిన కనీస అవసరాలను తీర్చిదిద్దేలా పాలకులు, ప్రభుత్వాలు ఉండాలి. స్వదేశభాషలను రక్షించాలనే ధృడమైన కాంక్ష పాలకుల్లో గట్టిగా ఉండాలి.



బి. నాగశేషు
బెంగళూరు.
ఫోన్ : 998 550 9053,
905 234 0055

# విపులాచ పృథ్వీ......

జులై ముప్పై – ఇది మంచి రోజో, దుర్దినమో ఎలా తెలుస్తుంది?

ముప్పైఏళ్ళు పైగా సర్కారీ కొలువు వెలగబెడుతున్న ఎస్వో రావుకు ఆరోజు విడుదల! అరె, అప్పుడే జీవితంలో మూడొంతులు పైగా ఖర్చయిపోయిందా? – ఏమి సాధించాడు? ప్రభుత్వ నౌకరీలో ప్రజల సేవకు అవకాశం లేని – ఎవరికీ చెందని ఒక త్రిశంకు స్వర్గంలో 'కంఫర్ట్ జోన్'లో మూడుపదుల కాలం కరిగిపోయింది. కిందవాళ్ళ మీద పెత్తనం – పైవాళ్ళకు చిత్తం. చిత్తం, ఇంతేగదా – ఇంతకంటే అస్తిత్వం ఏముంది – 'జాబ్ సాటిస్‌ఫాక్షన్' ఏమిటి? కిందివాళ్ళకు అసూయ – పైవాళ్ళకు అలుసు.

పని చేయకుండా, అదే, చేయని పనికి జీతం తీసుకుంటూ ఉద్యోగ సంఘాల వత్తిడి, ఆ జీతాలు చాలవని సమ్మెలు, ఉద్యమాలు – పోరాటాలని పడిపట్టు పదాలు – రాజకీయ పార్టీల అండలు – మంత్రుల దండలు – దండగమారి స్లోగన్స్ – కార్మిక కర్షక – దినాలు – మధ్యలో స్త్రీవాద ఉద్యమాలు – అయిదేళ్ళు కొనసాగే ప్రజాపార్టీల ప్రభుత్వాలు – కొత్త మంత్రులు – పాత జీవోలు – ఐ.ఎ.ఎస్.ల అహంకారాలు – దేర్భేద్యమైన సెక్రటేరియట్ గోడలు – బైటకు పోనవసరంలేని ట్రాన్స్‌ఫర్లు – బేఫికర్ పనిగంటలు రాత్రిళ్ళు కాంట్రాక్టు దారుల మర్యాదలు, మందుపార్టీలు – అప్పుడప్పుడు సాంస్కృతిక కార్యక్రమాలు పేరిట నాటకాలు – మేధావి వర్గంగా ముద్రకోసం తాపత్రయం – గ్రూపులు – ట్రూపులు, పైరవీలు లీవులు అమ్ముకోవటాలు – వారాంతపు పేకాటలు – నిన్నటికీ ఇవాల్టికీ తేడా లేకుండా రోజులు దొర్లిపోతుంటే ఆహా జీవితం ఎంత హాయిగా ఉంది అనుకుంటూ 'కాలక్షేపం' చేస్తూ గడిపేనస్తూ ముప్పైఏళ్ళు వయుసు కరిగిపోయింది. బట్టతల – కాటరాక్టూ – ఇంత షుగరూ – కొంత బి.పి. – అన్ని చుట్టుముట్టి – 



చిట్టచివరకు ఇదిగో జులై ముప్పై – వీడ్కోలు సభా – (ఒకరకమైన సంతాప సభ) ఏర్పాటు చేసిన ఇంకా సేవలో సర్వీసులో ఉన్న ఇప్పటివరకు తోడు ఉన్నవారు, ఘనంగా సాగనంపారు – ఎక్కడికి? ముందు ఇంటికి? తర్వాత ఈ విశాల ప్రపంచంలోకి కాని ఈ విశాల ప్రపంచంలోకి తనని ఆహ్వానించటానికి ఎవరూ సిద్ధంగా లేరు.

కొన్నాళ్ళు జులై 30 కి ముందు 'పదవీ విరమణ' వయసు మరో రెండేళ్ళు పెంచుతారని, ఎన్నికల ముందు వచ్చిన వాగ్దానాలను నమ్మి, ఇంకా రెండేళ్ళుందని జులై 30 ని సీరియస్‌గా తీసుకోలేదు. కానీ, ఎన్నికల మాటలు నీటిమూటలేనని తెలియటానికి జులై 30 దాటిపోయింది.

ఇన్నాళ్ళు ఏ వ్యాపకం పెట్టుకోకుండా గడిపి (వ్యసనాలే వ్యాపకాలు) ఇప్పుడు రోజంతా ఏమిచేయాలి? ఎంతసేపని టి.వి. చూస్తాడు? ఎప్పుడూ ఏ పనీ చెప్పని ఇల్లాలు – హెరిటేజ్‌కెళ్ళి కూరగాయలు, వగైరాలు తెచ్చిపెట్టండి – అటుంటే అదోమాదిరిగా ఉంది. ఎప్పుడైనా ఓ తెలిసిన ముఖం తను దినవెచ్చాలు తీసుకు రావటం చూసి, 'ఏమిటి రావూ ఈ టైమ్‌లో, సెలవా?' అని సాగదీస్తుంటే 'లేదు, సాగనంపా'రని చెప్పటానికి ఎన్ని తిప్పలు పడాలి?

ఏనాడూ ఆఫీస్‌కి రావటానికి హైదరాబాద్ రోడ్లు ఎలా ఉన్నాయి, ట్రాఫిక్ కష్టాలేమిటి? ఈ విషయాలేమీ తెలియకుండానే గడిచిపోయింది. ఇప్పుడు ఏ రోడ్‌లో ఎన్ని గుంటలున్నాయో లెక్కపెట్టుకుంటూ తిరుగుతున్నాడు. కొన్నాళ్ళు మార్నింగ్ వాక్‌లూ అయిన తర్వాత, మోకాళ్ళ ఆపరేషన్ చేయించుకొని, హాస్పిటల్ నుంచి ఇంటికి చేరుకుని, నెలరోజుల ఫిజియోతెరఫీ తర్వాత అప్పుడే నడక నేర్చుకుంటున్నవాడిలా తప్పటడుగులతో, ఇరుకైన విశాల ప్రపంచంలోకి అడుగుపెట్టాడు ఎస్వో రావు. ఈ విశాల ప్రపంచంలో తనకెవరూ తెలియదు. అంతా కొత్తగా ఉంది. ప్రతి చిన్న విషయానికీ ప్రక్కవాడితో పోటీపడాలి. తెలియని శత్రువుతో పోరాటం చేయాలి. ఇవన్నీ అలవాటుపడని రావుకి విశాల ప్రపంచం చాలాచాలా ఇరుకిరుకుగా దర్శనమిస్తోంది.

ఉప్పలూరి...


## కొడిగట్టని చింతనాగ్ని

# జి.వి.కె. కృష్ణరావు

*– బి.వి. రామిరెడ్డి*

**జి**.వి.కె.గా ప్రసిద్ధులైన డా. జి.వి. కృష్ణరావుగారు బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆయన కవి, నాటకకర్త, నవలా రచయిత, కథకుడు, విమర్శకుడు, పండితుడు, వ్యాసకర్త, పరిశోధకుడు. అలంకార శాస్త్ర సిద్ధాంతాలను ఔపోసనపట్టిన అగస్త్యుడు, ప్రాక్పశ్చిమ తత్త్వశాస్త్రాలను ఆమూలాగ్రంగా అధ్యయనం చేసిన తత్త్వవేత్త, హేతువాది, బుద్ధిస్టు. తాను సాధించుకున్న జ్ఞానఫలాలను సమాజానికి సమర్పించి, వ్యక్తిగా మనిషికి, సమిష్టిగా సమాజానికి కనువిప్పుగా హృదయ సంస్కారమూ కలిగించేందుకు కృషిచేసిన స్రష్ట. ఇన్ని ప్రత్యేకతలు ఒకే వ్యక్తిలో మూర్తీభవించడం అరుదుగా చూస్తాం. కృష్ణరావు శిష్యులు వారిని ఆంగ్లపండితుడుగా డాక్టర్ జాన్సన్‌తో పోల్చారు. డాక్టర్ జాన్సన్ ఒక సాహితీ యుగం మొత్తాన్ని తనచుట్టూ తిప్పుకున్నాడు. ఆ యుగపు సాహితీ స్రష్టలందరు ఆయన్ని నీడలా అంటిపెట్టుకుని తిరిగారు. కాని కృష్ణరావుది ఏక వీర సైన్యం. ఒక్కడుగా ఎవరికీ తలవొంచక, తాను నమ్మిన విలువల కోసం తన గమ్యాన్ని చేరే వరకు ఎన్నో ఒడిదుడుకులను, జీవన సమస్యలను ఎదుర్కొంటూ యులిసిస్‌లాగ తమ గమ్యం వైపు సాగిపోయారు.

లోకంలో చాలామంది మేధావులు, కవులు, రచయితలు, తాత్త్వికులు జీవితంలో ఒక స్థాయి వరకు ఎదిగి, ఏదో ఒక మజిలీలో స్థిరపడిపోతారు. కాని కృష్ణరావుగారు స్కూలు విద్యార్థి దశ నుండి కడదాకా ఎక్కడా అలసిపోక, ఆగిపోక నిరంతరమూ పరిణితి చెందుతూనే వచ్చారు. ఆయన ఏ వాదంలోనూ, నాదంలోనూ ఇమడలేదు, ఆగిపోలేదు. అదే వారి ప్రత్యేకత. ఆ విధంగా ఆయన నిత్య పరిణామ శీలి, ప్రగతిశీలి. ఆయన నిరంతర అధ్యయనమే అందుకు దోహదం చేసిందనిపిస్తుంది. హైస్కూలు విద్యార్థిగా ఉన్నప్పటి నుండే కృష్ణరావు గారు భాషాధ్యయనం ప్రారంభించారు. ప్రశ్న పత్రాలకు సమాధానాలు వ్రాసి, మంచి మార్కులు సంపాయించాలనే తాపత్రయాన్ని ప్రక్కనపెట్టి, ప్రశ్న పత్రంలోని వ్యాకరణ దోషాలను విశ్లేషించడానికే సాహసించారంటే, భాషమీద పట్టు సాధించేందుకు ఆయన అంత చిన్న వయసులోనే తమ కృషిని కొనసాగించడం కనిపిస్తుంది. ఈ సంఘటన చదువుతున్నప్పుడు మనకు 'సరస్వతీపుత్ర' శ్రీ పుట్టపర్తి నారాయణచార్యులవారు గుర్తొస్తారు. నారాయణాచార్యుల వారికి పదవతరగతి పరీక్ష వ్రాద్దామనిపించి ఆ పరీక్షకు కూర్చున్నప్పుడు సంవత్సరాంతపు పేపరులో వారే



జి.వి.కె. కృష్ణరావు

రచించిన 'పెనుగొండ లక్ష్మి' పద్య కావ్యాన్నించి కొంత భాగాన్ని పదవ తరగతి పాఠ్యపుస్తకంలో పద్యభాగంగా ఇవ్వబడింది. అదే పద్య భాగం మీద ప్రశ్న పత్రంలో ప్రశ్న అడగబడిందట. నారాయణాచార్యులవారు అదే ప్రశ్నకు సమాధానంగా మొత్తం సమయమంతా విశ్లేషించారట. ఫలితం ఏమిటో మనకు తెలుసు. పాండిత్యం కోసం జీవితాన్ని అర్పించుకున్నవారి స్వభావరీతి అలా ఉంటుంది.

కృష్ణరావుగారు స్కూలు విద్యార్థిగా ఉన్నప్పుడే తరగతిలో బ్లాక్‌బోర్డు మీద తనకు నచ్చని ఉపాధ్యాయుడి మీద పద్యాన్ని వ్రాసి స్కూలు నుండి బదిలీ పత్రం తీసుకున్నారంటే తప్పును, అన్యాయాన్ని సహించలేని వారి స్వభావం అర్థమవుతుంది. ఆ కాలంలోనే బ్రాహ్మణ వాదానికి వ్యతిరేకంగా ఉద్యమం నడిచింది. కవిత్వం, వ్యాకరణ శాస్త్రం, పాండిత్యం, అలంకార శాస్త్ర అవగాహన, ఛందస్సు కావ్య శాస్త్ర విషయాల్లో తిరుగులేని జ్ఞానం మొదలైనవాటిలో బ్రాహ్మణులేతప్ప అబ్రాహ్మణులు వీటిమీద అధికారాన్ని సాధించలేరనే బ్రాహ్మణాధిపత్య వాదానికి వ్యతిరేకంగా అబ్రాహ్మణ రచయితల సంఘం ఆవిర్భవించింది. కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరిలాంటి ఉద్దండులు సూతాశ్రమాన్ని స్థాపించి, బ్రాహ్మణవాదానికి వ్యతిరేకంగా సూతపురాణం, శంబుకవధ, పల్నాటి భారతంలాంటి కావ్యాలు రచించి ఎందరో అబ్రాహ్మణ రచయితలకు స్ఫూర్తినిచ్చారు. కృష్ణరావు అష్టావధాన శతావధానం చేయడంలోను, సంస్కృతంలో వ్యాకరణ, అలంకార శాస్త్రాల మీద అధికారం సాధించటంలోను ఆ స్ఫూర్తి కనిపిస్తుంది. అందరి విద్యార్థుల్లాగ టాలాటోలీ చదువులుకాక కృష్ణరావు విద్యార్థిగా ప్రారంభ దశ నుండి తాము దృష్టిపెట్టిన ప్రతి అధ్యయనం మీద సంపూర్ణమైన కృషి చేశారు. కృష్ణరావు జీవితంలో ఆదినుండి అంతందాకా, సవ్యసాచిలాగ ఒకవైపు గాఢమైన అధ్యయన శీలత, రెండోవైపు వివిధ ప్రక్రియలలో సాహితీ సృజన చేస్తూ పయనించారు. కృష్ణరావు తాను తెలుసుకోదలచిన విషయం మీద

సంపూర్ణతను సాధించుకునే పట్టుదలతో కృషిచేసేవారు. అది అలంకార శాస్త్రమైనా, తత్త్వశాస్త్రమైనా, బౌద్ధ ధర్మం అయినా. అయితే, అలా పాండిత్యాన్ని సాధించుకున్నవారు ఎక్కువమంది పండితులుగా విమర్శకులుగా స్థిరపడిపోతారు. తను పాండితీ ప్రకర్షను చాటుకోవడంలోనే సంతృప్తిపడతారు కాని కృష్ణరావులాగ తమ పఠనానుభవాలను, పాండిత్యాన్ని సాహితీ సృజనకు భూమికగా మార్చుకున్నవారు అరుదుగా కనిపిస్తారు. కృష్ణరావు అలాంటి అరుదైనవారు. ఆయన ఎమ్.ఎ. ఆంగ్లం చదువుతూనే ఎమ్.ఎ. తెలుగు విద్యార్థులకు పాఠ్యగ్రంథంగా నిర్ణయింపబడిన 'కావ్యజగత్తు'ను వ్రాయగలిగారు. గాఢము, గూఢము అయిన పాండిత్యం అవగాహన కోసం ఉపయోగపడాలనీ, అది సామాజిగావగాహనకు దోహద పడాలనీ, సామాజిక స్వభావ స్వరూపాలను సమాజానికి ఎత్తిచూపే సాహితీదర్పణంగా ఉపయోగపడాలనేది కృష్ణరావుని చూస్తే అర్థమవుతుంది.

చాలామంది సాహితీకారులు తమ సృజనతో సంతృప్తిపడిపోతారు. సంతృప్తి మానవ ప్రగతికి శతృవంటారు కొందరు. సంతృప్తి చెందనివారు ఎక్కడో ఒక మజిలీలో ఆగిపోతారు. కృష్ణరావు నిరంతర పరిణామశీలి. ఆయన పఠనంలోను, జ్ఞానంలోను, సృజనలోను, నమ్మకంలోను, ఆలోచనా ధోరణిలోను ఒక నిరంతర చలన శీలత, పరిణామక్రమం, మార్పుచేర్పులు కనిపిస్తాయి. యువకుడుగా ఆయన మార్క్సిస్టు, కౌమారంలో రాయిస్టు, తరువాత హ్యూమనిస్టు, జ్ఞానసూర్యుడు పశ్చిమాకాశంలో ఒరిగాక బుద్ధిస్టు. వీటన్నిటినీ కలిపి కట్టే దారంలా అంతర్లీనంగా రేషనలిస్టు. చాలామంది సాహిత్యకారులు జీవన గమనంలో ఉద్యోగాలు చేస్తూ పట్టణాలకు వలసపోయి పరాయీ కరణకు లోనవుతారు. కృష్ణరావుగారు అలాకాక, తాను పుట్టి పెరిగిన మూలాలను మరచిపోకుండా పల్లె జీవితాల్లో అన్ని మానుష అమానుష లక్షణాలను, స్వచ్ఛతను, మురికిని విశ్లేషించి వాటిని కడిగి శుభ్రపరిచేందుకు, మనుషులుగా మార్చేందుకు కావలసిన హృదయ సంస్కారాన్ని తమ రచనల ద్వారా అందించారు. పల్లె జీవితాలను ప్రభావితం చేసే, పాడుచేసే వక్ర రాజకీయ ప్రభావాలను అప్పుడే పసిగట్టి, అవి జీవితాలను ఎలా వక్రీకరిస్తాయో చూపి, అప్రమత్తంగా ఉండమని ఉద్బోధించారు. జీవితం అన్నిటికన్నా విలువైనది, ఉన్నతమైనది. క్షణికమూ, వక్రమూ అయిన రాజకీయాలకు, డబ్బు వ్యామోహానికి, అధికార దర్పానికి, మూర్ఖపు పట్టుదలకు దాన్ని చేజేతులా బలిచేసుకోరాదని ఆయన తన రచనల ద్వారా హెచ్చరించారు. ఆకలి మనిషికి శత్రువు. మనిషి జ్ఞానాన్ని, సంస్కారాన్ని, విచక్షణని, ఓర్పును అది చంపేస్తుంది. అందుకే ఆకలితో అలమటించేవాడికి కావలసింది ఆహారం. దాన్నిచ్చి అతని ఆకలిని తీర్చకుండా వేదాంతాన్ని బోధించినందువల్ల ప్రయోజనం లేదన్నాడు స్వామి వివేకానంద. కృష్ణరావుగారు నిరుద్యోగిగా ఆర్థిక సమస్యల్లో ఉన్నప్పుడు తమ మార్క్సిస్టు దృక్పథంతో మహాభారతంలోని వ్యాసుడు కాశీమీద కోపించి, శపించబూనిన ఘట్టాన్ని 'భిక్షపాత్ర' పేరుతో రచించిన నాటకం ప్రసిద్ధం. స్వానుభవంతో వ్యాసుడి స్థితిని కృష్ణరావుగారు అద్భుతంగా చూపించారు.

కృష్ణరావుగారి 'భిక్షపాత్ర' వారికి మంచి నాటక రచయితగా గుర్తింపు తెచ్చింది, రేడియో ద్వారా ప్రసారం అయింది, పదహారు భాషల్లోకి అనువాదమయింది. అంతేగాక, వారి పరిశోధన ఫలితానికి తోడ్పడింది. ఈ నాటికను ఆంధ్ర విశ్వవిద్యాలయం ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో ప్రదర్శించారు. ఆ ప్రదర్శన విశ్వవిద్యాలయం విద్యార్థుల మనసుల్ని దోచుకోవడమేగాక అప్పటి విశ్వవిద్యాలయం రిజిస్ట్రారు సర్ కూర్మా వేణుగోపాలస్వామి నాయుడుగార్ని మెప్పించింది. కృష్ణరావుకి తెలుగు సాహిత్యంలో ఎమ్.ఎ. డిగ్రీ లేదు. ఆయన ఆంగ్ల సాహిత్యంలో కూడ ఎమ్.ఎ. డిగ్రీ తీసుకోలేదు. బెనారస్ విశ్వవిద్యాలయంలో ఎమ్.ఎ. ఆంగ్లం చదువుతూ, ఆర్థిక సమస్యలతో మొదటి సంవత్సరం చివర్లోనే చదువు మానివేసి వచ్చేశారు. ఇటు తెలుగులోను అటు ఆంగ్లంలోను ఎమ్.ఎ. డిగ్రీ లేని కృష్ణరావు ప్రఖ్యాత తెలుగు ప్రబంధం పింగళి సూరన రచించిన 'కళాపూర్ణోదయం' మీద ఆంగ్లంలో పరిశోధనా పత్రాన్ని వ్రాశారు. దానిని పరిశీలను ఆంధ్ర విశ్వవిద్యాలయం తీసుకోవడానికి నిరాకరించడంతో సర్ కూర్మా వేణుగోపాలస్వామి నాయుడిగారి సిఫారసుతో మద్రాసు విశ్వవిద్యాలయానికి సమర్పించి, పి.హెచ్‌డి. పట్టాతోపాటు పతకం కూడా సాధించుకున్నారు కృష్ణరావు! అదీ తెలుగు ప్రబంధం మీద ఆంగ్లంలో పరిశోధనా వ్యాసాన్ని సమర్పించి సాధించారు!! అదో అపురూపమైన విషయం. ఆయన తెనాలి వి.ఎస్.ఆర్. కళాశాలలో పదేళ్ళపాటు ఆంధ్రోపన్యాసకులుగా పనిచేశారు. అక్కడ యాజమాన్యంతో పడక, ఉద్యోగాన్ని వదిలి, ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో మరో పది సంవత్సరాల పదవీ విరమణ వరకు పనిచేశారు. కృష్ణరావుగారు స్వభావితః వ్యక్తివాది. ఎవరి అధికారానికీ

తలవొంచేవారు కాదు. ఆయన అధ్యాపక ఉద్యోగాన్ని కూడా మనసు నొచ్చుకునే మానివేశారని ఎరిగినవారంటారు. మరి ఎన్నో కట్టుబాట్లు వ్యక్తిత్వాన్ని ఇబ్బందిపెట్టే వాతావరణమూ ఆవరించుకుని ఉండే ఆకాశవాణిలో వారు ఇమిడిపోవడం ఆశ్చర్యమనిపిస్తుంది. అయితే, ఆకాశవాణిలో ఆయనతో కలిసి పనిచేసినవారు ఆయన స్వభావాన్నెరిగినవారు అవడంవల్లా, తమ సృజనాత్మకతకు ఇబ్బందు లేకపోవడంవల్లా, తమ నాటికలను రేడియో గౌరవించి, ఉపయోగించుకోవడంవల్లా ఆయన సంతృప్తి చెందారనిపిస్తుంది.

అధ్యాపకుడిగా, రచయితగా కృష్ణరావుగారు నిజమైన బోధకులు. అధ్యాపకునిగా తన విద్యార్థులకు, రచయితగా తన సమాజానికి ఆయన గొప్ప బోధన చేశారు. తన జ్ఞాన తృష్ణతో ఆయన పఠించి, శోధించి, అనుభవించి, భావించి, తెలుసుకున్న విషయాలను గ్రంథరూపంలో మనకిచ్చి పోయారు. నిజమైన అధ్యాపకుడు తాను జీవించిన సమాజం నుంచి ఎంతో పొందుతాడనీ, ఎంతో జీవన జ్ఞానాన్ని గ్రహించుకుంటాడనీ, ఆ విధంగా అతడు సమాజానికి ఋణపడతాడనీ, అందుచేత తన జీవన ప్రయాణాల్ని ముగించేలోపల తాను సాధించిన జ్ఞానాన్ని పుస్తకాల రూపంలో సమాజానికిచ్చేసి తన రుణం తీర్చుకోవలసి ఉంటుందనీ రైట్ ఆనరబుల్ వి.ఎస్. శ్రీనివాసశాస్త్రి అన్నారు. ఆ విధంగా కృష్ణరావు సమాజానికెంతో అవగాహన కల్పించే రచనలిచ్చారు. పండితులంటారు – గొప్ప గ్రంథాలను పఠించి, పరిశోధించి, వాటి అంతరంగ రహస్యాలను తమ విమర్శతో, విశ్లేషణతో మనకు విడమరిచి చెబుతారు. భావుకులంటారు – తమ భావనాశక్తితో ఎన్నో గొప్ప రహస్యాలను తమ అవగాహనలోకి తెచ్చుకుంటారు. వాటిని వివిధ సాహితీ రూపాలలో సాటి మానవులకిచ్చి, ఆత్మల్ని మేల్కొలిపి, జ్ఞాన నేత్రాలను, విప్పార్చి, సామాజికుల్ని ఆలోచింపజేస్తారు. హేతువాదులంటారు – గుడ్డిగా మతం అనో, సెంటిమెంట్ అనో, ఎవరో చెప్పారనో నమ్మక, శాస్త్రీయ దృక్పథంతో నిగ్గు తేలిన విషయాలనే రచనల రూపంలో మనకందిస్తారు. తత్త్వవేత్తలంటారు – ప్రాక్ పశ్చిమాల భేదాలు లేకుండ ప్రపంచంలోని అన్ని తత్త్వ చింతనాపథాలను కూలంకషంగా చర్చించి, జీవితంతో పోల్చుకొని, విలువలతో రంగరించుకుని, తాత్త్వికసారాన్ని మన జీవితాలకు అన్వయించుకునేందుకు తోడ్పడతారు. కృష్ణరావుగారిలో వీరినందరినీ సమగ్రంగా చూస్తాం. ఆశ్చర్యం ఏమిటంటే హేతువాదీ, తాత్త్వికుడూ ధృవాల్లాంటివారు. వీరిద్దరూ ఒకే వ్యక్తిలో కలిసి కనిపించరు. కాని, కృష్ణరావుగారిలో ఈ విరుద్ధ వ్యక్తులు కనిపిస్తారు. ఇదొక వైరుధ్యం అనిపించవొచ్చు. కాని, కళలు, శాస్త్రాలు, జీవితాన్ని విడిచి సాముచేసేవి కావు. అవి జీవితంలోంచి విడదీయరానివి. కృష్ణరావులో ఇవన్నీ మనకు పరిణామ దశలుగా అర్థమవుతాయి. కృష్ణరావు అన్నింటినీ జీవితానికి అన్వయించి, సమగ్ర జీవితానికి మార్గం చూపారు.

ఇన్ని రంగాలలో విశేషంగా కృషిచేసి ఇంతగా ఎదిగిన కృష్ణరావుకి రావలసినంత గుర్తింపు రాలేదనిపిస్తుంది. ఆయన తన ఔన్నత్యాన్ని ఎన్నడో నిరూపించుకున్నారు. మార్క్సిజం నుంచి ఫ్రాయిడ్ సిద్ధాంతాల దాకా ఒక భాషలో ఒక కవి, రచయిత సమాజాన్ని మేల్కొలిపి సంస్కరించే గొప్ప కృషిని కొనసాగించినప్పుడు, జాతికి హితం కలిగించే సాహితీ రూపాల్లో గొప్ప రచనలు చేసినపుడు అలాంటి రచయితలను, కవులను గుర్తించి, గౌరవించుకోవడం ప్రజలే కాదు, ప్రజా ప్రభుత్వాలది కూడాను. కాని, తెనాలిలో శ్రీ బెజవాడ గోపాలరెడ్డి అధ్యక్షతన వారి మిత్రులు, అభిమానులు, సహోధ్యాయులు, విద్యార్థులు చేసిన సన్మానంలాంటివి మరెన్నో ఆయనకు జరగవలసింది. అలా జరగకపోవడం లోపమనిపిస్తుంది. బాధేస్తుంది, మెచ్చుకోళ్ళు లేనంత మాత్రాన ఆయనకు, ఆయన కృషికి వచ్చే న్యూనత ఏమీ లేదు. కృష్ణరావు జీవిత కాలంలోనే వారి రచనలకు గొప్ప గుర్తింపు వచ్చింది. అవార్డులంటారా వాటిని పొందటానికి ఏమేం చేయాలో, ఏం చేస్తున్నారో అవి ఎవరికి వస్తున్నాయో, ఎలా వస్తున్నాయో మనం చూస్తూనే ఉన్నాం. కృష్ణశాస్త్రిని సంబోధిస్తూ చలం ఎప్పుడో అన్నారు కదా – 'శాస్త్రిగారూ! ఊర్వశి గాఢాలింగన ప్రవాసీ!! వెలితి మనుషుల వెకిలి సన్మానాల్లో సంతుష్టిని వెదకజూశారా!!" అని. అయితే, కృష్ణరావులాంటి బలమైన వ్యక్తిత్వం కలవారు తమ పఠనంలోంచి, అందువల్ల దక్కిన జ్ఞానానందంలోంచి, కలిగిన భావోత్సాహం హృదయాన్ని నిలవనీయని అసంతృప్తి, తన గ్రంథాలు పఠితల్లో రేపిన జ్వలనం చలనం వాటిని చూసినప్పటి గర్వం – వీటికన్నా గొప్ప సన్మానాలు, పురస్కారాలు ఉంటాయని ఆయన అనుకోలేదేమో. వారు మేధావుల్లో మేధావిగా, జ్ఞానుల్లో జ్ఞానిగా, కవుల మధ్య కవిగా, మనుషుల మధ్య మానవతావాదిగా, తాత్త్విక చర్చల మధ్య తాత్త్వికుడుగా నిండుగా జీవించి వెళ్ళిపోయారు. వారి చింతనాగ్ని ఇప్పటికీ జ్వలిస్తూనే ఉంది.

బి.వి. రామిరెడ్డి, రుద్రవరం, కృష్ణాజిల్లా.
ఫోన్ : 990 885 6530

# పోయన్, లేకబోయన్ అది కులనామమే

*– భీమనాధుని శ్రీనివాస్*

ఏప్రియల్ 2016 **మిసిమి** మాసపత్రికలో 'ఆలపాకం' అనే వ్యాసంలో గౌరవనీయులు పలగాని గోపాలరెడ్డి గారు 'పోయన్' అనేది పదవినామమే కానీ కులనామం కాదని, చరిత్రకారులు పొరపడి 'రాచరికపు' చరిత్రతో సంబంధం లేని ఒక ఆటవిక బోయ జాతికి ఆటవిక నామాన్ని కట్టబెట్టారని ఆ విషయాన్ని మరలా చరిత్రకారులు పునస్సమీకరించాలని ప్రస్తావించారు.

వారి అభిప్రాయం తెలియజేయడం సబబుగానే ఉంది. కానీ ఆటవికులకు చరిత్ర లేదన్నట్లు పేర్కొనడం బాధాకరం.

చరిత్ర లోతుల్ని పరికించి చూస్తే ఆటవిక వీరుల చరిత్ర అవగతమౌతుంది, నేను సేకరించిన కొంత సమాచారాన్ని కూర్చి వ్యాసంగా రాస్తున్నాను.

పురాణ సంప్రదాయం ప్రకారం సామాజిక నిర్మాణంలో మార్పుని సాధించిన మాగధరాజు బింబిసారుడు, శిశు నాగవంశానికి చెందిన ఆటవికుడు. ఈ శిశు నాగవంశాన్ని బ్రహ్మణ పురాణాలు చాలా హీనంగా చూశాయి. 'నాగ' అనేది వైదిక ఆర్యులు ఆటవికులకు వాడిన పేరు. అలాగే కోసలరాజు ప్రసేనజిత్తు, ఇక్ష్వాకు వంశీయుడిగా చెప్పుకొన్నాడు. ఇతడు 'నాగముండా' అనే ఆటవిక స్త్రీ యొక్క కుమార్తెను వివాహమాడాడు. 'ముండా' అనేది ఇప్పటికి బీహార్ ప్రాంతంలో ఉన్న ఒక ఆటవిక తెగ పేరు నేటి నెల్లూరు జిల్లాలోని ప్రాంతాన్ని 'ముండా రాష్ట్రం' అనేవారు. ఈ ఆధారములనుబట్టి భారతదేశ చరిత్రలో మొట్టమొదటి సర్వసత్తాక రాజ్యాలను స్థాపించిన సార్వభౌములు ఆటవికులని తేటతెల్లమౌతుంది.

బోయుల పరాక్రమాన్ని గురించిన గాథలు గాథాసప్తశతిలో కోకొల్లలున్నాయి. బోయరాజ్యాలు పతనమైనప్పటికి తెలుగు భూమిలో బళ్ళారి, అనంతపురం, కర్నూలు, చిత్తూరు, కర్నాటకలోని గుల్బర్గా, రాయచూరు, కోలారు, చిత్రదుర్గ, తూమ్‌కూరు తమిళనాడులోని ఉత్తర ఆర్కాట్, చెంగల్పట్టు జిల్లాలలో చిన్నచిన్న పాళెగాళ్ళుగా పిలువబడుతున్నారు. బోయలలో వాల్మీక బోయ, నాగబోయ అనే రెండు శాఖలున్నాయి.


తమిళ సంఘ సాహిత్యంలో వడుగర్లు (తెలుగు ప్రజలు) వేటగాళ్ళు వేటకుక్కల్ని వెంటబెట్టుకొని తిరుపతి చిట్టడవుల్లో వేటాడేవారని వారు మేకలు, గొర్రెలు, గేదెలు, ఏనుగులువంటి జంతువుల్ని మచ్చిక చేసుకొనేవారని మరికొన్ని జంతువుల్ని వేటాడేవారని చెప్పబడింది. ఇదే సంఘసాహిత్యంలో 'పట్టు' అనే మాటకు చిట్టడవి అనే అర్థం ఉంది. నెల్లూరు, చిత్తూరు జిల్లాలలో చిట్టడవులు వ్యాపించి ఉన్న ప్రాంతాలు ఎరికంపట్టు, ఎగువపట్టు, దిగువపట్టు, కీలపట్టు, వీలపట్టు, పూతలపట్టు, మురకంపట్టు, చెంగలపట్టు, కొన్నెంపట్టు, మంపట్టు, పెరియపట్టు, నేలపట్టు, ఎదురుపట్టు వంటి అనేక పేర్లలో పట్టు అనే మాట 'పట్టు' నుండి వచ్చినట్లు స్పష్టమౌతుంది.




నెల్లూరు జిల్లా దక్షిణ మండలాలలోను చిత్తూరు జిల్లా తూర్పు మండలాలలోను వ్యాపించి ఉన్న చిట్టడవులు వేటగాళ్ళకు తొలినాళ్ళలో ఆవాస కేంద్రాలని చెప్పవచ్చు. కనుకనే

ఆ ప్రాంతాల పేర్లలో 'వేడు' అనే మాట నిలచి ఉంది. 'వేడు' అంటే తమిళంలో వేట, వేటాడేచోటు అని అర్థం ఉంది. ఉదా : సత్యవేడు, కడివేడు, కదిర్‌వేడు, కచర్‌వేడు, కానమానంవేడు, మాద్రివేడు, మదనంవేడు, కొటరవేడు, ఆయనవేడు, కురచ్చివేడు, వటంవేడు, వీలవేడు, పులివేడు, వాగవేడు వంటి మొదలైన పేర్లను చెప్పవచ్చు.

వేటగాళ్ళకు సంబంధించిన చారిత్రిక ఆధారములను పరిశీలించినట్లైతే గ్రామణి గ్రామానికి లేదా తెగకు చెందిన సైనిక (దండు) సమూహానికి నాయకత్వం వహించేవాడు. మౌర్యుల కాలానికి ముందుగానే గ్రామణి గ్రామపెద్దగా మారాడు. గ్రామ పెద్దని గ్రామ భోజక, గ్రామవృద్ధ అని కూడా శాసనాలలో ఉంది. బింబిసారుడు 86,000 మంది గ్రామ పెద్దలను రాజధానికి పిలిచినట్లు ఆధారాలున్నాయి. గ్రామపరిపాలన గ్రామపెద్దల చేతుల్లో ఉండేది. ఈ గ్రామ పెద్దలు తమ తెగ సైన్యాలకు నాయకులుగా ఉండి కొందరు యోధులను, విలుకాళ్ళను సంసిద్ధులను చేసి కొన్ని యుద్ధ సందర్భాలలో రాజు గారి సేనలతోపాటు తమ దళాలకు సారథ్యం వహించేవారు.



సాలంకాయన వాన, శాసనాలలో *'ముతుద పమూహాగామోభాని తవ్వో'* అనే తొలి ప్రాకృత పాఠం సంస్కృత శాసనాలలో *'ముతుద ప్రముఖః గ్రామేయక వక్తవ్యాం లేదా ముతుద సహితానే గ్రామేయకాన్ సమాజ్ఞాపయతి'* అని ఉంది. ఈ పదప్రయోగాలనుబట్టి 'ముతువ' అంటే తెలుగులో ఊరికాపు, గ్రామ రక్షకుడు, నాయకుడు అని అర్థం. సాలంకాయన పత్రాలన్ని విధిగా 'ముతుద'ను సంబోధించి రాసినవే. ఈ గ్రామ సంస్థ హోదా తరతరాలుగా వస్తూ ఉండేది. కనుక ఈ విధానాన్ని చక్రవర్తులు గౌరవించేవారు. గ్రామాధిపతి 'ముతుద' ప్రజల నుండి రాజుగారికి రావలసిన సుంకాలను వసూలు చేయడం, గ్రామంలోని శాంతిభద్రతలను కాపాడటం వంటి బాధ్యతలు కలిగి ఉండేవాడు. ఇతడు కొంత భూభాగాన్ని అనుభవించేవాడు కనుక భోగికుడు లేక భోగిక గ్రామభోజక వేటువ, గ్రామేయన్ వంటి పేర్లతో పిలువబడేవారు.

చక్రవర్తులు పరిపాలనా సౌలభ్యం కోసం తమ రాజ్యాన్ని భోగాలుగా విభజించి వాటి పాలనా బాధ్యతలు స్థానిక నాయకులైన వేటగాళ్ళకు అప్పగించేవారు. కనుక భోగాల పాలకులైన భోజులు తమ బస్తీల చుట్టూ రక్షణ అవసరాల నిమిత్తం ఓ మాదిరి కొట్టాలను నిర్మించుకొంటారు. పల్లవ రాజ్యంలో భోగ – కొట్టంలు లేక బోయకొట్టాలు అని పిలిచేవారు. శ్రీలంక బౌద్ధుల చరిత్ర రచనల్లో మొత్తం పల్లవ రాజ్యాన్ని పల్లవ భోగం లేదా పల్లవ భోగ్గం అనే ప్రస్తావన ఉంది. కృష్ణానది దక్షిణ తీరంలోని ప్రత్యేక ప్రాంతాన్ని బోయ – విహార్ – దేశమనే పేరు ఉంది (ఆంధ్రప్రదేశ్ సమగ్ర చరిత్ర – సంస్కృతి–II. ఐ.కె. శర్మ).

భోగి, భోగె, బోగ్గం, భోగ్యం అనే వంశ నామాలు బోయ కులస్థులలో ఎక్కువగా ఉన్నాయి. భోగి అంటే రాజు గ్రామాధికారి అని అర్థం. క్రీ.శ. 730లో రెండవ పల్లవ నందివర్మ కంచి సింహాసనం అధిష్ఠించి, తిరుగుబాటుదారుల్ని అణచివేసి తన శత్రురాజులు ఆక్రమించిన భూభాగాలను సాధించుకొనే దిశగా అశ్వమేథ యాగం తలపెట్టి తన అధికారం చాటుకొనేందుకు యాగాశ్వాన్ని వదిలాడు. ఈ యాగాశ్వాన్ని అనుసరిస్తూ తన సేనాని ఉదయ చంద్రుడు ఉత్తరంగా బోయవిహార్ దేశంలోనికి ప్రవేశించాడు. అక్కడ చాళుక్య సామంతుడైన బోయ నాయకుడు పృథ్వీ వ్యాఘ్ర రాజు యాగాశ్వాన్ని పట్టుకొనే ప్రయత్నం చేయడంతో ఇరుపక్షాల మధ్య యుద్ధం చెలరేగి చివరకు ఉదయ చంద్రుడు బోయనాయకుడ్ని పారద్రోలినట్లు (ఉదయేందిరం శాసనాల వలన) తెలుస్తుంది. అలాగే క్రీ.శ. 848–49లో చాళుక్య సేనాని పండరంగడు నెల్లూరు జిల్లాలోని పంట, పాక నాడుల్లోని 12 బోయకొట్టాలను ధ్వంసం చేసినట్లు అద్దంకి శాసనంలో చెప్పుకొన్నాడు.

ముండారాష్ట్రంలో (బోయకొట్టాలు) దొర (ప్రభువు) అని సింహాసనబోయ (బోయసింహాసనం) అని పేర్కొనడం అడవి మండలాలలో పాలక నాయకుల హోదాని తెలియజేస్తుంది. 11వ శతాబ్దికి చెందిన శాసనంలో ఒక బోయనాయకుడ్ని 480 గ్రామాల ప్రభువుగా అభివర్ణిస్తుంది (ఆంధ్రప్రదేశ్ సమగ్ర

చరిత్ర - సంస్కృతి - III. బి. రాజేంద్రప్రసాద్). మనకు లభిస్తున్న శాసనాధారములనుబట్టి వేటాడి, ఆహార సేకరణ చేసుకొనే వేటగాళ్ళు సంచార జీవనానికి స్వస్థిపలికి, స్థిరనివాసాలకు అలవాటుపడి గ్రామాలను నిర్మించి, ప్రజాసంరక్షణ బాధ్యతలు చేపట్టినట్లు స్పష్టమౌతుంది.

తెలుగు శాసనాలలోని బోయల పేర్లను పరిశీలించినట్లైతే మద్దిబోయుండు మర్రిబోయుండు, సూరెబోయుండు, మారెబోయుండు వంటి పేర్లు అనేకం కనిపిస్తాయి. మొదటి పేర్లలోని మద్ది, మర్రి అనేవి చెట్లుపేర్లు చెట్లను పూజించడం ఆటవికుల సంప్రదాయం కాబట్టి వారి ఆటవిక మూలాలు స్పష్టంగా తెలుస్తున్నాయి. అలాగే 'సూరె' అంటే కత్తి అని అర్థం కనుక కత్తిని వినియోగించటంలో ప్రావీణ్యుడై ఉంటాడు. 'మారె' అంటే నల్లటి అని అర్థం. కాబట్టి అతని దేహఛాయని సూచిస్తుంది. ఇక బోయుండు అనే మాట పోయిండు, లేక పోయుండు అనే మాటను స్ఫురింపజేస్తుంది.

తెలుగులో 'వేటు' అంటే శిక్షాత్మక చర్య దెబ్బవేయడం అరణ్యంలోని మృగాలను, పక్షులను చంపుకొని తినుట అనే అర్థాలు చెప్పవచ్చు. ఈ 'వేటు' శబ్దమే తమిళంలో వేటువ లేక వేదర్ అయింది. కన్నడంలో బేడర్ లేక బేడడు అయింది. వేటగాళ్ళు ఆహార సేకరణ నిమిత్తం వలసపోవుటవలన పోయేవాండు, పోయుండు, పోయిండు, అని వ్యవహరించబడుతూ అదే క్రమంగా బోయండు లేక బోయగా స్థిరపడి ఉంటుంది. కృష్ణా, తెలంగాణా ప్రాంతాలలో పోయాడు, వచ్చాడు అనే మాటలను పోయిండు, వచ్చిండు అని పలుకుతారు.

కాకతీయ సామ్రాజ్యం పతనమైన తరువాత 'ఓరుగల్లు బహమనిరాజుల ఆధీనంలోనికి వచ్చింది. ఒక సామాన్య బోయ కుటుంబంలో జన్మించిన బోయసీతడు లేక సీతాపతి అనే యవకుడు. బహుమని రాజుల మెప్పు పొందుటకు సిత్తాపఖానుగా పేరు మార్చుకొని వరంగల్లు గవర్నరుగా నియమింపబడి కొంతకాలం తరువాత స్వతంత్రించి క్రీ.శ. 1504 ప్రాంతంలో వరంగల్లుని జయించి, స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించి ఏకశిలాపురి (ఓరుగల్లు)ని రాజధానిగా చేసుకొని పరిపాలించాడు. తన విజయానికి చిహ్నంగా వరంగల్లులో వేయించిన శాసనంలో తనది 'భోగి' వంశమని ఈ వంశానికి మూలపురుషుడు 'నాగ' అనే నాగాభ్యుడని ఇతని కుమారుడు మానాయాఖ్యుడని ఈ మానాయాఖ్యుని వలన అతని ధర్మపత్ని గౌరాంబకు అనేక పుత్రులు జన్మించారని, వారిలో సిత్తాపఖాను ఒకడని తనకు అనేక రాణులు ఉన్నారని, వారిలో తన ప్రియ ధర్మపత్ని అగు దేవాంబికకు అవదూత ఖాను, పురాంతకుడు అను ఇద్దరు కుమారులని, తన రెండవ భార్య అనుమాంబికు అమరుడు, బోగి (భోగయ్య) రాముడు (రామయ్య) అనే ముగ్గురు కుమారులు జన్మించినట్లు పేర్కొనబడింది. ఈ శాసనంలో నాగయాఖ్యుడు, మానాయాఖ్యుడు యొక్క శౌర్యపరాక్రమాలను గురించి సిత్తాపఖాను సాహస కృత్యాలను గురించి ప్రభలంగా వర్ణించబడింది.

శ్రీకృష్ణదేవరాయలవారు పూర్వ దిగ్విజయ యాత్రకు బయలుదేరి కందుకూరు, కొండవీడు, వినుకొండ, బెల్లంకొండ మొదలైన దుర్గాలను జయించి, విజయోత్సాహంతో దండయాత్ర చేస్తుండగా సిత్తాపఖాను 60,000 శూరులతో రాయులవారి సైన్యాన్ని ఎదిరించి, నిలువరించాడు. క్రీ.శ. 1515-16లో జరిగిన ఈ సంఘటన విశ్వనాథ నాయకుని స్థానాపతి రచించిన రాయవాచకంలోని 94-95 పుటలలో ఉంది. కుమార దూర్జటి రచించిన కృష్ణరాయ విజయము నందు కూడ సీత్తాపఖాను ప్రశంస ఉంది (షితాబు ఖాను అను సీతాపతిరాజు - ఆదిరాజు వీరభద్రరావు).

వేటగాళ్ళు వేటాడటంలోనేకాదు ఘంటాన్ని పట్టి కావ్యాలు రాయడంలోను, శత్రురాజుల కంఠాలను ఖండించటంలోను వన్నెకెక్కిన వీరులు అనడానికి ఆనవాలు సంస్థానాలు చుండి, సురపురం, బంగారుపాళెం, తాడిమర్రి, కనకగిరి, చిత్రదుర్గ ప్యాపులి, కంగుందివంటి పాళెగాళ్ళ వారసులు నేటికి బంధుత్వాలు నెరపుకొంటున్నారు. తమ ఆటవిక మూలాలనే కాదు పదవి నామాలను సైతం వంశనామాలు లేక గృహనామాలలో పదిలపరచుకొన్నారు. వీరి ఘనమైన చరిత్రకు ఇంతకన్నా సాక్ష్యం ఏం కావాలి?

'పోయన్' అనేది పదవినామమే అయితే ఆ పదవిని అలంకరించిన తొలి సమూహం వేటగాళ్ళే కాబట్టి వారి కులం 'బోయ' అని పిలుపవబడుతుంది. 'బోయ' అంటే వేటగాడనే అర్థం ఉంది.


భీమనాథుని శ్రీనివాస్
(సాయిసిద్ధార్థ)
గుంటూరు.
ఫోన్ : 829 759 4166




# త్యాగరాజుస్వామి జీవితం సత్యాసత్యాలు

**2007**వ సంవత్సరంలో Bill Bryson వ్రాసిన *షేక్స్‌పియర్ ది వరల్డ్ ఈజ్* ఎ స్టేజ్ అన్న పుస్తకం విడుదలైంది. ఇంతవరకూ, ఎంతోమంది అతని గురించి వ్రాసినా అతని గురించి తెలిసింది చాలా తక్కువే అని పేర్కొన్నాడు రచయిత. అలానే త్యాగరాజుపై కూడా మనకు తెలిసిన నిజాలు తక్కువే. అతని జీవితం చుట్టూ ఎన్నో మహిమలు, మరెన్నో రుజువు కాని సంఘటనలు, పుట్టగింపులు, చిత్రవిచిత్రమైన కథానికలు ప్రచారంలో ఉన్నాయి. రుజువుకు నిలచేవి, నిర్ధారణ అయిన నిజాలు చాలా తక్కువనే చెప్పాలి.

మొట్టమొదటిగా అతను ఎప్పుడు పుట్టాడు? ఎంతకాలం జీవించాడనే అంశాన్ని పరిశీలిద్దాం.

త్యాగరాజు 1847వ సంవత్సరంలో సీతారాముల సన్నిధికి చేరుకున్నాడన్నది వాస్తవం.

అప్పటికి అతని వయసెంత? అన్న విషయంలో అనేక భిన్నాభిప్రాయాలున్నాయి.

C.R. Dey ప్రకారం అతను 20 సంవత్సరాలే జీవించాడు.

Rev. H.A. Poley ప్రకారం అది 50 సంవత్సరాలు.

సుబ్బరామ ధీక్షితార్ ప్రకారం 77, నరసింహ భాగవతార్ చెప్పింది 88, సి.ఆర్. శ్రీనివాస అయ్యంగార్ దానిని 89, తిరుమలయ్య నాయుడు 75 సంవత్సరాలని, జె. లక్ష్మణ పిళ్ళై ప్రకారం అది 80 సంవత్సరాలు. ఇలా ఎవరికి వారు తలోసంఖ్య పేర్కొన్నారు. అందరూ తాము చెప్పిన సంఖ్యకు స్పష్టమైన రుజువులు ఉన్నాయన్నారు తప్ప అవేమిటో పేర్కొనలేదు.

త్యాగరాజు స్వామి జీవిత చరిత్ర 1927 సంవత్సరంలో ఎమ్.ఎస్. రామస్వామి అయ్యర్ ఇంగ్లీషులో వ్రాయగా, *ది హిందూ* న్యూస్‌పేపర్‌లో సీరియల్‌గా ప్రచురితమైంది. అందులో పేర్కొన్న అతని జన్మసంవత్సరం 1759. ఇది యదార్థం కాదంటూ ప్రొఫెసర్ సాంబమూర్తి అభ్యంతరం లేవనెత్తారు. దానికి ఆధారం, త్యాగరాజు జీవితకాలంలోనే వలజపట్టు వెంకట రామన్న భాగవతార్ వ్రాసిన జీవిత చరిత్ర – ఇంతవరకూ రికార్డయిన వాటిలో మొదటిది. అంతేకాదు, అతను త్యాగరాజు శిష్యుడు కూడా. తంజావూరు రామారావు అనే మరొక శిష్యుడు త్యాగరాజు జన్మరాశిని పరిశీలించి అది మే 1767గా పేర్కొన్నాడు. ఇతను త్యాగరాజుకంటే ముందే మరణించాడు. ప్రస్తుతం ఏది నమ్మాలో నమ్మకూడదో ఇదమిద్ధంగా చెప్పలేని పరిస్థితి.

త్యాగరాజుకు సంగీత వారసత్వం ఎలా అబ్బింది?

తంజావూరు రాజధానిగా మహారాష్ట్రులు పరిపాలించినప్పుడు వారి ఆస్థానంలో సంగీత విద్వాంసునిగా గిరిరాజ కవి పనిచేస్తుండేవారు. ఆయన త్యాగరాజు మాతామహులని *గిరిరాజా సుతా తనయ* అన్న త్యాగరాజు కృతే దీనికి సాక్ష్యంగా కొందరు పేర్కొన్నారు. కానీ ఆ రచనలో అంతఃసూత్రంగా ఇది గణపతి ప్రార్థనగా పరిగణింపబడుతుంది (గణపతి గిరిరాజ తనయుడు). త్యాగరాజుపై పరిశోధన గావించిన ఎన్. సీత, త్యాగరాజస్వామి పితామహుల పేరు గిరిరాజ బ్రహ్మంగా పేర్కొన్నారు. మాతామహుల పరంగా సంగీతం, పితామహులపరంగా ఆధ్యాత్మిక జీవితం త్యాగరాజును ప్రభావితం చేశాయి.

త్యాగరాజు తండ్రయిన రామబ్రహ్మం – తుల్జా మహారాజు వద్ద రామాయణ కావ్య విశ్లేషకునిగా పనిచేశారు. త్యాగయ్యతన తల్లి నుంచి చిన్నతనంలో సంగీతం నేర్చుకున్నాడు. ఇంతకీ ఆమె పేరేమిటి? ఇది వివాదాస్పదం. త్యాగరాజు వ్రాసిన రచనలు, శ్లోకాల ఆధారంగా, ఆమె పేరు 'సీత'గా ఎక్కువమంది పరిగణిస్తున్నా ఆమె పేరు 'శాంత'గా కొందరు పేర్కొంటారు.

సంగీత త్రిమూర్తులుగా పేర్కొనబడిన శ్యామశాస్త్రి, ముత్తుస్వామి దీక్షితులులానే త్యాగయ్య కూడా తిరువరూర్

(Tiruvarur)లోనే జన్మించాడని కొందరు భావిస్తుంటే, బి.ఎమ్. సుందరం అనే పండితుడు మాత్రం త్యాగరాజు పుట్టింది తిరువయ్యయూర్ (Tiruvaiyaru)గా పేర్కొన్నారు. త్యాగయ్య తల్లి నుంచే గాక మాతామహులైన కాళహస్తి అయ్యర్ నుంచి (ఆయన పేరు గిరిరజా కవి కాదు) సంగీత సూత్రాలు నేర్చుకున్నారని సిద్ధాంతీకరించారు. వలజపట్టు వెంకటరమణ భాగవతార్ ప్రకారం, తాతగారి వద్దనున్న సంగీతానికి సంబంధించిన తాళపత్రాలు త్యాగరాజు వద్ద ఉండేవని సంగీత లక్షణాలను వారు దాని నుంచి గ్రహించారని పేర్కొన్నారు.


త్యాగరాజు సంగీత గురువు శొంఠి వెంకట రమణయ్య. ఈ విషయంలో అందరికీ ఏకాభిప్రాయమే ఉంది. శొంఠి వెంకట రమణయ్య ఒకసారి తుల్జా మహారాజు ప్రక్కన అర్థసింహాసనంపై ఆశీనులైనారు అన్న విషయంలో కూడా బేదాభిప్రాయాలు లేవు. త్యాగరాజుకు సోదరులెందరు? జపేశా అనే పేరుగల సోదరుడు ఒక్కరే ఉన్నారనే విషయంలో ఎక్కువమంది ఏకీభవిస్తున్నారు. పంచానంద, పంచపాకేశ బ్రహ్మం అనే పేరుగల మరో ఇద్దరు సోదరులున్నట్లు కొందరు చెబుతున్నారు. వారంత శీలవంతులు కారని, కుటుంబ ప్రతిష్ఠను దిగజార్చేవారని వెంకటరామన్న భాగవతార్ త్యాగయ్య జీవిత చరిత్రలో పేర్కొన్నారు.

త్యాగయ్యకు రెండుసార్లు వివాహం జరిగింది. మొదటి భార్య పార్వతి మరణానంతరం ఆమె సోదరి అయిన కమలను వివాహమాడారు. ఆమె వల్ల ఆయనకు సీతామహాలక్ష్మి అనే పేరుగల కూతురు పుట్టింది.

త్యాగరాజు మొదట శృతి పరచిన కృతి యేది? అన్నది కూడా వివాదస్పదమే!

దేశిక తోడిలో రచించబడిన 'నమోనమో రాఘవయ్య' మొదటిదని. ఇది శొంఠి వెంకట రమణయ్య వద్ద శిష్యరికానికి ముందే వ్రాయబడినదని అభిప్రాయముంది. కానీ సుబ్బరామ దీక్షితులు 1904 వ సంవత్సరంలో ప్రచురించిన సంగీత సంప్రదాయ ప్రదర్శని ప్రకారం మొదటి రచన ఆరణా రాగంలో శృతి చేయబడ్డ 'ఏల నీ దయరాదు' రచన అని, ఆయనే తరువాతి కాలంలో 1908లో త్యాగయ్య ప్రథమ కృతి 'గిరిరాజ సుతా తనయ'గా పేర్కొన్నారు. గణపతి స్తోత్రమైన ఇదే ప్రథమ రచన కావచ్చని ఎక్కువమంది భావిస్తున్నారు.

ఇంతకీ త్యాగరాజు ఎన్ని కృతులు రచించాడు? ఈ ప్రశ్నకు చాలామంది వెంటనే 24 వేల కృతులని అంటారు. దీనికి చారిత్రక ఆధారాలు లేవు. ఇంతవరకూ పరిశోధనలో వెలుగులోనికి వచ్చినవి సుమారు 700 కృతులు మాత్రమే. కర్ణాటక సంగీత కృతులు లిపిబద్ధం కాకపోవటం, కర్ణాటక సంగీతం మౌఖికంగానే శిష్యపరంపరగా వచ్చినదగుటవలన చాలా కృతులు లుప్తమయినట్లు భావించాలి. రెండు యక్షగానాలు నౌకాచరిత్రము, ప్రహ్లాద భక్తివిజయము ప్రస్తుతం లభిస్తున్నాయి. మూడవదిగా చెప్పబడుతున్న 'సీతారామ విజయం' ఇంతవరకూ లభ్యం కాలేదు.



ఈ చిత్రం త్యాగరాజు స్వామియొక్క అసలు రూపానికి దగ్గరగా ఉన్నదని చాలా ఎక్కువమంది భావిస్తున్నారు.

చిత్తూరు వి. నాగయ్య తన స్వంత సంస్థ రేణుకా ఫిలింస్ ద్వారా త్యాగయ్య జీవితాన్ని 1946లో తెరకెక్కించారు. అప్పటికి త్యాగరాజు మరణించి, 100 సంవత్సరాలు కాలేదు. నాగయ్య గారు ఎంత ప్రయత్నించినా త్యాగయ్య యథార్థ జీవన గాథ దొరకకపోవటంతో ప్రజా బాహుళ్యంలోనున్న గాథలను, త్యాగరాజ కృతులను ఆధారంగా తీసుకొని కథ, స్క్రీన్‌ప్లే తయారుచేసుకున్నారు. అదే విషయం సినిమా ప్రారంభంలో తెలియజేశారు.

మి

(ఆంగ్లమూలం : వి. శ్రీరాం)
తెలుగు : కాండ్రేగుల నాగేశ్వరరావు
హైదరాబాద్.
ఫోన్ : 994 808 3387.

# రాళ్ళపల్లి వారి లేఖ....

**శ్రీ** అన్నగారికి,

ప్రణామములు – ఉభయకుశలోపరి. మీ కుశల పత్రిక నిన్న శ్రీ జయంతికి చేరింది. ఆత్మావలోకనం చేసుకోవలసిన ఆ శుభ పుణ్యసమయంలో అది రావడం విశేషం. యథాశక్తి ఆ పనీ, ఆరాధనా చేశాం. ఉపవాసం ఎవరూ చేయలేదు.

రెండు దినాలకు ముందు నా కోడలు సౌ.చి. పద్మకు నేనే సమాశ్రయణం చేస్తిని, దానితో నా భార్యకు నిన్నటి తళిహాలో ఆమె సహాయం కొంత విశ్రాంతినిచ్చింది. శ్రద్ధతో చేస్తే శ్రీమతానికైనా కాచుకునే దానికంటే ఇదే మేలని సాహసించాను. కాని, ఇదివరలో చేసిన సాహసమే అది. చి. వాగ్దేవి ఆరోగ్యం దినేదినే సుముఖంగా సాగుతూ ఉంది మీ యాశీస్సువల్ల. తక్కిన అందరూ కుశలం. వ్యక్తుల గుణదోషాల విషయంలో మీ ఉదారాభిప్రాయాలూ ఆచరణలూ నాకు తెలిసినవే. మీ విశాల – దీర్ఘ – స్వతంత్ర జీవితంలో మీరు సాధించిన పెద్ద సిద్ధులకన్నిటికీ ఆ చిత్తవృత్తే ముఖ్యకారణమని నా నమ్మకం. తాడిమరి వారికంటే అంబాళం వారి వ్యవహారం నాకెక్కువగా తెలిసిన విషయం. శ్రీమతానికీ మీకూ ఉన్న స్పర్థలలో నడుమ నలిగినవారిలో నేనొక్కణ్ణి. మా స్వీకృత పితగారి వర్షాబ్దికం రాళ్ళపల్లిలో పెట్టుకునే అవకాశం లేక చెన్నంపల్లికి శ్రీ మా అయ్యగారితో గూడా పోయి, అక్కడ వారొక్కరినే నియంత్రించి, నిర్వహించినవాణ్ణి నేను. ఈ కలతల కంతా ముఖ్య కారకులు రాళ్ళపల్లిలోని మాజ్ఞాతులు. శ్రీ దేశిక స్వామిగారి సంబంధం వారిచేత పెద్ద ఆయుధంగా ఉండేది. ఐనా వారెవరిమీదా ద్వేషం సాధించే చిత్తవృత్తి నేనూ పెంచుకోలేదు. వారిండ్లలో సాపాటు మొదలైన వ్యవహారాలను నేనెప్పుడూ తిరస్కరించలేదు. వారివల్ల కలిగిన అవమానాలూ నష్టాలూ అన్నీ నేను మరచిపోయినాను. నా అల్పజీవితంలో నాకున్న చిత్తశాంతికీ విశ్వాస గౌరవాలకూ అదే ముఖ్య కారణమని నా నమ్మకం. ఇతరులకు తెలిసి నేను చేసిన ద్రోహాలేవీ నాకు తెలియవు. తెలిసి చేసిన స్వల్పోపకారాలకు చేయించుకొన్న కొందరు కృతఘ్నుత చూపినా అది నన్ను సామాన్యంగా అంటదు. మీయందు నాకుగల గౌరవానికీ నాయందు మీకు గల విశ్వాసానికీ ఈ సామ్యం ప్రధాన కారణంగా శ్రీనివాసులు సంకల్పించినట్లున్నది.

ఈ వ్యక్తి ధర్మం సాంఘికంగా – అంతకంటే రాజకీయంగా పనికి వస్తుందా అన్న సందేహం నాకున్నది. సంఘంలో ప్రధాన వ్యక్తులు మఠాధికారులు మొదలైనవారి దుర్గుణాలను గమనించి ఖండించకపోతే సంఘంలో ఏ నీతినియమాలూ ఉండవు. ఇప్పటి తరుణుల సంఘం ఆ దురవస్థలోనే కుళ్ళుతూ ఉంది. ఇప్పటి మన 'పెద్దల'లో పిన్నవారియందు భక్తినిగాని, భయమునుగాని కలిగింపగల శక్తులు లేరు. ఇక రాజకీయ నాయకుల దోషాలను గమనించకపోతే దేశంలో ముఖ్యంగా ప్రజాస్వాతంత్ర్యమని చెప్పుకొనే ఈ దినాలలో – ఊరూరిలోను విప్లవాలు బయలుదేరి సంఘక్షేమాన్ని ధ్వంసం చేస్తాయి. వ్యక్తిగతంగా వారి గుణాలకు, తెలివితేటలకూ, మనమెంత సంతోషించినా, సాంఘికంగా వారి దోషాలు మన్నించడం రాజకీయంగా అపచారమవుతుంది. చమత్కారమైన మాటకారితనంతో, తెలివితేటలతో వారు జనసామాన్యాన్ని రెచ్చగొడతారు. ఇప్పుడు, వ్యక్తియందుండే గుణాలకూ, దోషాలకూ సంఘదృష్టితో, రాజకీయ దృష్టితో, విలువ ఎట్లు, ఎంత, కట్టవలెననేదే పెద్ద ప్రశ్న. విలువ కట్టేవారికందరికీ ఏవో తమ నమ్మకాలు, ఆశలు, సంప్రదాయాలు, సంస్కారాలున్ను ఉండి తీరును. వాటికి అనుగుణంగా వారు విలువ కడతారు. వాటిని ఎంత మనం దాటగలిగితే అంత సత్యానికి సమీపంగా వర్తిసామేమో! కాని అది సాధ్యమా? 'సాధ్యమైనంత' అని మీరన్నమాట చాలా పెద్దది. మనం చేయగలిగిందంతా అంతే – చేస్తే! కాని అది మన ఆత్మను సంస్కరింపగలదేమోకాని, సంఘాన్నీ, రాజ్యాన్నీ తాకి పనిచేయజాలదు. ఆత్మధర్మాన్నీ, సంఘ రాజనీతులనూ వేరుగా చూడగలిగే శక్తి ఒక వ్యాసునికి, ఆ ప్రకారం ఆచరించే శక్తి తప్ప ఇతరులకు లభ్యం కాలేదనిపిస్తుంది. గనుకనే 'సర్వధర్మాన్ పరిత్యజ్య' అని వారి ఉపదేశ సారం. అది మహామంత్రంగా మన పెద్దలు గ్రహించి ఉపదేశించిరి. మన ధర్మం అంతే. మీరు వ్రాసే కొన్ని జవాబులు 'భారతం' కావచ్చును. కాని 'చేట భారతం' మాత్రమెప్పుడూ కావు. ఇంత విశ్వాసంతో ఆంతరంగిక విషయాలు వ్రాసేవారు నాకెవరున్నారు?

కుశలం తెలుపగలరు. నతయః –రా. అ. కృ. శర్మ

**కొన్ని పదాలకు అర్థాలు :** 1. సమాశ్రయణం – శ్రీవైష్ణవులకు గురువుల లేదా పెద్దల ద్వారా పంచసంస్కారాల దీక్ష ఇవ్వడం. వేడిచేసిన శంఖ, చక్ర, గదాది లోహముద్రలను వొంటిపై. ముఖ్యంగా భుజాలమీద, ఎదమీద ఒత్తించుకొనడం.

**2. తళిహ – నైవేద్యం :** వివరణ : రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మగారు రాజగురు శ్రీమాన్ శ్రీనివాస తోళప్పాచార్యులవారికి రాసినదీ ఉత్తరం. ఈ శ్రీ వైష్ణవ మతాచార్యులకు – రాళ్ళపల్లి వారికి వందలకొద్ది ఉత్తర ప్రత్యుత్తరాలు కాలక్రమంలో సాగాయి. తోళప్పాచార్యుల వారు బళ్ళారి జిల్లా హోస్పేట నివాసి. రాళ్ళపల్లివారికన్నా ఎనిమిది పదేళ్ళు పెద్ద. రాజగురువుగా, శ్రీవైష్ణవమతాచార్యులుగా పేరుప్రసిద్ధులు గడించిన మహాభాగులు.

తోళప్పాచార్యులవారు రాళ్ళపల్లివారికి పది, పదహైదు పేజీలు అప్పుడప్పుడు నోటుబుక్కు నిండా సుదీర్ఘమైన సుహృల్లేఖ వ్రాస్తే శర్మగారి మనుమలు, మనుమరాండ్రు పెద్ద పళ్ళెంలో ఆ ఉత్తరాన్ని ఉంచి, దాని బరువును మోయలేక మోస్తున్నట్లు నటిస్తూ శర్మగారికి అందించి, కాస్సేపు ఆ ఉత్తరం ఇవ్వకుండా వారిని సతాయించి, పెప్పరమింట్లకని కాసిన్ని పైసలు తీసుకొని మరీ ఆ ఉత్తరం శర్మగారికి అందించేవారట! ఈ మాటలు పూజ్యులు అనంతకృష్ణ శర్మ సహజస్నిగ్ధమైన చిరునవ్వు చిందిస్తూ 1978–79 కాలావధిలో నాతో అన్నమాటలు.

ఈ ఉత్తరాన్ని ఇంకా సుమారు యాభై ఉత్తరాల్ని నాకు పంపిన శ్రీమాన్ తోళప్పాచార్యుల సుపుత్రులైన దేశికాచార్యులవారికి కృతజ్ఞతలు.

ఘట్టమరాజు అశ్వత్థనారాయణ
బెంగుళూరు.
ఫోన్ : 0 996 408 2076.

క్రోమోసోమ్ కథనమ్

# వ్యక్తిత్వం

– ము.పా.సా.

క్రోమోసోమ్ కథనమ్ – 16


న్యూరాన్ ప్రతిస్పందనలకు అడ్డుతగులుతుంది సెరోటోనిన్. ట్రాన్స్‌పోర్టర్ అనబడే ఒక జన్యువుంటుంది. దీని యాక్టివేషన్ సీక్వెన్స్ పొడవు ఎప్పుడూ మార్పు చెందుతూ ఉంటుంది. అంటే, దీనివల్ల కొందర్లో సెరోటిన్ ట్రాన్స్‌పోర్టర్లలెక్కువుంటాయి. ఫలితంగా – ఎక్కువ సెరోటిన్ విడుదలవుతుంది.

దీన్నిబట్టి, సెరోటిన్ డిప్రెషన్‌ను పెంచుతుంది. తగ్గించదు అని నిర్ధారణకు వచ్చాడు డీన్ హేమర్, దీన్ని అతడు మెదడు ఉపయోగిస్తున్న "పనిష్మెంట్ కెమికల్" అన్నాడు. కాని మనకు లభ్యమవుతున్న సాక్ష్యాల ప్రకారం సెరోటోనిన్ వల్ల ఉల్లాసం, ఉత్సాహం పెరుగుతాయి. ఉదాహరణకు చలికీ, వేడివేడి పకోడీలకూ, ముడుచుకొని పడుకోవటానికీ ఒక అవినాభావ సంబంధముంది. దీనికి కారణం మెలోటోనిన్ అనబడే హార్మోన్ అనిపిస్తుంది. సెరోటోనిన్ వల్ల ఇది ఉత్పత్తి అవుతుంది. కాని మెదడు ఇన్సూలిన్ విడుదల చేస్తేనే సెరోటోనిస్ ఉత్పత్తి అవుతుంది. ఇన్సులిన్ కావాలంటే కార్బొహైడ్రేట్స్ అధికంగా ఉండే స్నాక్స్ (పకోడీలు) కావాలి.

మరో విషయం. శరీరంలో కొలెస్టరాల్ తక్కువగా ఉండటానికీ, హింసాప్రవృత్తికీ సంబంధముంది. తక్కువ కొలెస్టరాల్ ఉన్న పదార్థాలు తిన్న కోతుల్లో హింసా ప్రవృత్తి బాగా పెరిగింది. దీనికి కారణం, వాటిలో సెరోటోనిన్ శాతం తగ్గటమే. నార్త్ కరోలినాలోని బౌమాన్ గ్రే మెడికల్ స్కూల్‌లో జే కాప్లాన్ జరిపిన పరిశోధనల్లో కూడా ఇదే విషయం నిరూపితమైంది. సెరోటోనిన్ తక్కువగా ఉన్నవాళ్ళు హత్యలకూ, ఆత్మహత్యలకూ పాల్పడతారు. అందువల్ల, జనమంతా తమలోని సెరోటోనిన్ శాతమెంతో బహిరంగంగా ప్రకటించాలా?

అలా చెయ్యమనటం చట్టవిరుద్ధమేకాక మూర్ఖత్వం కూడా మీలోని సెరోటోనిన్ స్థాయికీ, సమాజంలోని మీ హోదాకూ సంబంధముంది. ఉన్నత స్థాయి వ్యక్తులలో ఆత్మవిశ్వాసం ఎక్కువగా ఉన్నవాళ్ళలో సెరోటోనిన్ ఎక్కువగా ఉంటుంది. అయితే, ఆత్మవిశ్వాసంవల్ల సెరోటోనిన్ పెరిగిందా లేక సెరోటోనిన్ వల్ల ఆత్మవిశ్వాసం పెరిగిందా అన్న విషయం ఇంకా స్పష్టం కాలేదు.

అలాగే, మెదడులోని సెరోటోనిన్‌కూ, నేరప్రవృత్తికీ సంబంధముందని కూడా చెప్పవచ్చా అంతమాత్రంచేత, నేరాలకు సామాజిక కారణాలు లేవనలేంగద. ఇక్కడా మళ్ళీ మన వాదన తిరగబడుతుంది. సామాజిక సంబంధాలవల్ల సెరోటోనిన్ స్థాయిలో మార్పులు జరుగుతాయి. స్వభావం, బుద్ధి, వ్యక్తిత్వం, ప్రవర్తన – వీటన్నింటినీ గాఢంగా ప్రభావితం చేస్తుంది సామాజిక జీవితం. అన్నింటికీ కేవలం జీవశాస్త్ర పరమైన కారణాలు మాత్రమే ఉన్నాయనుకోవద్దు.



క్రోమోసోమ్ - 16 ఫ్యామిలి

అయితే, ఒకే విషయానికి ఒక్కొక్కరి ప్రతిస్పందన ఒక్కోలా ఉంటుంది. దీనికి కారణం వాళ్ళలోని న్యూరో ట్రాన్స్‌మిటర్లేనని చెప్పటం సత్యదూరం కాదు. అంటే, మళ్ళీ సెరోటోనిన్ గురించి మాట్లాడుకోక తప్పదు. ఒక డచ్ కుటుంబంలో మూడు తరాలుగా జన్మించినవాళ్ళందరూ నేరస్థులే. దీనికి జన్యుపరమైన కారణాలున్నాయని శాస్త్రజ్ఞులు ఏకాభిప్రాయానికి వచ్చారు. నేరస్థుల్లో X

క్రోమోసోమ్ మీద "మోనోఏమైన్ ఆక్సిడేస్ A జీన్" ఉంటుంది. మోనోఏమైన్ ఆక్సిడేస్, సెరోటోనిన్‌ను ఇతర రసాయనాలుగా విడగొడుతుంది. సెరోటోనిన్ న్యూరో కెమిస్ట్రీ వల్లనే డచ్ కుటుంబంలోని వాళ్ళంతా నేరస్వభావాలను సంతరించుకుని ఉంటారు. శాస్త్రీయంగా ఇలా మాట్లాడుకోవటం బాగానే ఉంటుంది గాని నేరాలకు వాళ్ళు బాధ్యులు కారనటం మాత్రం ఎవరూ అంగీకరించరు.

వ్యక్తిత్వానికీ, మెదడులోని రసాయనిక ప్రక్రియలకు దగ్గిర సంబంధముంది. దీనికి ప్రధాన కారణం సెరోటోనిన్ మాత్రమే. సెరోటోనిన్ వల్ల సామాజిక జీవితం ప్రభావితమవుతుంది. సామాజిక జీవితం వల్ల సెరోటోనిన్ స్థాయిలో మార్పులు వస్తాయి.

## క్రోమోసోమ్ కథనమ్ - 17

**స్వయం నిర్మితం :**

గబ్బిలాలు నీటి కింద ఉన్న జీవుల్ని గుర్తించగలవు. గుండె పంపులాగ పనిచేస్తుంది. కన్నుకూ కెమెరాకూ పోలిక ఉంది. మెదడులో ఉండేవన్నీ తీగలే (వీటిని Axons అంటారు) సి డైనాప్సెస్ అనబడే స్విచ్‌లు కూడా ఉంటాయి. రోగనిరోధక వ్యవస్థ అనేది ఒక గూఢచారి సంస్థలాంటిది. ఇలాగ మనం శరీర నిర్మాణానికి ప్రకృతికి ఎన్నో పోలికలు చూడవచ్చు.

కాని, అత్యద్భుతమైన, అనూహ్యమైన విషయమేమిటంటే అసలు ఈ శరీర నిర్మాణమెలాజరిగింది? మాంసం ముద్దలాంటి అండం ఇంత సంక్లిష్ట వ్యవస్థగా ఎలా మార్పుచెందింది? ప్రకృతి వైచిత్రి కాక మరేమిటిది? అండం ఇలా ఎదగడం వెనక ప్రకృతి రచించిన వ్యూహమేమిటి? ఇది దైవ కార్యమనుకుంటే సమస్యకు తక్షణమే సమాధానం దొరుకుతుంది గాని మనం శాస్త్రవిషయాల గురించి మాట్లాడుకుంటున్నాం కదా! శరీర నిర్మాణాన్ని గురించిన ప్రణాళిక, బ్లూప్రింట్ ఒకటి ఉంటే తప్ప అండం ఎదగలేదు. పూర్వకాలంలో కొందరు వీర్యంలో మానవ లక్షణాలన్నీ ఉన్నాయని ప్రచారం చేసిన సందర్భాలూ లేకపోలేదు. అండ దశలోనే సూక్ష్మ రూపంలో శరీరం అందులో ఉంది. ఇలా మనం మరెన్ని వివరణలు ఇచ్చుకున్నా, ఊహాగానాలు చేసినా ఈ మిస్టరీని ఛేదించలేంగాని, నిజానికిది మిస్టరీయే కాదు. అసలు విషయమేమిటంటే జన్యువుల్లో డిజిటల్‌గా నిక్షిప్తమై ఉంటుంది మానవ నిర్మాణ క్రమం. దీనికి సంబంధించిన జన్యువులన్నీ క్రోమోసోమ్-12 కు సమీపంలో ఉంటాయి. జెనెటిక్ ఆవిష్కరణ తర్వాత, అత్యంత ముఖ్యమైన పరిశోధన దీని గురించే జరిగింది.

ఫలదీకరణ చెందిన అండం, పిండంగా ఎదుగుతున్న ప్రాథమిక దశలో అది మాంసం ముద్దకన్న ఎక్కువేమీ కాదు. ఆ తర్వాత, క్రమంగా అది రెండు దిశల్లోకి ఎదుగుతుంది. ఒకటి తల – తోక, మరొకటి ముందు – వెనుకగా. ఈగల్లో, కప్పల్లో తల్లిలోని కణాలు, పిండానికి ఈ ఆదేశాలిస్తాయి. కాని, ఎలుకల్లో, మనుషుల్లో ఈ ఎదుగుదల గురించి మరిన్ని పరిశోధనలు జరగాల్సి ఉంది. గర్భధారణ సమయం కీలకమని తెలుస్తోంది.


ఈగలు, కప్పల గురించి చాలా విషయాలు తెలుసుకున్నాం. తల్లి జన్యువుల్లోని కొన్ని ఖచ్చితమైన రసాయనిక చర్యలు వీటికి కారణం. క్షీరదాల్లో కూడా ఈ ప్రక్రియ అలాగే కొనసాగుతుంది. ప్రతి కణానికీ తానెక్కడ ఉండబోతున్నాడో తెలిసిపోతుంది.

అయితే, ఏ కణం ఎక్కడ ఉండబోతుందో తెలుసుకోవటంకన్న అదేం చెయ్యబోతోందో తెలుసుకోవటం ముఖ్యం. ఈ ప్రక్రియను నియంత్రించే జన్యువులను హోమియోటిక్ (Homeotic) జన్యువులంటారు. ఉదాహరణకు ఒక కణానికి ఈ జన్యువు 'రెక్కగా ఎదుగు'' లేదా "మూత్రపిండంగా ఎదుగు" అని ఆదేశమిస్తుంది. సులభంగా అర్థంచేసుకోవటం కోసం ఇలా మాట్లాడుకుంటున్నాంగాని నిజానికి ఇలా జరగదు. ఎవరూ ఎవరికీ ఆదేశాలివ్వరు. కేవలం ఒక క్రమపద్ధతిలో జన్యువులు పరస్పరం తమలోని మార్పులకు అనుగుణంగా వ్యవహరిస్తాయి. నిజానికి, ఎదుగుదల ఒక వికేంద్రీకరణ కార్యక్రమం. శరీరంలోని ప్రతి కోణంలో, జీనోమ్ పూర్తిగా ప్రతినిక్షిప్తమై ఉంటుంది గనుక, అది మరోచోటి నుండి ఆదేశాలు గ్రహించవలసిన అవసరం లేదు. *శరీర నిర్మాణ ప్రక్రియ ఇంత వికేంద్రీకరణ చెందినా కాని మన సమాజాలు కేంద్రీకరణవైపే నిరంతరం పయనిస్తున్నాయి. ఎవరో ఒకరు ఆదేశాలివ్వాలి. మరొకరు వాటిని అమలు చెయ్యాలి! మనం శరీరంలోని జన్యువుల్లాగ ఉండగలిగినప్పుడే సమాజంలో నిజమైన వికేంద్రీకరణ సాధ్యం!*

గత శతాబ్ది ప్రారంభం నుండీ (పళ్ళమీద వాలే) ఈగలతో తరచు ప్రయోగాలు చేశారు జెనెటిసిస్టులు. లేబరేటరీలలో వీటిని పెంచడం చాలా సులభం. జెనెటిక్స్

నిగూఢ రహస్యాలను మనకు అవగతం చేసినందుకుగాను మానవజాతి ఈగలకు సదా రుణపడి ఉండాలి. క్రోమోసోమ్స్ మీద జన్యువులుంటాయని, ఎక్సెరేలవల్ల జన్యువులను విభజించవచ్చు కాని ఈ ప్రయోగాలవల్లే మనకు తెలిసింది, హోమియోటిక్ జన్యువుల్లో తేడా వస్తే విపరీత ఫలితాలు వస్తాయి.

1970లలో, యానినస్లైన్ వార్హార్డ్, ఎరిక్ వైష్కాస్ అనబడే ఇద్దరు జర్మన్ శాస్త్రజ్ఞులు ఈగలతో రకరకాల ప్రయోగాలు చేశారు. జన్యు విభజనవల్ల, వాటికి కాళ్ళుండవలసినచోట రెక్కలు మొలిచాయి. అంగాలు ఆకారాలు మార్చుకుని శరీరాలు వికృతంగా, విచిత్రంగా మారిపోయాయి. జన్యువిభజనను ప్రేరేపించే రసాయనాలను చల్లి కొన్ని వేల ఈగల్ని పెంచారు. ప్రయోగ ఫలితాలను పరిశీలిస్తే జన్యువిభజనలో ఒక క్రమపద్ధతి కనిపించింది. Pair-rule జన్యువులు, Segment Polarity జన్యువులు, Development జన్యువులు కొన్ని ప్రత్యేక లక్షణాలను కలిగి ఉన్నాయని తెలిసింది. హోమియోటిక్ జన్యువులన్నీ ఒకే క్రోమోసోమ్ వద్ద కేంద్రీకరించాయి. వీటిని Hox జన్యువులన్నారు. వీటిలో ఒక జన్యువు నోటినీ, మరొక జన్యువు మొహాన్నీ, మరొకటి నుదుటి భాగాన్నీ, మరొకటి మెడనూ, గొంతును, నడుమును, వెనక భాగాన్ని – ఇలా ఒక్కొక్కటీ ఒక్కొక్క అంగాన్ని రూపకల్పన చేస్తున్నది.



క్రోమోసోమ్ - 17

నిజానికి పరిస్థితి ఇలా ఉండదు. జన్యువుల కథ చెప్పుకుంటున్నాం గనక, ఫలాని జన్యువులు, ఫలాని క్రోమోసోమ్ మీద ఉంటాయని వివరణ ఇచ్చుకున్నాం. ఉదాహరణకు హోమియోటిక్ జన్యువులు అవసరాన్నిబట్టి మరోచోట కూడా ఉంటాయి.

1983లో, దీనికి సంబంధించిందే మరో ఆశ్చర్యకరమైన విషయం తెలిసింది. ఒకే సెల్‌లోని వాల్టర్ గెరింగ్ లేబరేటరీలో, శాస్త్రజ్ఞులకు అన్ని హోమియోటిక్ జన్యువుల్లోనూ 180 అక్షరాలుగల ఒకే పేరాగ్రాఫ్ కనిపించింది. అసలు వీటి పని ఇతర జన్యువులను 'స్విచ్–ఆన్' 'స్విచ్–ఆఫ్' చెయ్యటమే అని కూడా తెలిసింది. ఆ తర్వాత అదే దారిలో పయనించిన శాస్త్రజ్ఞులను పలు కొత్త విషయాలు ఆశ్చర్యపరిచాయి. ఎలుకల్లో హాక్స్ జన్యువులు నాలుగు గ్రూపుల్లో ఉంటాయి. "పిండ దశలో మనకూ ఈగలకూ తేడా లేదు. ఎలుకల్లోను హాక్స్ జన్యు గ్రూపులే మనకూ ఉంటాయి. క్రోమోసోమ్ – 12 మీద ఉంటుంది క్లస్టర్ సి అని Nature పత్రికలో రాశారు.

ఇప్పుడు మనకు రెండు విషయాల గురించి స్పష్టత వచ్చింది. ఒకటి : *మహోన్నతమైన మన మానవజాతిది ఈగల సంతతి.* 530 మిలియన్ సంవత్సరాల క్రితం జరిగిన పిండోత్పత్తి క్రమం నుండే ఆవిర్భావించాం (మనుషులు క్షుద్ర కీటకాల కన్న ఎక్కువేమీ కాదు అనటంలో తప్పులేదుగదా!). మరో ముఖ్య విషయం : దశాబ్దాల తరబడి కొనసాగిన ఫలితంగా మనకు మన గురించి ఎంత తెలిసిందోగాని ఈగల గురించి మాత్రం పుష్కలంగా తెలిసింది. కేంబ్రియన్ యుగంలో జీవించిన ఒక కీటకానికి ఇద్దరు కవలలు పుట్టారు. వాళ్ళలో ఒకరు ఈగగా, మరొకరు మనిషిగా పరిణామం చెందారు. ఇది మీకు కట్టుకథగా కనిపించవచ్చు. కాని ఇది ఇలాగే జరిగిందని నిరూపించటానికి మరో అద్భుత ప్రయోగం జరిగింది. ఈగలోని, జన్యు విభజన ద్వారా, ఒక జన్యువును తొలగించి, జెనెటిక్ ఇంజనీరింగ్ సాయంతో మనిషిలోని ఒక జన్యువును దానిలో ప్రవేశపెట్టి మరో ఈగను పెంచటం సాధ్యమే అని నిరూపించారు. అత్యవసర పరిస్థితుల్లో మనుషుల్లోని హాక్స్ జన్యువులు, ఈగలకు సాయపడగలవు. నిజానికి, ఈ జన్యువులను పరిశీలించినప్పుడు, ఏవి ఈగలవో, ఏవి మనుషులవో చెప్పటం అసాధ్యం.

ఈ పుస్తకం ప్రారంభించటానికి ప్రాతిపదిక ఇదే. జన్యువులు సాఫ్ట్‌వేర్‌లాంటివి. ఏ సిస్టంమీదనైనా పనిచేస్తాయి. అంటే, సిస్టం ఏదైనా, అవి చేసే పని మాత్రం మారదు. 530 మిలియన్ సంవత్సరాల తర్వాత కూడా మనుషుల కంప్యూటర్ ఈగల సాఫ్ట్‌వేర్‌నూ, ఈగల కంప్యూటర్ మనుషుల సాఫ్ట్‌వేర్‌నూ గుర్తించగలదు. కేంబ్రియన్ యుగంలోని 540–520 మిలియన్ సంవత్సరాల మధ్య శరీర నిర్మాణాలతో చాలా ప్రయోగాలు జరిగాయి. 1980లలో కంప్యూటర్ సాఫ్ట్‌వేర్‌లతో జరిగినట్టుగా జంతు శరీరాలకూ, హోమియోటిక్

జన్యువులకూ మధ్య లంకె అప్పుడే ఏర్పడి ఉంటుంది.

ఇప్పుడు మనుషుల్లోని హాక్స్ జన్యువుల గురించి కొద్దిగా తెలుసుకుందాం. Hox C4 జన్యువు, ఈగల్లోని dfd జన్యువుతో సమానం. నోటి భాగాలు దీనినుండే ఏర్పడతాయి. A4, B4, D4 లు ఎలుకలలోని a4, b4, d4 లకు సమానం. వీటినుండి మెడ, వెన్నెముక ఏర్పడ్డాయి. మనుషుల్లో 13 హాక్స్ జన్యువుల క్లస్టర్స్ ఉంటే, ఈగల్లో ఎనిమిది క్లస్టర్లే ఉంటాయి. వెన్నెముక గల జీవుల్లో ముడ్డి దగ్గరే తోకలుంటాయి. మనుషులు తోకలు పెంచటం మానేసిన తర్వాత, దీనికి సంబంధించిన జన్యువులు నిర్మాణంగా ఉన్నాయి. పిండం ఎదుగుదల, జీవజాతి పరిణామ క్రమానికి నకలుగా ఉంటుంది.

ఈ కథలన్నీ బాగానే ఉంటాయిగానీ 'బిగ్‌పిక్చర్'లో ఇవన్నీ ఒక లేశం మాత్రమే. ప్రతి హాక్స్ కంపార్ట్‌మెంట్ ఒక హాక్స్ జన్యువును జాగృతం చేస్తుంది. అది ఇతర జన్యువులను జాగృతం చేస్తుంది. జాగృతం చేసే సిగ్నల్స్ అన్నీ ఒక్కలాగే ఉంటాయి. కాని, శరీరంలోని ఒక్కొక్క భాగంలో అవి ఒక్కొక్క అంగానికి రూపకల్పన చేస్తాయి. ఈగలోని కాళ్ళకూ, రెక్కలకూ కూడా మూలం decapentaplegic అనబడే జన్యువు.

Hedgehog జన్యువులు ఈగ వెనక భాగానికీ, రెక్కలకూ మూలం. పొడుగైన ఎముకలాగున్న చేతికి అయిదు వేళ్ళు ఎలా మొలిచాయి? ఈ పరిణామానికి చాలా కాలం పట్టింది. 400 మిలియన్ సంవత్సరాల క్రితం, చేపల మొప్పల నుండి, తొలి చతుష్పాదుడి చేతులు ఏర్పడినప్పుడే ఇదీ జరిగి ఉంటుంది. ప్రాచీన శిలాజాల ఆధారంగా పరిణామ క్రమాన్ని అధ్యయనం చేస్తున్న శాస్త్రజ్ఞులూ, Hox జన్యువుల మీద పరిశోధన చేస్తున్న పిండోత్పత్తి శాస్త్రజ్ఞులూ ఈ విషయంలో ఏకాభిప్రాయానికి వచ్చారు.

అసలు కథ 1988లో గ్రీన్‌లాండ్‌లో ప్రారంభమవుతుంది. అక్కడ Acanthostega అనబడే శిలాజం లభించింది. అది సగం చేప, సగం చతుష్పాది. దాని వయస్సు 360 మిలియన్ సంవత్సరాలని నిర్ధారించారు. దీనికి కాళ్ళకు ఎనిమిదేసి వేళ్ళుండటం అందర్నీ ఆశ్చర్యపరిచింది. శరీర నిర్మాణం గురించి ప్రయోగాలు జరుగుతున్న కాలమది (360 మిలియన్ సంవత్సరాల క్రితం). చేపల మొప్పల నుండి మన చేతులూ, చేతి వేళ్ళూ ఏర్పడ్డాయి (ముంజేతి ఎముకల నుండి విడిపడినవే వేళ్ళు). మన చేతి ఎక్స్‌రే చూస్తే విషయం స్పష్టమవుతుంది. శిలాజాల ఎముకలను పరిశోధించి శాస్త్రజ్ఞులు ఈ నిర్ధారణలు చేశారు. కాని, ఎంబ్రియాలజిస్టులు (embryologists) కూడా తమ ఆవిష్కరణలతో అంగీకరించారని తెలిసినప్పుడు వాళ్ళ సంతోషానికి అవధుల్లేవు. Hox జన్యువులు మొదట ముంజేతిని కాస్త వంచుతాయి. ఆ వంకలోంచి పుట్టుకొస్తాయి వేళ్ళు.

శరీర ఎదుగుదలను నిర్ణయిస్తున్నవి Hox, Hedgehag జన్యువులు మాత్రమే కాదు, అనేక డజన్ల ఇతర జన్యువుల సమిష్టి కృషి ఫలితమే వివిధ అంగాల అమరిక. శరీరం స్వయం నిర్మితమనటంలో అర్థం ఇదే. జెనెటెసిస్టులు ఈ జన్యువులకు తమాషా పేర్లు పెట్టారు. ఉదా : Radical fringe; even-skipped; fushi tarazu; bunch back; giant; cactus; serpent; gurke; oskar; tailless వగైరా. జెనెటిక్ ఎంబ్రియాలజీ గురించి మాట్లాడటమంటే JRR రోలిన్ సృష్టించిన అద్భుత, ఇంద్రజాలిక Lord of the Rings ప్రపంచంలోకి ప్రవేశించటమే. అన్నీ కొత్త పదాలే. కొన్నిసార్లు తెలిసినమాటలైనా వాటి అర్థాలు భిన్నంగా ఉంటాయి. అయినప్పటికీ ఇందులో ఓ సౌలభ్యముంది. ఓ పట్టాన అర్థంకాని క్వాంటం డైనమిక్స్ సిద్ధాంతాలేవీ ఇందులో ఉండవు. నిజానికి, జటిలమైన ఫిజిక్స్‌తో పోలిస్తే జెనెటిక్ కోడ్‌ను చదవటం కూడా సులభమే. అండంలోని రసాయనాల గురించి అవగాహన పెంచుకోవటం మన ప్రయత్నానికి మొదటిమెట్టు. ఆ తర్వాత పిండం గురించీ తెలుస్తుంది. శరీర నిర్మాణమూ దానంతటదే అర్థమవుతుంది. ఒక జన్యువు మరో జన్యువును అది మరో జన్యువును స్విచ్ ఆన్ (జాగృతం) చేస్తుంది. నిర్మాణ ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఇదొక క్రమబద్ధమైన కెమికల్ – మెకానికల్ ప్రక్రియ. ఒక కోణం నుండి చూస్తే అత్యంత సులభంగా కనిపించే శరీర నిర్మాణం, జన్యుపరంగా అధ్యయనం చేస్తే అత్యంత సంక్లిష్టమైనదని తెలుస్తుంది. యంత్రాలను డిజైన్ చేస్తున్న ఇంజనీర్లు, శరీర నిర్మాణమనే ఇంజనీరింగ్‌ను అధ్యయనం చెయ్యటంవల్ల తమ శాస్త్రజ్ఞానాన్ని ఇంకా అభివృద్ధి చేసుకోవచ్చు.

(Matt Ridley రచన ఆధారంగా)

తెలుగు : ము.పా.సా. హైదరాబాదు.
ఫోన్ : 9177 678 708.

# మరుగున పడిన సంస్థానం

– ముదిగొండ శివప్రసాద్

ఈస్టిండియా కంపెనీవారు స్వదేశీ సంస్థానాలను క్రమంగా ఆక్రమించుకుంటూ వచ్చారు. 1857 విక్టోరియా రాణి భారతదేశాన్ని స్వాధీనం చేసుకున్నది. ఈ దశలో రాజకీయాల్లో అస్తిత్వం కోల్పోయిన పాలకులు ఆంగ్లేయుల ఆధిపత్యాన్ని అంగీకరించారు. సైనిక సహకార పద్ధతి ద్వారా చాలా రాజ్యాలు బ్రిటిషు భారతంలో కలిసిపోయాయి.

ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించినంతవరకు గాంధీ గారి జాతీయోద్యమం ఉధృతం అయ్యేవరకు స్థానిక రాజన్యులు బ్రిటిషువారికి వ్యతిరేకంగా పోరాడలేదు. అలా అని స్వదేశ వేష భాష పోషణ వదలలేదు. నేటి సీమాంధ్రలో విజయనగరం, కాకినాడ, పెద్దాపురం, వెంకటగిరి, చల్లపల్లి, చేబ్రోలు, మీర్జాపురం వంటి ఎన్నెన్నో పేర్లు చెప్పుకోవచ్చు. వెంకటగిరి రాజావారికి సామంతులుగా ఉన్నవారిలో కరవది ప్రభువుల గురించి చెప్పుకోవాలి. వీరి చరిత్ర ఇప్పుడు దాదాపుగా విస్మృతమయిపోయింది. మొన్న "ప్రభాతగీతం" నవల కోసం విషయ సేకరణ మొదలుపెడితే తీగలాగితే డొంక మొత్తం కదిలింది.

కరవాంక = సముద్రపు గట్టు నోర నుండెడి బురద నేల (దేశ్యము – శబ్దరత్నాకరము)

కరవడి = సముద్రపు ఉప్పునీరు వెనుకకు తన్నే ప్రదేశం అని బ్రౌను నిఘంటువు. కరాకు – కరవాకు అనే రూపాలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం ప్రకాశం జిల్లా ముఖ్య పట్టణమైన ఒంగోలుకు ఉత్తరంగా ఇరవై నిమిషాల బస్సు ప్రయాణం దూరంలో కరవది ఉంది. ఒకప్పుడిది బ్రాహ్మణ అగ్రహారం. కాకతీయ ప్రతాపరుద్రుని కాలం నాటి శిలాశాసనం మనకు స్థానిక గంగాపార్వతీ సమేత రామలింగేశ్వర స్వామివారి దేవాలయంలో లభ్యమయింది. కాకతీయ సామ్రాజ్యం ఉత్తరాన ఔరంగాబాద్, దేవగిరి నుండి దక్షిణాన కంచి వరకు వ్యాపించింది. రామేశ్వరం కూడా వెళ్ళిన ఆధారం దొరికింది కానీ అది జయయాత్రయో, తీర్థయాత్రలో ఇంకా నేను నిర్ధారించుకోలేదు. నేటి నూతన రాజధాని మందడం వద్ద కాకతీయ శాసనాలున్నాయి. త్రిపురాంతకంలో సరేసరి. కరవదిని ఖరవధా క్షేత్రం అని సంస్కృతీకరించారు. శ్రీరామచంద్రుడు దండకారణ్య సంచారం చేస్తున్నప్పుడు ఖరాసురుణ్ణి వధించిన ప్రదేశమే కరవది అయిందని ఒక ఐతిహ్యం కల్పించారు. దీనికి చారిత్రక ప్రామాణ్యము మృగ్యము. శూర్పణఖకు అరణంగా ఇవ్వబడిన ప్రదేశం ఇదేనని మరొక జన శ్రుతి. ఈతముక్కల అంటే ఇంతి ముక్కు కోసిన గ్రామం అని కథ సృష్టించారు.

కరవది బ్రాహ్మణులు గొప్ప భోక్తలు. ఇక్కడ ఖగోళ విజ్ఞానం వికసించింది. పిసపాటి వారి పంచాంగాలు నేటికీ ప్రసిద్ధములే (పిసుపాటి, పీసపాటి, పిశుపాటి ఇలా చాలా శబ్ద రూపాలు కనబడుతున్నాయి).

**ఆలయములు :**

కరవదిలో కొన్ని ప్రధానాలయములున్నాయి. చెరువు ప్రక్కన రుక్మిణీ సత్యభామాసమేత వేణుగోపాలస్వామి దేవాలయము, ప్రాచీనమైన గంగాపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి వారి దేవాలయము, భద్రాచల రామాలయము పోలికలో ఉన్న దేవాలయము, అభయ ఆంజనేయ దేవాలయము (అర్వాచీనము) సాయిబాబా గుడి, అంకాలమ్మ గుడి, నాగేంద్రుని పుట్ట రేణుకా ఎల్లమ్మ గుడి వంటివి ఉన్నాయి. ఒక కోతి వచ్చి తోకతో వర్తులాకారంలో గీచిన చోట భక్తులు అభయాంజనేయస్వామి గుడి నిర్మించారు.

బ్రాహ్మణులలో శాఖాభేదాలుండేవి. వైదికులు వైదికులతో, నియోగులు నియోగులతోను వైవాహిక సంబంధ బాంధవ్యాలు కుదుర్చుకొనేవారు. పురాణం, పిశుపాటి, కురుగంటి, మొక్కపాటి, నేలభొట్ల, కప్పగంతుల ఇవన్నీ వైదిక కుటుంబాలే.

వేణుగోపాలస్వామి విగ్రహం కాశీ నుంచి తెచ్చి ప్రతిష్ఠ చేసినట్లు జన శ్రుతి. అక్కరాజు కుటుంబీకులు ప్రోత్సాహాన్ని

అందించారు. ఇక రాజా పిశుపాటి వెంకట రంగయ్య గారు 1890 ప్రాంతం నుండి చైత్ర శుద్ధ నవమి నాడే కళ్యాణోత్సవాలు అన్ని దేవాలయాలలో జరిగించే ఏర్పాట్లు చేసినట్లు తెలుస్తున్నది. వీరే రామలింగేశ్వర స్వామి దేవాలయములో పార్వతీ వీరభద్ర స్వామి వారి విగ్రహములను ప్రతిష్టింపజేశారు.

పిసు(శు)పాటి బంగారు భొట్ల అనువంశిక ట్రస్టీగా వ్యవహరించారు. నారాయణం కృష్ణమాత్యులు వారి కుమారుడు నారాయణం వేంకటశేష రఘుప్రదీప్, హనుమాచార్యులు అర్చకులుగా వ్యవహరిస్తున్నారు.

పిసుపాటి పూర్ణయ్య సిద్ధాంతి, సత్యనారాయణ సిద్ధాంతి పంచాంగకర్తలు.

పిసుపాటి చిదంబరశాస్త్రి గద్వాల సంస్థాన ఆస్థాన పండితులు. వీరు పద్మపురాణం రచించారు. వీరు ఆశుకవి, అవధాన శేఖరుడు.

పిసుపాటి వెంకట్రామశాస్త్రి, వెంకటేశ్వర ఘనాపాఠీలు వేదంలో దిట్టలు. నేలభట్ల రంగనాయక శర్మ గాత్ర విద్వాంసుడు. కప్పగంతుల రంగ కవి బహు నాటక కర్త. కరవది రంగారావు మాయల ఫకీర్ ఫేం – మొక్కపాటి కృష్ణమోహన్ సాంఘిక నటుడు. మేళ్ళచెరువు జగన్నాథ శాస్త్రి గొప్ప పౌరాణికుడు.

1942 దేవరంపాడు ఉప్పుసత్యాగ్రహ వీరులకు కరవదియే వేదిక. ఆహార విహారాలు కల్పించారు. చలనచిత్ర తార కాంచన కరవది గ్రామానికి చెందినవారే. వీరు శ్రీమతి విద్యుత్ వల్లీ తాయారు గారి కుమార్తె. మద్రాసులో బి.ఎ. చదివి, ఎయిర్‌హోస్టెస్‌గా కొద్దికాలం పనిచేసి తర్వాత చిత్రరంగంలో నటిగా రాణించారు. పద్మశ్రీ బిరుదాంకితులు షేక్ చినమౌలానా సాహెబ్ ప్రముఖ నాదస్వర విద్వాంసుడు ఇక్కడివారే.

1830లో ఏనుగుల వీరస్వామయ్య ఈ ప్రాంతం నుండి పయనించినట్లు వారి కాశీయాత్ర గ్రంథంలో ఉంది. ఒంగోలులోని ప్రసిద్ధ పౌరాణికులు మంత్ర శాస్త్రవేత్త కొంపల్లి జ్వాలయారాధ్యులవారి ధర్మపత్ని సీతారామమ్మ గారి పుట్టిల్లు కరవది. కరవది రామకృష్ణయ్య – భార్య రామమ్మ గారు నియోగి కుటుంబీకులు. వీరు కరవది కారణంగా పనిచేసినట్లున్నది (సర్వేయర్?). సీతారామమ్మ జ్వాలయారాధ్యుల దౌహిత్రుడే ఈ వ్యాసరచయిత. కావలి జవహర్ భారతి వైస్ ప్రిన్సిపాల్ కొంపల్లి వెంకట కోటి లింగం సీతారామమ్మగారి పెద్ద కొడుకు.

**పిశుపాటి వారి చరిత్ర :**

వీరి వంశ చరిత్ర ముత్తంభట్టు దగ్గరి నుండి లభ్యమవుతున్నది. ముత్తయ్య శబ్దము మృత్యుంజయ శబ్ద భవము. భట్టు భట్టారక శబ్ద వి(ప్రా)కృతి. తర్వాతి తరంలో బంగారు భట్ల (భట్టు) పేరు కనపడుతున్నది. పెద్దల పేర్లు పిల్లలకు పెట్టుకునే సంప్రదాయం ఉంది. కాబట్టి వీరి వంశంలో రంగయ్య, బంగారు భట్టు పేర్లు పునరావృతం కావడం గమనార్హం. బంగారు భట్టు నాలుగుసార్లు వచ్చింది. పిశుపాటి రాఘవయ్య ఇక్కడి తొలి సి.పి.ఐ. పార్లమెంటు సభ్యుడు.

బంగారు భొట్ల గారికి చిన్న వెంకట్రాయశర్మ, లక్ష్మమ్మ, లక్ష్మీనారాయణ అని ముగ్గురు సంతానం. చివరివాడైన లక్ష్మీనారాయణ నిస్సంతు.

చిన లక్ష్మీనారాయణ పెద్ద కుమారుడు బంగారు భొట్లు – ఈయన భార్య వెంకటలక్ష్మమ్మ. బంగారు భట్ల గారు దత్తతకు వచ్చినట్లు తెలుస్తున్నది. వీరి కుమారుడు పిశుపాటి వెంకట రంగయ్య రాజా (కాలం 1870) వీరి ధర్మపత్ని సుందరమ్మ. వీరికి నలుగురు సంతానం. 1. బంగారు భొట్లు (భార్య బుచ్చమ్మ), 2. వెంకట్రాయశర్మ (భార్య శేషమ్మ), 3. లక్ష్మీనారాయణ (భార్య సుబ్బమ్మ), 4. వెంకట సుబ్బమ్మ.

బంగారు భట్టు – 3 గారి పెద్దకుమార్తె మీనాక్ష్మమ్మ.
రెండవ కుమార్తె లక్ష్మమ్మ, మూడవవాడు సుబ్రహ్మణ్యం.
మీనాక్ష్మమ్మ కుమారుడు సత్యనారాయణ.

పిశుపాటి వెంకట్రాయశర్మ గారి పెద్ద కొడుకు వెంటక రమణయ్య – భార్య కాశీ అన్నపూర్ణ, వెంకట్రాయ శర్మగారి కుమార్తెలు కోమలవల్లి తాయారు, విద్యుత్ వల్లి తాయారు, అన్నపూర్ణమ్మ (చివుకుల), శివరామకృష్ణ. వీరిలో విద్యుత్‌వల్లీ, తాయారు భర్త పురాణం రామకృష్ణశాస్త్రి, ఇంజనీర్. వీరి కుమార్తెలు వసుంధరాదేవి, గిరిజా కుమారి. వసుంధరాదేవియే కాంచన సినీతార. ఇక అన్నపూర్ణమ్మగారి భర్త కురుగంటి సదాశివశర్మ వారి కుమారుడు ఆనందతీర్థ – లాయరు ఒంగోలులో ఉన్నారు (జననం 27-5-1938).

ఒంగోలు పి.వి.ఆర్. హైస్కూలు నిర్వహణలో కురుగంటి సదాశివశర్మ గారు ప్రముఖ పాత్ర పోషించారు. పిశుపాటి వెంకట రంగయ్య గారి పెద్ద కుమారుడు బంగారు భట్టు

రెండవ కుమారుడైన వెంకట్రాయ శర్మ గారి పెద్ద కుమారుడు వెంకటరమణయ్య. బంగారుభొట్ల గారికి దత్తుగా వెళ్ళాడు.

ఆనందతీర్థ గారి అన్న చెంచురామ శేషశర్మ. కుమారుడు కిశోర్. కోమలవల్లి తాయారు గారికి దత్తుడు.

నాల్గవ బంగారు భొట్లు – బుచ్చమ్మల కుమార్తె కామాక్షమ్మ. వీరి కుమారుడు మొక్కపాటి కృష్ణమోహన్ సాంఘిక నాటక రచయిత, నటుడు. ప్రస్తుతం తెనాలిలో ఉన్నారు.

కరవది చెరువుకు సమీపంలో రాజా వెంకట రంగయ్య గారి మహల్ ఉండేది. విశాలమైన ప్రాంగణంలో పూలతోట మధ్యలో కోటగోడల మధ్య భవనం. గోడలకు తైలవర్ణ చిత్రములు. రెండు గుర్రాలు పూన్చిన బగ్గీ, పల్లకీ, జర్మనీ (టాప్‌లెస్) మోటారు కారు చుట్టూ భటులు, అంగరక్షకులుగా ఉండేవారు. ఇంకా ఒక బ్రిటిషు ఏజెంటు రూథర్‌ఫర్డ్ వెంకటగిరి రాజాగారి ఏజెంటు కూడా ఉండేవారు. పూజామందిరంలో మరకత శివలింగం, రత్నాలు పొదిగిన నాగాభరణం ఇంకా శ్రీచక్రం ఉండేవి. గణేశ నవరాత్రులు, శరన్నవరాత్రులు, శ్రీరామనవమి ఉత్సవాలు, యజ్ఞాలు జరుగుతూ ఉండేవి. ఆత్మరక్షణకై పిస్టల్ ఉండేది. పిడికత్తి (కర్రలో కత్తి) ఉండేది.

వేదపాఠశాలలు నడిచాయి. చెంబై వైద్యనాథ భాగవతార్, మంగళంపల్లి బాలమురళి, ములుకుట్ల సదాశివశాస్త్రి వంటి కళాకారులు బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేవారు. చదలవాడ నుండి నగరాజకుమారి నృత్యానికి వచ్చేది. కూచిపూడి నుండి భాగవతులు వచ్చి ఉషాపరిణయం నాటకాలు, యక్షగానములు ప్రదర్శించేవారు. ఇంకా రోషనారా వంటి చారిత్రక నాటకాలు పోషింపబడ్డాయి.

మూడు దేవాలయాలకు కలిపి ఒకే వాహనశాల ఉండేది. అందులో రావణ, ఆంజనేయ, నంది, పొన్నమాను, గరుడ వాహనాదులు ఉండేవి. నేలభట్ల ఆదినారాయణగారి నేతృత్వంలో పండిత సభలు జరిగేవి. కుందుర్తి చలపతిరావు కార్యదర్శిగా సాహితీ సాంస్కృతిక సభలు నిర్వహించి, పండిత సత్కారాలు చేసేవారు. నాట్యావధాని ధారా రామనాథశాస్త్రి, ఆంధ్రప్రదేశ్ ఆస్థాన కవి కాశీ కృష్ణమాచార్యులు వంటివారు వీరి సత్కారాలు అందుకున్నారు.

ఐ.వి. సుబ్బారావు అనే ఆస్థాన చిత్రకారుడు ఉండేవాడు. వెంకట్రాయ శర్మగారు స్వయంగా కవి పండితుడు. రాజతరంగిణి, గాడ్ అండ్ కాస్మోస్, నారాయణ తీర్థుల కృష్ణ లీలాతరంగిణి వ్యాఖ్యానాలు రచించారు. నేడు ఇవి అలభ్యములు. బెర్లిన్ నుండి శర్మ గారు ధర్మరంజన డాక్టర్ పండిత బిరుదు పొందారు. వానప్రస్థానాశ్రమంలో తోటలో ఉండేవారు. వేణుగోపాలస్వామి వారి దేవాలయంలో మూలవిరాట్ పాదాలపైన మాఘమాసంలో సూర్యకిరణాలు పడటం విశేషం. గ్రామంలో మసీదులు లేవు కాని చర్చీలు ఉన్నాయి. ఇటుక బట్టీల పరిశ్రమ ఇక్కడ ప్రముఖమైనది. గ్రామీణ వృత్తులు నశించాక ఇక్కడి ప్రజలు ఒంగోలు, హైదరాబాదు వంటి పట్టణాలకు ఉద్యోగార్థం వెళ్ళిపోయారు. సికిందరాబాదులోని గంజాం కృష్ణప్రసాద్ ఉస్మానియా యూనివర్శిటీలోని హిస్టరీ ప్రొఫెసర్ పి.ఎస్.ఆర్. కరవదివారే. వారి పూర్తి పేరు పిశుపాటి శ్రీరామశర్మ.

పిశుపాటి వారి సంస్థానం వెంకట్రాయశర్మ గారి తర్వాత కోర్టు కేసులలో చిక్కుకొని బలహీనపడిపోయింది. ప్రస్తుతం కరవదిలో వీరి ఆస్తులు లేవు. కొందరు అస్తమించారు, మరికొందరు ఆయా నగరములలో స్థిరపడ్డారు. బ్రాహ్మణులు వంశపారంపర్య వృత్తులు వదిలిపెట్టారు. అట్టడుగు వర్గాలలో క్రైస్తవీకరణ జరిగింది.

**1942 దేవరంపాడు సత్యాగ్రహం :**

మద్రాసులో బ్రిటిషువారి తుపాకీలకు రొమ్ము చూపిన ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులుగారు దేవరంపాడులో చాలాకాలం ఉన్నారు. కరవదికి ఆనుకొని దేవరంపాడు ఉంది. అక్కడికి సమీపంలో గుండాయపాలెం ఉంది. మహాత్మాగాంధీ పిలుపు మేరకు క్విట్ ఇండియా ఉద్యమం, ఉప్పుసత్యాగ్రహం జరిగాయి. అందులో స్థానికులు పాల్గొన్నారు. అమ్మనబ్రోలు కరవది వంటి గ్రామ ప్రజలు తరలి వచ్చారు. ఇక్కడికి బాబూ రాజేంద్రప్రసాద్, టంగుటూరి ప్రకాశం పంతులు వంటి ప్రముఖ నాయకులూ వచ్చారు. ఉద్యమంలో సాగి వంశస్థులైన సాగి విజయరామరాజు, సాగి కృష్ణంరాజు, చేబ్రోలు ఆంజనేయులు, సాయిన ఆదెమ్మ, పోలవరపు వెంకటకృష్ణయ్య, నరహరి పద్మనాభయ్య వంటి వారెందరో పాల్గొన్నారు. లాఠీదెబ్బలు తిన్నారు. కొండా వెంకటప్పయ్య పంతులు వంటివారు ఉద్యమ నాయకత్వం వహించారు. ప్రస్తుతం సాగి విజయరామరాజు గారి శిలావిగ్రహం అక్కడ ఉంది. వీరు స్వాతంత్ర్య సమరయోధుల పింఛన్లు కూడా తిరస్కరించారు. వీరికి రెండున్నర

సంవత్సరాలు జైలు శిక్ష పడింది. ప్రస్తుతం ఒక స్మారక స్తూపం కనపడుతున్నది. అలాగే టంగుటూరి ప్రకాశం పంతులు గారు నివసించిన తోట ఉంది. ఇక్కడ ఒక స్తూపము నిర్మించారు. దానిపై గాంధీ చిత్రం ఉంది. ఉద్యమంలో పాల్గొన్నవారికి భోజనము, మజ్జిగ, ఆశ్రయము కరవది కల్పించింది. కొందరు వేణుగోపాలస్వామి సువిశాల ప్రాంగణం (కాంపౌండు) లోపల ఉన్నారు. కరవది – దేవరంపాడు, గుండాయపాలెంలో జరిగిన స్వాతంత్ర్యోద్యమం చరిత్ర ముందు తరాలవారికి అందకుండా పోయింది.

పెళ్ళూరు కోటతో కరవది సంస్థానం వారికి సంబంధాలుండేవి. ప్రస్తుతం కరవదిలో ఆనాటి రాజమహల్ మేడ లేదు. దానిని నెల్లూరు నుండి వచ్చిన డాక్టరు గారు 60 వేలకు కొని, హాస్పిటల్ కట్టుకున్నారు. చివుకుల, పిసుపాటి, కారుగంటి, నేలభొట్ల, మొక్కపాటి వంశస్థుల జాడలు కూడా కనపడటం లేదు. విరిగిపోయిన గుర్రపుబగ్గీ చువ్వలు, షహనాయీలు, నౌబత్ (నగారా) ఆనవాళ్ళు కథావశిష్టమైనాయి. కరవది వారు వెంకటగిరి రాజులకు సామంతులుగా పనిచేసినట్లు తెలుసుకున్నాము. వెంకటగిరి సంస్థానాధీశులు వెలమదొరలు. వీరి పూర్వీకులు తెలంగాణాలోని రాచకొండ ప్రాంతమువారు. తర్వాత శ్రీకృష్ణదేవరాయల కాలంలో నెల్లూరు జిల్లా వెలుగోడు, ఆ తర్వాత వెంకటగిరి వచ్చారు. వీరిలో అందరూ కవి పండిత పోషకులే. వీరిలో కుమార యాచమ నాయనింగారికి విద్వత్కుమార అనే బిరుదం ఉంది. వీరి ఆస్థానంలోని గోపీనాథ వెంకటకవి బ్రహ్మవైవర్తము. శ్రీమద్రామాయణము రచించారు. వీరు కరవదిలోని పిసుపాటి వెంకటరంగయ్య రాజా వారికి సమకాలికులు కావచ్చు.

ఈ సమాచార సేకరణలో నాకు సహకరించిన కురుగంటి ఆనంద తీర్థ (ఒంగోలు), కొండలరావు (దేవరంపాడు) గార్లకు కృతజ్ఞతలు. అర్చకులు నారాయణం రఘు ప్రదీప్‌కు ఆశీస్సులు.

ప్రొఫెసర్ ముదిగొండ శివప్రసాద్
ఎం.ఎ.పి.హెచ్.డి., హైదరాబాద్.
ఫోన్ : 960 361 2246

---

## షోపెన్ హోవర్ – మంచిమాటలు

- ఎక్కువగా దుఃఖించకూడదంటే, ఎక్కువగా ఆనందించకూడదు.
- ఒక వ్యక్తి తన జాతిని గురించి, కులం గురించి, దేశం గురించి గర్విస్తున్నాడంటే అతడిలో గర్వించదగ్గ మరే లక్షణమూ లేదన్నమాట. లేకపోతే లక్షలాదిమందిలో కోట్లాదిమందిలో ఒకడిగా తాను గర్విస్తున్నాడంటే అర్థమేమిటి? తన జాతిలోని, తన కులంలోని లోపాలను చూడలేనివాడే అదేదో చాలా గొప్ప విషయమనుకుని తృప్తిపడతాడు.
- మరణానికి వడ్డీలాంటిది నిద్ర. వడ్డీ ఎప్పటికప్పుడు చెల్లిస్తే అసలు తిరిగి ఇవ్వటం కొంతకాలం వాయిదా వెయ్యొచ్చు.
- స్వంతంగా ఆలోచించలేనివాళ్ళు, ఇతర్ల అభిప్రాయాలే తమ అభిప్రాయాలనుకుంటారు.
- ఎవరైనా అబద్ధాలాడుతున్నారని గ్రహిస్తే, అతడు మరింత వాగటానికి ప్రోత్సహించాలి. తాను చెప్పిందంతా నమ్ముతున్నారనుకుని అతడు మరింత బాహాటంగా అబద్ధాలాడతాడు.
- మామూలు మనుషులు టైంపాస్ చెయ్యటమెలాగా అని ఆలోచిస్తారు. ప్రతిభావంతుడు కాలాన్ని ఉపయోగించటమెలా అని ఆలోచిస్తాడు.
- మనుషులు ఒకర్నొకరు “మిస్టర్, సర్” అని కాదు, “సహబాధితుడా”, “సహ దుఃఖితుడా” అని సంబోధించుకోవాలి.
- నువ్వు ఎన్ని దీపాలు వెలిగించినా వాటి చుట్టూ చీకటి ఎప్పుడూ పరచుకొనే ఉంటుంది.
- జంతువులు, మరణించేటప్పుడు తప్ప మరింకెప్పుడూ మరణం గురించి ఆలోచించవు.
- తన డివైన్ కామెడీలో నరకాన్ని అద్భుతంగా చిత్రించాడు దాంతె. అతడి మాటల్లోని ఆ నరకం ఈ లోకమేగదా!
- డబ్బంటే మనుషులకు ఊహాస్వర్గం. ఉన్నదాంతో ఆనందించలేరు.
- ఏ దీపాన్నైనా ఆర్పవచ్చు. మేధస్సు కూడా ఒక దీపమే. దాన్నీ ఆర్పవచ్చు.

# ఆ మనుషులేరి

- మహీధర రామశాస్త్రి

**స్వాతంత్ర్య సమరయోధుడు, శతాబ్ది మహనీయుడు - డా. ఎ.బి. నాగేశ్వరరావు (1.11.1901 - 6.11.1982) :**

**జననం :**

అంబటిపూడి బాలనాగేశ్వరరావు గారు మధ్యతరగతి, వ్యవసాయ, వెలనాటి బ్రాహ్మణ కుటుంబంలో 1901 నవంబరు 1వ తేదీనాడు, అనగా ప్లవంగ నామ సంవత్సర ఆశ్వయుజ పూర్ణిమనాడు కృష్ణాజిల్లా "కొజ్జిలపేట"లో జన్మించారు. వారి స్వస్థలం అవనిగడ్డ. తల్లిదండ్రులు నాంచారమ్మ - సుబ్బారాయుడుగారలు.

నాంచారమ్మ - సుబ్బారాయుడు దంపతుల ముగ్గురు కుమారులలో ఎ.బి. రెండవవారు. పది సంవత్సరాల వయసులో తండ్రిని పోగొట్టుకున్నారు. ఎ.బి. అన్నగారైన సాంబశివరావుగారి పోషణలో పెరిగారు. సాంబశివరావుకు తండ్రి ఉద్యోగవమే ఇచ్చారు. అన్నగారి పట్ల ఎ.బి. లక్ష్మణస్వామిలా మసలుకొనేవారు.

**చదువు :**

16వ సంవత్సరంలో హైస్కూలు విద్యను పూర్తి చేసుకొనిన ఎ.బి.ని వారి పినతండ్రి భార్య అయిన కామేశ్వరమ్మ దత్తత తీసుకొన్నారు.

18 సంవత్సరాల వయసులో తన అక్క కూతురు సూరమ్మను పెళ్ళి చేసుకున్నారు. కానీ దురదృష్టవశాత్తు సూరమ్మ తొలి కానుపులోనే మరణించింది. దత్తత తల్లి అయిన కామేశ్వరమ్మగారు ఎ.బి.కి ద్వితీయ వివాహం జరిపించారు. ఈ ద్వితీయ పత్ని పేరు కూడా కామేశ్వరమ్మే. ఆ దంపతులకు అయిదుగురు కుమారులు, నలుగురు కుమార్తెలు కలిగారు.

1918-20 సంవత్సరాల కాలంలో ఎ.బి. బందరులోని నోబుల్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసుకున్నారు. తర్వాత ఎల్.ఎమ్.పి. డాక్టర్ కోర్సు చదివే నిమిత్తం విశాఖపట్టణం వైద్య విద్యాలయంలో చేరారు.

**గాంధీజీ ప్రభావం :**

ఎ.బి. జన్మస్థలమైన మచిలీపట్నంలో 'వందేమాతరం' ఉద్యమం ఉధృతంగా సాగుతున్నరోజులవి. ముట్నూరి కృష్ణారావు, కోపెల్ల హనుమంతరావు, భోగరాజు పట్టాభిసీతారామయ్యల ఆధ్వర్యంలో ఉద్యమం సాగుతుంది. అప్పుడే బిపిన్‌చంద్ర పాల్ మచిలీపట్నం వచ్చి పెద్ద బహిరంగ సభ జరిపారు. విద్యార్థి దశలో ఉన్న బాల నాగేశ్వరరావు మీద ఎంతో కొంత ప్రభావం పడిందనాలి.

ఆ ప్రభావం వైజాగ్‌లో వైద్యకళాశాలలో చదువుతున్న రోజుల్లో బయటపడింది. రాజమండ్రి వాస్తవ్యులైన వంగవీటి వెంకటరామ దీక్షితులు (వి.వి.ఆర్. దీక్షితులు) ఎ.బి. గారికి సహాధ్యాయులు. ఇద్దరూ ఉద్యమంలో పాల్గొన్నవారే.

1920లో గాంధీజీ భారత్‌కి వచ్చి జాతీయోద్యమం చేపట్టిన రోజులవి. విశాఖపట్టణంలో లక్ష్మీబాయమ్మ మొదలైన నాయకులు గాంధీ టోపీధారణ ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారు. ఆ ప్రభావంతో ఎ.బి. గాంధీ టోపీ ధరించి మెడికల్ స్కూలుకి వెళ్ళారు. అధికారులు ఎ.బి.ని స్కూలు నుంచి బహిష్కరించారు.

**డాక్టరుగా ఎ.బి. :**

1922-26 మధ్యకాలంలో రాజకీయ పరిస్థితులు చక్కబడిన కారణంగా వైద్య విద్య పూర్తి చేసుకొని, కైకలూరు తాలూకా నరసాయిపాలెంలో డాక్టరుగా ప్రాక్టీసును ప్రారంభించారు ఎ.బి.

**జాతీయోద్యమంలో ఎ.బి. :**

గాంధీజీ జాతీయోద్యమాన్ని ప్రత్యక్ష పరోక్ష విధానాలుగా విభజించారు. 1. సహాయ నిరాకరణం, ఉప్పుసత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాలు. 2. నిర్మాణాత్మక కార్యక్రమాలు.

ఎ.బి. ఈ రెండు రకాలైన కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొని, తనవంతు దేశ భక్తినికి చాటుకున్నారు.

**సహాయ నిరాకరణోద్యమం :**

సహాయ నిరాకరణోద్యమ ప్రచారం 'తిలక్' స్వరాజ్య నిధి వసూలు' నిమిత్తం గాంధీజీ మౌలానా మహమ్మదాలీ, ఆయన భార్య 'సుకాని' 14-9-1921 నాడు విశాఖపట్నం

వచ్చారు. గాంధీజీని చూడాలని వచ్చిన ఎంతోమందిలో మెడికల్ స్కూలు విద్యార్థులు కూడా ఉన్నారు. సహజంగా ఎ.బి. కూడా వచ్చారు. రైల్వేస్టేషనులో దిగుతున్న మహమ్మద్ అలీని అరెస్టు చేశారు. శాంతియుత వాతావరణంలో అరెస్టు చర్యను ప్రజలంతా ఖండించారు. యువకుల్లో ఉద్రేకం పొంగి పొర్లింది. గాంధీజీ 'సహాయ నిరాకరణం'లో పాల్గొనవలసిందిగా విశాఖపట్నం రైల్వేస్టేషన్లోనే తమ సందేశాన్ని ఇచ్చారు. గాంధీజీ ప్రసంగం ఎ.బి. జీవిత గమ్యాన్నే మార్చేసింది. తదాదిగా స్వాతంత్ర్య పోరాటంలో మడమ తిప్పని వీరునిగా మూడుసార్లు జైలు శిక్ష అనుభవించారు.

విశాఖపట్నం వైద్య విద్యాలయం నుండి ఎ.బి., దీక్షితులు, కె.ఎల్. నరసింహారావు మొదలైన వైద్య విద్యార్థులు ప్రభుత్వ పోలీసు చర్యను నిరసిస్తూ కళాశాల తరగతులు బహిష్కరించారు. నినాదాలు చేస్తూ ఊరేగింపుగా బయలుదేరి సభ జరిపారు. విదేశీ వస్త్రాలను, వస్తువులను కుప్పగా పోసి తగులబెట్టారు. గాంధీ టోపీని ధరించడం కూడా నేరం, శిక్షార్హమవుతుంది. 1921 సెప్టెంబర్ 19 న విశాఖపట్నం వైద్య విద్యాలయంలోని ఒక విద్యార్థి గాంధీ టోపీ ధరించి, తరగతులకు హాజరు కావడంతో అతడిని స్కూలు నుంచి బహిష్కరించారు. మర్నాడు ఎ.బి.తో సహా 142 మంది విద్యార్థులు గాంధీ టోపీలు ధరించి, తరగతులకు హాజరైనారు. 142 మందినీ తాత్కాలికంగా క్లాసుల నుండి డిస్మిస్ చేసింది కళాశాల ఆధిపత్యం. క్షమాపణ చెప్పి గాంధీ టోపీని ధరించమని వాగ్దానం చేస్తే తరగతులకు అనుమతిస్తామన్నారు. ఎ.బి.తోసహా 39 మంది క్షమాపణలు చెప్పేందుకు నిరాకరించగా అధికారులు వారిని 1921 అక్టోబరు 23 నాడు కళాశాల నుండి శాశ్వతంగా బహిష్కరించారు. ఎ.బి.తో పాటు బహిష్కరింపబడినవారిలో శోభనా చలపతిరావు (మచిలీపట్నం), వి.వి.ఆర్. దీక్షితులు (రాజమండ్రి), కె.ఎల్. నరసింహారావు (రాజమండ్రి), గంటి సూర్యనారాయణ (విశాఖపట్నం) కూడా ఉన్నారు.

బహిష్కరణానంతరం వీరంతా ఎవరి ఇళ్ళకు వాళ్ళు వెళ్ళాలని నిర్ణయించుకుంటే, ప్రభుత్వం అనుమతించలేదు. వీరందరూ ఉద్యమంలోకి ఉరికారు. *యంగ్ ఇండియా* ఈ విశాఖపట్నం ఉదంతాన్ని ప్రచురించింది. 'ఈ ముప్పైతొమ్మిది మంది విద్యార్థులు స్వరాజ్యం కోసం తమవంతు సేవ చేయాలని, దాని కొరకు ఎంతటి త్యాగానికైనా సిద్ధమేనని ప్రతిజ్ఞ చేయాలని' గాంధీజీ ఆదేశించారు. గాంధీజీ ఆదేశం మేరకు ప్రతిజ్ఞ చేసి, ఆ విషయాన్ని కాంగ్రెస్ హైకమాండ్‌లోకి తంతి పంపిచారు. విశాఖపట్నం వైద్య విద్యాలయం నుండి బహిష్కరింపబడిన ఎ.బి. మొదలైన ముప్పైతొమ్మిదిమంది వైద్య విద్యార్థులను వైజాగ్‌లో ప్రఖ్యాత కవి మారేపల్లి రామచంద్ర శాస్త్రి ఖద్దరు అమ్మి, వీరిని మూడు నెలలు పోషించారు. ఈ ఉదంతం ఎ.బి.ని కాంగ్రెసుతోను, స్వాతంత్ర్య పోరాటంతోను ముప్పై సంవత్సరాలపాటు అనుబంధం కలిగేటట్లు చేసింది.

మారేపల్లి రామచంద్ర శాస్త్రి కవిగారి సారథ్యంలో ఈ ముప్పైతొమ్మిది మంది విద్యార్థులు విశాఖపట్నంలో గాంధీజీ నిర్మాణ కార్యక్రమాలను చేసేవారు. ఖద్దరు అమ్మకం, ప్రభుత్వాన్ని విమర్శిస్తూ వ్యంగ్యంగా పాటలు పాడటం, నాటికలు ప్రదర్శించడం ఈ కార్యక్రమాల్లో భాగంగా ఉండేవి. 1922లో విశాఖపట్నలో 144వ సెక్షను అమలు పరిచారు. 144 సెక్షనుని ధిక్కరిస్తూ డా. వంగవీటి దీక్షితులు, డా. కె.ఎల్. నరసింహారావు మొదలైన విద్యార్థులందరు 'జలియన్ వాలా బాగ్' మారణహోమాన్ని, రౌలట్ చట్టానికి వ్యతిరేకంగా పానుగంటివారు రచించిన 'పంజాబు దురంతాలు' అనే నాటికను ప్రదర్శించారు. వారందరినీ అరెస్టు చేసి, నాలుగు నెలల కఠిన కారాగార శిక్షను రాజమండ్రి సెంట్రల్ జైల్‌లో అనుభవింపజేశారు. చౌరా చౌరీ ఘటనతో సహాయ నిరాకరణ ఉద్యమం తాత్కాలికంగా నిలుపుదల చేయబడింది. విద్యార్థులందరూ ఎ.బి.తో సహా విడుదలై బయటపడ్డారు. 1926 నాటికి వైద్య విద్యను పూర్తి చేసుకుని బందరు దగ్గరున్న నరసాయపాలెం గ్రామంలో వైద్య వృత్తిని ప్రారంభించారు ఎ.బి.!

**ఉప్పుసత్యాగ్రహం : 1930 :**

1929 మే 8 న సీతానగరం ఆశ్రమానికి వచ్చారు. గాంధీజీ రాకతో రాజమండ్రి కాంగ్రెసు కార్యకర్తలలోను, ఈ ప్రాంత యువతలోను ఉత్సాహం రెట్టింపయింది. సర్వశ్రీ మద్దూరి అన్నపూర్ణయ్య, క్రొవ్విడి లింగరాజు, చుండ్రుపట్ల హనుమంతరావు, బండరాముడు, ధరణీప్రగడ శేషగిరిరావు, రామచంద్రుని వెంకటప్పయ్య, వక్కలంక సుబ్బారావు, డా. బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యం ఇత్యాదులు ఆశ్రమ కార్యక్రమాలను ఉధృతం చేస్తూన్న రోజులు అవి.

**ఎ.బి. రాజమండ్రి రాక :**

విశాఖ వైద్య కళాశాలలో ఎ.బి. సహవిద్యార్థి రాజమండ్రి

వాసి అయిన డా. దీక్షితులు వైద్యం చేస్తూ సీతానగరం ఆశ్రమంలో ఉన్న ఉద్యమ కారుల కుటుంబాలకు, గ్రామ ప్రజలకు తలలో నాలుకలా ఉండేవారు. ఫలితంగా దీక్షితులు గారికి రాజమండ్రిలోని తన ఆసుపత్రిని, రోగులను చూసేటందుకు, సమయం ఉండేది కాదు. అప్పుడు దీక్షితులుగారు తన సహాధ్యాయి, నరసాయపాలెంలో వైద్య వృత్తిలో ఉన్న ఎ.బి.ని రాజమండ్రి వచ్చి తన ఆసుపత్రిని చూడవలసిందిగా కోరారు. అంతే, అదే రామాజ్ఞగా భావించి, ఎ.బి. 1929 మే 23 న రాజమండ్రికి తన మకాం శాశ్వతంగా మార్చేశారు.

**రాజమండ్రి రాజకీయాలు :**

రాజమండ్రిలో వైద్యం చేస్తూనే డా. బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యం, క్రొవ్విడి లింగరాజు వంటివారితో కలిసి ప్రభుత్వం వ్యతిరేక కార్యక్రమాల్లో పాల్గొనేవారు ఎ.బి.

ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొన్న లింగరాజు రామచంద్రుని వెంకటప్పవంటి నాయకులు కాకినాడలో అరెస్టు అయ్యారు. ఆ సమయంలో ఎ.బి. రాజమండ్రిలో స్థానిక కాంగ్రెసు కార్యక్రమాలకు ఇన్‌ఛార్జిగా ఉంటూ మహిళా కార్యకర్తల కార్యక్రమాలను పర్యవేక్షించారు. దుర్గాబాయి, లింగరాజు మొదలైన ప్రథమ శ్రేణి నాయకులు మద్రాసులో అరెస్టయిన కాలంలో ఎ.బి., వక్కలంక సుబ్బారావు మొదలైన రాజమండ్రి నాయకులు మద్రాసు చేరి, చైనా బజార్‌లో పికెటింగ్ చేస్తుండగా ప్రభుత్వం ఎ.బి.ని కూడా అరెస్టు చేసి 12 నెలలు కఠిన కారాగార శిక్ష విధించింది. తర్వాత గాంధీ – ఇర్విన్ ఒడంబడికతో జైళ్ళలోని కాంగ్రెసు నాయకులను, కార్యకర్తలను బ్రిటిష్ ప్రభుత్వం విడుదల చేసింది. ఎ.బి. కూడా బయటకు వచ్చారు. ఉద్యమం ఆగింది.

**క్విట్ ఇండియా ఉద్యమం :**

యావత్ భారతీయులు ఉద్యమించి బ్రిటిష్ పాలనను, బ్రిటిష్ వారిని తరిమికొట్టాలన్నది ఈ ఉద్యమ లక్ష్యం! ఆంధ్రాలో ప్రధాన నాయకులందర్నీ ప్రభుత్వం అరెస్టు చేసింది. తూ.గో. జిల్లాలో ప్రధాన నాయకులైన సాంబమూర్తి, లింగరాజు, మొసలికంటి తిరుమలరావు, పళ్ళంరాజు మొదలైన నాయకులను అదుపులోకి తీసుకుంది. నాయకులు లేని స్థితిలో 'డిక్టేటర్లు' ఉద్యమాన్ని కొనసాగించారు. రాజమండ్రిలో ఎ.బి. నాయకుడుగా 'డిక్టేటరు'గా పట్టణ కార్యక్రమాలను నిర్వహించారు. సభలు, సమావేశాలు, ఊరేగింపులు, పికెటింగులు, దుకాణాలు మూయించడాలు వంటి ప్రభుత్వ వ్యతిరేక చర్యలు చేపట్టారు. ఆ సందర్భంగా ఎ.బి.ని రాజమండ్రి మునిసిపల్ ఆఫీసు దగ్గరే అరెస్టు చేసి బళ్ళారిలోని ఆలీపూర్ క్యాంపు జైలుకి తరలించి 18 మాసాల కఠిన కారాగార శిక్ష విధించారు. 'మానవతే' జీవిత ధ్యేయంగా మలుచుకున్న ఎ.బి. జైలులోని ఖైదీలకు వైద్యం చేసేవారు. విసుగు లేకుండా ఖైదీలను ఆదరించి, పలుకరించి, వారి మంచి చెడ్డలు చూస్తూ ధైర్యం చెప్పేవారు, మానసిక శాంతిని కలిగించేవారు. సత్యాగ్రహాల ప్రత్యేక ప్రశంసలు అందుకున్నారు ఎ.బి. అక్కడ జరిగిన తీవ్ర లాఠీఛార్జికి గురై ఎ.బి. అస్వస్థులై కొన్నాళ్ళు లేవలేని స్థితిని అనుభవించారు. ఆ స్థితి 1979–80 వరకు ఆయన్ని బాధించింది. ఈ జైలులో ఉండగా ఆంధ్ర, కర్ణాటక, తమిళ, మళయాళ ప్రాంతాల వేలాది రాజకీయ ఖైదీలు ఎ.బి.ని నాయకునిగా ఎన్నుకున్నారు.

1943 డిఫెన్స్ ఆఫ్ ఇండియా రూల్‌లోని 127 సెక్షన్ ఆధారంగా 'క్విట్ ఇండియా' ఉద్యమాకారులను జైళ్ళ నుండి విడుదల చేయాలనే ప్రభుత్వ ఆదేశమం మేరకు నాయకులు, సత్యాగ్రహులతోపాటు ఎ.బి. కూడా విడుదలయేవారు.

**పార్టీ రాజకీయాలు :**

**1918–1949 (30 సంవత్సరాల మధ్య) ఎబి. :**

1. కాంగ్రెసు పార్టీ కార్యకర్తగా
2. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షునిగా
3. తూ.గో. జిల్లా కాంగ్రెస్ కమిటీ మెంబర్‌గా
4. రాష్ట్ర కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా కార్యక్రమాలు చేపట్టి నిర్వహించారు. వందల వేల కార్యకర్తలను పార్టీలో నమోదు చేయించారు.

1932–1942 మధ్య కాలంలో స్వాతంత్ర్యోద్యమ ఉధృతి లేదు. 1934లో కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ ఏర్పాటు అయింది. 1936 జులై 29న తూ.గో. జిల్లా కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ 15 మంది కీలక సభ్యులతో ఏర్పాటైన లింగరాజు, కె.ఎల్. నరసింహారావులతోపాటు ఎ.బి. కూడా ప్రధాన సభ్యుడు.

**రాజమండ్రి వేదికగా :**

సీతానగరం ఆశ్రమాన్ని పోలీసు ముస్తాఫలీ విధ్వంస పరచడంతో కాంగ్రెస్ కార్యక్రమాలకు రాజమండ్రి వేదిక అయింది. కార్యక్రమాలు కూడా ముమ్మరం చేశారు. లింగరాజు జైల్లోను, బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యం

అనారోగ్యంతోను కార్యక్రమాలు మందగించిన సందర్భంలో ఎ.బి. కార్యకర్త స్థాయి నుంచి సహాయకునిగా ఎదిగి, తన సత్తాని నిరూపించుకున్నారు.

1937 – రాజమండ్రి మునిసిపల్ కౌన్సిలర్ అయ్యారు.

1947, 1952 లోను రెండుసార్లు మునిసిపల్ చైర్మన్‌గా ఎన్నికై కాంగ్రెస్ కార్యక్రమాలు, అటు మునిసిపల్ కార్యక్రమాలను చురుగ్గా నడిపించి, తిరుగులేని నాయకునిగా స్థిరపడ్డారు. ఈ సమయంలో ఆంధ్రా కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా జిల్లా కాంగ్రెస్ ఎన్నికలకు అధ్యక్షునిగా ఎ.బి. చేసిన సేవలు కొనియాడదగినవి. స్వాతంత్ర్యానంతరం పరిస్థితులు, కాంగ్రెస్ రాజకీయాలలో మార్పులు వ్యక్తుల అస్తిత్వానికి ప్రాధాన్యతలు ఏర్పడి కేంద్ర రాష్ట్ర రాజకీయాలలో గ్రూపు తత్త్వాలు పెచ్చు పెరిగి ఆంధ్రా కాంగ్రెస్ – ప్రకాశం గ్రూపుగాను, పట్టాభి గ్రూపుగాను విడిపోయాయి.

**ప్రజాపార్టీ :**

1951లో ఆంధ్రా ప్రొవిన్షియల్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవికి ఎన్నికలు జరిగాయి. సంజీవరెడ్డి, ఎన్.జి. రంగా పోటీలో అభ్యర్థులుగా ఉన్నారు. పట్టాభి – సంజీవరెడ్డిని, ప్రకాశం – రంగాని సమర్థించడం జరిగింది. ఈ ఎన్నికలు ఆంధ్రా ప్రావిన్సులో రెండు గ్రూపుల మధ్య అంతిమ చీలికకు కారణమైంది. సంజీవరెడ్డి ఎన్నికల్లో గెలుపొందారు. దీనితో రంగా, ప్రకాశం కాంగ్రెస్‌కు రాజీనామా చేసి ప్రజాపార్టీని ప్రారంభించారు.

1953 ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పడేనాటికి ప్రజా పార్టీ పేరుతో ఎన్నికలలో పాల్గొనడం జరిగింది. ప్రారంభం నుండి కాంగ్రెస్ కార్యకర్తగాను నాయకుడుగాను కొనసాగిన ఎ.బి. మునిసిపాలిటీలో కాంగ్రెస్ టికెట్ ద్వారా ఎన్నికలలో పోటీ చేసి గెలుపొందారు. అయితే, కాంగ్రెస్ పార్టీలో తనకు ఎదురైన చేదు అనుభవాలు, అసంతృప్తుల వల్ల కాంగ్రెస్‌కు రాజీనామ చేసి ప్రకాశం ప్రారంభించిన ప్రజాపార్టీలో చేరడం జరిగింది!

ఎ.బి. ప్రకాశం పంతులు రాజకీయ శిష్యుడే కాదు, అన్నివిధాలా ప్రకాశం సిద్ధాంతాలని ఆమోదించిన నాయకుడు. 'ప్రజలే ప్రకాశం – ప్రకాశమే ప్రజ' అన్నంతగా ప్రజలు ఆయనకి బ్రహ్మరథం పట్టేవారు. ప్రకాశంలాగే ఎ.బి. కూడా ప్రజల మనిషి! 1952 సాధారణ ఎన్నికలలో ప్రకాశంతోపాటు ఎ.బి. కూడా ఎనలేని సేవచేసి, ప్రజల వద్దకు ప్రజా పార్టీని ప్రచారం చేయడంలో కంకణం కట్టుకున్నాడు. ప్రజా పార్టీ కార్యాలయం ఎ.బి. ఆసుపత్రిలో ప్రకాశం పంతులే ప్రారంభించారు. మొదటి సాధారణ ఎన్నికల్లో ప్రకాశంతోపాటు ఎ.బి. ఎంతో కష్టించి ప్రజల వద్దకు ప్రజా పార్టీని తీసుకొని వెళ్ళగలిగారు. కోనసీమ నుండి ప్రజాపార్టీ సభ్యుడైన నడింపల్లి రామభద్రరాజు నిలబడ్డారు. కాంగ్రెసు తరపు నుంచి కళా వెంకట్రావు నిలబడ్డారు. ప్రజాపార్టీ అభ్యర్థి రామభద్రరాజు బంపర్ మెజారిటీతో గెలిచారు. ఎ.బి. నాయకత్వంలో ప్రజాపార్టీ చేసిన కృషి ఎంచదగినది. అదే సమయంలో ఎ.బి. ప్రజాపార్టీ సెక్రటరీగా ఎన్నికయారు. ఎ.బి. నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడే మనిషి!

1953లో ప్రకాశం కాంగ్రెస్‌లో చేరగా ఎ.బి. చేరలేదు. ప్రజాపార్టీ సభ్యులైన రామభద్రరాజు, లింగరాజు ప్రకాశంతోపాటు కాంగ్రెస్‌లో చేరినా ఎ.బి. మాత్రం ప్రజాపార్టీని వీడలేదు. కానీ ప్రకాశం త్యాగనిరతికి ఎప్పుడూ జోహార్లు చెబుతుండేవారు. పార్టీ నాయకుల కంటే, కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని నమ్మినవారు ఎ.బి. జాతీయోద్యమం సఫలీకృతం కావడానికి అటువంటి స్థానిక కార్యకర్తల కృషి, పట్టుదల, కార్యదక్షత, అంకితభావమే ప్రధానమని ఎ.బి. నమ్మిక! స్వార్థపూరిత కార్యకర్తలు కొందరు ఎ.బి. ఉదార స్వభావాన్ని ఉపయోగించుకుంటూ ఆయన్ని కష్టాలలోకి నెట్టేవారు. అయినా ఎ.బి. వారిని ఒక్క మాట కూడా అనేవారు కాదు. ప్రకాశం తర్వాత ప్రజా పార్టీ అధ్యక్షులుగా ఎన్నికైన తెన్నేటి విశ్వనాథం అంటే ఎ.బి.కి ఎంతో గౌరవం. కాంగ్రెస్‌లో గాని ప్రజాపార్టీలోగాని ఉన్నంత కాలం ఎ.బి. అంకిత భావంతో పార్టీ విజయానికే కృషి చేశారు. 1977లో ప్రజాపార్టీ జనతా పార్టీలో విలీనం అయినందున ఆయన రాజకీయ కార్యక్రమాలు జనతా పార్టీ ద్వారా కొనసాగాయి.

1977లో కాంగ్రెస్ ప్రభుత్వం National Emergency ని ప్రకటించింది. దానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో జయప్రకాష్ నారాయణ పిలుపు మేరకు పౌరహక్కుల రక్షణ నిమిత్తం సత్యాగ్రహం చేసి 75 సంవత్సరాల వయస్సులో కూడా జైలుశిక్షను అనుభవించారు ఎ.బి. పార్టీలకంటే, ప్రజాసేవే ధ్యేయంగా కొనసాగిన ఎ.బి. పార్టీ రాజకీయాలు, ముఠా తగాదాలకు ఎప్పుడూ దూరంగా ఉంటూ సేవే లక్ష్యంగా జీవితాంతం కొనసాగిన సంయమేంద్రియుడు!

**స్థితప్రజ్ఞుడు :**

1955–62 మధ్య కాలంలో ఎ.బి. కార్యక్షేత్రం

రాజమండ్రి నుండి రాష్ట్ర రాజకీయాలకు మారింది. ఆంధ్ర రాష్ట్రం కర్నూలు రాజధానిగా ఏర్పడినప్పుడు 1955లో జరిగిన మధ్యంతర ఎన్నికలలో ఐక్య కాంగ్రెస్ అభ్యర్థిగా రాజమండ్రి నియోజకవర్గం నుండి పోటీ చేసి గెలుపొంది, స్థానిక స్వపరిపాలనా మంత్రి పదవి చేపట్టారు. విచిత్రమేమంటే హైదరాబాదు రాజధానిగా విశాలాంధ్ర ఏర్పడినప్పుడు అదే శాసన సభలో ప్రతిపక్ష సభ్యునిగా కొనసాగారు. 1962లో శాసన సభకు జరిగిన సాధారణ ఎన్నికలలో ప్రజాపార్టీ తరపున ఎ.బి. పోటీ చేసి, ఓడిపోయారు. 1953 అక్టోబరు 1 న ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటైంది. టంగుటూరి ప్రకాశం పంతులు ముఖ్యమంత్రిగా 'కోయలిషన్' ప్రభుత్వం ఏర్పడింది. నీలం సంజీవరెడ్డి ఉపముఖ్యమంత్రిగా ఆంధ్ర రాష్ట్ర శాసన సభ ఏర్పాటైంది.

మూడునాళ్ళ ముచ్చటగా సాగిన ప్రభుత్వం 1954 నవంబరు 4న కూలిపోయింది. 1955 ఫిబ్రవరి 11, 27 తేదీలలో రాష్ట్ర శాసన సభకు జరిగిన మధ్యంతర ఎన్నికలలో యునైటెడ్ కాంగ్రెస్ ఫ్రంట్ పార్టీ 196 స్థానాలకి 119 స్థానాలు గెల్చుకుని అత్యధిక మెజారిటీ పార్టీగా నమోదై ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ రెండవ ఆంధ్ర రాష్ట్ర శాసన సభకు బెజవాడ గోపాలరెడ్డిని ముఖ్యమంత్రిగా ఎన్నుకోవడం జరిగింది. యు.పి.ఎఫ్. ద్వారా ప్రజా పార్టీ నుండి 12 మంది పోటీలో ఉండగా 5 మంది గెలుపొందగా వారిలో ఎ.బి. ఒకరు. ఎ.బి. కార్యదక్షతకి, 1953 ఆగస్టులో వచ్చిన గోదావరి వరదలలో ఆయన చేసిన నిస్వార్థ సేవకు గుర్తింపుగా రాజమండ్రి ప్రజలు ఎన్నుకోవడం, ప్రజా పార్టీ సభ్యులందరికంటే అత్యధిక మెజార్టీతో గెలుపొందిన కారణంగా ఎ.బి.కి మంత్రి పదవి దక్కింది. ఆ విధంగా ఎ.బి. రాజమహేంద్రవరానికి ప్రప్రథమ కేబినెట్ మంత్రిగా చరిత్ర సృష్టించారు. స్థానిక స్వపరిపాలన, ఎక్సైజు, ప్రొహిబిషన్ శాఖల మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. కానీ ఈ పదవిలో ఎ.బి. ఒక సంవత్సరం ఆరు మాసాల మూడు రోజులు మాత్రమే కొనసాగారు.

**విశాలాంధ్ర :**

1956 నవంబరు 1న విశాలాంధ్ర ఏర్పాటైంది. 1957లో సాధారణ ఎన్నికలు ఆంధ్రాలో జరపకుండా అప్పటికే ఉన్న శాసన సభను కొనసాగించవలసిందిగా ఎన్నికల కమిషన్ ఆమోదించింది. 1957లో కాంగ్రెస్ ఒంటరిగానే గెలిచి, సంజీవరెడ్డిని ముఖ్యమంత్రిగా ఎన్నుకోవడంతో ప్రజా పార్టీ ప్రతిపక్షంలోకి నెట్టివేయబడింది. 1962 మార్చి 10 వరకు ఎ.బి. ప్రతిపక్షంలో కొనసాగారు. దీనితో ఎ.బి. 28-3-1955 నుండి 30-3-1962 వరకు ఉన్న శాసన సభా సభ్యత్వం ఏడు సంవత్సరాల మూడు నెలల కాలం మాత్రం.

**మంత్రిగా ఎ.బి. :**

ఆంధ్రలో ముప్పై అయిదు పంచాయితీలను మునిసిపాల్టీలుగా పెంపు చేశారు. టౌన్ ప్లానింగ్ కమిటీలు ఏర్పడ్డాయి. 25 హరిజన వాడలను 215 వరకూ పెంచారు. కో ఆపరేటివ్ హౌసింగు కాలనీలు మంజూరై 43 లేఔట్‌లని ఆమోదించారు. అల్పాదాయ, మధ్యతరగతి వారికి గృహనిర్మాణానికి, ఫ్యాక్టరీల నిర్మాణానికి లేఔట్‌లు ఆమోదించారు. విశాఖజిల్లాలోని అరకు వ్యాలీని పట్టణంగా అభివృద్ధి చేయడానికి ఆమోదించారు. విజయవాడ, గుంటూరు, కర్నూలు, విశాఖపట్నం, కాకినాడ, నెల్లూరు పట్టణ ప్రాంతాలకు మాస్టర్‌ప్లాన్ ఆమోదించారు. 193 ప్రథమశ్రేణి, 3,687 ద్వితీయ శ్రేణి పంచాయతీలు ఉండేవి. పంచాయితీ అధ్యక్షులు అవినీతి కార్యకలాపాలవల్ల మూడు పంచాయితీలను రద్దు చేశారు. రాజమండ్రి మెయిన్‌రోడ్ వెడల్పు పనికీ, పట్టణ మాస్టర్‌ప్లాన్, హరిజనవాడల నిర్మాణం, కార్మికులకు ఇళ్ళ పనులకు పునాదులు పడ్డాయి. గవర్నమెంటు ట్రైనింగు కాలేజీలో బి.యిడి. కోర్సుతోపాటు ఎం.యిడి. కోర్సు ప్రారంభించబడింది. ఎ.బి. మంత్రిగా ఉంటూ ప్రతి శుక్రవారం కర్నూలు శివారు రోజాపేటలోని ముస్లిం పేదలకు ఉచిత వైద్యసేవలనందించడానికి గవర్నరు అనుమతి సంపాదించారు. 'వైద్యం నా వృత్తి, మంత్రి పదవి తాత్కాలికం!' అన్నది ఎ.బి. ధోరణి.

**నైతికతకు మారుపేరు :**

మంత్రిగా ఉన్న కాలంలో బహూకరించిన బంగారు, వెండి కత్తెరలు మున్నగువాటిని పదవి ముగిసిన తర్వాత చీఫ్ సెక్రటరీకి అందజేసి, రసీదును పొందారు. ఇది చరిత్రలో నభూతో నభవిష్యతి! పదవి నుంచి దిగపోయాక రాజమండ్రి రావడానికి ప్రయాణ ఖర్చుల నిమిత్తం నాటి సమాచార మంత్రి శ్రీ కడప కోటిరెడ్డిగారి వద్ద కొంత సొమ్మును చేబదులుగా తీసుకొని, రాజమండ్రి చేరాక, ఆ పైకాన్ని తిరిగి కోటిరెడ్డి గారికి పంపిన నిజాయితీపరుడు ఎ.బి. రాజమహేంద్రవర

వరపుత్రుడు ఎ.బి.,. 50 సంవత్సరాలపాటు రాజమహేంద్రవరానికి రాజకీయ, పట్టణ సేవ, వైద్య రంగాలలో ఎ.బి. చేసిన సేవలు అపూర్వం.

1938లో ఏప్రిల్ 30 న కౌన్సిలరు అయిన ఎ.బి. నాలుగుసార్లు ఎన్నికయి, తిరుగులేని నాయకునిగా స్థిరపడ్డారు. కారణం పార్టీలకు అతీతంగా ప్రజలకాయన అందించిన వైద్యసేవలు అటువంటివి మరి!

**మునిసిపల్ చైర్మన్‌గా :**

1947లో ఎ.బి. చేసిన నిస్వార్థ నిజాయితీ సేవకు గుర్తింపుగా చైర్మన్ పదవిని కట్టబెట్టగా, 1952లో బచ్చు సత్యానందంపై పోటీచేసి గెలుపొంది, చైర్మన్ పదవిని దక్కించుకున్నారు.

మంత్రి పదవి నిర్వహించిన అనంతరం 1968లో మరోసారి ఎ.బి. మునిసిపల్ ఎన్నికలలో సీతంపేట నుండి ఎ.బి. 67 సంవత్సరాల ముదిమి వయస్సులో కూడా అత్యధిక మెజార్టీతో గెలుపొందారు. పోతుల వీరభద్రరావు చైర్మన్‌గా ఎన్నికైన కౌన్సిల్లో ఎ.బి. మొదటిసారి ప్రతిపక్ష నాయకుని హోదాలో కార్యక్రమాలు చేపట్టారు. పదవికన్నా ప్రజాసేవ ముఖ్యమైనది అని ఎ.బి. నమ్మేవారు.

- దానవాయిపేట మున్సిపల్ హైస్కూలు, కోర్లమ్మపేట మున్సిపల్ ఎలిమెంటరీ స్కూలు ఎ.బి. కృషి ఫలితాలే. విద్య, వైద్యం, సంక్షేమం ఎ.బి మూలసూత్రాలు.
- ఎనిమిది సంవత్సరాలపాటు చైర్మన్ హోదాను నిర్వహించిన ఏకైక నాయకుడు డా. ఎ.బి. ఏ ఒక్క సభాసమావేశానికి హాజరు కాకపోవడం ఉండేది కాదు.
- గోదావరి నది కలుషితం కాకుండా 24 గంటలు నిఘా, మురికి వాడల పరిశుభ్రత, స్థలాల ఆక్రమణల తొలగింపు చర్యలు ఎ.బి. కార్యదీక్షకు నిదర్శనాలు. అంతేకాదు, అనేక రోడ్డు విస్తరణ కార్యక్రమాలు కూడా చేపట్టింది ఏ.బి.యేను.
- ఆధునిక సెప్టిక్ ట్యాంక్ విధానాన్ని ప్రవేశపెట్టడానికి శ్రీకారం చుట్టారు.
- మంచినీటి పథకంతో కొత్త ఫిల్టర్లు 1952-53 నాటికి పూర్తిచేయించారు.
- రాజమండ్రిలో సిటీబస్సుల సర్వీసు ప్రారంభించడానికి కూడా ఎ.బి. కారకులు.
- వీధి దీపాలుగా ఉన్న కిరసనాయిలు దీపాల జాగాలో ట్యూబులైట్లు ఏర్పాటు చేశారు.
- స్టేడియం బ్రాడ్‌కాస్టింగ్ ప్రారంభించారు. రేడియో బ్రాడ్‌కాస్టింగ్ ప్రారంభించారు.
- 1947, 1950లో జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో ఎ.బి. ఇళ్ళను కోల్పోయినవారందరినీ పార్టీ విభేదాలను పక్కనపెట్టి రక్షించారు. రాజమండ్రిలో ఈ తీరు మానవత్వం ఈనాటికీ కొనసాగుతుందంటే దానికి ఎ.బి.యే అందరికీ ఆదర్శం.

**1953 వరదలు :**

8-15-1953 అర్ధరాత్రి గోదావరమ్మ పొంగిపొరలి రాజమండ్రిని ముంచెత్తింది. వీధులలో పడవలు తిరిగాయి. అటువంటి విపత్కర పరిస్థితుల్లో ఆరాపురంలోని తన ఇల్లు కూడా నీటిలో మునిగిపోగా, కుటుంబాన్ని వదిలి వరద బాధితుల కుటుంబాలను స్వయంగా లింగరాజు, ఇతర నాయకులతో కలసి నీటిలోకి దిగి వరదలో చిక్కుకున్నవారిని కాపాడారు. దేశవిదేశాల నుండి వచ్చిన విరాళాలు, వస్తువులు, నిధులు సద్వినియోగమవడానికి కారణం ఎ.బి. నిస్వార్థ బుద్ధే కారణం. అదే మరెవరైనా అయితే దుర్వినియోగం జరిగే ఆస్కారం ఉండేదనీ, ఆయన అంతటి నీతిమంతుడనీ ఆయన ప్రత్యర్థి పార్టీకి చెందిన కమ్యూనిస్టు సభ్యుడే ఉటంకించడం గమనార్హం! డా. ఎ.బి. నిజాయితీని పరీక్షించే నిమిత్తం నాటి మద్రాసు ముఖ్యమంత్రి రాజగోపాలాచారి "కృష్ణయ్య చెట్టి"ని రాజమండ్రి పురపాలక కమిషనరుగా నియమించారు. డా. ఎ.బి. నిజాయితీకి కమిషనర్ చేతులు జోడించి బ్రహ్మరథం పట్టారు. ప్రజలు ఆయనకు 'దీన జన బాంధవ్' బిరుదు ప్రదానం చేశారు. ఎ.బి. కౌన్సిలర్‌గానీ, చైర్మన్‌గానీ పదవులు నిర్వహించిన కాలంలో ఏనాడూ సమావేశాలకుగానీ, ఇతర మునిసిపల్ కార్యకలాపాలకు వచ్చినప్పుడుగానీ ఎన్నడూ ప్రయాణ ఛార్జీలు మునిసిపల్ ఫండు నుండి మంజూరు చేయించుకుని వాడుకోలేదు. సొంత ఖర్చులతోనే కార్యాలయానికి వచ్చేవారు.

వానై కురిసిన మనిషితనానికి,
తానై నిలచిన తాపసి మన ఎ.బి.



మహీధర రామశాస్త్రి
రాజమహేంద్రవరం.
ఫోన్ : 7702 450 157.

# చరిత్రలో తెనాలి

*- ముత్తేవి రవీంద్రనాథ్*

**1887** వ సంవత్సరంలో ప్రచురితమైన కందుకూరి వీరేశలింగం పంతులుగారి 'ఆంధ్ర కవుల చరిత్రము' అనే గ్రంథంలో తెనాలి రామకృష్ణ కవిని గురించి రాస్తూ పంతులుగారు రామకృష్ణ కవి స్వస్థలం కృష్ణా మండలములోని తెనాలి గ్రామమని పేర్కొన్నారు. నిజంగానే ఆ గ్రంథ రచనా కాలానికి తెనాలితో సహా నేటి గుంటూరు జిల్లా మొత్తం కృష్ణాజిల్లాలో ఒక అంతర్భాగంగా ఉండేది. 1904 వ సంవత్సరంలో మాత్రమే కృష్ణా నదికి పశ్చిమంగా ఉన్న ప్రాంతం గుంటూరు జిల్లా పేరిట వేరే జిల్లాగా ఏర్పడింది. తెనాలిని గురించి ప్రాచీన సాహిత్యంలో ఎవరు,ఎక్కడ ప్రస్తావించినా దానిని కృష్ణాతీర గ్రామంగానే ప్రస్తావించారు. ప్రస్తుతం కృష్ణాతీరం నుంచి తెనాలి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పటికీ అనాదిగా తెనాలిని కృష్ణాతీర గ్రామంగానే పరిగణించడానికో కారణం ఉంది. కృష్ణా నదికి ఎలాంటి ఆనకట్టలూ, కరకట్టలూ లేని ప్రాచీన కాలంలో నది వరద నీరు తరచు తెనాలిని ముంచెత్తేదట. ఆ కారణంగానే వరద ముంపును తట్టుకొనేటందుకు పాత తెనాలిలోని ఇళ్ళ పునాదులన్నీ నేలమట్టం నుంచి పది పదిహేను అడుగుల ఎత్తున నిర్మించబడి ఉండడం మనం నేటికీ గమనించవచ్చు. అతి ప్రాచీనకాలం నుంచీ కృష్ణాతీర గ్రామాలలో తెనాలిది ఓ విశిష్టమైన, విలక్షణమైన స్థానం. ఒకప్పుడు పేరెన్నికగన్న బౌద్ధ- జైన క్షేత్రంగా, తరువాత ఓ సుప్రసిద్ధ అగ్రహారంగా, కొంతకాలం ఓ ప్రసిద్ధ నగరంగా, మరికొంతకాలం కూచిపూడి సమితులోనూ, ఆ తరువాత రేపల్లె తాలూకాలోనూ ఓ గ్రామంగా పలు రూపులెత్తిన తెనాలి ప్రాంతపు చారిత్రక వైభవం తెలుసుకోవడం ఆసక్తికరంగా ఉంటుంది. అనాదిగా పాడి పంటలతో విలసిల్లుతూ, చదువుల పుట్టినిల్లుగా, కళలకు కాణాచిగా, స్వాతంత్ర్య సమరానికి పురిటిగడ్డగా, కార్మిక కర్షకోద్యమాలకు ఉనికిపట్టుగా, రాజకీయ ధురంధరులకు కార్యస్థలిగా వినుతికెక్కిన తెనాలి ప్రాంతం ప్రాచీనత, విశిష్టతలను గురించి సంక్షిప్తంగా తెలపడం ఈ వ్యాసం లక్ష్యం.

విలక్షణమైన తెనాలి అనే పేరే తెనాలి ప్రాచీనతకు నిలువెత్తు సాక్ష్యం. పలు ఇతర పట్టణాలు, గ్రామాల పేర్లలా మనం తెనాలి అనే పదాన్ని తేలికగా విశ్లేషించి తెలుగులో అర్థం చెప్పలేము. 'తెన్', 'న్యాలి' అనే రెండు ప్రాగ్ద్రావిడ శబ్దాల కలయికతో ఏర్పడిన 'తెన్న్యాలి' శబ్దమే కాలక్రమాన 'తెన్నాలి', 'తెనాలి' గా రూపాంతరం చెందిందని నా అభిప్రాయం. (ప్రాచీన సాహిత్యంలో 'తెన్నాలి' అనే గ్రామనామం కూడా వాడుకలో ఉంది) 'తెన్' అంటే 'దక్షిణము', 'న్యాలి' అంటే 'నీటి వనరు' అని అర్థాలు. తెన్ను టికిరి, తెన్నేరు (తెన్ ఒనేరు), తెన్ కాశి, న్యాల్ కల్ (న్యాలి కల్లు), న్యాలి కొండ, న్యాల కొసిగి (న్యాలి కొసిగి), దోర న్యాలి (దోర్నాల), న్యాలికొండ పల్లి (నేలకొండ పల్లి), న్యాలి నూతుల (నేల నూతల), న్యాలి, నాలి మొదలైన గ్రామనామాలన్నీ పరిశీలిస్తే అవన్నీ కూడా ఇలా తెనాలి లాగే ప్రాగ్ద్రావిడ శబ్దాలతో ఏర్పడినవేనని గ్రహించగలం. అలా తెనాలి పేరే దాని ప్రాచీనతకు ప్రబల సాక్ష్యం.

తెనాలి పట్టాణానికి నైరుతి దిశలో ఉన్న మల్లెపాడు దిబ్బ మీద పురావస్తు శాఖ జరిపిన తవ్వకాలలో లభించిన అవశేషాల ఆధారంగా క్రీ.పూ. 5 వ శతాబ్ది - క్రీ.పూ. 3 వ శతాబ్ది మధ్యకాలంలో ఈ ప్రాంతంలో ఒక గొప్ప నాగరకత విలసిల్లినట్లు, ఆ నాగరకతా కేంద్రానికి ధాన్యకటకం, ధనద పురం (చందవోలు), ప్రతీపాల పురం (బట్టి ప్రోలు) నాగరకతలతోనూ, రోమన్లతోనూ సన్నిహిత వ్యాపార సంబంధాలున్నట్లు పురావస్తు ఆధారాలతో చారిత్రకులు నిర్ధారించారు. క్రీ.శ. ఒకటో శతాబ్దిలో సద వంశానికి చెందిన శ్రీసద అనే రాజు తెనాలి ప్రాంతాన్ని పాలించినట్లు నిర్ధారణ అయింది. తెనాలి ప్రాంతం గౌతమీ పుత్ర శాతకర్ణి కుమారుడు వాసిష్టీ పుత్ర పులోమావి (క్రీ.శ.102- 130) పాలనలో ఉన్నట్లు తెలిపే ఆ కాలంనాటి నాణెములు, ఇతర పురావస్తు ఆధారాలు ఇక్కడ లభించాయి. తరువాత ఈ ప్రాంతాన్ని వరుసగా ఇక్ష్వాకు, పల్లవ, బృహత్పలాయన, ఆనంద గోత్రిక, శాలంకాయన, విష్ణుకుండిన రాజులు పాలించారు. బృహత్పలాయన రాజైన జయవర్మ (క్రీ.శ.270-285) రాగిరేకుపై ప్రాకృత భాషలో వేయించిన శాసనం ఒకటి తెనాలి సమీపంలోని కొండముది గ్రామంలో లభించింది. ఆ శాసనం ప్రకారం తెనాలి ప్రాంతంతో సహా పాటూరు (నేటి కాకుమాను మండలంలోని కొండపాటూరు) కూడా కూడూరు (దివిసీమ కోడూరు) హారములోని ఒక భాగమని తేలింది. ఆనాటి

హారము అంటే జిల్లా వంటి ఒక పరిపాలనా విభాగం. తెనాలి గంగానమ్మ పేటలోని రామేశ్వర (రామలింగేశ్వర) స్వామి ఆలయ ఆవరణలో జరిపిన తవ్వకాలలో బయల్పడిన క్రీ.శ. 5 వ శతాబ్ది నాటి జైన తీర్థంకరుని పాలరాతి విగ్రహాన్ని బట్టి, ఒకప్పుడు అక్కడ ఉండిన ప్రసిద్ధ జైనాలయాన్ని తొలగించి, దాని స్థానంలో శివాలయాన్ని నిర్మించడం జరిగిందనీ, ఆ ఆలయ నిర్మాణం జనాశ్రయుడనే బిరుదు పొందిన విష్ణుకుండిన రాజు మూడవ మాధవ వర్మ పాలనాకాలం (క్రీ.శ. 546- 611)లో జరిగివుంటుందనీ చరిత్రకారులు భావిస్తున్నారు. తెనాలి ప్రాంతాన్ని పాలించిన రెండవ అమ్మరాజు (ఈయన పాలనాకాలం క్రీ.శ. 945-970) 'అర్హనంది' అనే జైనాచార్యుడికి 'కలుచుంబఱ్ఱు' (తెనాలి సమీపంలోని నేటి పెదగాదెలవఱ్ఱు) అనే గ్రామాన్ని దానంగా ఇచ్చినట్లు శాసనాధారం ఉంది. ప్రస్తుత కొల్లిపర మండలం దావులూరు గ్రామంలోని గోకర్ణేశ్వర స్వామి ఆలయంలో కనుగొన్న శాలివాహన శకం 1065 (క్రీ.శ. 1143) నాటి ఒక ప్రాచీన శాసన స్తంభం మీద తెనాలి పేరు మొదటగా ప్రస్తావించబడింది. ఈ శాసనాన్నిబట్టి వెలనాడులోని అంతర్భాగంగా ఉన్న ఈ ప్రాంతపు నాటి పాలకుడు రెండవ గొంకరాజు అనే నామాంతరం కల మొదటి రాజేంద్ర చోడుడు (పాలనా కాలం క్రీ. శ. 1132- 63). అయ్య వంశీకుడైన జాయప్ప కాకతి గణపతిదేవుని(క్రీ.శ. 1198- 1262) గజసాహిణిగా ఉంటూ చేబ్రోలు కేంద్రంగా ఈ ప్రాంతమంతటినీ పాలించాడు. ఈయన తన సోదరీమణులు నారమ్మ, పేరమ్మలను గణపతిదేవుడికిచ్చి వివాహం చేశాడు. సంస్కృతంలో ఈ జాయప్ప రాసిన 'నృత్త రత్నావళి' అనే నాట్యశాస్త్ర గ్రంథంలో వివరించిన నాట్య భంగిమలే అనంతరకాలంలో వరంగల్ సమీపంలోని పాలంపేటలో ఉన్న రామప్ప గుడిలోని అపురూప శిల్పాలు చెక్కిన శిల్పులకు ప్రేరణ అయ్యాయని చరిత్రకారులంటారు. కాకతీయ ప్రతాపరుద్రుని పాలనాకాలం (క్రీ.శ. 1296- 1323)లో ఆయన తన గురువైన ముదిగొండ శివయోగీశ్వరుడిని రప్పించి, తెనాలి రామలింగేశ్వర స్వామి దేవస్థానానికి ఆయన్ని స్థానాచార్యుడిగా నియమించి, ఆయనకూ, మరికొన్ని కుటుంబాలకూ నివాస గృహాలు నిర్మించి ఇచ్చినట్లు తెనాలి కైఫీయ్యత్ పేర్కొంటుంది. తెనాలిలోనూ, సమీప ఈమని గ్రామంలోనూ నేటికీ నివసిస్తున్న ముదిగొండ ఉద్భటారాధ్యుని వంశస్థులు, ఇంకా ములుగు, కాశీనాథుని వంటి గృహనామాలు కల ఇతర ఆరాధ్య శైవ కుటుంబాలు ఆ సందర్భంగా ఇక్కడ స్థిరపడినవారి వంశీకులేనంటారు. కాకతీయ సామ్రాజ్య పతనానంతరం కమ్మ నాయకులైన ముసునూరి ప్రోలయ నాయకుడు, కాపయ నాయకుడు నేటి ఖమ్మం జిల్లా రేకపల్లి కేంద్రంగా క్రీ.శ. 1323 నుంచి 1368 వరకు సాగించిన పాలనకు సంబంధించిన ఆధారాలు ఏవీ తెనాలి ప్రాంతంలో లభించలేదు. అయితే తెనాలి సమీపంలోని చిలువూరు, అంగలకుదురు, యడ్లపల్లి వంటి గ్రామాలలోని ముసునూరి కుటుంబాలవారు రేకపల్లి రాజ్యం పతనానంతరం వచ్చి అక్కడ స్థిరపడ్డారని వినికిడి.

తెనాలి ప్రాంతమంతా క్రీ.శ. 1324 నుంచి క్రీ.శ. 1424 వరకు కొండవీడు రాజధానిగా పాలించిన రెడ్డి రాజుల పాలన కింద ఉండేది. కొండవీటి రెడ్డిరాజుల పాలనాకాలంలో రావూరి రంగారెడ్డి అనే ఆయన కొంతకాలం తెనాలికి స్థానిక పాలకుడుగా వ్యవహరించాడు. యక్షగాన కళారూపాన్ని ప్రోత్సహించిన కొండవీటి పాలకుడు కుమారగిరి రెడ్డి పాలనా కాలం (క్రీ.శ. 1386- 1402)లో శైవులైన జక్కుల కులస్థులు పెద్ద సంఖ్యలో వచ్చి తెనాలి ప్రాంతంలో స్థిరపడ్డారని జనశ్రుతి. జక్కులు శివ మాహాత్మ్యమును చాటే యక్షగాన కళారూపాలను ప్రదర్శిస్తూ, తెనాలి ప్రాంతపు రంగస్థల కళావైభవానికి ఓ రకంగా బీజావాపనం చేశారు. ఆ తరువాత కొంతకాలానికి వైష్ణవమత ప్రాబల్యం అధికమైనప్పుడు కృష్ణానదికి ఆవలి తీరాన ఉన్న కూచిపూడిలో అప్పటి రాజులు, వైష్ణవాచార్యుల ప్రోత్సాహంతో కొందరు బ్రాహ్మణ కళాకారులు భాగవత కథల ఆధారంగా యక్షగాన కళారూపాలు ప్రదర్శించడం మొదలైంది. వీరిని కూచిపూడి భాగవతులు అంటారు. తెనాలి కైఫీయ్యత్ లో పేర్కొన్నదాని ప్రకారం విజయనగర పాలకుడు సాళువ నరసింహ రాయలు పాలనా కాలం (క్రీ.శ. 1485- 1491)లో జన్నాదుల (జొన్నాదుల) వల్లభుడు అనే పద్మశాలీయుడు ఇక్కడి గాంధీ చౌక్ కి అతి సమీపంలో ఉన్న సుప్రసిద్ధ గోవర్ధనస్వామి ఆలయం శాలివాహన శకం 1411 (క్రీ.శ. 1489) లో నిర్మించాడు (తెనాలిలో నేటికీ పద్మశాలీయులు- ప్రత్యేకించి జొన్నాదుల వారు - పెద్ద సంఖ్యలో ఉన్నారు). క్రీ.శ.1515 లో విజయనగర పాలకుడైన శ్రీకృష్ణ దేవరాయలు కొండవీటి దుర్గాన్ని జయించి, తన మంత్రి సాళువ తిమ్మరుసును

దుర్గాధ్యక్షునిగా నియమించాడు. సాళువ తిమ్మరుసు ఈ గోవర్ధన స్వామి ఆలయానికి తెనాలి నగరాన్ని దానంగా ఇచ్చాడని కూడా పేర్కొనబడింది. తెనాలిలోని ఈ గోవర్ధన స్వామి ఆలయాన్ని సాళువ తిమ్మయ్య సోదరి కృష్ణమాంబ, ఆమె భర్త నాదెండ్ల తిమ్మయ్య, వారి కుమారులు నాదెండ్ల అప్ప మంత్రి, గోప మంత్రి దర్శించుకుని చేసిన ధర్మకార్యాల వివరాలు కైఫీయ్యత్ లో ఉన్నాయి. తిమ్మరుసు యొక్క ఈ ఇద్దరు మేనల్లుళ్ళే తరువాతకాలంలో కొండవీడు దుర్గాధ్యక్షులుగా వ్యవహరించారు. శాలివాహన శకం 1437 (క్రీ.శ. 1515) లో కొండవీటి దుర్గాన్ని జయించిన తరువాత శ్రీకృష్ణ దేవరాయలు తెనాలికి స్వయంగా వచ్చి, ఇక్కడి గోవర్ధనస్వామి ఆలయానికి తేలప్రోలు గ్రామానికి చెందిన 25 కుచ్చెళ్ల (160 ఎకరాల) ఖండ్రిక ఇచ్చారని కైఫీయ్యత్ పేర్కొంది. తేలప్రోలు తెనాలి పట్టణంలోని అయితానగరానికి ఆనుకుని ఉన్న గ్రామం. రాయలు కొండవీడు దుర్గాన్ని క్రీ.శ. 1515 జూన్ 23 వ తేదీన జయించాడని చారిత్రకుల నిర్ధారణ. కనుక ఆ తరువాత కొంతకాలానికి ఎప్పుడో ఆయన తెనాలి గోవర్ధనస్వామి ఆలయాన్ని సందర్శించి ఉంటారు.

'వికటకవి'గా సుప్రసిద్ధుడైన తెనాలి రామలింగని స్వస్థలం తెనాలికి సమీప గ్రామమైన గార్లపాడు. తెనాలి నుంచి నందివెలుగు మీదగా గుంటూరు వెళ్ళే మార్గంలో విజయవాడ – చెన్నై జాతీయ రహదారిని ఆనుకుని ఉందీ గ్రామం. తల్లిదండ్రులు శైవులైన గార్లపాటి రామయ్య, లక్ష్మమాంబలు. మేనమామల ఇంట తెనాలిలో క్రీ.శ. 1495 లో జన్మించిన ఈ కవి శైవునిగా 'ఉద్భటారాధ్య చరిత్రము' అనే కావ్యం రాసి ప్రసిద్ధుడై, ఆ తరువాత వైష్ణవం స్వీకరించి, 'రామకృష్ణ కవి' పేరిట తిమ్మరుసు సాయంతో హంపి విజయనగరంలో రాయలవారి 'భువన విజయం'లో క్రీ.శ. 1520 నుంచి 1530 వరకు అష్టదిగ్గజ కవులలో ఒకనిగా వెలుగొందాడు. హంపిలో ఉండగా 'కందర్పకేతు విలాసము', 'హరిలీలా విలాసము' అనే కావ్యాలు రాసి, విఠల భక్తుడైన రాయలవారి ప్రేరణతో 'పాండురంగ మాహాత్మ్యము' రచన ఆరంభించి, రాయల మరణానంతరం చాల కాలానికి క్రీ.శ. 1570 లో ఆ దివ్య ప్రబంధ రచనను పూర్తిచేశాడు. ఇది తెలుగులోని పంచ కావ్యాలలో ఒకటిగా ప్రసిద్ధి పొందింది. ఇక చేతులు వణికే వృద్ధాప్యంలో ఆయన రాసిన మరో ప్రముఖ కావ్యం 'ఘటికాచల మాహాత్మ్యము'. క్రీ.శ. 1590 లో తన 95 వ ఏట మరణించి ఉంటాడని భావిస్తున్న ఈ కవి తాను 'తెనాల్యగ్రహార నిర్ణేత'నని 'పాండురంగ మాహాత్మ్యము' అవతారికలో చెప్పుకున్నాడు. 'ఉద్భటారాధ్య చరిత్రము' అవతారికలో 'కుమారభారతి తన బిరుద'నీ, తెనాలిలోని 'రామేశ్వరస్వామి రమణీయ కరుణ కారణంగా తాను సహజ సాహిత్య మాధురీ సంయుతాత్ముడ నయ్యాన'ని పేర్కొన్నాడు. ఈ కవి క్రీ.శ.1510 లో తెనాలి రామేశ్వర దేవస్థానానికి బహూకరించిన ఉమ, రామలింగ స్వాముల ఉత్సవ విగ్రహాలు ఆ ఆలయంలో నేటికీ పదిలంగా ఉన్నాయి. వాటి పాద పీఠం మీద ఉన్న శ్లోకంలో తెనాలి ఒక నగరంగా పేర్కొనబడింది. తెనాలికి ఈ కవిలా పేరు ప్రతిష్టలు తెచ్చినవారు మరొకరు లేరు. ఈయన పేరిట ప్రచారంలో ఉన్న హాస్య కథలు, సమస్యాపూరణ కథల కారణంగా కేవలం ఆంధ్రదేశంలో మాత్రమే కాక యావద్భారత దేశంలో – ప్రత్యేకించి దక్షిణ భారతదేశంలో– ఈ కవి పేరు వినని వారుండరంటే అతిశయోక్తి కాదు.

తెనాలి రామకృష్ణ కవికి సమకాలికుడైన సుప్రసిద్ధ కవి భట్టుమూర్తిది కూడా తెనాలి సమీపంలోని 'బట్టు పల్లె' అనే మరోపేరు కలిగిన 'దేవరాయ భట్ల పాలెం' కావడం విశేషం. ఈ గ్రామం తెనాలి రామకృష్ణ కవి స్వగ్రామానికి కూతవేటు దూరంలో ఉన్న వెంకట కృష్ణాపురానికి శివారు గ్రామం. భట్టుమూర్తి రచించిన ప్రఖ్యాత శ్లేష ప్రబంధం 'వసు చరిత్ర' పంచకావ్యాలలోకెల్లా అతి రమ్యమైనది. 'ప్రబంధాంకం' అనే ఇంటిపేరుగల భట్టుమూర్తి శ్రీ కృష్ణదేవరాయలు అల్లుడైన 'అళియ' రామరాయలు కొలువులో కొంతకాలం పోషణనందుకున్న కారణంగా అతడికి 'రామరాజ భూషణుడు' అనే మరో పేరు. వీరేశలింగం పంతులుగారు తమ 'ఆంధ్ర కవుల చరిత్రము' (పేజీ 604, అక్టోబర్, 2005 ముద్రణ, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్)లో తెనాలి రామకృష్ణ కవి గురించి రాస్తూ ఆయన స్వస్థలం తెనాలికి సమీపంలోని గార్లపాడు గ్రామమనీ, ఆయన బాల్యంలో బట్టుపల్లె గ్రామంలో ఉండే బట్రాజుల సాంగత్యంచేసి, వారి చెలిమి చేత సంస్కృతాంధ్ర సాహిత్యమును, కవిత్వ కౌశలమును సంపాదించాడని పేర్కొన్నారు. బహుశా బట్టుపల్లెలో తమ విద్యాభ్యాస కాలం నుంచే రామకృష్ణ కవికీ, భట్టుమూర్తికీ ఒకరంటే ఒకరికి సరిపడదు. వారిరువురి గురించి ప్రచారంలో ఉన్న పలు చాటువులే వారి మధ్య గల బద్ధ వైరానికి ప్రబల నిదర్శనం.

ఇక ఆ సంగతి అలా ఉంచితే, తెలుగు పంచ కావ్య కర్తలలో ఇరువురు తెనాలి ప్రాంతం వారే కావడం తెనాలి వారందరికీ గర్వకారణం. నాలుగు జిల్లాలలో విస్తరించిన 999 గ్రామాలకు ప్రభువైన శ్రీ రాజా వాసిరెడ్డి వేంకటాద్రి నాయుడు మన్నెసుల్తాన్ బహద్దర్ (క్రీ.శ. 1761- 1816) చేబ్రోలు, శృంగార పురం, చదలవాడ, ఆలపాడు మొదలైన పలు తెనాలి ప్రాంత గ్రామాలలో అనేక శైవ, వైష్ణవ ఆలయాలను నిర్మించి, జీర్ణోద్ధరణ చేసి ఖ్యాతి గాంచాడు. చేబ్రోలులో ఈయన నిర్మించిన 101 ఆలయాలు, అమరావతి అమరేశ్వరస్వామి ఆలయం, అక్కడికి సమీపంలోని వైకుంఠపురం ఆలయం, మంగళగిరి స్థల నరసింహస్వామి ఆలయానికి నిర్మించిన అతి ఎత్తైన గాలి గోపురం ఈయన అద్భుత నిర్మాణ కృషికి మచ్చుతునకలుగా నిలుస్తాయి. ఈయన పాలనా కాలంలో చేబ్రోలు, వడ్లమూడి, చేకూరు, చినపాలెం, పెదపాలెం, తుమ్మపూడి వంటి తెనాలి ప్రాంత గ్రామాలలో ఈయన బంధువర్గంలోని వాసిరెడ్డి, చావా, చేకూరి, బోడేపూడి, పాటిబండ్ల, పుతుంబాక, సూర్యదేవర, దేవభక్తుని, చిరుమామిళ్ళ, గోళ్ళమూడి, నారా, గుంటుపల్లి మొదలైన పలు కుటుంబాలవారు పెద్దసంఖ్యలో స్థిరపడ్డారు. క్రీ.శ. 1652 లో గోల్కొండ నవాబు సేనాని మీర్ జుమ్లా చేసిన దాడిలో గండికోట రాజ్యం పతనమైన తరువాత దక్షిణ దేశానికి వలసవెళ్ళిన గండికోట శాఖీయులైన పెమ్మసాని, అదుసుమిల్లి, ఘట్టమనేని, శాఖమూరు, కిలారు, నర్రావుల, పరుచూరి మొదలైన కుటుంబాలవారు వేంకటాద్రి నాయని పాలనా కాలంలోనే ఆంధ్రదేశానికి తిరిగి వచ్చి తెనాలి ప్రాంతంలోని పెదరావూరు, బుర్రిపాలెం, కొత్తపాలెం తదితర గ్రామాలలో స్థిరపడ్డారు, ఇదొక ప్రముఖ సామాజిక పరిణామం.

నాయని పాలనా కాలంలోనే బ్రిటిష్ ప్రభుత్వం కర్నల్ కాలిన్ మెకంజీ ద్వారా వివిధ గ్రామాల స్థానిక చరిత్రలను సేకరించి, కైఫీయ్యత్ ల పేరిట వాటిని క్రోడీకరించడం జరిగింది. నాటి చరిత్రకు అవి కొంతమేరకు సాక్ష్యాధారాలుగా నిలుస్తున్నాయి. క్రీ.శ. 1876- 78 సంవత్సరాలలో వరుసగా రెండేళ్ళ అనావృష్టి కారణంగా మద్రాసు, బొంబాయి ప్రావిన్సులలోనూ, హైదరాబాదు, మైసూరు సంస్థానాలలోనూ అతి తీవ్రమైన కరవు సంభవించింది. దీనినే కొందరు 'డొక్కల కరువు' అంటారు. మొత్తంగా ఒక కోటీ మూడు లక్షల మంది ప్రజలు మృత్యువువాత పడిన ఆ ఘోరమైన కరవులో సస్య సమృద్ధిగల తెనాలి ప్రాంతం కూడా విలవిలలాడి పోయింది. రెండేళ్ళు వరుసగా పంటలు లేని కారణంగా అందరి దగ్గరా ధాన్యం నిల్వలు పూర్తిగా నిండుకున్నాయి. అయితే అంత దుర్భిక్షం తాండవిస్తున్నా పశువులకు మాత్రం ఏదో ఒక మేత లభించేదట. అప్పటి జనం ఆకలిబాధకు తట్టుకోలేక మెత్తటి ఒండ్రు మట్టిని పెరుగులో కలుపుకుని తినేవారని వాళ్ళ అమ్మ చెప్పిందని నా చిన్నతనంలో మా అమ్మమ్మ చెప్పేది. శాశ్వత కరవు నివారణ చర్యలలో భాగంగా బ్రిటిష్ ప్రభుత్వం సర్ ఆర్థర్ కాటన్ నేతృత్వంలో, కెప్టెన్ ఓర్ ప్రత్యక్ష పర్యవేక్షణలో కృష్ణా నదిపై ఆనకట్ట నిర్మించడం, ఆ తరువాత క్రమంగా కృష్ణా వెస్టర్న్ మెయిన్ కెనాల్ మరియు చానల్స్ ఏర్పరచి, డెల్టా వ్యవస్థను పూర్తిగా వినియోగంలోకి తీసుకురావడం, 1954లో, లోగడ గండిపడిన పాత ఆనకట్ట స్థానంలో ప్రకాశం బరాజ్ ని నిర్మించి డెల్టా వ్యవస్థను మరింతగా ఆధునీకరించి, ఆయకట్టు మరింత పెంచడంతో ఈ ప్రాంతంలో కరవును విజయవంతంగా తిప్పి కొట్టడం సాధ్యపడింది.

ప్రస్తుతం కృష్ణా డెల్టాలో అత్యంత సారవంతమైన పంట భూములతో అలరారే ప్రాంతం ఏదంటే మనం ముందుగా తెనాలినే చెప్పుకోవాలి. ఇక్కడ పండని పంట లేదు. అనాదిగా ఇక్కడి రైతులు ఆరుగాలం శ్రమిస్తూ, ఇలాతలం నుంచి హేమాన్ని పిండడంలో కడు నేర్పరులయ్యారు. పాడి పంటల సమృద్ధితో ఈ ప్రాంతం నిత్యం పచ్చగా, భాగ్యవంతంగా ఉండడమే కాక, ఇక్కడి కర్షకులు ఎప్పటికప్పుడు ఆధునిక వ్యవసాయ పద్ధతులు అనుసరిస్తూ వ్యవసాయ విజ్ఞానంలో అందరికీ ఆదర్శం కాగలిగారు. ఈ ప్రాంతం వరి, చెరకు, జొన్న, మొక్కజొన్న, ఆముదం మొదలైన నూనె గింజల పంటలకే కాక, అన్ని రకాల కూరగాయలు, ఆకుకూరలకూ, తమలపాకు తోటలకూ, కొబ్బరి, నిమ్మ, జామ, సపోటా, బొప్పాయి, అరటి, మామిడి, ఉసిరి వంటి పండ్ల తోటలకూ, గులాబీ, మల్లె, కాగడా మల్లె, కనకాంబరంవంటి పూల తోటలకూ ప్రసిద్ధి పొందింది!

ముత్తేవి రవీంద్రనాథ్
హైదరాబాద్.
ఫోన్ : 984 913 1029

# తెలుగుతెరపై తొలిసీత

*- హెచ్. రమేష్ బాబు*

**టా**కీలు వచ్చిన తొలి, మలి దశకాల్లో పౌరాణిక నాటకాలు, రంగస్థల నటీనటులే తెలుగు సినిమా నడిపించారు. తొలి తెలుగు టాకీ 'భక్త ప్రహ్లాద' (1931-32) పూర్తిగా రంగస్థల నాటకమే కాగా అందులో నాయికగా నటించిన సురభి కమల నాటక సమాజం నుండే సినిమాల్లోకి వచ్చింది. ఆమె దారిలోంచే తెరపైకి వచ్చిన శ్రీరంజని తొలిస్టార్‌గా పేరు తెచ్చుకున్నది. తెరపై స్త్రీ పాత్రల పోషణలో తనదైన ముద్రవేసిన నటి ఆమె. ముఖ్యంగా సీతపాత్రలో 'లవకుశ' (1934)లో ఆమె నటన నభూతో నభవిష్యతిగా చరిత్రకెక్కింది. అప్పటికదే ఆమెకు మొదటి సినిమా.

నూట పదేళ్ల క్రితం గుంటూరు జిల్లా మురికిపూడిలో 1906లో జన్మించారు మంగళగిరి శ్రీరంజని. తల్లి వీరమ్మ. చిన్నతనంలోనే బెజవాడ హనుమాన్‌దాస్ వద్ద సంగీతం నేర్చుకున్నారామె. తన మేనత్తల వద్ద భరతనాట్యం నేర్చుకున్న శ్రీరంజని పాఠశాల చదువు లేకపోయినా సంస్కృతాంధ్ర భాషలు ప్రైవేటుగానే నేర్చుకున్నారు. అది మూకీల కాలం కావడంతో అప్పట్లో పౌరాణిక నాటకాలకు మంచి ఆదరణ ఉండేది. సంగీత నృత్యాలు అభ్యసించిన శ్రీరంజని నాటకాల వైపు ఆసక్తి చూపడంలో ఆశ్చర్యం లేదు. కృష్ణ విలాస సభ నాటక సమాజంలో చేరిన ఆమె 'రాధాకృష్ణ', 'శశిరేఖా పరిణయం', 'సావిత్రి', 'కనకతార', 'ఉషాపరిణయం' నాటకాల్లో రాధగాను, కృష్ణుడుగా శశిరేఖ, అభిమన్యుడు, సత్యవంతుడు వంటి పాత్రలతో రంగస్థలంపై జైత్రయాత్ర చేశారావె. నాటకాల్లో ఉండగానే తను సంగీతం నేర్చుకుంటున్నప్పుడు సహపాఠి అయిన కొప్పోలు నాగుమణిని వివాహమాడారామె. నాటకాలకు సంగీతం చేసేవారాయన. నాటకరంగంలో శ్రీరంజని స్వర వైభవం విన్న గ్రామఫోన్ కంపెనీ హెచ్.ఎం.వి. వారు ఆమెతో ప్రైవేటు రికార్డులిప్పించాలని వొప్పందం కుదుర్చుకుని రికార్డింగు కోసం బెంగుళూరు రమ్మన్నారు. ఈ ప్రయత్నాల్లో ఉండగానే సి.పుల్లయ్య 'లవకుశ' సినిమా తీయాలని సీత పాత్ర కోసం అన్వేషిస్తుండగా ఆ అవకాశం ఆమెకు వచ్చింది. సినిమా నటీనటుల కోసం విజయవాడ వచ్చిన సి.పుల్లయ్య అక్కడే శ్రీరంజనిని పిలిచి ఆమెను చూడగానే సీత పాత్రకు ఎంపిక చేసి వెంటనే షూటింగ్‌కి హాజరు కావాలన్నారు. అయితే బెంగుళూరులో గ్రామఫోన్ రికార్డింగ్ అయ్యాక గాని కలకత్తాకు వచ్చి చిత్రీకరణలో పాల్గొంటానని చెప్పి బెంగుళూరు వెళ్లిందామె.

అసలు ఈ లవకుశ సినిమా తీసింది కలకత్తాకు చెందిన ఈస్టిండియా ఫిలిం కంపెనీ. అప్పటికే హిందీ, బెంగాలీల్లో దేవకీబోస్‌తో 1934లో పృథ్వీరాజ్, దుర్గాఖోటేలతో 'సీత' సినిమా తీశారు. అప్పట్లో ఈ సినిమా వెనీస్ ఫిలిం ఫెస్టివల్‌లో పాల్గొన్నది. పెద్ద విజయం సాధించింది. అన్ని కమర్షియల్ హంగులున్న ఈ చిత్రాన్ని తెలుగులోనూ తీయాలని నిర్ణయించుకుని సి.పుల్లయ్య గారికి ఆ బాధ్యత అప్పజెప్పారు. అప్పటికే వారికి సావిత్రి (1933) తీసి ఉన్నారాయన. బెంగాలీ వెర్షన్‌కు ఉపయోగించిన సెట్లు, కాస్ట్యూమ్స్, రథాలు ఉండటం కలకత్తాలోనే చిత్రీకరణ జరిపారు. పారుపల్లి సుబ్బారావు రాముడు, శ్రీరంజని సీత, పారుపల్లి సత్యనారాయణ వాల్మీకిగా, ఇతర పాత్రధారులంతా రంగస్థల నటులే.

'లవకుశ' విడుదలై (1934) తెలుగు సినిమా చరిత్రలో తొలి పెద్ద కమర్షియల్ విజయం పొంది రికార్డులకెక్కింది. సినిమా విజయం పూర్తిగా సీతపాత్రలో శ్రీరంజని నటనకే దక్కింది. ఆమె నటన గురించి ఆ రోజుల్లో ప్రజలు గొప్పగా చెప్పుకున్నారు. 'సాక్షాత్తూ సీతాదేవి వచ్చి సినిమాలో కనిపించినట్లు'గా ప్రేక్షకులు తన్మయులైనారు. ఈ సినిమా చూడటానికి గ్రామీణ ప్రాంతాల ప్రజలు చద్దిమూటలు కట్టుకుని ఎడ్లబండ్లపై తండోప తండాలుగా వచ్చేవారు. తెరపై సీతగా శ్రీరంజని కనిపించగానే చేతులెత్తి దండం పెట్టేవారు. సినిమాలో ఆమె వనవాస దృశ్యాలు చూసి కంటతడి పెట్టేవారు. నిర్మాతలకు కనకవర్షం కురిపించిందీ చిత్రం.

లవకుశ అద్భుత విజయంతో శ్రీరంజనికి పలుచోట్ల సన్మానాలు జరిగినవి. మద్రాసులోని క్రౌన్ టాకీస్‌లో శతదినోత్సవాలు జరుపుకుంది. ఈ సందర్భంగా జరిగిన సన్మాన కార్యక్రమంలో కాశీనాధుని నాగేశ్వరరావు, జయపురం మహారాజా విక్రమదేవ్ వర్మ, నాటి మద్రాసు గవర్నరు పాల్గొన్నారు. సీత పాత్ర పోషించిన శ్రీరంజనికి బంగారు పతకంతో సత్కరించారు. సీతగా శ్రీరంజని నటన ఎంతగా



సీనియర్ శ్రీరంజని

ఆకట్టుకున్నదంటే ఆమె ఎక్కడకు వెళ్లినా స్త్రీలు ఆమెను నిజంగా సీతగానే భావించారు. కొందరు పిల్లలు ఆమె కాళ్లపై పడేవారు. ముత్తయిదువలు పసుపు – కుంకాలు, నూతన వస్త్రాలు సమర్పించుకుని మంగళహారతులిచ్చేవారు. సీతగా శ్రీరంజని ఎంతగా జనాదరణ పొందినదంటే 1963లో రెండో లవకుశ వచ్చి అంజలిదేవి కూడా సీతగా కనిపించేదాక సీత అంటేనే శ్రీరంజనే గుర్తుకు వచ్చేవారు.

'లవకుశ' తరువాత శ్రీరంజనికి సీతపాత్రలు మాదిరిగానే శోక, కరుణ రసాత్మక పాత్రలు ఆమె తలుపు తట్టినవి. ఈ నేపథ్యంలో ఆమె 'శ్రీకృష్ణ లీలలు' (1935) చిత్రంలో దేవకిగా, 'మాయాబజార్'లో సుభద్రగా, 'సతీ తులసి'లో పార్వతిగా (1936), 'నర నారాయణ'లో గయుని భార్య చిత్రరేఖగా, సారంగధర (1937)లో రత్నాంగిగా, 'చిత్ర నళీయం'లో దమయంతి, మార్కెండేయ (1938)లో మరుధ్వతిగా చివరి చిత్రం 'వర విక్రయం' (1939)లో భ్రమరాంబగా నటించారు. మొత్తం తన అయిదేండ్ల సినీ జీవితంలో ఆమె నటించిన చిత్రాలు తొమ్మిదే. వీటిలో ఒకటి రెండు తప్ప అన్నీ జనాదరణ పొందిన చిత్రాలే. అయితే లవకుశ సినిమాలో సీతపాత్రకు వచ్చిన పేరు తరువాతి చిత్రాల్లో చేసిన పాత్రలకు రాకపోవడం గమనార్హం. అయితే ఈ దశకంలో కాంచనమాల, కన్నాంబ, శాంతకుమారి వంటి తారల రంగ ప్రవేశం కూడా శ్రీరంజనికి ప్రధాన పాత్రలు రాకపోవడానికి ఒక కారణంగా చెప్పుకోవచ్చు. నటించిన తొమ్మిది చిత్రాల్లో ఎనిమిది పౌరాణికాలు కాగా ఒకటి సాంఘికం. అది 'వరవిక్రయం'. యాథృచ్చికం ఏమిటంటే ఆమె తొలిచిత్రం చివరి చిత్రం దర్శకులు సి.పుల్లయ్య కావటం. అయితే నాటకాల్లో సినిమాల్లో ఎన్ని పాత్రలు పోషించినా శ్రీరంజనికి లవకుశలోని 'సీత'గా చేసిన నటనకే చిరకీర్తి లభించింది. రంగస్థలం, వెండితెరలపై నటనకే గాకుండా పాటకు, పద్యానికి శ్రీరంజని గొప్ప స్వర సౌందర్యాన్ని ఆపాదించి పెట్టింది. 'లవకుశ'లో ఆమె పాడిన 'ముదమాయెగా నాథా, ఆహా ఏమి నా భాగ్యము, అరయ కౌసల్యాది యత్తలనడిగి వంటి పాటలు, పద్యాలు ఆ రోజుల్లో తెలుగునాట మారుమ్రోగినవి. ఇంకా 'శ్రీకృష్ణలీలలు'లో 'మిముబాసి చనన్ వలసెన్, శ్రీశా శ్రీకర నాపయిన్ దయలేదా, సుకుమారుని కుమారుని విడనాడి, అన్న క్షమింపుమన్న తగదల్లుడు (పద్యం), మాయాబజార్‌లో 'క్షీరాబ్దిసుతా గిర్వాణ సుతా', 'దుస్సహంబౌతున్న దాహ దుర్విషాగ్ని' పాటలు, 'సారంగధర'లో అమృతరస ప్రదాయి, 'ఈశా ఇక బ్రోవగదే యీ దీనను', 'సుగుణాకర అరభీకర', 'దాక్షిణ్యమేగనవా దయాళో', 'వరవిక్రయం'లో 'హితవు విన విధియేమి, 'విధిగతి గడువతరమె పరమేశా' పాటలు, 'ఎన్నడు నా మాటకెదురు చెప్పగలేదు', 'పేదవారి పిల్లకు వరుడేరుపడెనన' వంటి పద్యాలు శ్రీరంజని స్వరంలో జీవం పోసుకున్నవి.



సీత, లవకుశలు

అది టాకీల తొలిదశకం కావడంవల్ల ఆంగికం, అభినయాల్లో ఆరితేరిన శ్రీరంజని సినీజీవితం సాఫీగా సాగిపోతున్న సమయంలో ఆమె అనారోగ్యానికి గురైంది. ఆ అనారోగ్యమే చివరికి కాన్సర్‌గా మారి ఆమె ప్రాణాలను బలిగొన్నది. ఆ రోజు 1939 సెప్టెంబర్ 24. అకాల మరణమే సంభవించకపోతే ఆమె మరిన్ని ఉత్తమ పాత్రల్లో మనల అలరించేవారు. శ్రీరంజని మరణిస్తూ తన ముగ్గురు కుమారులను పోషించడానికి చెల్లెలు మహాలక్ష్మిని వివాహం చేసుకోవలసిందిగా భర్తను కోరింది. అప్పటికే ఆమె సినిమారంగ ప్రవేశం చేసి ఉండింది. శ్రీరంజని మరణించాక తెరపై మహాలక్ష్మి పేరు 'జూనియర్ శ్రీరంజని'గా మారింది. మరణం తరువాత 'శ్రీరంజని' పేరుకు ముందు 'సీనియర్' వచ్చి చేరింది. ఆ తరువాత 'ప్రమీలార్జునీయం'తో దర్శకుడైన ఎం.మల్లికార్జునరావు ఆమె కుమారుడే. తెలుగు సినిమా చరిత్రలో చాలా మంది సీతపాత్రలు పోషించినవారున్నారు. కాని తెలుగు తెరపై తొలి సీతగా శ్రీరంజని స్థానం చెరిగిపోదు.

శ్రీరంజని జ్ఞాపకార్థం చెల్లెలు మహాలక్ష్మి (జూనియర్ శ్రీరంజని) తాము పుట్టి పెరిగిన మురికిపూడిలో కందిమళ్ళ శారదాంబ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఒక సభావేదికను, ఒక తరగతి గదిని నిర్మించి ఇచ్చారు.

హెచ్. రమేష్ బాబు
మహబూబ్‌నగర్.
ఫోన్ : 944 092 5814

# మనుషులు చేసిన దేవుళ్ళు

– దేవిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి

విశ్వంలో 13.8 బిలియన్ల ఏండ్ల నాడు **"బిగ్ బ్యాంగ్"** జరిగింది. ఎనర్జీ పుట్టింది. ఈ ఎనర్జీ కాలక్రమంలో సెమీ–ఆటమ్స్‌గా, ఆటమ్స్‌గా, ప్లానెట్స్‌గా పరిణామం చెందింది. అనగా, భూమివంటి గ్రహాలు, ఉపగ్రహాలుగా ఎనర్జీ మారింది. అంటే, పదార్థంగా (మేటర్‌గా/మెటీరియల్‌గా) ఎనర్జీ మారింది.

భూమి 4.5 బిలియన్ల ఏండ్లనాడు ఏర్పడింది. భూమిపై ప్రాణి 3.8 బిలియన్ల ఏండ్లనాడు ఏర్పడింది. తొలి మనిషి ఏప్స్ రూపంలో ఆఫ్రికాలో 7 మిలియన్ల ఏండ్లనాడు అగుపడడం జరిగింది. ఆధునిక రూపంలోని మనిషి 200,000 ఏండ్లనాడు ఏర్పడినాడు. మనిషిలాంటి హోమో హేబిలిస్‌లు (Homo habilis) 2.6 మిలియన్‌ల ఏండ్లనాడు శిలలతో తయారు చేసుకొన్న ఆయుధాల్ని వాడడం ఆరంభించాడు. ఇది జరిగిన 2.5 మిలియన్ల ఏండ్ల తరువాత మనుష్యులు చిన్నచిన్న గ్రూపులుగా నివసించడం ఆరంభించారు. వేరులు, బెర్రీలు, ఇతర ప్లాంట్స్‌ని సమకూర్చుకోసాగారు. ప్రకృతి సిద్ధ గుహల్లో, చెట్ల కొమ్మల నీడల్లో జీవిస్తూ నిప్పు వాడడం, స్టోన్‌ఏక్స్, స్పియర్‌లతో వేటాడడం చేయసాగారు. దాదాపు 8000 బి.సి.ఇ. (క్రీ.పూ) నాటికి పెద్ద గ్రూపులుగా నివసించడం, గ్రామాలు ఏర్పరచుకోవడం, శిలాయుధాలు బదులు కాపర్ లోహపు ఆయుధాల్ని వాడడం, బంగారం వాడడం కూడా నేర్చుకొన్నారు. ఐతే, హోమో సెపైన్స్ (Homo sapines) అనబడు ఆధునిక మానవుడు ఆఫ్రికా నుండి యూరప్‌కు, ఇతర ప్రపంచ ప్రాంతాలకు 60,000 ఏండ్లనాటికే వలసపోవడం ఆరంభించాడు. నియాండెర్తల్స్ (Neanderthals) స్థానంలో తెలివైన మనిషి యూరప్‌లో ఏర్పడి, ఉత్తర అమెరికా, ఆస్ట్రేలియాలకు 15,000 బి.సి.ఇ. నాటికి తరలిపోవసాగాడు. వ్యవసాయాన్ని 11,000 బి.సి.ఇ. ప్రాంతంలో ఆరంభించాడు. వ్రాతను 3100 బి.సి.ఇ. నాటికి కనుగొన్నాడు. భారత్‌లో అత్యంత ప్రాచీనమైన దైవంగా భావింపబడు పశుపతి ఐదువేల ఏండ్ల నాటికి (2,600 బి.సి.ఇ) సింధూ నాగరికత కాలంలో ఆరాధించబడ్డాడు. పశుపతిని తరువాతి కాలంలో శివుడుగా పిలువడం జరిగింది. అంటే, **భూమిపై** మానవ రూపంలోని దేవుళ్ళుగా భావింపబడేవారు పదివేల ఏండ్లకు మునుపు లేరు.

అనగా, **సమస్త విశ్వం, పలు రకాల ఎనర్జీలతో నిండి ఉంది, అంటే పదార్థంతో నిండి ఉంది**. భూమిపై అది, అగుపడే పదార్థంగానూ ఉంది, అగుపడని పదార్థంగానూ ఉంది, కదిలే పదార్థం గానూ ఉంది, కదలని పదార్థంగానూ ఉంది, చిన్న పదార్థాలుగానూ ఉంది, పెద్ద పదార్థాలుగానూ ఉంది. ప్రాణం పోయాక ప్రాణుల్లోనూ మిగిలేదీ పదార్థమే. ప్రాణుల్లో మనుష్యులు, జంతువులు, పక్షులువంటి కదిలే ప్రాణులు ఉన్నాయి. చెట్లు, గడ్డి, పంటలువంటి కదలని ప్రాణులు ఉన్నాయి. నిర్ణీత కాలంలో పదార్థం ప్రాణిగా, ప్రాణి పదార్థంగా మారుతూనూ ఉన్నాయి. ఐనా, పదార్థాలు, ప్రాణులు, రెండూ అంతిమంగా పదార్థ రూపాలే; పదార్థాలే. అనగా, పదార్థాలు ఎనర్జీ యొక్క ప్రతిరూపాలు; శక్తి రూపాలు, మహిమలు కలిగినవి కావు. అనగా, విశ్వం మొత్తం ఎనర్జీ మయం; శక్తిమయం. అసలు, శాస్త్రప్రకారం, ఎనర్జీ నుండే పదార్థం (మేటర్/మెటీరియల్) ఏర్పడింది; అనగా, పుట్టింది. అందుకే, మట్టి, రాళ్ళువంటి అగుపడే పదార్థాలతో రూపొంది ఉన్న భూమి, చంద్రుడువంటి గ్రహాలు, ఉపగ్రహాలు శూన్యం (స్పేస్) అనబడు అగుపడని మాగ్నటిక్ పదార్థ (ఎనర్జీ) ఆధారంగా స్పేస్‌లో నిల్చొని ఉన్నాయి. అనగా, పదార్థంలో, ప్రాణిలో, రెండింటిలోనూ ఎనర్జీ ఉంది. అంటే ప్రకృతిలో

ప్రాణం ఉన్న పదార్థాలు ఉన్నాయి (మనిషివలె), ప్రాణం లేని పదార్థాలు ఉన్నాయి (రాళ్ళు వంటివి), కదిలే ప్రాణులున్నాయి (మనిషి, పశువువలె), కదలని ప్రాణులున్నాయి (చెట్లువంటివి). కాని భూమిపై ఉన్న అన్నింటిలోనూ ఎనర్జీ (శక్తి) ఉంది. వేటిలోనూ మహిమలు లేవు. అలాంటప్పుడు మనిషికి మాత్రం మహిమలున్నాయనడం సత్యం కాదు. ప్రాణి శరీరం, నీరు, గ్యాస్‌లతో ఏర్పడిందనేది మాత్రం శాస్త్రీయంగా సత్యం.

ఇక్కడ గుర్తించాల్సిన ఆశ్చర్యకరమైన విషయమేమంటే, **ప్రాణి (మనిషి కూడా) ఒక కదిలే పదార్థమేగాక, మార్పు చెందే పదార్థంకూడాను.** ఉదాహరణకు, ప్రాణికి ప్రాణం పోతే అది పదార్థంగా, అంటే, మేటర్‌గా/మెటీరియల్‌గా మారుతోంది. కాలక్రమంలో అది భూమిలో కలసిపోతోంది. కదలని ప్రాణులైన చెట్లు, పంటలకు ఆహారంగా (ఎరువుగా) మారుతోంది. వాటి ఉత్పత్తులు (కాయలు, పండ్లు, గింజలు వంటివి) కదిలే ప్రాణులకు (మనిషికి కూడా) ఆహారమౌతున్నాయి (తిండి). ఆ ఆహారం ప్రాణుల శరీరాల్లో భాగంగా మారుతున్నాయి. అనగా, తిరిగి ఏదో ఒక ప్రాణిగా (ఇదీ పదార్థమే), పదార్థంగా మారుతోంది. అంటే, పదార్థం, ప్రాణి నిరంతరం రూపాంతరం చెందుతూనే ఉంటున్నాయి. బహుశా, దీనినే, రకరకాల ప్రాణులుగా మనిషి జన్మిస్తూనే ఉంటాడు అని మన ప్రాచీన భారత ఆధ్యాత్మిక గురువులు అనడానికి కారణమేమో. ఆ మాట ఆధ్యాత్మికంగా అన్నారో, శాస్త్రీయంగా అన్నారో చెప్పడానికి ఆధారాలు లేవు; ఇక్కడ ఆ చర్చ అవసరమూ లేదు.

ఐతే, **భూమిపై దేవుడు ఉన్నాడు, రాక్షసుడు ఉన్నాడు, మానవుడు ఉన్నాడు.** పదిమందికి మంచి పనులు చేసినవాడు, మంచి మాటలు చెప్పి (బోధనలు చేసి), మంచి మార్గంలో జనాన్ని నడిపినవాడు దేవుడు. పదిమందికి చెడు పనులు చేసినవాడు, చెడు మాటలు చెప్పి (బోధనలు చేసి) చెడు మార్గంలో జనాల్ని నడిపినవాడు రాక్షసుడు. పదిమందికి మంచి పనులూ చేయక, మంచి మాటలూ చెప్పక తను, తనవారి మంచి గురించే ఆలోచించేవాడు మానవుడు. అనగా, భూమిపై మనం పూజించుకొంటోన్న దేవుడు మహిమలు గలవాడు కాదు. అంటే, **మానవుని స్వభావంబట్టి, మానవుని గుణాల్లో ఉన్నతమైన, ఆదర్శవంతమైన, ఇతరులు ఆచరించదగ్గ గుణాలకు ప్రాచీన మానవులే దైవస్థానాన్ని ఇచ్చారు. అలాంటి గుణాలుగలవారిని దైవం అన్నారు.** కొన్నాళ్ళకు ఆ గుణాలకు, ఆ గుణాలుగల వారికి మహిమల్ని ఆపాదించి, భక్తిని జోడించి ఆరాధించసాగారు. ఇదంతా మనిషి పరిణతి దశకు చేరాక జరిగింది. అంతకు ముందు, మనిషేకాక ఇతర ప్రాణులు, పదార్థాలు కూడా దైవ స్థానాన్ని పొందాయి.

అంటే, మనిషి, జంతువువంటి పలు ప్రాణుల్లో, నీరు, గాలివంటి పలుపదార్థాల్లో **మంచి చేసే** వాటిని / మంచి చేసేవారిని, **ఉపయోగపడే** వాటిని / ఉపయోగపడేవారిని ప్రాచీన మానవులు కాలక్రమంలో గౌరవించసాగారు. ఉన్నత స్థానమివ్వదగినవిగా / ఉన్నత స్థానమివ్వదగినవారుగా తలంచసాగారు. దైవంగా భావించసాగారు. వాటికి / లేదా, వారికి క్రమంగా మహిమల్ని ఆపాదించసాగారు. తమ ఆపాదించిన ఆ మహిమలే తమ సమస్యలన్నింటినీ తీర్చగలవని భావించసాగారు. అలా, మహిమలున్నవిగా భావించిన వాటిని / అలాంటివారిని భక్తి తన్మయత్వంతో ఆరాధించసాగారు (భక్తి మార్గం, కర్మ మార్గం అనేవి సుమారుగా క్రీ.శ. నాల్గవ శతాబ్ది నుండే ప్రోత్సహించబడ్డాయి; అనగా, పురాణాలు పుట్టడం ఆరంభమైన నాల్గవ శతాబ్ది నుండి ప్రోత్సహించబడినట్లు తెలుస్తోంది). అలాంటివాటిని లేదా అలాంటి వారిని **సహజసిద్ధంగా ఉన్న రూపంలోగాని**, చిహ్నాల రూపంలోగాని, **అర్ధ-మానవ రూపంలోగాని** (వినాయకుని రూపంలోవలె), **మానవ రూపంలోగాని,** ఆరాధించబడసాగాయి / ఆరాధించబడసాగినారు. అలాంటివాటికి లేదా అలాంటివారికి ఆపాదింపబడి ఉన్న మహిమల్ని పలు సాహితీ ప్రక్రియలు, నాట్యాలు, నృత్యాలు, నాటకాలు, సంగీతం, శిల్పాలు, చిత్రలేఖనాలు, ఆలయాలు, తిరునాళ్ళు, బుర్రకథలు, హరికథలు, తోలుబొమ్మలాటలువంటి పలు మాధ్యమాలతో ప్రచారం చేయసాగారు (వ్రాత పుట్టుకతో క్రమబద్ధమైన పాట, ఆట, సంగీతంవంటివి పుట్టి భక్తితత్వ వ్యాప్తి జరిగింది). వాటికి / లేదా వారికి ఆపాదించబడిన మానవతా విలువల్ని, సిద్ధాంతాల్ని (తత్వాల్ని) ప్రచారం చేయసాగారు (నయనార్లు, ఆళ్వార్లు, ఋషులు, దాసులు, వాగ్గేయకారులు, దేవదాసీలు వంటివారివలె). ఇలాంటి దైవ ప్రచారకుల్లో కొందరు శిష్య పరంపర రీతిలో ప్రచారకుల్నీ తయారు చేయసాగారు (శంకరాచార్యులు, రామానుజాచార్యులు వంటివారు). మరి కొందరు ప్రచారకులు తామూ మహిమలున్నవారుగా, తామూ

దైవాలుగా ప్రచారం చేసుకోసాగారు. ఇంకా కొందరు ప్రచారకులు, తాము బ్రతికి ఉన్నప్పుడుగాని, బ్రతుకు చాలించిన తరువాతగాని, తమకు తెలిసిగాని, తమ ప్రమేయం లేకుండాగాని, దైవాలుగా ప్రచారం చేయించుకోవడంగాని, ప్రచారం కాబడేట్లు చేసుకోవడంగాని (శిష్యపరంపర రీతిలో), ప్రచారం కాబడడంగాని జరిగింది (భక్త కన్నప్ప, నయనార్లు, ఆళ్వార్లు, వెంగమాంబ, షిరిడీసాయిబాబా, సత్యసాయిబాబాలవలె).

కాని, భక్తి తత్వం క్రమంగా ఓర్వలేని స్థాయికి చేరి, ఇతర భక్తితత్వాల్ని ఆచరించేవారితో ఘర్షణపడసాగింది (భిన్న మతాల మధ్య, భిన్న రాజకీయ భావాల మధ్య జరిగిన ఘర్షణలు, యుద్ధాలువలే, ముఖ్యంగా శైవం-వైష్ణవం, క్రైస్తవం-ఇస్లాం, హైందవం-ఇస్లాం మధ్య చరిత్రలో జరిగినట్లు). హైందవంలో తిరుమలవంటి ప్రాంతాల్లో తలల్ని, శరీర భాగాల్ని దైవానికి అర్పించే ఉన్మాద స్థితి కూడా ఏర్పడింది. భక్తి తత్వం అనగా మాయ, మాయాలోకం, ఊహాలోకం, శాస్త్రీయంగా నిజం కానిది, మెదడులో మనిషి సృష్టించుకొన్న భావం (క్రియేటివ్ ఐడియాలజీ); కాని, మనిషికి ఊరటను, తృప్తిని ఇచ్చే సత్యం. భక్తి, మనిషిని, మాయలో జీవించేట్లు చేస్తుందిగావునే మాయన్, మాయావి అని భగవంతుని ప్రాచీన కాలపు ఆళ్వారులే అన్నారు. ఐతే, **భక్తి తత్వం, ఆధ్యాత్మికత** భారతీయుల ఆలోచనారీతిని, జీవన విధానాన్ని, సంస్కృతిని మలచింది; రకరకాల కళలు, సాహితీ ప్రక్రియలు, ప్రపంచంలో ఎక్కడా లేనంతటి గుట్టలకొద్దీ సాహిత్యం పుట్టడానికి, వ్యాప్తిచెందడానికి కారణమయింది. ఉదాహరణకు, దైవాలకు తొలుత నివాసాలుగా ఉండిన చెట్లు, పొదలు, కొయ్యపందిరిళ్ళు, పూరిండ్లు, రాతి పందిరిళ్ళు, ప్రకృతిసిద్ధ గుహలు దశ తరువాత వాస్తు శిల్ప కళల్లో (ఆర్ట్ అండ్ ఆర్కిటెక్చర్) జైన, బౌద్ధ, హైందవ మతాలన్నింటిలోనూ మానవ నిర్మిత గుహాలయాలు (కట్-ఇన్ రాక్ కేవ్స్), కట్-ఔట్ రాక్ టెంపుల్స్, కట్టడ ఆలయాలు (స్ట్రక్చురల్ టెంపుల్స్), ప్రతిమలు, చిత్రలేఖనాలువంటివెన్నో పుట్టుకొచ్చాయి. కుషాణుల కాలంలో బౌద్ధం తొలిసారిగా గుండ్రటి శిలాప్రతిమల్ని రూపొందించి, అన్ని మతాలకూ ఆ కళను అందించింది.

**భక్తి తత్వం**, మనిషిని తను ఊహించిన తత్వానికి దగ్గరగా, మాయాలోకంలోకి, తీసుకెళుతుంది; కంటికి అగుపడని మాయాలోకంలో మనిషి జీవించేట్లు చేస్తుంది. తనకు భిన్నమైన తత్వాన్ని నిరసిస్తుంది, విభేదిస్తుంది, ఖండిస్తుంది, అవసరమైతే ఘర్షణ పడుతుంది, మితిమీరితే ఆ భిన్నతత్వీయుల్ని చంపడానికి కూడా సిద్ధపడుతుంది. **ఆధ్యాత్మికత** మనిషిని కంటికి అగుపడే ప్రకృతిలో భాగమై జీవించేట్లు చేస్తుంది; ప్రకృతి నిర్దేశించిన సూత్రాలకు అనుగుణంగా జీవించేట్లు చేస్తుంది; అంటే, ప్రకృతిలోని మానవతా విలువలకు దగ్గరయినది ఆధ్యాత్మికత. అనగా, ప్రకృతిలో భాగంగా, ప్రకృతికి దగ్గరగా, సహజసిద్ధంగా, సాదాగా, ముఖ్య అవసరాలకు మించిన ఆశలు, దురాశలు లేకుండా సాగించే జీవితమే ఆధ్యాత్మిక జీవితం. ఇదే, ప్రాచీన కాలం నుండి తత్వవేత్తలు, ఆధ్యాతిక గురువులు చెబుతున్న విషయం. ఎంత ఎక్కువగా ఆధ్యాత్మికతతో కూడిన జీవితాన్ని మనిషి సాగిస్తాడో అంతే స్థాయిలో మానవత్వం కలిగిన వ్యక్తిగా అతడు రూపొందుతాడు, అంతేస్థాయిలో అగ్రెసివ్ బిహేవియర్‌ను కోల్పోతాడు, ఆడంబర జీవనానికి దూరంగా ఉంటాడు, **జనం దృష్టిలో దైవస్థానం పొందుతాడు;** మానవులకు భిన్నమైనవాడుగా గుర్తింపబడుతాడు.

ఇక, భగవంతుని విషయానికి వస్తే (పైన పరిశీలించినట్లు), ప్రకృతిలోని మానవతా విలువల ప్రతిరూపం **భగవంతుడు.** వాటి సూత్ర రూపం **మతం**. వాటి ఆచరణ రూపం **ఆధ్యాత్మికం**. వాటి ప్రతిరూపమైన భగవంతునిపై నమ్మకం **భక్తి**. ఆ నమ్మకంతో జీవించే మానవుడు **భక్తుడు**. ఇలాంటి మనిషికి మాత్రమే దేవుడున్నాడు. అంటే, మనిషికి మాత్రమే దేవుడున్నాడు; ఇతర ప్రాణులకు దేవుడు లేడు. ఇందుకు కారణం, మనిషికి మాత్రమే ప్రకృతిలోని వాటిని చూసి స్పందించే క్రియేటివ్ బ్రెయిన్, అనగా, బయోసాఫ్ట్‌వేర్ ఉంది. అందులోంచే భగవంతుడు అనే భావన పుట్టి, ప్రకృతిలోని రూపాల్లో, చిహ్నాల రూపాల్లో, అర్ధ-మానవ రూపాల్లో, మానవ రూపాల్లో ఆరాధింపబడుచున్నాడు (ప్రకృతి అందించిన ఇన్‌పుట్స్‌తో దేవుడనే ఔట్‌పుట్ పుట్టుకొచ్చినట్లు... మానవ రూపేణ దేవం). **ప్రకృతి రూపాల్లో** సూర్యుడు, చంద్రుడు, గోవు, సర్పం, కొండలు, నీరు వంటివి; **చిహ్నాల రూపాల్లో** శివలింగం, దైవ పాదాలువంటివి; **అర్ధ-మానవ రూపాల్లో** వినాయకుడు వంటివారు; **మానవ రూపాల్లో** శివుడు, విష్ణువు, కృష్ణుడు, రాముడు, సరస్వతి, భూదేవి, లక్ష్మీదేవివంటివారు. దైవం, భావన కాదు, ఈ రూపాలన్నింటి ప్రతిరూపం అని భావించే

వారికి దైవం సర్వాంతర్యామి, అంటే, ప్రకృతే.

ఇక, భూఖండంపైగల దేవతల్ని, ముఖ్యంగా భరత ఖండంలోని దేవతల్ని పరిసీలిస్తే, ప్రాణి పుట్టడానికి, మనుగడ సాగించడానికి అవసరమైన (1) నీటిని గంగాదేవియని, (2) గాలిని వాయుదేవుడని, (3) వేడిని సూర్యుడని, (4) చల్లదనాన్ని చంద్రుడని, (5) వర్షాన్ని, వరుణుడని ప్రాచీన కాలం నుండి ఆరాధించడం జరుగుతోంది. ప్రకృతిసిద్ధ ఆహారాన్ని, నివాసాన్ని, ఆరోగ్యాన్ని ఇచ్చే వేప, రాగివంటి పలు చెట్లూచేమల్ని ప్రకృతిమాతయని ఆరాధించడం జరుగుతోంది. పంటల సాగుకు, పాల ఉత్పత్తులకు ఉపయోగపడే గోవుల్ని గోమాతయని, మగవైతే నందియని, అవి ఈశ్వర (దైవ) స్వరూపమని ఆరాధించడం జరుగుతోంది. ఆకాశంలో ఎత్తుగా ఎగరగల్గే సాహసపక్షి గద్దను గరుత్మంతుడని ఆరాధించడం జరుగుతోంది. మంచిచేసిన మనుషుల్ని వారివారి పేర్లతోగాని, వారు నివసించిన కొండలు, ప్రాంతాల పేర్లతోగాని ఆరాధించడం జరుగుతోంది. ఉదాహరణకు, కైలాసవాస-శివుడు, మేరుపర్వతవాస-విష్ణువు, అయోధ్యవాస-రాముడు, ద్వారకావాస-కృష్ణుడు, బ్రహాండనాయక-బ్రహ్మ, వేంగడవాస-వేంగడేశ్వర/వేంకటేశ్వర (వేంకటేశునికి, కొండ పేరే వాడుకలో ఉంది, అసలు పేరు తెలియదు). విజ్ఞానం నిల్వ చేసుకోవడానికి, భవిష్యత్తులో వాడుకోవడానికి ఉపయోగపడిన అక్షరాన్ని, అనగా, అక్షర భాషను సరస్వతియని (మానవ అభివృద్ధిలో అక్షరభాష విప్లవాత్మక మార్పుల్ని తెచ్చింది), భూసంపదను భూదేవియని, బంగారు, వెండి, డబ్బువంటివి భూమితోపాటు సంపదగా గుర్తింపబడినప్పటినుండి సర్వసంపదల్నీ కలిపి లక్ష్మీదేవియని ఆరాధించడం జరుగుతోంది. ఇక, పూర్తిగా ఊహారూపాలైన, మానవ జాతి హద్దులుగల భూభాగాన్ని, ఉదాహరణకు ఇండియాను భరతమాతయని, తెలుగువారి ప్రాంతాన్ని తెలుగుతల్లియని దైవాలుగా ఆరాధించడమూ జరుగుతూ ఉంది. ఇలా చెబుతూపోతే వేలకొద్ది ఉదాహరణల్ని ఇస్తూపోవచ్చు. ఐతే, విషయం అర్థంకావడానికి ఈ ఉదాహరణలు చాలు. అంతం లేని విశ్వం సృష్టికి కారణమైన శక్తిని, అనగా, ఎనర్జీని; భూఖండం వెలుపల ఉన్నదాన్ని, పూర్తిగా మనం అర్థం చేసుకోలేకపోవచ్చుగాని; భూఖండంపై పుట్టినట్టి, ఏర్పడినట్టి, దైవంగా భావింపబడేట్టి ప్రాణులు, పదార్థాల గురించి, మానవుల గురించి తెలుసుకోవడం కష్టంకాదని పై విషయాల్తో తెలుస్తోంది. ఎందుకంటే, భూఖండంపై ఉన్న మానవుని మెదడులో మాత్రమే దేవుడు అనే భావం రూపుదిద్దుకొన్నది. అనగా, భూఖండంపైగల దేవుడు మానవుని మెదడులోంచి పుట్టాడు. మానవుడు, మానవుల్ని మూడు రకాలుగా విభజించుకొన్నాడు – పదిమందికి మేలుకై కృషిచేసేవాడు దేవుడుగాను, పదిమందికి హాని చేసేవారిని రాక్షసులుగాను, తన స్వార్థాన్ని చూసుకొనేవాడిని మానవుడిగాను విభజించుకొని, అలా పిలుచుకోసాగాడు.

మరో విచిత్రమైన విషయమేమంటే, మానవుని ఆలోచనల్లో కాలక్రమంగా వచ్చిన అసహజ, అవకాశవాద మార్పులు కారణంగా ఒక్కొక్క కాలంలో ఒక్కొక్క దేవుడుగాని, కొందరు దేవుళ్ళుగాని ప్రసిద్ధ దేవుళ్ళుగా ఆరాధింపబడడం, లేదా ప్రసిద్ధ దేవుళ్ళకు సేవకులుగా ఇతర దేవుళ్ళు మార్చబడడం అగుపడుతుంది. ఉదాహరణకు, అతి ప్రాచీన దేవతలలో ఒకడైన శివుడు ప్రధాన దైవంగా ఆరాధింపబడిన కాలంలో శివునికన్నా విష్ణువు తక్కువ స్థాయిలో చూడబడడం, శివుని సేవకునిగా భావించడం జరిగింది. అలాగే, విష్ణువు ప్రాధాన్యత కలిగి ఉండిన కాలాల్లో విష్ణువుకు లేదా ఆయన అవతార దైవాలకు సేవకుడుగా శివుణ్ని భావించడం జరిగింది. ఉదాహరణకు, విష్ణువుగా భావింపబడు వేంకటేశ్వరునికి శివుడు, బ్రహ్మ నిత్యం సేవలు చేస్తున్నవారుగా ఇప్పటికీ భావించడం జరుగుతోంది; ఆలయ కార్యక్రమాలు కూడా ఆ భావనతోటే నడుపడం జరుగుతోంది. ఇక, మానవుడు ఆరాదించిన తొలి దేవతల్లో ఒకరైన గంగాదేవివంటివారు తరువాతి కాలాల్లో శివుడు, విష్ణువు ఆలయాల్లోగాని, ఇతర రకాల శైవ, వైష్ణవ ఆలయాల్లోగాని ద్వారపాలకులుగా, సేవకులుగా శిల్పరూపంలో చూపడం జరిగింది. యక్షులు, యక్షిణులు దిక్పాలకులుగా, ద్వారపాలకులుగా, బ్రాకెట్ శిల్పాలుగా చూపబడ్డారు (తొలి దేవతలైన యక్ష, యక్షిణిల్లో కుబేరుడు, హారీతి ఉన్నారు). ఉష, ప్రత్యుషలూ సేవకులయ్యారు. గరుత్మంతుడు విష్ణువుకు వాహనంగా చేయబడ్డాడు. చంద్రుడు శివుని శిరస్సుపై ఆభరణంగా మార్చబడ్డాడు. సూర్యుడు విష్ణువుకు చక్రాయుధంగా చేయబడ్డాడు. నాగదేవతగా కొలవబడిన నాగుపాము, నాగరాజు పేరుతో శివుని మెడకు ఆభరణంగా చేయబడగా, విష్ణువుకు ఆదిశేషుడు పేరుతో పాన్పుగా చేయబడ్డాడు.

వాయుపుత్రుడుగా ఆరాధింపబడిన ఆంజనేయుడు రామునికి సేవకుడుగా చేయబడ్డాడు. ఇలా చెబుతూపోతే ఎందరో తొలి దేవుళ్ళుగా ఆరాధింపబడినవారు శివుడు, విష్ణువులాంటి మలిదేవుళ్ళు, పెద్దదేవుళ్ళు సేవకులుగా మార్చబడడం అగుపడుతుంది. మరోవైపు, ఈ పెద్ద దేవుళ్ళు తమకన్నా మునుపు ప్రాంతీయంగా ఉండిన చెట్లు, పశువులు, పక్షులు, సూర్యచంద్రులు, నదులు, కొండలువంటివాటిని దైవాలుగా ఆరాధించే కల్ట్ (మతాలు) సాంప్రదాయాన్ని మింగేసి పెద్దదేవుళ్ళుగా మారడం అగుపడుతుంది. దైవాలుగా ఆరాధించబడిన జంతువులు, పక్షులు ఈ దేవుళ్ళ వాహనాలుగా చేయడం అగుపడుతుంది. ఉదాహరణకు, తొలుత లింగ ఆరాధకుడుగా ఉండిన శివుడు, లింగాన్ని భుజాన పెట్టుకొని దైవంగా ప్రచారం చేసిన శివుడు, కైలాస పర్వతంపై స్థిరనివాసమేర్పరచుకొన్నాక ఆయనే లింగ రూపుడని, శివుడని ఆరాధించడం జరిగింది; గుట్టల కొద్దీ శైవ సాహిత్యం పుట్టుకొచ్చింది (పురుష మర్మాంగమైన లింగం, స్త్రీ మర్మాంగమైన యోని ప్రాచీన మానవుల దైవాలుగా ఆరాధించబడినాయి. లింగ ఆరాధనను శివుడు ప్రచారం చేయడంతో లింగ రూపుడుగానూ ఆయనను ఆరాధించడం జరిగింది.

మానవ సృష్టికి లింగం, యోని మూలం కావున ప్రాచీన మానవుడు వీటిని దైవాలుగా ఆరాధించడం జరిగింది. లింగాన్ని **సిస్న దేవుడుగా** ఆరాధించడం జరిగింది). ఇలాంటివన్నీ మానవులు చేసినవే (ప్రకృతిలోని సూర్యచంద్రులు, నేల, గాలి, నీరు, నిప్పు, మనుషులు, జంతువులు, పక్షులు, చెట్లు వంటివితప్ప మిగిలినవన్నీ మానవ సృష్టే). ఇదంతా, మనిషివలన, ఇతర ప్రాణులు, పదార్థాల వలన కలిగెడి **మంచి, ఉపయోగం అనేవాటికి మానవుడు, ముఖ్యంగా భారతీయులు ఇస్తూవస్తోన్న గౌరవ స్థానం; అంటే దైవ స్థానం**. అందుకే, జనానికి మంచి చేసి ఉపయోగపడిన ఎంతోమందితోపాటు శివుడు, విష్ణువు, కృష్ణుడు, రాముడువంటి రాజ్య పాలకులు, పాలకుల స్థాయివారు, వీరులు, ఆధ్యాత్మిక నాయకులు (నయనార్లు, ఆళ్వార్లువంటి వారు) కూడా దేవతలుగా నేటికీ ఆరాధింపబడుతున్నారు. వీరేగాక, తొలుత పుల్లికున్రంగా పిలువబడి, తరువాత వేంగడంగా ప్రసిద్ధిగాంచిన తిరుమల ప్రాంతాన్ని మొట్టమొదటగా పాలించిన పుల్లి అను తెలుగు రాజు కూడా వేంగడ–ఈశుడుగా (దేవుడుగా), వేంగదేశ్వరుడుగా, వేంకటేశ్వరుడుగా వేంగడం కొండ పేరుతోనే సుమారు క్రీ.పూ. ఒకటవ శతాబ్ది నాటి నుండి ఆరాధింపబడుచున్నాడు. అసలు పేరు తెలియక తమకు చిన్నప్పటి నుండి అలవాటుపడిన ఏదో ఒక ఇష్టదైవం పేరుతోనే పిలుచుకోవడం, ఆరాదించుకోవడం చేయసాగారు.

**డా. దేవిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి**
**రిటైర్డ్ ప్రొఫెసర్, చరిత్రశాఖ, ఎస్వీ యూనివర్శిటీ,**
**తిరుపతి. ఫోన్ : 984 958 4324.**

## ఆకెళ్ల

కథ, నవల, టి.వి., సినిమా, నాటక రచయిత. పూర్తి పేరు ఆకెళ్ల వెంకట సూర్యనారాయణ. ఈయన 1950 ఫిబ్రవరి 10న జన్మించాడు. కొన్ని కథలు, నవలలు కన్నడ, హిందీ, తమిళ భాషల్లోకి అనువాదం పొంది, తెలుగు బావుటాను ఎగురవేశాయి. ఈయన సంభాషణలు రాసిన 'స్వాతిముత్యం', 'శ్రుతిలయలు'వంటి చిత్రాలు జాతీయ స్థాయిలో అవార్డులు పొందాయి. నాటక రచన ఆలస్యంగా ప్రారంభించినా, అనతి కాలంలోనే ఉత్తమశ్రేణి రచయితగా ఎదిగాడు. నంది నాటక పోటీలతో సహా వివిధ నాటక పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రదర్శన, మరెన్నో ఇతర బహుమతులు పొంది, ఆకెళ్ల కీర్తిని ఇనుమడింపచేశాయి. సన్నివేశ కల్పనలో సహజత్వం, పాత్రచిత్రణలో తెలుగుతనం, అన్నింటికీమించి కావ్యార్థాన్ని మనోజ్ఞంగా ఆవిష్కరించే నాటక శిల్పం ఆకెళ్ల రచనా వ్యాసంగానికి పెట్టని కోటలు. అందుకే ప్రతి రచనలోను నిష్టుర సత్యంతో కూడిన నిజాయితీ పాత్రచిత్రణలో అంతర్లీనంగా ప్రవహిస్తూ ఉంటుంది. ఈయన రచించిన *కాకి ఎంగిలి* నాటకానికి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం లభించింది.



ఆకెళ్ల

# సహృదయునితో సంభాషణ

*– యార్లగడ్డ బాలగంగాధర రావు*

తెలుగు అభిమాన విషయంగా చదివే అందరూ విధిగా చిన్నయసూరి బాలవ్యాకరణం పఠిస్తారు. అలాగే దానికి కొంతవరకు మాతృక అయిన నన్నయ కృత శబ్దచింతామణిని చదువుతారు. రెండింటా ముమ్ముందుగా మన ఈ భాషలోని అక్షరాల సంఖ్యను గూర్చి మూడు సూత్రాలున్నాయి. కాకపోతే అవి చింతామణిలో సంస్కృతంలో వుండగా బాలవ్యాకరణంలో తెనుగులో వున్నాయి. అంటే చిన్నయసూరి చింతామణిలోని మూడు ప్రారంభ సూత్రాలను తెనుగులోనికి అనూదితంగావించారన్నమాట. ఆ సూత్రాలు :

1. సంస్కృతమునకు వర్ణము ఏబది,
2. ప్రాకృతమునకు వర్ణములు నలుబది,
3. తెనుగునకు ముప్పది ఆరు.



తిరుమల రామచంద్ర

నేను తెనుగు అభిమాన విషయంగా బి.ఎ., ఎం.ఎ., (ఆంధ్ర విశ్వవిద్యాలయం) చేశాను. బి.ఎ. చదువుకుంటున్న సందర్భంలో నాకు చాలా ప్రౌఢ వ్యాకరణాలు, కీ.శే. జోశ్యుల సూర్యనారాయణ మూర్తిగారు బోధించగా ఎం.ఎ.లో వాటిని కీ.శే. ఆచార్య లకంసాని చక్రధరరావుగారు బోధించారు. ఇరువురూ ప్రస్తుతాలను వ్యాఖ్యానం చేసే సందర్భంలో ముఖ్యంగా మొదటి రెండు సూత్రాల విషయంలో, ఆ రెండు భాషల (సంస్కృతం, ప్రాకృతం) ప్రభావం మన భాషలో వుంది గనుక ఆయా భాషలకు చెందిన అక్షరాలను వాటి సంఖ్యను గూర్చి ఆయా గ్రంథకర్తలు చెప్పటం జరిగింది. ఆ క్రమంలోనే తెనుగు భాషకు ముప్పది ఆరు అని చెప్పటం జరిగింది. అవి సామాన్యంగా పండితులందరూ భావిస్తున్నదే చెప్పారు. ఇప్పటికీ అదే భావనను బోధించటం జరుగుతోంది. అవి ప్రారంభసూత్రాలు, కేవలం సమాచారాన్ని మాత్రమే చెబుతున్నవి. పరీక్షల్లో వాటిని గూర్చిన ప్రశ్నలు లేకపోవటం కారణాన అప్పట్లో వీటిమీద దృష్టిపెట్టలేదు. అంతేగాక, అవును, ఆ సూత్రాలు చెపుతోంది అంతేననే భావన కూడా వుండటం కారణంగా, అప్పట్లో మరి ఆలోచించింది కూడా లేదు.

అయితే, అధ్యాపక వృత్తిలోనికి ప్రవేశించి, మరలమరల ఆ రెండు గ్రంథాలను పఠించటం, మననం చేసుకోవటం, బోధించటం జరిగిన సందర్భాల్లో వాటిని కొంత నిశితంగా ఆలోచించటం జరిగింది. నా ఆలోచనలకు కారణాలు ఏమంటే – 1. తెనుగు భాషకు వ్యాకరణం చెపుతూ సంస్కృత భాషనుగల అక్షరాలెన్నో చెప్పటం దేనికి? 2. అలాగే ప్రాకృతం విషయం కూడా. 3. తెనుగునను ముప్పది ఆరు అని చెప్పినా, ఇప్పుడు మనం ఉపయోగిస్తున్న అక్షరాలు మరిన్ని ఎక్కువగా వున్నాయి గదా అనేవి. సంస్కృత ప్రాకృతాల ప్రభావం మన భాషమీద వుంది గనుక అలా చెప్పారనుకుంటే, ఆ మాటే చెప్పవచ్చునుదా! అక్షరాల సంఖ్య చెప్పవలసిన అవసరం ఏమిటి? ఒకవేళ అలాగే భావించినా ప్రాకృత అక్షరాల సంఖ్య చెప్పాడు తప్ప, ఏ ప్రాకృతమన్నది నిర్ధారించలేదేమి? మరి చాలా ప్రాకృతాలున్నాయిగదా! ఏ ప్రాకృత విషయం వారు చెప్పినట్లు? ఈ ప్రశ్నలు నన్ను చాలా వేధించాయి. కవిత్రయల్లారతున్న వచనీసమచే సమయంలో, రాజు, నన్నయను 'తెనుగు'గా (తెలుగులో లేదు) భారతం రచించమని చెప్పటం, నన్నయ 'తెనుగు'లో రచిస్తున్నానటం, తిక్కన నిర్వచనోత్తర రామాయణాన్ని 'తెలుగు'లో చెపుతున్నానని చెప్పి భారతం వ్రాసేవేళ 'తెనుగు'లో చెపుతున్నానటం (నిజానికి రామాయణ భారతాల్లోని ఆయన భాష ఒకటే), ఆ తరువాత ఎఱ్ఱన మొదలుకొని అందరు కవులూ 'తెనుగు'లోనే తమ వచనలు సాగిస్తున్నామని చెప్పిన మాటలను గమనించి, నిశితంగా ఆలోచించినపుడు, ఆ ప్రశ్నలకు సమాధానాలు దొరికినాయి. అంటే, నాకు స్ఫురించాయి. నాకు స్ఫురిస్తే పోతుందా? వాటికి ప్రమాణాలను సాధించటం ఎలా? పండితులలో నా

ఆలోచనలు పంచుకోవాలి. తర్వాత సత్యనారాయణ మూర్తిగారు అప్పటికీ గతించారు. చక్రధరరావుగారు, వారు చెప్పిందేమో చెబుతారు. అంటే! వాదనకు రారు. మౌనం వహిస్తారు. సంప్రదాయ పండితుల చెవికి ఈ ప్రశ్నలు మొదలు ఎక్కవు. అదిగో ఆ స్థితిలో ఒక సందర్భంలో నాకు కీ.శే. తిరుమల రామచంద్రగారిని కలిసే అవకాశం ఏర్పడింది. పై ప్రశ్నల విషయమై మా ఇరువురి మధ్య సుదీర్ఘమైన సంభాషణ జరిగింది. ఆ సంభాషణా క్రమాన్ని యథాతథంగా మీ ముందుకు తెస్తున్నాను (పై ప్రశ్నలకు నాకు స్ఫురించిన సమాధానాలు కూడా ఆ సంభాషణా సరళిలో మీరు గమనిస్తారు.)

సమమైన తేదీ, సంవత్సరం గుర్తులేదు. తిరుమల రామచంద్రగారు ఎందుకో గుంటూరు వచ్చారు. వారితోనే వచ్చారో లేక విడిగా ఏమైనా పనిమీద వచ్చారోగాని బిట్టు వెంకటేశ్వర్లుగారు వారిలో వున్నారు. నేను వెళ్ళింది కీ.శే. నాజరుగారి సన్మాన సభలో పాల్గొనటానికి. ఆ సందర్భంలో నేను వారిని ఒక లాడ్జిలో కలుసుకోవటం జరిగింది. అంతకు ముందు వారితో నాకు పరిచయం లేదు. వారి రచనలతో పరిచయముంది. ఆయనను నాకు పరిచయం చేసింది వెంకటేశ్వర్లుగారే.

ఇక వారితో నా సంభాషణ తిరిగిన తీరుతెన్నులు ఇలా వున్నాయి: "అయ్యా, తెనుగు భాషను గూర్చి, ప్రాకృత భాషను గూర్చి తాము విశేషమైన కృషి చేశారుగదా! శబ్దచింతామణి, బాలవ్యాకరణ ప్రారంభ సూత్రాలపై నాకు కొంత వివరణ మీ నుండి కావాలి" అని అడుగగా, వారు "అడగండి" అన్నారు. నేను ఈ వ్యాస ప్రారంభంలోని సూత్రాలనే చెప్పి, ఆ గ్రంథాలలో ఆ సూత్రాల ఉనికికి కారణాలేమిటి, అందునా ప్రాకృతానికి వర్ణాలు నలుబది అన్నప్పుడు ఏ ప్రాకృతాన్ని గూర్చి ఆ సూత్రకర్తలు భావించినట్లు అని అడిగాను. ఆ మీద వారు నన్ను అడిగిందేమంటే – "ఈ ప్రశ్నలు ఇప్పుడు నన్నే అడుగుతున్నారా, ఇంతకు ముందు ఎవరినైనా అడిగారా" అని. "లేదండీ, నేను ఎవరినీ అడుగలేదే. మొదటిసారిగా మిమ్మల్నే అడుగుతున్నాను" అనగా, "ఎందువలన" అని వారు అడిగారు. దానికి నా సమాధానం ఏమంటే – "వేరెవరినైనా అడిగితే, నేను కొంటెతనానికి లేదా మరేదో ఉద్దేశ్యంతో అడిగానని భావించే అవకాశం వుంది. మొదలు ఇలాంటి ప్రశ్నలకు ఆస్కారం లేదనే భావంతో నన్ను తిరస్కరించవచ్చును లేదా ఉదాసీనతను పాటించవచ్చు. మీరు మాత్రమే నా ప్రశ్నలను సమంగా అర్థంచేసుకొనే సహృదయులనే ప్రమాణ బుద్ధితో మిమ్మల్ని అడుగుతున్నాను" అన్నాను. దానికి వారన్నమాట ఏమంటే – "మీరడిగిన ప్రశ్నలు సమంగా అర్థం చేసుకున్నాను. అయితే వాటికి సమాధానాలు నా వద్ద లేవుగాక లేవు. లేకపోవటం మాట అలా వుంచండి. మొదట ఇలాంటి ప్రశ్నలు ఉత్పన్నమయ్యే అవకాశముందనే ఊహ కూడా నాకు లేదుగదా, ఇంతవరకూ ఎవరికీ తట్టలేదు. సరే దానినలా ఉంచండి – ఈ ప్రశ్నలు మీకు కలిగాయంటే కారణమేదో వుండాలిగదా – ఆ కారణాలు చెప్పండి" అన్నారు. దానికి నేను – "ఆ మాట నిజమే! విన్నవిస్తాను. చిత్తగించమ"ని ఇలా చెప్పాను –

మొదట ప్రశ్న – "సంస్కృత భాషకు వర్ణాలు ఏబది అని ఎందుకు చెప్పినట్లు అని గదా! ఆ ప్రశ్న ఉత్పన్నం కావటానికి కారణం నేను ప్రశ్నించిన విధానంలోనే – అంటే నన్నయ అలా చెప్పుటలో అంటే అలా ఆయన ఇన్ని అని నిర్ధారించారంటే ఆ భాషకుగల వర్ణాల విషయంలో మతభేదాలున్నట్లే గదా అన్నాను (ఆ మాట నిజమేగదా అన్నారు రామచంద్రగారు). కనుక మతభేదాలతో పనిలేదు. ఏబై వర్ణాలు అని ఆమోదింపబడిన సంస్కృతమేదో – అది ఈ భాషకు (తెనుగుకు) అక్కర సుమా! ఆ వర్ణాలు మాత్రమే ఈ భాషలో చోటుచేసుకున్నాయి సుమా అని చెప్పటం నన్నయ ఆంతర్యం అనేది నా భావన" అనగా, వారు – "సెభాస్! బాగుంది" అని, "రెండో విషయానికి రండి" అన్నారు. నేను అదికూడా "నలభై అక్షరాలుగల ప్రాకృతమేదో అది మాత్రమే ఈ భాషలో చోటుచేసుకుంది. అని చెప్పటం" అంటూ "దానిని నేను ఆంధ్ర ప్రాకృతం అంటున్నాను. ఇప్పుడు మనం మాట్లాడుతున్న భాషకు నన్నయ తెనుగు అని సంభాషించాడని, అది ఆంధ్ర, తెలుగు ప్రాకృతాల సమ్మేళనమని, దానిపైన ఏబది అక్షరాలకు పరిమితమైన సంస్కృతం ప్రభావం ఉందని, మొత్తం ఆ మూడు భాషలలోని వర్ణాలతో కూడిన భాషావ్యవహారం తెనుగు" అని చెప్పాను.

దానికి వారు, "మీ మాటను అంగీకరిద్దామంటే ఒక అవరోధం వుంది" అన్నారు. "అదేదో చెప్పండి" అనగా – "తాను ఆంధ్ర ప్రాకృత విషయం, సంస్కృత విషయం చెప్పిన నన్నయ తెనుగు ప్రాకృత విషయం ఎందుకు చెప్పనట్లు" అని అడిగారు! "ముప్పది ఆరు అని చెప్పారుగదా! కాకపోతే,

అచ్చులో 'తెలుగునకు' అని వుండవలసినచోట 'తెనుగునకు' అని అచ్చవుతూ వస్తోంది. ఇది చిన్నయసూరి గారు చేసిన వివరణ అయివుండదు. భారతం, ఇతర కావ్యాల్లో 'తెనుగు' అని వుండటం కారణంగా ఆ ఒరవడిలోనే తెనుగు అని అచ్చుపడుతోంది. మీరు ఆలోచించాలి. ఇప్పుడు మన వ్యవహారంలో వున్న భాషలో వున్నవి ముప్పది ఆరు కాదుగదా" అన్నాను. ఇంకా నేను వారికి ఇలా చెప్పాను – "పల్లవ చక్రవర్తి శివస్కంధ వర్మ శాసనం ఆంధ్ర ప్రాకృతంలోనిది కాగా, యుద్ధమల్లుని శాసనం, అద్దంకి శాసనం తెలుగులోనివి. అనంతరం వచ్చిన భట్టిప్రోలు శాసనాలు తెలుగులోనివి. తెలుగునను, ఆంధ్రానికి అట్టే భేదం లేని కారణాన, భట్టిప్రోలు శాసనం, ఇంకా ఆ తరువాత (నన్నయకు పూర్వం) వచ్చిన శాసనాలు  గమనించిన పండితులు నన్నయకు పూర్వమే కావ్యరచన సాగి వుంటుందని, ఆ కారణంగా నన్నయ ఆదికవి కాదనే నిర్ధారణకు వచ్చారు. దీనిని మొదట ప్రారంభించినది వీరేశలింగమని, దానికి ఆయన కారణాలు ఆయనకు వున్నాయని, ముఖ్యమైనవి ఆయన శైవుడు కావటమని, అనంతర కాలంలో విశ్వవిద్యాలయాలలోని బ్రాహ్మణేతర ఆచార్యులు దానిని బ్రాహ్మణ ద్వేషంలో అందిపుచ్చుకుని దానినే ప్రచారం చేయనారంభించారని, అయితే ఆయనే (నన్నయ) చెప్పుకున్న 'విపుల శబ్దశాసనుడు' అన్న మాటను ఎవరూ విశ్లేషించే ప్రయత్నం చేయలేద"ని చెప్పాను.

అంతా విని, వారు "మీ ప్రతిపాదనతో నేను పూర్తిగా ఏకీభవిస్తున్నాను. ఇది వ్యాప్తమైతే మన భాషాచరిత్రలోగల లోపాలు సమసిపోతాయి" అన్నారు. "అయితే, నేను త్వరలో మన భాష వ్యాకరణాలపై ఒక సదస్సు నిర్వహింపదలచాను. దానికి తాము రావాలి. తమ అభిప్రాయం సభాముఖంగా ప్రకటించాలి" అని అనగా వారు "తప్పక వస్తాను, నా అభిప్రాయం చెపుతాను" అన్నారు. అయితే ప్రయత్నమైతే చేశానుగాని అప్పట్లో దానికి నాకు అవకాశాలు అందిరాలేదు. వారూ కాలంలోనికి వెళ్ళిపోయారు.

ఇప్పటికిప్పుడు ఇదంతా వ్రాయటానికి కారణం రావినూతల సత్యనారాయణగారు జనవరి, 2016 సంచికలో ప్రచురించిన తిరుమల రామచంద్రగారిపై వ్రాసిన వ్యాసం ఒక్కసారిగా నాటి సంఘటన, వారి సహృదయత కళ్ళముందు కనబడటంతో ఇది అక్షరరూపం దాల్చింది.

'సత్యేసర్వ ప్రతిష్ఠితమ్'

ఆచార్య యార్లగడ్డ బాలగంగాధరరావు
విజయవాడ.
ఫోన్ : 984 949 9169

---

**ఉ**వ్వెత్తున ఎగసిన కెరటం తెన్నేటి హేమలత గతకాలపు 'కన్నడి' ఆమె తమ రచనా విన్యాసంలో సాహసంతో సావాసం చేసిన విధంగా నిజాల్ని నిర్భయంగా, సాదాసీదా వనితల కథావ్యధలను వివరంగా విస్తరించి, కన్నీటి సిరాతో రక్తాక్షరాలను లిఖించారు. అది సాహితీ దిగ్గంతులను విమర్శక చక్రవర్తుల raised eyebrosతో ఉలిక్కిపడేలా చేసింది.


తెన్నేటి హేమలత

అప్పటికీ తెలుగు మహిళలు అలవాటుపడిన మధ్యతరగతి (ఆత్మవిశ్వాసం పొంగి పొరలే) వనితకు 'మద్యం' తరగతి కలవారి నాయకులను తిప్పితిప్పి మూసకథల రచనా విన్యాసాలతో ఓ రకంగా 'ఓపియం'ను పాఠకురాళ్ళకు అలవాటు చేశారు. ఆ క్రమంలోనే హైదరాబాద్ బీచ్‌లో వైర్‌లెస్ తీగలపై కిలకిలరావాలను కూడా ఉదహరించి గట్టెక్కిన రచయిత్రులు ఎందరో ఉన్నారు. అప్పుడే! ఆనాడే!! ఆ మత్తులోంచి దివినుండి భువికి దిగిరా అంటూ ఆనాటికి తన కొత్త ఆలోచనల్లోంచి తీసుకువచ్చిన మార్పు తూర్పువైపుకు వేలెత్తి చూపించారు, తెన్నేటి హేమలత తమ వినూత్న రచనా సంవిధానం ద్వారా. అది ఓ పాయగా, ఓ సెలయేటి పాటలా ప్రారంభం కాలేదు. ఓ ప్రభంజనంలా ఎగసిపడి నిశితంగా నిర్భయమైన నిజాల శరాలు సంధించిన లత తన 'గాలిపడగలు నీటి బుడగలు' సంచలన రచన అందరూ చదివారు. అలానే దశ దిశ మార్చుకోకుండా తెన్నేటి హేమలత గారు తరువాతి కాలంలో *ఎడారి పువ్వులు, మోహనవంశి* (అద్భుత రచన), *జీవన స్రవంతి, నీలినీడలు, డాక్టర్ వనమాలి, స్వర్ణసీత, ప్రేమరాహిత్యంలో స్త్రీ* మొదలైన ఈ సంచలనాత్మక రచనలేకాక ఆంధ్రప్రభ పత్రికలో ధారావాహికంగా *ఊహాగానం* శీర్షిక తెలుగు ప్రజానీకాన్ని అలరించింది. అటువంటి మహా రచయిత్రి శ్రీమతి తెన్నేటి హేమలతను **మిసిమి** వెలువరించిన సుదీర్ఘ వివరణాత్మక వ్యాసానికి యాజమాన్యానాకి కృతజ్ఞతలు. గతకాలపు కథావస్తు పరిశోధనలను వెలికి తీసినందుకు వందనాలు.

– *వి. ప్రమోద్‌కుమార్, విజయవాడ*

వేదిక

మొదటి స్వాతంత్ర్య సంగ్రామం ముగిసిన తరువాత, విక్టోరియా మహారాణి చేతికి పరిపాలనా పగ్గాలు వచ్చిన తరువాత, మనకు స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత, మన రాజ్యాంగం అమలు అయిన తరువాత, రిజర్వేషన్లు ప్రచారం పొందిన తరువాత, రాజకీయ లబ్ధి కోసం దళిత అన్నమాట చాలా విరివిగా వాడుకలోనికొచ్చింది. ఆర్థికంగా, సామాజికంగా, చదువు ఉద్యోగాల పరంగా, రాజకీయంగా వెనుకబడిన వర్గానికి సామాజిక న్యాయం చేయడం మన ప్రజాప్రభుత్వ విధి. వందల సంవత్సరాలుగా అణచివేయబడ్డ వర్గానికి చేయూతనివ్వడం అందరి కర్తవ్యం కూడా. కాని ఈనాడు వాడబడుతున్న మాటను పురాణాల రచనా కాలానికి వర్తింపచేయడం ఏమంత సబబు కాదు. అలా వర్తింపచేస్తే శివుడిని బైగమి (Bigamy) నేరం కింద, దశరథుడు, కృష్ణుడు మొదలైన దేవతలను పాలిగమీ (polygamy) నేరం కింది, రాముడిని గృహహింస (domestic violence) చట్టంకింద శిక్షార్హులుగా ప్రకటించాల్సి వస్తుంది. త్రేతాయుగపు రామాయణాన్ని, ద్వాపర యుగపు మహాభారతాన్ని కార్లమార్క్స్ దృష్టితో చూడడం వల్ల మనమేమీ సాధించలేము.

పురుష సూక్తంలో చెప్పబడిన

*బ్రాహ్మణోస్యముఖమాసీత్ । బాహూరాజన్య కృతః*
*ఊరూతదస్యయద్వైశః । పద్భ్యాగ్ంశూద్రో అజాయతః*

బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర మాటలు సమాజంలోని వర్ణాలను కాకుండా ప్రజల వృత్తులను సూచిస్తాయి. ఇంద్రుడు, సీజర్‌లాంటి మాటలు వ్యక్తుల పేర్లను సూచించవు. అవి వారి స్థానాన్ని, పదవిని సూచిస్తాయి. ఈ రోజుకు మనం సమాజాన్ని నాలుగు వర్గాలుగా – మేధావి వర్గం (inlelligentsia) రక్షణ దళ సిబ్బంది (Defence personnel) వ్యాపారస్తుల వర్గం (Business community), శ్రామిక వర్గం (Labour class) పరిపాలనా సౌలభ్యం కోసం విభజిస్తున్నాము. సమాజ పురోభివృద్ధికి ఈ నాలుగు వర్గాల వారు తోడ్పడుతున్నారు. ఇతర దేశాలలోలాగా శ్రమ హూందాతనంను (Dignity of Labour)ను మనం గుర్తించకపోవడంవల్ల ఒకరు హెచ్చు మరొకరు తగ్గు అని మనం భావిస్తున్నాం. శూద్రులను విరాట్స్వరూపుని పాదాలుగా వర్ణించడం వల్ల పాదాలను శరీరంలోని హేయమయిన అంగంగా మనం భావించరాదు. ఇది నిజమైతే మనం పెద్దలను దర్శించినప్పుడు పాదాలకు ఎందుకు మొక్కుతున్నాం. బ్రాహ్మణులు తలను, క్షత్రియులు భుజాలను, వైశ్యులు తొడలను పట్టుకొని ఎందుకు నమస్కరించడంలేదు? **మిసిమి,** జులై 2016 సంచికలోని తమ 'గీటురాయి' వ్యాసంలో శ్రీ ఎన్. సదాశివగారు చాలా మంచి మాట చెప్పారు. "ఉమరలీషాను చెట్టు కవి, ఇస్మాయిల్‌ను సాహస కవి, వజీర్ రహ్మాన్‌ను ఎవరూ ముస్లిం కవులు అనడంలేదు." అలాంటప్పుడు నాగులను, గరుడులను దళితులు అని ఎందుకు పిలవాలి? వ్యాసకర్త ప్రకారం (అనువాదకుడి ప్రకారం కానే కాదు) నాగులు, గరుడులు కశ్యపముని సంతానం. కశ్యపుడికి 12 మంది కాదు 13 మంది భార్యలు. వారి స్వభావాలకు అనుగుణ్యంగా పిల్లలను కన్నారు. పెద్ద భార్య అదితి దేవతలను (ఇంద్రుడు, సూర్యుడు మొదలైన) కంటుంది. రెండవ భార్య దితి, మూడవ భార్య దను వరుసగా హిరణ్యాక్ష, హిరణ్యకసిపులాంటి రాక్షసులను, దానవులను కంటారు. ఒక భార్య జలచరాలను, ఒక భార్య పక్షులను, ఒక భార్య యక్షాలను, ఒక భార్య గంధర్వులను, ఒక భార్య కింపురుషులను కంటారు. కద్రువనాగులకు జన్మనిస్తే వినత అనూడికి – ఇతడికి కాళ్ళుండవు – గరుడుడికి జన్మనిస్తుంది. వీరందరు కశ్యపుడి సంతానమే. మనది పితృస్వామ్య వ్యవస్థ. తండ్రి బ్రాహ్మణుడైతే సంతానం కూడా బ్రాహ్మలు అవుతారు. అటువంటప్పుడు నాగులు గరుడులు దళితులు కాలేరు. చెప్పదలుచుకున్నదేమిటంటే రాక్షస, దానవ, దేవత, నాగ, గరుడ పదాలు స్వభావాలను సూచిస్తాయేకాని జాతులను కాదు.

'ఉనికి కోల్పోతున్న దళిత గరుడ సంస్కృతి' వ్యాసం గరుత్మంతుని వీపుమీద స్వారీ చేస్తున్న విష్ణువు చిత్రం మీరు చూసే ఉంటారుతో ప్రారంభమవుతుంది. "దళిత గరుడ సంస్కృతిపై సవర్ణ సంస్కృతి పెత్తనం చలాయించడమే ఈ ప్రతీక అర్థం" అని కూడా చెప్పారు. ఈ చిత్రం నవధా భక్తిలోని 'సేవనమ్'కు ప్రతీక. ఇందులో భక్తుడు స్వామిని ఒక దాసుడిగా సేవిస్తాడు. ఆ కారణం వల్లనే కంచర్ల గోపన్న రామదాసు అయ్యాడు. కన్నడ నవకోటి నారాయణ పురందరదాసు అయ్యాడు. తులసీదాసు, కాళిదాసు, కనకదాసు, సూర్‌దాసు మొదలైన పేర్లు దాస్య భక్తిని సూచిస్తాయి. డా. భవదేవ పాండేయ్ గారు గరుత్మంతుడిని దళిత వర్గానికి చెందిన వ్యక్తిగా అభివర్ణించారు. మొత్తం వైష్ణవ సాహిత్యంలో గరుత్మంతునికి చాలా ఉన్నత స్థానం ఇవ్వబడింది. తమిళులు గరుత్మంతుడిని గరడాళ్వారుగా ఆరాధిస్తారు. తిరుమల క్షేత్రానికి శివుడు క్షేత్రపాలకుడు. అంతమాత్రాన అతడు వెంకటేశ్వరస్వామికంటే ఒక మెట్టు కింద అని చెప్పలేం. నవధా భక్తి దృష్టితో గరుత్మంతుడిపై స్వారీ చేస్తున్న విష్ణువు చిత్రాన్ని డా. భవదేవ పాండేయ్‌గారు చూడలేదని చెప్పవచ్చును. ఇలా ప్రతీకకు అర్థంచెప్పుకుంటూపోతే ముందుముందు జీవకారుణ్య సంస్థవారు (SPCA) శివుడు, కుమారస్వామి, వినాయకుడు, యముడు, శని మొదలైన దేవతల చిత్రాలలో కనబడే వృషభం, నెమలి, ఎలుక, దున్నపోతు, కాకి లాంటి చిత్రాలను తొలగించాలని ఒక కొత్త ఉద్యమానికి నాంది పలకవచ్చు.

**గమనిక :** ఈ లేఖ ఉద్దేశ్యం మూల హిందీ రచయిత డా. భవదేవ పాండేయ్‌ను విమర్శించడమేకాని అనువాదకులు ఆచార్య ఘట్టంరాజు అశ్వత్థనారాయణను విమర్శించడం కాదు. చాలా అందంగా చదివించేలా అనువాదం చేసిన ఆచార్య ఘట్టంరాజు అశ్వత్థనారాయణ నాకు తమ్ముడులాంటివాడు. మేమిద్దరం అనంతపురం పాతూరివారమే. ఇద్దరం వృత్తిచేత హిందీ ఆచార్యులమే. ఇద్దరం బెంగుళూరులోనే ఉంటున్నాం.

డా. ఎ.బి. సాయిప్రసాద్
బెంగుళూరు.
ఫోన్ : 0 998 056 7541.

## వేదిక

[illegible]


[illegible]

9290094015

(దేవులపల్లి కృష్ణమూర్తి, ప్రముఖ నవలారచయిత)

ఈ *దూరతీరాలలో* పుస్తకం **మిసిమి** సంవత్సర చందాదారులకు ఉచితంగా ఇస్తున్నాం.

"...... సాంస్కృతిక సాహిత్య విషయాలపై నాకు ఆసక్తి. వీటి అన్వేషణ ఓ తృప్తి. ఈ ప్రక్రియలో నాకు ఆలస్యంగా దొరికిన చుక్కాని, చక్కనైన **మిసిమి**. *భారతి* కి సుందరమైన వైవిధ్యభరిత 'వ్యాస'మాల **మిసిమి** అని నా నమ్మిక. ఆర్థర్ షోపెన్‌హావర్ (ము.పా.సా. గారి మాటల్లో) చెప్పినట్లు "మంచి పుస్తకాలు చదవాలంటే చెడ్డ పుస్తకాన్ని రెండుసార్లు చదవాలి. రెండవసారి చదివినప్పుడు పుస్తకంలోని వివిధ పార్శ్వాల మధ్య ఉన్న సంబంధం మరింత బాగా అర్థమవుతుంది." నిస్సందేహంగా ఈ కోవకు **మిసిమి** చెందుతుంది. మరీమరీ చదువవలసిన, చదువతగిన 'పాఠ్యపుస్తక' మాసపత్రిక. ముఖ్యంగా, ముక్తవరం పార్థసారథి గారి వ్యాసాలు, తెలుగుసేత, సాయి పాపినేని, జయశ్రీ నాయనిగార్ల హరప్పా నాగరికతపై ప్రామాణిక పరిశోధనలు నన్ను ముగ్ధుణ్ణి చేస్తున్నాయి. వి.ఎ.కె. రంగారావుగారి విమర్శలు, వాఖ్యానాలు చదవడం ఒక అనుభూతి. ముఖచిత్రాలు, అట్టలమీద కళాకృతులు, ముద్రణాప్రమాణాలు ఉన్నత స్థాయిలో ఉన్నాయి. **మిసిమి** మాటలకందని ఆనందం. మీకు, మీ సంపాదక వర్గానికి హృదయపూర్వక అభినందనలు....."




– *ఆర్. సత్యనారాయణ, ముంబయి*

## అట్లావారి విశిష్ట విశ్లేషణ శైలీశిల్పం - వెయ్యేళ్ళ తెలుగు కవిత్వం

**డా.** ఆట్ల వెంకట రామిరెడ్డి గారి పాతిక సంవత్సరాల కృషి ఫలితమే *శైలీశిల్పం – వెయ్యేళ్ళ తెలుగు కవిత్వం.* ఉద్గ్రంథం! దాదాపు వెయ్యి పుటల విశ్లేషణా పొత్తం తన పి.హెచ్‌డి., గ్రంథం కాదని చెప్పుకొచ్చారు రచయిత. నిజానికి ఇది నన్నయకు పూర్వం నుండి నేటి ఆధునిక కవి కె. శివారెడ్డి గారి దాకా తెలుగు కవిత్వంలోని ముఖ్యమైన కవులందరి శైలీ శిల్ప విశ్లేషణలతో భాసిల్లుతున్న ప్రామాణిక గ్రంథంగా చెప్పుకోవచ్చు. దాదాపు రెండువందల మంది కవుల, రచయితల, సంపాదకుల రచనలను తెలుగు, సంస్కృతం, హిందీ మరియు ఆంగ్ల భాషల నుండి సేకరించి, అధ్యయనం చేసి సృజించిన ఈ గ్రంథరాజము సాహితీ ప్రియులకు, పరిశోధకులకు ఉపయుక్తంగా పదికాలాలపాటు నిలిచిపోతుందనటంలో సందేహం లేదు.

ఒక కవితా వస్తువుకి ఎన్ని కోణాలుంటాయో, ఏ కోణం నుండి పొరలు పొరలుగా విప్పి ఆవిష్కరిస్తే పాఠకున్ని అలరిస్తుందో అనితర సాధన, అధ్యయనం మూటకట్టుకున్న, ఆట్లవారి రచనా ప్రతిభ ప్రతి వాక్యంలోను తొణికిసలాడుతుంది. తెలుగు కవిత్వంలోని శైలీ... శిల్పం విశ్లేషిస్తూ ఎన్నో గ్రంథాలు వెలువడినా... ఎవరి సంతకం వారిదే. శైలికి సంబంధించిన ఈ విషయంలో వెంకటరామిరెడ్డి గారి ప్రత్యేకత ప్రతి పుటలోనూ విస్తరించి ఉండటం గమనార్హం. శిల్పం అంటే.... సృజనకారుడు చెప్పదలచుకున్న విషయాన్ని ఎత్తి పాఠకుల అంగిట్లోకి పంపేందుకు పనికొచ్చే ఒక పనిముట్టు. వెయ్యేళ్ళ కవన రంగంలో అసంఖ్యాక కవుల శైలీ నైపుణ్యాన్ని ఒడిసిపట్టుకొని సమగ్రంగా..... సోదాహరణగా మనముందుంచిన వైనం అబ్బురపరుస్తుంది.

ఆట్ల వెంకటరామిరెడ్డి గారు ఈ సాహిత్య విమర్శ గ్రంథాన్ని.... సాహిత్యం – కవిత్వం – శైలీశిల్పం – వస్తురూపాలు, కవితాశైలి – గుణాలు, దోషాలు, శైలీ భేదాలు – నిర్మాణ శిల్పం అన్న మూడు సిద్ధాంత భాగాలుగా, చారిత్రక శైలీ పరిణామానికి సంబంధించిన అన్వయం నాలుగవ భాగంగా విభజించి, వెయ్యేళ్ళ తెలుగు కవిత్వంలోని శైలి, శిల్ప విశ్లేషణలను సమగ్రంగా మనముందుంచారు. నేటితరం కవులకు... కవిత్వాన్ని ఏ దృష్టితో చూడాలన్న విచక్షణ, ఎలా విశ్లేషించుకొని చదవాలి... ఏ కవిత్వం మంచి కవిత్వం, ఏ శైలి మంచిది వంటి విషయాలమీద సంపూర్ణ అవగాహన ఈ గ్రంథం కల్పిస్తుందనటం అక్షరసత్యం.

నన్నయకు పూర్వం, నన్నయ యుగం, శివ కవి యుగం, తిక్కన యుగం, ఎఱ్ఱన యుగం, శ్రీనాథయుగం.... ఇతర శతాబ్దాల ప్రాచీన సాహిత్యానికి సంబంధించిన కవుల ప్రతిభా పాటవాలను సృజిస్తూ.... సంప్రదాయ సాహిత్య స్తబ్ద యుగాన్ని అవలోకిస్తూ, అభ్యుదయ కవితాయుగం, విప్లవ కవితాయుగంలోని సంచలన మార్పులని ప్రస్తావిస్తూ.... ప్రాచీన సాహిత్యానికి, ఆధునిక సాహిత్యానికి ఉన్న తల్లీ, కూతుళ్ళ బంధాన్ని అన్వయించిన పద్ధతీ అపురూపంగా పండింది. ఎంతో ప్రాధాన్యమైన కవితా వస్తువుని కళాత్మకంగా అందించారుకాబట్టే.... ఆట్లవారి ఈ విశిష్ట ప్రక్రియ సాహిత్య రంగంలో సుస్థిర స్థానాన్ని ఆక్రమించటం తథ్యం. వస్తువునీ, శిల్పాన్నీ విశ్లేషించడంలో.... రచయితకున్న సామాజిక, సౌందర్య శాస్త్ర పరిజ్ఞానం.... వెయ్యేళ్ళ తెలుగు కవిత్వంలోని శైలీ, శిల్పాలను ఉన్నత సాహిత్య ప్రమాణాలతో సంపూర్ణంగా విశ్లేషించడానికి అద్భుతంగా ఉపయోగపడింది. శతాబ్దాల కవుల కవితత్వాన్నీ, కవిత్వాన్నీ, వ్యక్తిత్వాన్నీ సంభావించి, ఆవహించాడు కాబట్టే ఆట్లవారు మొత్తం రూపాన్ని ఆవిష్కరించడంలో సఫలీకృతులయ్యారు.


చివరిగా..... ఆధునిక ప్రక్రియలైన లఘుకావ్యం, ఖండకావ్యం, దీర్ఘకవిత్వ, విశిష్టకావ్యం, మినీ కవిత – ముక్తకం – హైకూ, సినిమా పాట, అవధానం వంటి ప్రయోగాల్లోని శైలీ.... శిల్పాలను వివరించి, గ్రంథానికొక సమగ్రత సాధించడంలో కృతకృతులయ్యారు రచయిత. మినీ కవితల్తో, కథల్తో కాలం గడుపుతున్న యువ కవి రచయితలు..... సమాజహితంగా, సమకాలీన వస్తు ప్రతిబింబంగా కొత్త ప్రక్రియల్నీ, మిశ్రమ ప్రక్రియల్నీ, శైలీ శిల్పాల్నీ కనిబెడ్తూ నూత్న సాహిత్య యుగావిష్కరణలో పాలుపంచుకోవాలని పిలుపునివ్వడం పెను మార్పులకు లోనవుతున్న వర్తమాన సాహిత్యాన్ని, కొన్ని విలువలున్న గతంతో పోలుస్తూ..... గతాన్ని వర్తమానానికి అన్వయించడానికి, అన్వయించి పరిస్థితులను బేరీజు వేయడానికి రచయిత చేసిన ప్రయత్నం ప్రశంసనీయం. వెయ్యి పుటల సాహితీ మేరు పర్వతాన్ని... రెండు పుటల్లో పరిచయం చేయడమంటే, చిన్ని అక్షర దర్పణంలో పట్టడానికి చేసిందే ఈ సంక్షిప్త ప్రయత్నం.

సాహితీ ప్రియులందరూ తమతమ వ్యక్తిగత గ్రంథాలయాల్లో భద్రపరచుకోవలసిన... ప్రతి గ్రంథాలయంలోను నిక్షిప్తపరచడానికి యోగ్యమైన అపురూప గ్రంథం *శైలీశిల్పం – వెయ్యేళ్ళ తెలుగు కవిత్వం.* రచయిత డా. ఆట్ల వెంకటరామిరెడ్డి బహుధా అభినందనీయులు. పొత్తం వెల : రూ. 320/– ప్రతులకు : 970 143 0356 మరియు 917 785 3511.

రమణ వెలమకన్ని
ఫోన్ : 986 601 5040.


# చదవండి...


– ఎన్నార్కె




✧ **విద్వన్మణి :** పంచ సహస్రావధాని జంధ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రిగారి సాహిత్యానుశీలం, పరిశీలనం. ఆంధ్రదేశంలో అధిక సంఖ్యలో కవులు అవధానులుగానే ఖ్యాతిగాంచారు. శాస్త్రిగారు బహుముఖ ప్రజ్ఞాశాలి. వారి రచనలన్నింటినీ సేకరించి, పరిశీలనగావించి పితృ ఋణం తీర్చుకున్న వారి పుత్రిక శ్రీమతి జంధ్యాల కుసుమకుమారి. పద్యపఠనంపై మక్కువగలవారికి ఈ పుస్తకం మరింత ప్రీతిపాత్రమవుతుంది.

*పేజీలు : 300, వెల : 150. ప్రతులకు : ఫోన్ : 738 200 6600 మరియు అన్ని ప్రముఖ పుస్తక షాపులలో లభిస్తాయి.*





సి.పి.ఐ. (ఎం) పార్టీ 21వ అఖిల భారత మహాసభలు విశాఖపట్నంలో 2015 ఏప్రిల్ 19 నుండి 21 వరకూ జరిగాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని సి.పి.ఐ. పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ రచనల పోటీ నిర్వహించింది. నవల, కథ, కవిత, ప్రక్రియలో ఈ పోటీలను ప్రకటించింది. ఈ పోటీలో బహుమతి పొందిన వాటిని ప్రజాశక్తి బుక్‌హౌస్ వారు 5 పుస్తకాలుగా ప్రచురించారు.




✧ **(1) వ్యూహం :** శిరంశెట్టి కాంతారావు రచించిన ప్రథమ బహుమతి పొందిన నవల. ఇది పారిశ్రామీకరణకు చెందినది. కార్మిక ధీరుల విలాపాగ్నుల విషాధ అశ్రువులు దీనిలోని ప్రధానాంశం. *పేజీలు : 206, వెల : ₹ 150/-.*

**(2) మబ్బులు వాలని నేల :** సన్నపురెడ్డి వెంకట్రామిరెడ్డి రచించిన ద్వితీయ బహుమతి పొందిన నవల. వ్యవసాయ రంగం దీని ఇతివృత్తం. *పేజీలు : 182, వెల : ₹ 150/-.*

**(3) కడలి కల్లోలం :** గనారా రచియించిన ఈ నవలకు తృతీయ బహుమతి లభించింది. పర్యావరణానికి పెనుముప్పుగా మారుతూ దానినే అభివృద్ధిగా పేర్కొంటున్న కుహనా ఆర్థికవేత్తలకు ఈ నవలలోని కథావస్తువు ఒక చెంపపెట్టు. *పేజీలు : 174, వెల : ₹ 125/-.*





**(4) పొట్టుపొయ్యి :** సి.పి.ఐ. (ఎం) పార్టీ 21వ అఖిల భారత మహాసభల పోటీలలో ఎంపికైన కవితా సంకలనం. ఇందులో 84 కవితలున్నాయి. రైతన్నలు, నేతన్నల వేతనలేకాక జాలర్లు, చాకళ్ళు వంటి వారి గురించి కవితలుండిన ఈ సంకలనం సంఘంలోనున్న చిట్టచివరి జనం బాధల గురించి వ్రాస్తూ లోటు లేకుండా చేసింది.
*పేజీలు : 221, వెల : ₹ 160/-*




**(5) కదలిక :** సి.పి.ఎం. 21 వ మహాసభల సందర్భంగా నిర్వహించిన పోటీలలో ఎంపికైన కథలు.
*పేజీలు : 200, వెల : ₹ 150/-,*


*పై ఐదు పుస్తకాలకు : ప్రజాశక్తి బుక్‌హౌస్, 27-1-54, కారల్‌మార్క్స్ రోడ్, విజయవాడ-2.*

*ఫోన్ : 0866 – 2577533. మరియు ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచిలలో లభ్యం.*





✧ **అర్థంకాని సందర్భాలు -** కవిత్వం : రచన బెల్లం ప్రభాకర్. 'నేనొక ఆధునిక చండాలుడి'నని ప్రకటించుకొని, మనిషి మనిషిలాగ ఎదగలేని ఈనాటి మానవుని హైపోక్రసీనీ ఎండగట్టారు రచయిత తన కవితలలో.

*పేజీలు : 100, వెల : ₹ 100/-, ప్రతులు : అన్ని ప్రముఖ బుక్‌షాపులలో లభ్యం.*





✧ **రెండు సత్యాలు :** ఈ రెంటిలో ఒకటి సాహిత్యం – రెండు శాస్త్రం. ఈ రెండూ మానవాళి మనుగడకు అత్యంత అవసరమని విశ్లేషణా పద్ధతిలో చందు సుబ్బారావు వ్రాసిన 11 వ్యాసాల సంపుటి. ఈ వ్యాసాలు చదివింపజేస్తాయి, ఆలోచింపజేస్తాయి.
*పేజీలు : 90, వెల : ₹ 100/-, ప్రతులు : అన్ని విశాలాంధ్ర, ప్రజాశక్తి, సమత పబ్లిషర్సు వద్ద లభిస్తాయి.*




✧ **కొత్తబాణీ - ప్రయోగ పద్యాలు :** రచన ఎలనాగ. ఇందులోని కవితలు ఛందోనియమాలను తు.చ. తప్పకుండా పాటిస్తూనే, ఎక్కడా పద్యమనే స్ఫురణ కలగని సులభ గ్రాహ్యమైన ఆధునిక వచన కవితలుగా అబ్బురపరుస్తాయి. సామాజిక అంశాలు అనేకం కవితా వస్తువులుగా స్వీకరించారు రచయిత.

*పేజీలు : 43, వెల : ₹ 50/-, ప్రతులు : అన్ని ప్రముఖ పుస్తక షాపులలో లభ్యం.*




✧ **ప్రముఖ వాగ్గేయకారులు :** ఒక భాష యొక్క అస్తిత్వం పెంచి, పోషించి, వ్యాపింపజేసే శక్తి ఒక్క వాగ్గేయకారులకే ఉంది. ఇందులో విద్యార్థి లోకానికి అందుబాటులో ఉండేలా ప్రధాన వాగ్గేయకారుల జీవిత చరిత్ర ఉంది. అందరూ చదివి, ఆనందించదగ్గ పుస్తకం (సావనీర్ సైజు).

*పేజీలు : 103, వెల : ₹ 100/-, ప్రతులు : విశాలాంధ్ర, నవచేతన పబ్లిషింగ్ హౌస్ దీని సోల్ డిస్ట్రిబ్యూటర్స్.*




✧ **వైష్ణవ సాక్షి:** సాక్షి వ్యాసాలతో ప్రసిద్ధికెక్కిన పానుగంటివారు వైష్ణవాభిమాని. విశిష్టాద్వైత సిద్ధాంతం పట్ల మొగ్గుచూపినవాడు. అలా కావడానికిగల ఆధ్యాత్మిక, లౌకిక కారణాలను అన్వేషించి, విపులంగా చర్చించారు మొదుగుల రవికృష్ణ. ఒక మహా రచయితలోని మరో కోణాన్ని ఆవిష్కరించటం అభినందనీయం. వాసు వేసిన పానుగంటివారి ముఖచిత్రం బాగుంది.

*పేజీలు : 100, వెల : ₹ 70/-, ప్రతులు : విశాలాంధ్రలో లభ్యం.*




✧ **మన అమరావతి కైఫియతు :** రచన డా. వావిలాల సుబ్బారావు. అమరావతికి సంబంధించిన చరిత్ర కథలు, జనశృతులు కలిసి ఉన్న, అందరూ ఆవశ్యం చదవవలసిన రచన, సరళమైన శైలిలో ఒక నవల చదువుతున్నట్లుగా విషయాన్ని చెబుతారు రచయిత – సావనీర్ సైజు పుస్తకం.

*పేజీలు : 124, వెల : ₹ 125/-, ప్రతులు : విశాలాంధ్ర, నవచేతన వారు సోల్ డిస్ట్రిబ్యూటర్స్.*




✧ **పామర సంస్కృతం (పాలమూరు మాండలికం) :** మన సమాజంలో బ్రాహ్మణ వర్గం సంస్కృతాన్ని పోషించినట్లుగా, వైశ్యాది కులాలు ఆ సంస్కృత పదాల నుండియే ఆగమాదేశ ప్రత్యామ్నాయ వ్యవహారిక భాషను ఏర్పరుచుకున్నారు. శిష్ట వ్యవహార భాషను అనేకమంది సామాన్యులు అనుసరించారు. వారికంటే క్రింది వర్గం వారు ఈ భాషకు పలుకుబడిలోనున్న కొన్ని జానపద పదాలను కలుపుకుంటూ, ఒక భాషను వాడులోకి తెచ్చారు. ఇందులో కొన్ని ఉర్దూ పదాల ఆధారితాలున్నాయి. డా. కపిలవాయి లింగమూర్తి గారు వ్రాసిన ఈ నిఘంటువు దానికి చెందినది. పద వివరణలు విశ్లేషణాత్మకంగా ఉన్నాయి.

*పేజీలు : 300, వెల : ₹ 300/-, ప్రతులకు : ఫోన్ : 08540 – 226437, ఈ-మెయిల్ : kapilavai.babu@gmail.com*




✧ **జన్నాభట్ల కథలు - 2 :** జీవితంలోని నైతికత, బాధ్యతలను ఆచి తూచి బాలన్స్‌డ్‌గా చూపించిన కథలు. కథలలో క్లైమాక్స్‌లో కొసమెరుపే కాదు, కొస మలుపు ఉంది. రచయిత జన్నాభట్ల నరసింహ ప్రసాద్.

*పేజీలు : 162, వెల : ₹ 130/-, ప్రతులకు – ఫోన్ : 829 726 3741.*



✧ **మధుర పథం :** తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి తన *మధురపథం* వారికి సంబంధించిన అనేక విషయాలను గురించి వివరించారు. వారు తన 60 సంవత్సరాలు ఆయన స్పృశించిన అనేక రంగాల విశేషాల సమాహారం.

*పేజీలు : 124, వెల : అమూల్యం. ప్రతులకు : 984 944 3752 కు సంప్రదించండి.*



✧ **బాలగేయాలు సీతాకోక చిలుక :** శ్రీమతి రాణీప్రసాద్ బాలల సంక్షేమానికి, వికాసానికి పాటుపడుతున్న రచయిత్రి. తన రచనలలో అమాయకత్వ బాల్యస్మృతులను అడుగడుగునా తట్టి లేపే కళాత్మక లోకాన్ని ఆమె తన గేయాలలో ఆవిష్కరించారు. పిల్లలను ఆనందపరచి, ఆహ్లాదపరచే రచనలు.

*పేజీలు : 105, వెల : ₹ 70/- ప్రతులకు : ఫోన్ : 08723 – 233514.*

# మిసిమి

మాసపత్రిక

**మీరు చందాదారులుగా చేరండి** **బహుమతిగా పంపండి**

మీ ఊరు, మీరు చదివిన బడి, మీరు పట్టభద్రులయిన కళాశాల – ఇవన్నీ మీకు అపురూపమైనవేకదా! మీకు ప్రియమైనవారు, స్నేహితులు – మీకు ఎంతో ముఖ్యంకదా! వీరందరికీ మీరు **మిసిమి** ని బహుమానంగా నెలనెలా పంపవచ్చు. మీరూ ఒక బహుమతిని పొందవచ్చు. ప్రక్కన వున్న పుస్తకాలలో మీకు కావలసిన పుస్తకాన్ని ఎంపిక చేసుకోండి. దాన్ని మీకు బహుమతిగా పంపిస్తాం. మీ ఊరి గ్రంథాలయానికి లేదా మీరు చెప్పిన స్నేహితులకోసం చందా **మిసిమి** పేర ₹ 360/- పంపండి. వారి పూర్తి చిరునామా ఈ క్రింది గడులలో ఇవ్వండి. మీరు ఇచ్చిన చిరునామాకు నెలనెలా **మిసిమి** పత్రికను పంపిస్తాం. ప్రతినెలా మీరు వారిని పలకరించినట్లే మంచి సారస్వతంతో....

**ఈ క్రింది బహుమతి పుస్తకాలలో మీకు కావలసిన పుస్తకాన్ని ఎంచుకోండి**

1. పారాయణ వర్గ, 2. నేనొక ప్రవాహాన్ని (అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి), 3. బుద్ధుని సూత్రసముచ్ఛయం, 4. మానవీయ బుద్ధ, 5. యతిగీతం – వివేకానందుడు (గజ్జెల మల్లారెడ్డి), 6. అంతర్వీక్షణం, 7. దూరతీరాలలో, 8. అగాధం, 9. ఓ ఖైదీ వీరగాథ, 10. నాలో నేను (వి. అశ్వినీకుమార్), 11. **మిసిమి** వ్యాసాలు (డా. ఇన్నయ్య).

**పేరు :** ..........................................................

**ఇం.నెం**......................................**వీధి**...............................

**ఊరు**...........................................**పిన్** .............................

**సెల్** ..........................................................


**సంతకం :** ..........................................................

మీ చిరునామా ఇక్కడ రాసి, వాట్సాప్ (994 951 6567)గానీ, ఇ-మెయిల్ (misimi_monthly@yahoo.in) ద్వారాగానీ పంపండి.

**Our A/c Details for Online Transfer :-**

| | | |
|---|---|---|
| Bank | : | **STATE BANK OF INDIA** |
| Account | : | **MISIMI** |
| A/c. No. | : | **10261569316** |
| Branch | : | **Saifabad, Hyderabad, INDIA** |
| IFS Code | : | **SBIN0007315** |

(ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్‌కు రూ. 50/- బ్యాంకు ఛార్జీలు కలపండి.)



**రెండు సంవత్సరాల చందాదారులకు (₹ 720+50/-) *ఏరియల్ (షెల్లీ)* గ్రంథం బహుమతి**



**మూడు సంవత్సరాల చందాదారులకు (₹ 1080+50/-) *బైరన్ (జీవిత కథ)* గ్రంథం బహుమతి**



**నాలుగు సంవత్సరాల చందాదారులకు (₹ 1440+50/-) *నా కథ చార్లీ చాప్లిన్* గ్రంథం బహుమతి**






**అయిదు సంవత్సరాల చందాదారులకు (₹ 1800+50/-) మిసిమి 2013 లేదా 2014 సంచికల బౌండ్ పుస్తకం బహుమతి**

**మిసిమి**
మాసపత్రిక

Kala Jyothi Process Pvt. Ltd., 1-1-60/5, R.T.C. 'X' Roads, Hyderabad - 500 020. Ph. **040-27645536.**



చిలుక లేఖ

MISIMI / **మిసిమి** / RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD/191/2015-17
Date of Posting: On 29th & 30th of every month.
Date of Publication: 25.08.2016



బిడియమేల